

గోతెలుగు.కామ్
చక్కటి కుటుంబ వార పత్రిక
వేదిక
కోసూరి ఉమాభారతి



నిదురలో, నాకు .... సన్నగా అమ్మ పాట వినబడుతుంది.

".......రామచిలుక నొకటి పెంచి ప్రేమ మాటలాడ నేర్పి....

రామరామరామ యనుచు.........

అమ్మ పాడితే ఎంతో బాగుంటుంది. కళ్ళు తెరిచి, వెల్లకిలా తిరిగి పడుకున్నాను. చక్కగా వినిపిస్తున్న అమ్మ

గొంతుతో .... గొంతు కలిపి, సన్నగా పాడ్డం మొదలుపెట్టాను.

సిటింగ్ రూంకి అటుపక్కనున్న హాల్లో రోజూ మ్యూజిక్ క్లాస్ చెబుతుంది అమ్మ. పిల్లలకి, పెద్దవాళ్ళకి కూడా పాట నేర్పిస్తుంది. ఇప్పుడు సమ్మర్ హాలిడేస్లో ప్రతిరోజూ క్లాస్ ఉంటుంది. చాలా మంది వస్తారు నేర్చుకోడానికి.

మ్యూజిక్ క్లాస్ అయ్యేంతవరకు ఆ హాల్లోకి రావద్దని చెప్పింది అమ్మ. అందుకే బోర్డ్ గేమ్స్ ఆడుకొని, స్టోరీ బుక్ చదువుకొని, క్లాస్ అయ్యేంత వరకు ఎ.సి పెట్టుకొని అమ్మ రూములోనే పడుకోవాలి.

...ఉయ్యాలలో ఉన్న తమ్ముడు నిద్రలేస్తే మాత్రం, వాణ్ణి జోకొట్టమంది.

**

తమ్ముడు గుర్తొచ్చి, పక్కకు తిరిగి చూస్తే నిద్రపోతున్నాడు. బాబు నోట్లో ఫీడింగ్ బాటిల్ అలాగే ఉంది. పైకి లేచి, మంచం పక్కన ఉన్న బల్లపీట మీద కాళ్ళుంచి నిలబడి, నేల మీదకి గెంతాను. అలా జంప్ చేయడం నాకిష్టం. మా ఇంట్లోలాంటి పందిరి మంచం, మాకు తెలిసిన ఇంకెవరి ఇంట్లోనూ చూడలేదు. ఇది అమ్మ మంచం.

చప్పుడు చేయకుండా తమ్ముడి దగ్గరగా వెళ్ళి ఫీడింగ్ బాటిల్ పక్కకి తీసి, వాడి నోరు నాప్కిన్ తో తుడిచాను.

తమ్ముడి పేరు వినోద్. బాబు అని కూడా పిలుస్తాము..పోయిన సండే వాడి ఫస్ట్ బర్త్డే పార్టీ అయింది.

బాబుని జోకొట్టి మెల్లగా వెనక్కి తిరిగాను.....

"....పలుకే బంగారమాయే ....." అమ్మ పాడుతుంది...

నా పాదాలు అమ్మ పాటకి అడుగులు వేస్తున్నాయి. అమ్మ వేస్తున్న తాళానికి ఓ సారి వడిగా, ఓ సారి నింపాదిగా... కదులుతున్నాయి. నాలో తెలియని ఆనందం. చేతులు తిప్పుతూ, గెంతుతూ, గది చుట్టూ గుండ్రాలు తిరుగుతూ, అప్పుడప్పుడు అమ్మ బీరువా అద్దంలో చూసుకుంటూ డాన్స్ చేస్తున్నాను.

**

పాట ఆగిపోయింది. క్లాస్ అయిపోయిందన్న మాట.

"చంద్రా, ఇటూ రామ్మా," పిలిచింది అమ్మ.

ముఖం తుడుచుకుంటూ పరుగున వెళ్లాను.

మ్యూజిక్ క్లాస్ వాళ్ళంతా ఇంకా అక్కడే ఉన్నారు. మాలిని, చిట్టెమ్మ మామి, కమలక్క. అందరూ.

"మళ్ళీ డాన్స్ చేస్తున్నావా లోపల? ముఖమంతా చెమట పట్టేసింది, రొప్పుతున్నావు," దగ్గరికి తీసుకొని, చీర కొంగుతో నా ముఖం తుడిచింది అమ్మ.

"ఆ డాన్స్ ఏదో మా ముందే చేయమనండి శారదగారు," అంటూ నా తల మీద మెల్లగా తట్టి వెళ్ళింది చిట్టెమ్మ మామి.

"మేడమ్, మీ క్రింద ఫ్లాట్ లోనే, శివరామశర్మ గారు కూచిపూడి డాన్స్ క్లాస్ మొదలు పెడతారంట. మా చెల్లెలు వెళ్ళబోతుంది. మన చంద్రకళని కూడా పంపండి మేడమ్," అంటూ నా బుగ్గ మీద ముద్దు పెట్టింది మాలిని..

"పాట నేర్చుకుంటుందిగా! ఎన్నని చేస్తుంది? సెకెండ్ స్టాండర్డ్ కి వెళ్ళబోతుంది కూడా," అనేసింది అమ్మ. ఔను.. నా యీడు వాళ్ళతో పాట నేర్చుకుంటున్నాను. అంతేకాదు, అమ్మ మిగతా క్లాసుల్లో నేర్పే పాటలన్నీ వింటూనే ఉంటాను... పాట ఇష్టమే... కాని ఆ పాటలకి డాన్స్ చేయడం ఇంకా ఇష్టం...

నాకిప్పుడు  సెవెన్ ఇయర్స్. గురుకుల్  స్కూల్లోఫస్ట్ స్టాండర్డ్ చదివేసి, ఇప్పుడు ఇంటిదగ్గరలో ఉన్న కాన్వెంటుకి వెళ్ళబోతున్నాను.

ఇంతలో తమ్ముడు లేచినట్టున్నాడు.  ఏడుపు వినిపించింది.

“చంద్రా, బాబు నిద్రలేచాడురా,” అమ్మ నన్ను వొడి నుండి దింపి అటుగా వెళ్ళింది.

**

చీకటి పడుతుండగా, నాన్నవి  ఆర్మీకాప్ -హాండ్ స్టిక్ - ఆఫీస్ ఫైల్స్ తో హడావిడిగా పైకి వచ్చాడు,ఆర్డర్లీకన్నన్.రోజు లాగా, వరండాలో ఓ పక్కగా ఉన్నకోట్-క్లాజెట్ లో వాటిని సర్దాడు.  అలవాటుగా  పరిగెడుతూనే  ఉంటాడు కన్నన్...

వెనకాలే నాన్న వచ్చారు.  చేతిలో ఎదో ప్యాకేజీ ఉంది.  ప్యాకేజిని వొళ్ళో ఉంచుకొనే,  తన కుర్చీలో కూర్చుని, షూజ్ తీసారు.నాన్న  విప్పిన యూనిఫారం  కోట్  కూడా అందుకొని,  దాని మీద  ఉన్న  స్టార్స్, రోప్స్ వేరు చేసి, ఆ సూట్ కూడా హాంగ్ చేసి, నాన్నకి సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు కన్నన్.

నాన్న ఫ్రెష్  అవడానికి  లోనికెళ్ళారు, చేతిలోని ప్యాకెట్ తో సహా.

రోజూలానే  బాల్కనీ లో  నుండి,  ప్లేగ్రౌండ్ లో క్రికెట్ ఆడుతున్న కిడ్స్ ని చూస్తూ  నాన్న కోసమే వెయిట్ చేస్తున్నాను...

**

పొద్దున్నే మిలిటరీ సూట్ మీద  స్టార్స్, రోప్స్ పెట్టి, తలపై కాప్ పెట్టుకొని తయారవుతుంటే, డోర్ దగ్గర నిలబడి

నాన్నని వాచ్ చేస్తాను.  ఆర్మీ జీపులో డ్యూటికి  వెళుతూ, నాన్న నాకు 'టాటా' చెప్పాకే లోనికి వెళ్తాను.  నాన్నని అలా ఫాలో అవడమే, నిద్రలేచాక  రోజూ నేను చేసే ఫస్ట్పని.

నాన్న నాకు చాలా బలమున్న దేవుడులా అనిపిస్తారు. మరి నాకు ఏది కావాలన్నా తెస్తారు.అమ్మకి తమ్ముడికి కూడా.

నాన్నకి,  ఆదేష్  అనే  మరో ఆర్డర్లీ కూడా  ఉన్నాడు.  అతను  జీపు డ్రైవ్ చేసి, బయట పనులు చేసి వెళ్ళిపోతాడు.కన్నన్  మాత్రం  ఇక్కడ క్వార్టర్స్ లో ఉంటాడు. ఎప్పుడన్నా, మా మారుతీ కార్ డ్రైవ్ చేస్తాడు.  సండే మాత్రమే అతనికి హాలిడే అంది అమ్మ.

**

నాన్న బాల్కనీ లోకి  వచ్చిన శబ్దమైతే అటుగా చూశాను.

ఫ్రెష్ అయి వచ్చి తన కుర్చీలో కూర్చున్నారు.  చేతిలో చాక్లెట్ బార్...

పరుగున దగ్గరికి వెళ్ళినాన్న పక్కనే ఉన్న నా మోడా మీద కూర్చున్నాను.

"ఏమ్మా కళా,  రోజంతా ఏం చేసావు? అడిగారు. "నీకోసం ఫైవ్- స్టార్ చాక్లెట్," అంటూ నా ఫేవరట్ చాక్లెట్ అందించారు.... "ఇది కాక ఇంకా వేఫర్స్, క్యాండీ తెచ్చాను.  రోజూ నేను డ్యూటీ నుంచి వచ్చాక  ఒక్కోటి  ఇస్తానుగాని, చెప్పు, ఇవాళ ఏం చేసావు?  మ్యూజిక్ క్లాస్ లో కూర్చునుంటావు,ఔనా?" అన్నారు.....

"లేదు నాన్న.  డాన్స్ చేసాను.  అప్పుడు మనం ఆ సినిమాలో చూసిన డాన్స్,  ప్రాక్టీస్  చేసాను.  చేసి చూపిస్తా" అంటూ చాక్లెట్ టేబిల్ మీద పెట్టి,  మోడా నుండి లేచి,  వరండాలోని  ఛైర్,  స్టూల్ పక్కకి జరిపాను.  "పిలిచానా రావటనా ....." అని పాడుతూ, చేతులు అచ్చంగా సినిమాలో అమ్మాయిలాగానే తిప్పుతూ, అడుగులు వేస్తుంటే, నాన్న నవ్వుతూ చప్పట్లుకొడుతున్నారు.  బాబునెత్తుకుని,  వరండాలోకి  వచ్చిన అమ్మ కూడా నా డాన్స్ చూస్తూ నిలుచుంది.

ఇంకా సంతోషంగా అడుగులు వేస్తూ, నవ్వుతూ డాన్స్ చేస్తున్నాను.. నాన్నకి కాఫీ కప్పందించి పక్కనే కూర్చుంది అమ్మ.

వొళ్ళంతా చెమటలు పడుతున్నా, అలా డాన్స్ చేస్తూనే ఉన్నాను.....

"ఇంక చాల్లే చంద్రా, మళ్ళీ రేపు వేరే పాటకిచేద్దువులే. ఇప్పుడు తమ్ముణ్ణి పార్క్ కి తీసుకెళతావుగా," అంది అమ్మ నవ్వుతూ..."శభాష్ రా కళా, సినిమాలో అమ్మాయికంటే బాగా చేశావురా. ఒక్క నవ్వే కాదు. ముఖంలో కోపం, అలక, కూడా చూపించావు," నన్ను మెచ్చుకుంటూ బాబుని చేతుల్లోకి తీసుకున్నారు నాన్న. నాకు చాలా హ్యాపీగా అనిపించింది.

'పిలిచానా రావటనా' కాదు. 'పిలిచినా బిగువటరా'.. అదీ పాట," అంది అమ్మ మళ్ళీ నవ్వుతూ.

"అయినా మనం ఆ సినిమా చూసి రెండు వారాలయిందిగా. ఇక ఈ ఆదివారం ఏ పాత సినిమా తెప్పిస్తున్నారో క్లబ్ లో," అంది నాన్నని చూస్తూ.

"ఈ ఆదివారం డాన్స్ ప్రోగ్రాం ఉందని చెప్పానుగా! మర్చి పోయావా? అన్నారు నాన్న.

ఆర్మీ ఆంధ్ర క్లబ్బుకి, నాన్న ప్రెసిడెంట్. ప్రతి ఆదివారం ఏదో ఒక ప్రోగ్రాం లేదా తెలుగు సినిమా ఏర్పాటు చేస్తారు నాన్నవాళ్ళు.

ఈ సారి గుంటూరు నుంచి వస్తున్నారట ఆ కూచిపూడి డాన్స్ గ్రూప్.

ఇంతలో బట్టలు మార్చేసుకొని, పైకి వచ్చాడు కన్నన్. బాబుని స్ట్రోలర్ లో కూర్చోబెట్టుకుని, రోజులా అతనితో పార్క్ వరకు వాకింగ్ కి బయలుదేరాను.



సండే పొద్దున్నే ఫోన్ రింగ్ అయితే, నాన్న ఆన్సర్ చేసారు.

“ఆ, ఆ, నమస్తే వచ్చేసారా? గుడ్. మా అసోషియేషన్ వాళ్ళు వచ్చి మిమ్మల్ని రిసీవ్ చేసారుగా !. ఏర్పాట్లన్నీ వాళ్ళు చూసుకుంటారు. కాస్త రిలాక్స్ అయ్యి, మీ కార్యక్రమాలు కానివ్వండి. నేను ప్రోగ్రాం టైంకి ముందే కలుస్తాను,” అని ఫోన్ పెట్టేసారు నాన్న. కార్టూన్స్ చూస్తూ నాన్న మాటలు వింటున్న నాకు క్లబ్బులో డాన్స్ ప్రోగ్రాం ఇవాళేనని అర్ధమయ్యింది.

**

లంచ్ అయ్యాక, జుట్టు పోనీటైల్ కట్టి, నాకు ఫ్రాక్ వేయబోయింది అమ్మ. జడ వేసి పొడుగు బొట్టు, జుమ్కాలు పెట్టమన్నాను. పరికిణీ వేసి, పాంజేబులు కూడా పెట్టమన్నాను.

“సరే, నువ్వు డాన్స్ చూడ్డానికి వెళుతున్నావా? లేక చెయ్యడానికా?” నవ్వుతూ నన్ను రెడీ చేసింది అమ్మ.

**

ఆర్మీ-క్లబ్ ఆడిటోరియంలో ‘వేదిక’ దగ్గర ఏర్పాట్లు చూడాలని పెందరాళే బయలుదేరాము. సండే అయినా, బాబు కోసం కన్నన్ మా కూడా వచ్చాడు. ప్రోగ్రాములంటే అతనికి ఇష్టమే...

క్లబ్ ఆడిటోరియంలో అమ్మ, బాబు ముందు వరసలో సోఫాల్లో కూర్చున్నారు. నేను మాత్రం నాన్న చేయి పట్టుకుని, స్టేజి వెనుక మేకప్ రూముల వైపు వెళ్ళాను. వాటిని ‘గ్రీన్ రూం’ అంటారని అమ్మ చెప్పింది.

నాన్నని చూడగానే ఒకాయన పరుగున వచ్చి నమస్కరించాడు. గ్రీన్ రూం వాకిలి వద్ద ఉన్న పెద్ద కుర్చీలో కూర్చున్నారు నాన్న.“మీరూ కూర్చోండి మాష్టారూ,” అన్నారు ఆయనతో, ఎదురుగా ఉన్న కుర్చీ చూపిస్తూ

“అయ్యో, మేజర్ గారు, మిమ్మల్ని ఫోటోల్లో చూడడమే కాని, ఇలా స్వయంగా కలవడం సంతోషంగా ఉంది సార్. తమరు గుంటూరులో మా స్కూలుకి వచ్చినప్పుడు కలవలేకపోయాను. క్షమించాలి,” అన్నాడాయన కూర్చుంటూ.

“ఔను, పోయిన సారి మేము దీపావళి పండుగకి గుంటూరు వచ్చినప్పుడు, మా అమ్మాయితో మీ‘నాట్యాంజలి’ స్కూల్ కి వచ్చాను. ఆ సమయంలో మీరు బయట ఊరికి ప్రోగ్రాముకి వెళ్ళినట్టున్నారు. మీ అన్నగారిని కలిసాను,” అన్నారు నాన్న.

“ఔను సార్.  అన్నయ్య  మీ  గురించి  అంతా చెప్పాడు,”, “ఈ పాప తమరి కుమార్తేగా! పాప గురించి కూడా చెప్పాడు,” నా వంక చూస్తూ అడిగారు మాస్టారు.

“అవును, మా అమ్మాయి చంద్రకళ,” అన్నారు నాన్న నా భుజాల చుట్టూ చేయి వేస్తూ. “డాన్స్ మీద చాలా ఆసక్తి. ప్రస్తుతం వాళ్ళమ్మ దగ్గర సంగీతం నేర్చుకుంటుంది,” మాస్టార్ కి నా గురించి చెప్పారు నాన్న.

“చూడు కళా, ఈయన కూచిపూడి గురువు రాఘవేంద్ర శర్మ. గుంటూరు నుంచి ఇక్కడ చెన్నైలో ప్రోగ్రాం ఇవ్వడానికి మనమే  ఆహ్వానించాము.

నమస్కారం  చేయి,” అన్నారు నాన్న నాతో.చేతులు జోడించి, నమస్కరించాను.

“పాప పేరుకు తగ్గట్టు కళకళ లాడిపోతుంది.  ఆసక్తి ఉంటే, మంచి డాన్సర్ అవ్వచ్చు కూడా,” అంటూ ఆశీర్వదించారు ఆయన. నాన్న నాకోసం తన పక్కనే కుర్చీ వేయించారు.  మాస్టర్  నుండి  వాళ్ళు  చేయబోయే  ప్రోగ్రాము వివరాలు అడిగి  తెలుసుకొన్నారు.  కొంత  రాసుకున్నారు కూడా.

**

మాటలయ్యాక,  మాస్టారు  తన డాన్స్  స్టూడెంట్స్ ని  పిలిచాడు.  పది  మంది  ఉన్నారు.  డాన్స్ డ్రెస్సుల్లో బాగున్నారు.  ఒకబ్బాయి కృష్ణుడులా తయారయ్యాడు.

“వీరు మేజర్. సత్యదేవ్ గారు.  కళాపోషకులే  కాదు, కళాకారులు కూడా.   వారి కాలేజీ రోజుల్లోసినిమాల్లోనటించి, అప్పట్లో కొన్నింటికి  సహకార  దర్శకత్వం  కూడా వహించారు.  ఇప్పుడు మాత్రం,  మంచి స్థాయిలో ఉన్న ఆర్మీ ఆఫీసర్.   ఇక్కడ చెన్నైలో ఆంధ్రసభ నిర్వాహకులు కూడా.  మనలని ప్రత్యేకంగా ఆహ్వానించి ఈ ప్రోగ్రాం ఏర్పాటు చేసారు.  ఈ అవకాశాన్నిచ్చి,  ఇంత  చక్కని  ‘వేదిక’ ని ఏర్పాటు చేసిన ఆయనకి నమస్కరించండి,”  అంటూ వాళ్ళకినాన్న  గురించి  చెప్పాడాయన.

అదంతా విన్నాక, 'నాన్న గురించి నాకు తెలియని గొప్పతనాలు ఇంకా ఉన్నాయన్న మాట' అనుకున్నాను. హ్యాపీగా అనిపించింది. అందరూ నాన్నకి నమస్కరించారు. కొందరు వచ్చి నాన్న పాదాలు తాకి మరీ నమస్కరించారు.

"పోతే, ఈ బంగారపు బొమ్మ, చంద్రకళ, వారి అమ్మాయి. వాళ్ళమ్మ సంగీత విద్వాంసురాలు. చంద్రకళ ఇప్పుడు సంగీతం నేర్చుకుంటుంది," అంటూ నాగురించి కూడా చెప్పాడాయన.

నాకు సిగ్గనిపించింది.

**

నాకు తెలిసిన వాళ్ళంతా వచ్చారు ప్రోగ్రాంకి. చిట్టెమ్మ మామి, భాను మామి, మాలిని. అంతా అమ్మ పక్కనే కూర్చున్నారు. అమ్మే వాళ్ళని ఇన్వైట్ చేసింది...

నన్ను చూస్తూ "నువ్వు బాగున్నావే డాన్సర్ లా,ఇవాళనువ్వు కూడా ఓ డాన్స్ చెయ్యి," అంది భానుమామి. నాకు ఒక్కసారిగా సంతోషమనిపించి, 'ఔనా' అనుకున్నాను. నాన్న తప్పక నాకు స్టేజ్ మీద టైం ఇవ్వగలరు కూడా....అనిపించింది..కొంచెమాగి, నిజంగానే అమ్మనడిగాను, "నువ్వు ఏదైనా చిన్న పాట పాడు, నేను డాన్స్ చేస్తా" అని...

"వీలు పడదు. మరో సారి చూద్దాం," అంది అమ్మ.

కాసేపు బాడ్ గాఫిల్ అయ్యాను..

**

ప్రోగ్రాం మొదలయ్యింది. సినిమాల్లో స్క్రీన్ మీద డాన్స్ చూసే దానికంటే, ఇలా దగ్గరినుండి చూడ్డం బాగుంది...ప్రోగ్రాం

అంతా కళ్ళార్పకుండా చూసాను. చూసింది నాకు వచ్చేసినట్టే అనిపించింది. డాన్స్ ప్రోగ్రాం లోని ప్రతి ఐటెం ఒకదాని కంటే ఒకటి బాగనిపించింది.ఇప్పటివరకు చూసిన వాటిల్లో తరంగం- నెమలి డాన్స్- దశావతారములు- ఎంకి డాన్స్ నచ్చాయి. ఓ చిన్నమ్మాయి చేసిన 'గోవర్ధన గిరిధారి'పాటకి డాన్స్ చాలా బాగుంది. ఆ పాట అమ్మ తరచు పాడుతుంది.వాళ్ళ డాన్స్ పాటలు - శ్లోకాలు కొన్ని, అమ్మ పాడేవే. గుర్తుపట్టాను.

'డాన్స్ చేసిన ఆ చిన్నమ్మాయి లాగా, నేనూ బాగా చెయ్యగలను' , 'ఇకనుంచి మ్యూజిక్ క్లాస్ లోఅమ్మఈ పాట పాడేప్పుడు , నేను డాన్స్ చేసేయ్యాల్సిందే' అనుకున్నాను.

ప్రోగ్రాం ముగిసాక, మంచి ప్రోగ్రాం ఏర్పాటు చేసారని, అందరూ నాన్నని మెచ్చుకున్నారు.

**

ఇంటికొచ్చేప్పుడు, కారులో బాబు 'ఆకలి' అంటూ గొడవ చేసాడు.ఎప్పుడో ప్రోగ్రాముకి ముందు, క్లబ్బులో, లైట్ స్నాక్ సర్వ్ చేసారు. అప్పుడు తినడమే. డాన్స్ చూసినంత సేపు మాత్రం నాకు ఆకలి కూడా తెలియలేదు.

**

ఇంటికొచ్చాక భోంచేస్తూ "వేదిక" అంటే ఏమిటి? వేదిక మీదే చెయ్యాలా డాన్స్?" అడిగాను అమ్మని.

"డాన్స్ ప్రదర్శనకి, ఆచారబద్ధంగా, అంటే పద్ధతిగా ఏర్పాటయిన ఎత్తైన ఓ 'స్టేజ్' అన్నమాట. నాట్యం చేసేవాళ్ళకి 'వేదిక' లేదా 'రంగస్థలం' అంటే దేవాలయమంత పవిత్రం. అందుకే వేదికని చేతులలో అంటి, కళ్ళకద్దుకొని ప్రదర్శన మొదలుపెడతారు," అంది అమ్మ.

నాకిష్టమైన మష్రూమ్ కర్రీ వడ్డిస్తూ, "మామీ అడిగింది కదాని, ఏదో ఒకలా అందరి ముందు డాన్స్ చేసేస్తానని అనకూడదు...తెలిసిందా? అంది అమ్మ నా తలపై చేయి వేసి...

“అలా ‘వేదిక’ల మీద నాట్యం చెయ్యాలంటే, ముందు గురువు వద్ద నేర్చుకొని, ప్రాక్టీసు చెయ్యాలి,” అంది నవ్వుతూ,,,

**

కిచెన్ లో నుండి అమ్మ మాటలు వినబడుతున్నాయి. పొద్దున్నే పనిపిల్ల కామాక్షిని సూపర్ మార్కెట్ కి పంపుతున్నట్టుంది.అలాగే కిచెన్ నుండి వస్తున్న ఘుమఘుమ వాసనలని బట్టి, అమ్మ ఇవాళ ఫ్రెంచ్– టోస్ట్ చేస్తుందని తెలుస్తుంది. ఫ్రెంచ్– టోస్ట్ తో ..తప్పకుండా పుడ్డింగ్ కూడా చేస్తుంది. స్నానం చేసి త్వరగా బయటపడాలని…బెడ్ మీద నుండి లేచాను…

**

స్నానమయి, తయారయి, దేవుడికి దణ్ణం పెట్టుకునే లోగానే, బాబుని తీసుకొని బ్రేక్ఫాస్ట్ కి రమ్మని పిలిచింది అమ్మ. కార్టూన్స్ చూస్తున్న బాబుని పిలిచి డైనింగ్ టేబిల్ వద్దకు వెళ్లి కూర్చున్నాను.

పుడ్డింగ్ కప్ నా ముందుంచుతూ, “నీకు ఇవ్వాల్టినుంచి ఓ చక్కని డాన్స్ నేర్పిస్తాను. అది నా చిన్నపుడు నేను చేసిన డాన్స్. మంచి పాట కూడా. సమ్మర్ కదా! నేర్చుకుని ప్రాక్టీస్ చేయి. నా మ్యూజిక్ క్లాస్ మొదలయ్యే ముందు, రోజూ ఓ అరగంట ప్రాక్టీసు చేద్దాము,” అంది అమ్మ.

వెంటనే కుర్చీ దిగి, “లవ్ యు అమ్మ,” అంటూ అమ్మని హగ్చేసాను.

**

‘ఆధరం మధురం వదనం మధురం

నయనం మధురం, హసితం మధురం

హృదయం మధురం, గమనం మధురం

మధురాధిపతే, అఖిలం మధురం....'

నాకిష్టమైన పాటే. అది అమ్మ పాడుతుండగా నేను విన్న పాటే, విని విని నాకు వచ్చును కూడా! ఆ పాటకే - మీనింగ్స్ చెబుతూ, డాన్స్ నేర్పడం మొదలు పెట్టింది అమ్మ.

....'శ్రీ కృష్ణుని అందాలు, నడకలు, నవ్వులు ఎంతో మధురం' అంటూ మొదలవుతాయి ఆ పాటలోని అర్థాలు.... ....

**

మరో మూడు వారాలకి, "నీకు ఒక డాన్స్ వచ్చేసినట్టే. బాగుంది," అని అమ్మ అన్నాకే, "మరి మ్యూజిక్ క్లాస్ లో అందరి ఎదుటా చెయ్యవచ్చా?" అని అడిగాను.

"బేషుగ్గా! రేపే మ్యూజిక్ క్లాస్ అయి, అందరూ వెళ్ళే ముందు చెయ్యి,"...అంది అమ్మ...



నమ్మలేనంత బాగా చేసావు," అని నన్ను, "అంతకంటే మీరు బాగా నేర్పారు మేడమ్," అని అమ్మని మెచ్చుకున్నారు, నా డాన్స్ చూసాక, మ్యూజిక్ క్లాస్ వాళ్ళంతా. "ఈ సారి మా 'చిన్మయ మిషన్' ఫంక్షన్ కి ఈ డాన్స్ చెయ్యాలి నువ్వు చంద్రా," అంది నా భుజం మీద తట్టి, భానుమామి."అక్కడ మంచి 'వేదిక' ఉంటే, అమ్మ 'సరే' అంటే చేస్తాను. ఫంక్షన్ ఎప్పుడు?" అడిగాను భానుమామిని.అమ్మతో సహా అందరూ నవ్వారు. కరెక్టుగానే అన్నానుగా అనుకున్నాను....

**

సమ్మర్ హాలిడేస్ అయ్యాక, నాన్న చేయి పట్టుకొని స్కూల్లో అడుగు పెట్టాను. ఆరునెల్లక్రితమే నాకిక్కడ అడ్మిషన్

కన్ ఫర్మ్ అయిందట. "హోలి ఏంజల్స్" కాన్వెంట్ కాంపౌండ్ చాలా పెద్దది. గేటు నుంచి ప్రిన్సిపాల్ ఆఫీస్ కి కొంత దూరం నడవాలి. లెఫ్ట్ లో పార్క్, దాటాక కిండర్ గార్టెన్, తరవాత పార్లర్, పక్కన ఆఫీసు. నాన్న ప్రిన్సిపాల్ తో మాట్లాడి పేపర్స్ మీద సైన్ చేసి నన్ను సెకెండ్ స్టాండర్డ్ లో అడ్మిట్ చేసారు. నాకు నర్వస్ గా, ఆతృత్రగా ఉంది. మరునాటి నుండి స్కూల్. మొదటి నాలుగు రోజులు నాన్న లోపల వరకు దిగబెడతాన్నారు.

**

స్కూల్ లోపల కిక్కిరిసినట్టు జనం. నాన్న వెంట నడుస్తుంటే, అందరూ మా వంకే చూస్తున్నారు. నాకు తెలుసు, మా నాన్న మిలటరీ యూనిఫారంలో ఉన్నందుకే అని. నాన్నతో నడవాలంటే చాలా గర్వంగా, భయం లేకుండా, గొప్పగా అనిపిస్తుంది నాకు.

**

స్కూల్లో ప్రతిరోజు జరిగే మ్యూజిక్ క్లాస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అవర్, చర్చికెళ్ళడం చాలా నచ్చాయి నాకు. ఆటల్లో ఈజీగా గెలవగలనని, మా టీచర్లని అచ్చంగా ఇమిటేట్ చేయగలనని కొత్తగా, నా గురించి నేను తెలుసుకున్నాను.స్కూల్లోమా మ్యూజిక్ క్లాస్ అంటే నాకు స్పెషల్ గా చాలా ఇష్టమయింది. మా మ్యూజిక్ టీచర్ అమెరికన్ లేడీ. పేరు మిస్. లిండా మాథ్యూ. ఇంగ్లీష్ పాటలు, చాలా కొత్తరకంగా నేర్పుతుంది మాకు.

**

ప్రతి సాయంత్రం, నాన్న నన్ను స్కూలు విషయాలు చెప్పమని అడగడం, ఆలస్యం.... కుర్చీలు, బల్లలు, సోఫా ఓ పక్కకి జరిపేసి, నాకోసం గదిని 'వేదిక' గా మార్చేస్తాను. అమ్మ, నాన్న తమ్ముడు, ఒక్కోప్పుడు కన్నన్ కూడా కాస్త దూరంలో, నా ఎదురుగా కూర్చోగానే, మా మ్యూజిక్ క్లాసుని ఓ 'డ్రామా'~`7ం¯ నటించేస్తాను.

మ్యూజిక్ క్లాస్ లో నేర్చుకున్న ఆ ఇంగ్లీష్ పాటలని రాగాలు తీస్తూ, రాగానికి తగ్గట్టుగా నేల మీదనుండి, బల్లమీదకి, అక్కడినుండి కిటికీలోకి ఎక్కి పాడటం ఒక ఎత్తైతే, ప్రతి టీచర్ని అనుకరించి చూపించడం మరో ఎత్తుగా, ఓ గంట సేపు వాళ్ళని నవ్వించగలుగుతున్నాను...

ఓ ' వేదిక ' మీద డాన్స్ చేయాలి, చేయగలను, నన్ను అందరూ మెచ్చుకుంటారు కూడా - అన్న ఆలోచన, నాలో మొదలైంది.

నా చేత ఇంగ్లీష్ పాటలు పాడించుకోడం, అమ్మ స్టూడెంట్స్ కి..., ఎప్పటికప్పుడు

కొత్తపాటలు పాడి వాళ్ళముందు పర్ ఫాం చేయడం నాకు రొటీన్ అయింది...వాళ్ళు నా ఫేవరేట్ ఆడియన్స్ అయ్యారు...

**

నేను కొత్తగా నేర్చుకున్న పాట 'రైన్ డ్రాప్స్ ఆన్ రోజస్'.....వాళ్లకి పాడి వినిపించాలని ప్రాక్టీస్ చేసాను. మ్యూజిక్ క్లాస్ అయ్యాక, ఉత్సాహంగా పాడి వినిపించాను కూడా. అమ్మ స్టూడెంట్స్ "బ్యూటిఫుల్ పర్ఫామెన్స్ ," అంటూ చప్పట్లు కొట్టారు....

ఆ సందడిలోనే, కింద గ్రౌండ్ ఫ్లోర్ నుండి ఏదో హడావిడి వినిపించింది. ఏమిటో చూద్దామని నేను కూడా మాలినితో కిందకి వచ్చాను. ఖాళీగా ఉన్న ఫ్లాట్ లోకి సామాను దింపుతున్నారు.

“నేను చెప్పానే, డాన్స్ క్లాసు మొదలవ్వబోతుందని. వాళ్ళ సామానే దింపుతున్నారు. ఆ మాస్టారు మంచి పేరున్న వారంట. ఆయన దగ్గర డాన్స్ నేర్చుకోవాలని...చాలా మంది ఎదురు చూస్తున్నారు...మా చెల్లిలాగా. బాగుంది. అయితే, త్వరలోనే ఇక్కడ డాన్స్ స్కూల్ మొదలైపోతుందన్న మాట,” అంది మాలిని.

నా వంక చూసి, “నువ్వింక పైకి వెళ్ళు చంద్రా,” అని తను ఇంటికి వెళ్ళిపోయింది.

**

మారల్ సైన్స్ క్లాసులో నా పక్కనే ఓ స్టూడెంట్ వచ్చి కూర్చుంది. పేరు లీనా జోసెఫ్. ‘హలో’ అంది.క్లాస్ మొదలవ్వడానికి ఐదు నిముషాలుంది. నా గణపతి బొమ్మ పెన్-బాక్స్ డెస్క్ మీద ఉంది. “హు ఇజ్ థిస్?” అంది గణపతి బొమ్మని చూస్తూ.

“లార్డ్ గణపతి,” అన్నాను.

“ఐ హేట్ యువర్ గాడ్స్. హవ్ స్టుపిడ్? హవ్ కెన్ హి హేవ్ ఎలెఫెంట్ ఫేస్ అండ్ ఫోర్ హేండ్స్? సో ఫన్నీ,” అంటూనే పోయింది.

షాక్ అయిపోయాను. కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. నేను గట్టిగానే ఎదురు చెప్పాను. “హవ్ కెన్ యు టాక్ లైక్ థిస్? హి ఇజ్ అవర్ గాడ్,” అన్నాను. అప్పుడే క్లాస్ రూం లో అడుగు పెట్టిన మా మేడమ్ కి చెప్పాను.ఆవిడ కూడా ఆశ్చర్య పోయింది. మమ్మల్నిద్దర్నీ క్లాస్ బయటికి తీసుకువెళ్ళి, నచ్చజెప్పి, వార్నింగ్ కూడా ఇచ్చింది...“చూడు లీనా, నీవిలా బిహేవ్ చేసి ఇతరులని ఇన్ సల్ట్ చేసి మాట్లాడుతుంటే, చర్చ్- ప్రీచర్ అయిన మీ ఫాదర్ కి చెడ్డ పేరు వస్తుంది. నీవు, చంద్రకళ కి అపాలజీ చెప్పవలసిన అవసరం ఉంది. మీ పేరెంట్స్ కి కూడా స్కూల్ నుండి నోట్ వెళుతుంది,” అని హెచ్చరించింది మేడమ్.మొదటి సారి ఇటువంటి సంగతి ఎదురవ్వడం. చాలా బాధపడ్డాను. ఇంటికెళ్ళాక అమ్మకి, నాన్నకి చెప్పాను.

**

"లీనా జోసెఫ్ లాంటి వాళ్ళతో అనవసరంగా వాదనలు పెట్టుకోకు.  వీలయినంత మటుకు నీ పని నువ్వు చూసుకో. అలాంటి వాళ్ళతో టైం వేస్ట్ చేసుకోకు," అంది అమ్మ.

"ఎన్నో రెలిజన్స్, కల్చర్స్ ఉన్నాయి ప్రపంచంలో.  ఎవరు ఏది పాటించినా, ఇతరుల భావాలని గౌరవించడం నేర్చుకోవాలి…" అన్నారు అంతా విన్న నాన్న.

అప్పటి నుంచే నాకు ఇతర రెలిజెన్స్ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది.

**

పేరెంట్స్ కి ఇమ్మని, 'స్కూల్ కాలెండర్ ఆఫ్ ఈవెంట్స్' ఇచ్చారు క్లాస్ టీచర్. యేడాది పొడుగునా జరగబోయే అకడమిక్, ఎక్ష్ ట్రా-కరికులర్, కల్చరల్ యాక్టివిటీస్ లిస్టు అని వివరించింది మా మేడమ్.

'స్ప్రింగ్ ఫెస్టివల్ - టాలెంట్ షో' – జరగనుందని, మా మ్యూజిక్ టీచర్ కూడా, అనౌన్స్ చేసి, 'టాలెంట్ షో'' గురించి పేపర్స్ ఇచ్చింది.  ఒక్కో స్కూల్ నుండి సెలెక్ట్ అయిన నాలుగు ఐటమ్స్ ని 'చెన్నై యంగ్ టాలెంట్ షో' అవార్డు కి పంపుతారంట.

రెండు వారాల్లో పార్టిసిపేట్ చేసేవాళ్ళ నేమ్స్ ఇవ్వాలంది మేడమ్.

**

ఇంటికి వెళ్ళగానే, స్కూల్ యాక్టివిటీ కాలెండర్ అమ్మకిచ్చాను. తప్పకుండా నేను ఆ 'టాలెంట్ షో' కి డాన్స్ ఐటమ్ చేయాలని అడిగాను. "నీకు కాస్ట్యూమ్ లేదు కదమ్మా!," అంది అమ్మ."చెయ్యనివ్వు శారదా, దాన్ని ఏడిపించకు. కాస్ట్యూమ్ కుట్టించు," అన్నారు నాన్న. నాన్నని, అమ్మని గట్టిగా హగ్ చేసి 'లవ్ యు' అని చెప్పాను.."రేపే నా పేరు

ఇస్తున్నా మా మేడమ్ కి," అన్నాను.

"ఓకే," అన్నారు ఇద్దరూ.

"అయితే, నీకు బాగా వచ్చిన 'అధరం,మధురం' డాన్స్ కి 'కాళీయ మర్దనం' ఎపిసోడ్ ని కలపాలి. పోటీకి వెళ్ళాలంటే, తప్పదు. నీకు సరిపడా ఆ ఎపిసోడ్ ని మార్చి నేర్పాలంటే, చిన్న పనేమీ కాదు మరి. రేపటినుండే ఆ ప్రాక్టీసు....," అంది అమ్మ...

ఆనందంతో నాకు నిద్రరాలేదు..... 'అధరం,మధురం...డాన్స్ గురించి, అమ్మ కుట్టించబోయే కాస్ట్యూమ్ గురించి ఆలోచిస్తూ ఎప్పటికో...నిద్రపోయాను.

**

అమ్మచేత కన్సెంట్ లెటర్ రాయించి, మరునాడు మా మ్యూజిక్ క్లాస్ లో సబ్ మిట్ చేసాను.

టాలెంట్ షోకి నేను చేయబోయేది- 'ఇండియన్ క్లాసికల్ డాన్స్' అని రాసింది అమ్మ.

అది చదివిన మా మ్యూజిక్ టీచర్, "వెరీ గుడ్. యు ఆర్ ది ఫస్ట్ గర్ల్ టు గివ్ యువర్ నేమ్, చంద్ర. గుడ్ లక్, చైల్డ్," అంది.

**

గ్రౌండ్ ఫ్లోర్ లోకి ఫర్నిచర్ దిగిన వారానికి క్రింద ఫ్లాట్ లో డాన్స్ క్లాస్ మొదలైంది. రెండో రోజు సాయంత్రం డాన్స్ క్లాస్ లోకి వెళుతున్న వారితో పాటు నేనూ వెళ్ళి, క్లాసులన్నీ అయ్యేంత వరకు చూసి ఇంటికి వెళ్ళాను.

మూడో రోజు, ఆ తరువాత కూడా అలాగే చేసాను. అక్కడున్నంత సేపు అసలు టైం తెలియడం లేదు....

ఒక వారం గడిచింది. ప్రతిరోజు డాన్స్ క్లాస్ చూసి ఇంటికి వెళ్ళేప్పటికి అమ్మ తప్ప అందరూ భోంచేసేస్తున్నారు. నేను వెళ్ళాకే, నాతో పాటు కూర్చుని తనూ భోంచేస్తుంది అమ్మ. దాంతో, కాస్త ధైర్యం వచ్చింది. అమ్మకి నామీద కోపం లేదన్న మాట అనుకున్నాను. అందుకే, రెండు రోజులుగా, సీనియర్ స్టూడెంట్స్ డాన్సులు కూడా చూడ్డానికి మరింతసేపు ఉండిపోయాను.

**

ఇవాళ మాత్రం, రోజూ కంటే బాగా ఆలస్యం అవడంతో, అమ్మ ఏమంటుందోనని భయం వేసింది. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి చేతులు కడుక్కొని, డైనింగ్ టేబిల్ వద్ద కూచున్నాను. టేబిల్ వద్దనే వెయిట్ చేస్తున్న అమ్మ....సీరియస్ గా ఉంది. బాగా కోపం వచ్చిందిలా ఉంది. ముందు నా ప్లేట్ లో, తరువాత తన ప్లేట్ లో వడ్డించింది. .. మెల్లగా తినడం మొదలు పెట్టాను. “చూడు చంద్రా, ఒకటో, రెండో రోజులు అక్కడ ఏం జరుగుతుందో చూసొస్తావులే అనుకున్నాను. వారం రోజులుగా రాత్రివరకు అక్కడే పడుంటున్నావు. ఇంట్లోతమ్ముడితో, పనితో నాకు ఊపిరాడటం లేదు. అసలు నువ్వు, స్కూల్ వర్క్ చేస్తున్నట్టు కూడా లేవు. నీ కోసం కన్నన్ వచ్చినా, అతన్ని లోపలికి పంపరుగా! అసలు గ్రహింపు లేకుండా ఉంది నీకు,” గట్టిగా కోప్పడింది అమ్మ...

**

అమ్మ కోపానికి భయమేసి, స్కూల్ నుండి వచ్చాక ఎక్కడికీ వెళ్ళడం లేదు. ఇవాళ అప్పుడే మూడో రోజు. పుస్తకాలు ముందు పెట్టుకొని కూర్చున్నాను. దిగులుగా అయిపోయాను.‘ఎలాగైనా నాన్నతో మాట్లాడి, అమ్మ కోపం పోగొట్టి, డాన్స్ చూడ్డానికి వెళ్ళాలి. అసలు డాన్స్ నేనెందుకు నేర్చుకోకూడదు? అమ్మా వాళ్ళని అడగాలి’ అనుకున్నాను.ఒక వారంలో ఎగ్జామ్స్ అయ్యాక, అమ్మ హ్యాపీగా ఉన్నప్పుడు డాన్స్ విషయం అడగాలని డిసైడ్ అయ్యాను....



ఎగ్జామ్స్ అయ్యాయి.  ఒకటి రెండు రోజుల్లో డాన్స్ సంగతి, ముందు నాన్నతో.. తరువాత, అమ్మతో మాట్లాడాలి...అనుకుంటూ డిన్నర్  ఫినిష్ చేసి వెళ్లి, నా గదిలో హోం వర్క్ బుక్స్ ముందేసుకున్నాను.

“కళా ఇలా రా,” పిలిచారు నాన్న.  డాన్స్ క్లాస్ ఆలోచనలోనే ఉన్న నేను మెల్లగా వెళ్లాను.

సిటింగ్ రూములో అమ్మా, నాన్నలతో కూర్చుని మాట్లాడుతున్న శివరామశర్మ మాస్టారుని చూసి ఆశ్చర్యపోయాను. భయం కూడా వేసింది. క్లాసులో అంతమందికి డాన్స్ నేర్పించే ఆయన, మా ఇంట్లోమా అమ్మావాళ్ళతో వచ్చి ఏమి మాట్లాడుతున్నారో అర్థం కాలేదు. మొన్న నన్ను పిలిచి, నా గురించి వివరాలు కనుక్కుని, డాన్స్ నేర్చుకోవాలని ఉందా? అని మాస్టారు అడిగినప్పుడు, తను ఔనని చెప్పడం గుర్తొచ్చింది. నాన్న దగ్గరగా వెళ్ళి నిలబడ్డాను.  “రేపటి నుంచి నువ్వు కూడా కూచిపూడి నేర్చుకో,” అన్నారు.చెప్పలేనంత సంతోషమనిపించింది.

"మీ మాస్టారు, ఆయనే వచ్చి, నిన్ను తప్పక డాన్సుకి పంపమని అడుగుతున్నారు. నీకు డాన్సెంత ఇష్టమో మాకు తెలుసుగా," అన్నారు నాన్న నా భుజాల చుట్టూ చేతులు వేస్తూ.

నేల చూపులు చూస్తుండిపోయాను.

"చంద్రా మరి ఇంకా అలకెందుకు? మాస్టారు గారి ఆశీర్వాదం తీసుకో," అంది అమ్మ.

గుర్తొచ్చింది పెద్దవాళ్ళ పాదాలు తాకి నమస్కరించాలని. అదే చేసాను.

మాస్టారు ఆశీర్వదించారు.

"సరే చంద్రకళ, రేపు చూస్తానమ్మా," అంటూ బయలుదేరారు మాస్టారు.

**

కూచిపూడి డాన్స్ నేర్చుకోబోతున్నందుకు గొప్పగా ఫీల్ అయ్యాను. కొత్త ఎనెర్జీ వచ్చింది..

అదీ కాక, వారం రోజుల్లో జరగబోయే టాలెంట్ షో కి ఎలాగూ ప్రాక్టీస్ చేయిస్తుంది అమ్మ.... అంటే, నాకిక ఎప్పుడూ డాన్స్....డాన్స్... డాన్స్.... చదువులో మార్కులు, క్లాస్ ర్యాంక్ బాగానే ఉంటే, నా డాన్స్ క్లాసుకి అడ్డం ఉండదని చెప్పింది అమ్మ. కాబట్టి హ్యాపీగా నిద్రపోయాను....

**

“త్వరగా బ్రేక్ ఫాస్ట్ చేసి పనులు కానివ్వు. ఇది నీ మొట్టమొదటి ‘టాలెంట్ షో’ కాంపిటీషన్ .. స్కూల్ కి వెళ్ళే దారిలో టెంపుల్ కి వెళదాము,” అంటూ పొద్దున్నే నిద్రలేపింది అమ్మ.

‘అవును, ఇవాళే ‘టాలెంట్ షో’ అనిగుర్తుచేసుకొని, కొంచెం నర్వస్ గా ఫీల్ అయ్యాను.

**

మేము వెళ్ళిన కాసేపటికి స్కూల్ ఆడిటోరియం కిక్కిరిసి పోయింది. ‘వేదిక’ పైన మొత్తం ట్వెల్వ్ స్టూడెంట్స్ పర్ ఫాం చెయ్యాలి. సాంగ్- డాన్స్- ఇన్స్ ట్రుమెంట్స్-పోయెట్రీ-రిసైటింగ్ డివిజన్స్ లో ‘షో‘ జరుగుతుంది.

బయట ఇతర స్కూల్స్ నుంచి ‘జడ్జెస్’ వచ్చారని చెప్పింది అమ్మ.

**

నా టర్న్ వచ్చింది... ‘వేదిక’ మీద అడుగు పెట్టి, ఒక్కసారి కిక్కిరిసిన ఆడిటోరియం వంక చూసాను..నర్వస్ గా అనిపించలేదు....హ్యాపీగా, ఎనర్జటిక్ గా అనిపించింది..

నేర్చుకున్న దానికంటే, బాగా చెయ్యాలని, కాన్ఫిడెంట్ గా చేసాను.

**

ప్రోగ్రాం అవగానే, ‘గంటలో విన్నర్స్ నేమ్స్ అనౌన్స్ చేస్తామంది మా మ్యూజిక్ మేడమ్. ఆ బ్రేక్ లో, ఆర్కెస్ట్రా క్లాస్ వాళ్ళ మ్యూజిక్ వింటూ, అమ్మ పక్కనే కూర్చున్నాను.

నేనే గెలుస్తానేమో! గెలిస్తేఏం చేయాలి.... లేదంటే నేను సెలెక్ట్ కానేమో! అప్పుడేమి చెయ్యాలి...ఏడవ కూడదు...కానీ మరి బాడ్ గా ఫీల్ అవుతానుగా! ఇలా నాలో ఎన్నో ఆలోచనలు.....

**

మరి కాసేపటికి, విన్నర్స్ ని అనౌన్స్ చేయడానికి, వేదిక పైకి వచ్చిన మా ప్రిన్సిపాల్ ని చూసి, నర్వస్ గా అనిపించి, గట్టిగా చెవులు మూసుకున్నాను. అమ్మ నవ్వుతూ చెవుల మీద నుండి నా చేతులు తీసేసింది.

అన్ని డివిజన్స్ లో విన్నర్స్ ని అనౌన్స్ చేసాక, "డాన్స్ డివిజన్ విన్నర్స్ ఆర్ - నివేదిత పాల్ – ఫర్ - వెస్టర్న్ డాన్సింగ్, ఎండ్, చంద్రకళ మధురై - ఫర్ – క్లాసికల్ డాన్సింగ్," అని నవ్వుతూ, "గివ్ దీజ్ విన్నర్స్ ఎ బిగ్ అప్లాజ్," అంది మా ప్రిన్సిపాల్.

'నేను నిజంగా నా పేరు విన్నానా?' అని నమ్మలేక పోయాను...

అందరూ చప్పట్లుకొట్టారు. చాలా మంది నాకు 'కంగ్రాచ్యులేషన్స్' చెప్పారు.

**

'టాలెంట్ షో' విన్నర్స్ ఫోటోస్, మా స్కూల్ బులెటిన్ బోర్డ్ మీద పెట్టి, అసెంబ్లీలో మా గురించి గొప్పగా మెచ్చుకున్నారు మా ప్రిసిపాల్ మేడమ్.

'చెన్నై సెంట్రల్ యంగ్ టాలెంట్ 'షో' లో పార్టిసిపేషన్ గురించి మాకు పేపర్స్ అందించారు ....

**

'చెన్నై 'షో' కి, వాణీ మహల్ 'వేదిక' మీద పర్ ఫాం చేసాను. నా పర్ఫామెన్స్ చాలా బాగుందని మెచ్చుకుని, నన్ను 'చైల్డ్ ప్రాడిజీ' అంటూ అనౌన్స్ చేసి, నాకు 'ట్రోఫీ' ప్రెజెంట్ చేసారు ఆ ఫౌండేషన్ వాళ్ళు. అనుకోని ఈ అవార్డు కి నేను, అమ్మ, నాన్న చాలా హ్యాపీగా ఫీల్ అయ్యాము.

నాకైతే, ఉత్సాహంతో నిద్రపట్టలేదు...

**

పొద్దున్న లేచేప్పటికి, అమ్మా నాన్న పేపర్ చదువుతున్నారు...న్యూస్ పేపర్స్ లో 'చెన్నై టాలెంట్ షో' రీవ్యూస్ వచ్చాయంది అమ్మ......'సెవెన్ – ఇయర్ - ఓల్డ్ చైల్డ్ ప్రాడిజీ' అంటూ నా ఫోటోతో పాటు నా డాన్స్ గురించి గొప్పగా రాసారట పేపర్ లో.. 'కాళీయ మర్దనం' ఎపిసోడ్ ని డాన్స్ కి 'హై-లైట్ ' గా పేర్కొన్నారంట.

కన్నన్ చేత వేరే పేపర్స్ కూడా తెప్పించి నాకు చదివి చెప్పింది అమ్మ.

'క్విక్ ఫ్లోయింగ్ సిల్వర్' తో పోల్చారట నా డాన్స్ స్టైల్ ని. "అంటే, పాదరసంలా వేగంగా, చకచకా కదిలినట్టు డాన్స్ చేసావన్న మాట," నాన్న నవ్వుతూ వివరించారు నాకు.

**

అమ్మ నాకు 'డాన్స్ భాష' లో ట్యూషన్ చెబుతానంది... ప్రతి సండే ఓ గంటసేపు ఎలాగూ మా చేత తెలుగు పద్యాలు, శ్లోకాలు చెప్పిస్తుంది. తెలుగు చక్కగా మాట్లాడాలని కూడా చెబుతూనే ఉంటుంది."అదేంటమ్మా?", 'డాన్స్ భాష' అని ఉంటుందా?" అడిగాను.

"ఉంటుందిగా మరి... - 'ప్రేక్షకులు, అభినయం, లయజ్ఞానం, పాదాభివందనం, కరతాళధ్వనులు, హావభావాలు' వంటి

పదాలు ఇంకా మరెన్నో ఉన్నాయి," అంది అమ్మ.వాటికి అర్ధాలు చెప్పడమే తన డాన్స్-భాషా ట్యూషన్ అంది..

అలాగే కొన్ని ఇంగ్లిష్ మాటలకి కూడానట.

**

అన్ని రకాల యాక్టివిటీస్ తో, ఇంటిల్లిపాది బిజీగా అయిపోయాము.... నాకు టైం ఉంటేనే పాట క్లాస్ కి వెళుతున్నాను.....ఎగ్జామ్స్ దగ్గరైనప్పుడల్లామాత్రం, డాన్స్ - మ్యూజిక్ నుండి బ్రేక్ తీసుకుంటున్నాను.

శనాదివారాలు, బాబు – నాన్న ఆర్మీ-స్పోర్ట్స్ ఆక్టివిటీస్ లో పార్టిసిపేట్ చేస్తుంటారు.

నాన్న ఫ్రెండ్ - భూషణ్ అంకుల్ వాళ్ళ స్టూడియో ఫంక్షన్స్ కి, అమ్మవాళ్ళతో తప్పక వెళుతుంటాను..

స్కూల్ టాలెంట్ షో లో గెలిచి, మరో సారి కూడా 'చెన్నై యంగ్ టాలెంట్' ట్రోఫీ గెలుచుకున్నాను. 'గోవిందాశ్రిత గోకుల బృందా' అనే పాటకి అమ్మ నేర్పిన డాన్స్ చేసాను....

**

"మూడేళ్ళు ఫాస్ట్ గా గడిచిపోయాయి. అప్పుడే ఫోర్త్ స్టాండర్డ్ కంప్లీట్ అయిపోతుంది. వచ్చే వారం నుండి ఫైనల్ ఎగ్జామ్స్ చంద్రానికు," అంది అమ్మ బ్రేక్ ఫాస్ట్ దగ్గర.

'ఔను, మూడేళ్ళగా -చదువు, డాన్స్ పాఠాలు, స్కూల్ మ్యూజిక్ బాండ్ లో ఉత్సాహంగా గడిచిపోతుంది. మా మ్యూజిక్ మేడమ్ నన్ను స్కూల్ సింగింగ్ గ్రూప్ లో పెట్టింది. డాన్స్ క్లాస్లో అడుగులు - జతులు నేర్చుకొని ప్రోగ్రెస్ అవుతున్నాను' .

నేను, తమ్ముడు కూడా స్కూల్లో మంచి మార్క్స్ తెచ్చుకుంటామని అమ్మ హ్యాపీ.

**

ఫోర్త్ స్టాండర్డ్ ఎగ్జామ్స్ అయ్యాయి.

పేరెంట్స్ డే, స్పోర్ట్స్ డే ఈవెంట్స్ లో పాల్గొన్నాను. అన్నిట్లో ప్రైజ్ లు కూడా గెలుచుకున్నాను.

నేను ఫిఫ్త్ స్టాండర్డ్ కి, తమ్ముడు అప్పర్ కే.జి కి వచ్చాము. సమ్మర్ హాలిడేస్ స్టార్ట్ అయ్యాయి.

నాన్న లీవ్ తీసుకున్నారు... వెకేషన్ కి గుంటూరు వెళుతున్నామంది అమ్మ.



పొద్దున్నే దేవుడి గది నుండి బయటకి వస్తుంటే, ఫోన్ రింగ్ అయింది... పికప్ చేసి 'హలో' అన్నాను. అవతలి నుండి అమ్మమ్మ గొంతు, "ఏరా బంగారం? బాగున్నావా? మిమ్మల్ని చూసి ఎన్నాళ్ళవుతుందో....నువ్వు సెకండ్ క్లాస్ లో జాయిన్ అవ్వక ముందు చూసాము. ఇప్పుడు ఐదో క్లాస్ కొచ్చావంట. ఇంకో వారం రోజులు ఓపిక పట్టాలి మీ రాక కోసం," సంతోషంగా ఆమె.

"అవునమ్మమ్మా మాకూ మిమ్మల్ని చూడాలనుంది," అన్నాను.

"ఫోనులో అమ్మమ్మే కదూ! ఓ పది నిముషాల్లో ఫోన్ చేసి అన్ని వివరాలు ఇస్తానని చెప్పి నువ్వు తినడానికి రా," అంది ఇదంతా వింటున్న అమ్మ నాతో. మరికాసేపు మాట్లాడాను అమ్మమ్మతో..

**

"ఇవాళ నుండి సమ్మర్ హాలిడేస్ మొదలయ్యాయిగా. ఎల్లుండే మన ప్రయాణం. ముందు నాలుగు రోజులు మీ నానమ్మ వాళ్ళ దగ్గరికి, ఓ మూడు రోజులు అమ్మమ్మ వద్దకి వెళ్ళి వస్తాము. తరువాత, సమ్మరంతా నీ డాన్స్ క్లాస్ యదాతథం, నా పాట క్లాస్ మామూలే. మళ్ళీ స్కూల్ తెరిచే లోగా, తమ్ముడు బర్త్డే సెలెబ్రేట్ చేద్దాము," అంది అమ్మ ప్లేట్లల్లో టిఫిన్ పెడుతూ.

తల తిప్పి అమ్మ వంక చూసాను. కాఫీ సిప్ చేస్తుంది.

'అమ్మని ఇప్పుడే అడగాలి' అనుకున్నాను.

నాలుగు స్పూన్స్ ఉప్మా కానిచ్చి, నీళ్ళు తాగాను.

"అమ్మా, నాకు ఇప్పుడు బోలెడు కొత్త స్టెప్స్ కూడా వచ్చు. నువ్వు పాడే 'గోవర్ధన గిరిధారి!' అనే పాటకి నాకు డాన్స్ తెలుసును. మనం తిరిగొచ్చాక, నాకోసం రోజూ పాడుతావా? నేను ప్రాక్టీస్ చేస్తాను," అడిగాను.

"ఏమిటీ! ఈ మధ్యేగా నీకు అడుగులు, జతులు అయ్యాయి. అంతలోనే, అలాంటి డాన్సా?" నవ్వింది అమ్మ. "అప్పుడోసారి క్లబ్బు ప్రోగ్రాములో, ఆ చిన్నమ్మాయి బాగానే చేసింది ఆ పాటకి. గుర్తుందా?" అంది నా వంక చూస్తూ అమ్మ.

క్షణమాగి, "అలాగేలే, తిరిగొచ్చాక ప్రాక్టీస్ చేద్దువుగాని. నేనూ చూస్తాను," అంది.

"ముందైతే, ప్రయాణానికి తయారవ్వండి.. నీ బట్టలవీ తీసి ఓసారి నీ బీరువా, తమ్ముడి అలమారా సర్దు," అంటూ మాకు హార్లిక్స్ కలిపి అందించింది.

**

ఒక రోజు ప్రయాణం తరువాత, లంచ్ టైం కి కారులో ఎర్రగొండ పాలెం చేరాము.

మమ్మల్ని చూసి చాలా సంతోషపడ్డారు నానమ్మ, తాత. మమ్మల్ని క్షణం వదలకుండా ఉన్నారు. ఆ రోజు సాయంత్రం నుండే, మమ్మల్ని చూడ్డానికి నాన్న వాళ్ళ చుట్టాలు ఒకొక్కరే వచ్చారు.

నాన్నని కలవడానికంటూ, నానమ్మ ఊళ్ళో వాళ్ళందరిని పిలిచింది.

మాకోసం రకరకాల వంటలు చేస్తున్నారు అత్తావాళ్ళు. చీకటి పడుతుండగా, పెందరాళే తినాలంటూ, విస్తళ్ళు వేసి కబుర్లుచెబూతూ వడ్డించారు. "నానమ్మ చేసిన పప్పు, ఉర్లగడ్డ కారం ఎంత రుచిగా ఉన్నాయో చూసావా? మీ అమ్మ కూడా ఇలా చేయలేదు," అన్నారు నాన్న.

**

మరునాడు కార్లో ఊరంతా తిప్పి, మా పొలం, తోట, రైస్ మిల్లు చూపించారు నాన్న. తాతల నాటి ఆస్తులట. నాన్నే వాటిని వృద్ధి చేసి, వాళ్ళ అక్కల పిల్లలకి అప్పజెప్పారుట.

నీళ్ళ కోసం మోటారు పెట్టించమని, తోట చుట్టూ ఫెన్స్ వేయించమని, డబ్బు కావాలని, రోజంతా నాన్నతో అర్ధరాత్రి వరకు మాట్లాడారు అత్తయ్య వాళ్ళు,.....

**

మరుసటి రోజు కారులో శ్రీశైలం వెళ్ళి, దేవుని దర్శనం చేసుకొని , సాయంత్రానికి తిరిగి పాలెం వచ్చాము. రాత్రి ఆలస్యం అయేంత వరకు కూర్చుని కబుర్లుచెప్పారు నానమ్మ వాళ్ళు.

కొద్ది గంటలు మాత్రమే నిద్రపోయాము...

మళ్ళీ తెల్లార్లుజామునేఅక్కడి నుండి, అమ్మమ్మ వాళ్ళ ఊరు గుంటూరుకి బయలుదేరి పోయాము.

**

మమ్మల్ని చూసి అమ్మమ్మ, తాతయ్య చాలా సంతోషించారు.

నన్ను దగ్గర కూర్చోబెట్టుకుని, రోజంతా కబుర్లు చెప్పింది అమ్మమ్మ. ఆస్ట్రేలియా పెద్దమ్మా వాళ్ళ గురించి, ఢిల్లీ రాంమామయ్యా వాళ్ళ గురించి బోలెడన్ని విషయాలు చెప్పింది. వాళ్ళు గుంటూరుకి వస్తుంటారట.

"ఔనూ, నీకు గుర్తున్నారా మామయ్యా, జగదీష్, అత్తయ్య?" అడిగింది అమ్మమ్మ నన్ను.

నాకు అంతగా గుర్తులేదన్నాను. నేను వాళ్ళని చూసి ఐదేళ్లయిందని అమ్మంది.

**

మాకోసం ఎన్నో వంటకాలు చేయించింది అమ్మమ్మ.

తాతయ్య మమ్మల్ని షాపింగ్ తీసుకువెళ్ళి, నాకు, తమ్ముడికి బంగారపు గొలుసులు కొని పెట్టారు. మూడు రోజులసమయం చాలా సరదాగా గడిచిపోయింది....తిరిగి చెన్నై వెళ్ళిపోయే రోజు, మమ్మల్ని వాళ్ళ గురువుగారి ఆశ్రమంకి తీసుకువెళ్ళింది అమ్మమ్మ. అక్కడ ఆయన ఆశీర్వాదం తీసుకున్నాము.

**

ఆశ్రమం నుండి ఇల్లు చేరాక, దగ్గరుండి అందరికీ భోజనం వడ్డించింది అమ్మమ్మ.

“ఏంటో, ఇలా తుర్రుమని వచ్చి పోతున్నారు.  దేనికి  టైం లేదు మీకు.  ఈ సారి వదిలేస్తున్నాను  గాని,  మళ్ళీ వచ్చినప్పుడు,నువ్వు  నేర్చుకుంటున్న డాన్స్ చేసి చూపించాలి,” అంది నా భుజం మీద తట్టి.

సాయంత్రం బయలుదేరి పోతుంటే అమ్మమ్మ కన్నీళ్లు పెట్టుకుంది.

**

గుంటూరు  నుంచి వచ్చాక,  మా మాస్టారిగారి ‘డాన్స్ వర్క్ షాప్’ అటెండ్ అవుతూ, ‘గోవర్ధనగిరిధారి’ పాటకి డాన్స్ ప్రాక్టీసు మొదలు పెట్టాను.మ్యూజిక్  క్లాసులతో అమ్మ కూడా తీరిక లేకుండా అయిపోయింది.

**

స్కూల్  రి-ఓపెన్  అయ్యాక,  కొత్త సబ్జెక్ట్స్, మ్యూజిక్ గ్రూప్ యాక్టివిటీస్  తో రెట్టింపు బిజీ అయ్యాను.  క్వార్టర్లీ ఎగ్జామ్స్  అవుతూనే  ‘చిన్మయ మిషన్’  వారి  కృష్ణాష్టమి   ఫంక్షన్ లో ఈ యేడు కూడా పర్ఫాం చేయాలంది మధుమామి.  అదేకాక,  ‘చిన్మయా అకడెమిక్   స్కాలర్ షిప్’ కమిటీ వారికి, నా బయోడేటాసబ్మిట్ చేసిందట మధుమామి...వాళ్ళ  గుర్తింపు  కూడా పొందే అవకాశం ఉందంది..

“మంచి వేదిక.  చక్కగా అలంకరించబోతున్నాము.  ‘గోవర్ధన గిరిధారి’ డాన్స్ చేయి,”  అంటూ మళ్ళీ వారానికి నా పేరు కూడా వేయించిన   ఇన్విటేషన్ కార్డ్స్ తెచ్చిచ్చింది ఆమె.

**

చిన్మయ వారి వేదిక అందంగా అలంకరించారు. అమ్మ పాట శ్రావ్యంగా పాడింది.. ఎంతో ఆనందంగా నాట్యం చేసాను. డాన్స్ అవగానే చిన్మయ వారు నాకు మొమెంటోతో పాటు, 'యుంగ్ రోల్ - మాడల్ స్కాలర్ షిప్ అవార్డ్' గా పాతిక వేల రూపాయల చెక్ ప్రెజెంట్ చేసారు... అనుకోని అవార్డును కరతాళ ధ్వనుల మధ్య అందుకున్నాను.

**చిన్మయ ప్రోగ్రాం గురించి మా శివరామశర్మ మాస్టారు అడిగారు. నేను చక్కగా చేసానని ఆయన కూడా విన్నారంట. నేను రెండుసార్లు గెలుచుకున్న 'టాలెంట్ షో ట్రోఫీ' గురించి కూడా మాట్లాడారు. నాకు ఎంతో గర్వంగా అనిపించింది.

**

శనివారం పొద్దున్నే మేము కార్టూన్స్ చూస్తుండగా, భూషణ్ అంకుల్ ఫోన్ చేసారు. నేనే 'హలో' చెప్పి ఫోన్ అమ్మకిచ్చాను. భూషణ్ అంకుల్ ఫేమస్ సినిమా యాక్టర్. తెలుగు, తమిళ భాషల్లో హీరోగా చేసారంట. 'విజయ భూషణ్ సిని స్టూడియో' కట్టాక, ఇప్పుడు మూవి ప్రొడ్యూసర్ కూడానట... మా కాంప్లెక్స్ ఎదురుగా పెద్ద బంగళాలో ఉంటారు. అప్పుడప్పుడు ఫోన్ చేసి మమ్మల్ని స్టుడియోలో ఫంక్షన్స్ కి ఇన్వైట్ చేస్తుంటారు.

ఇవాళ కూడా అందుకేనేమో ఫోన్ చేసారు.

మాతో ఫ్రెండ్లీగా ఉంటారు భూషణ్ అంకుల్. నాతో సరదాగా, ప్రేమగా మాట్లాడుతాడు ఆయన.వాళ్ళమ్మాయి రాణి అమ్మ దగ్గర మ్యూజిక్ నేర్చుకుంటుంది. తను ఎయిత్ స్టాండర్డ్ చదువుతుంది. స్కూల్లోనా సీనియర్. ఫోన్ లో మాట్లాడుతున్న అమ్మ మాటలు వింటూ, నేను, బాబు టి.వి చూస్తున్నాము.

"హలో నిరుపమా, ఎలా ఉన్నారు? మీతో మాట్లాడుకుండా ఫోన్ ఎలా పెట్టేస్తాను?" క్షణమాగింది అమ్మ. "ఆ..ఆల్ ది బెస్ట్, మీ కొత్తమూవి రిలీజ్ కి....భూషణ్ గారు చెప్పారుగా ..తప్పకుండా వస్తాము.....," అంటూ రాణి వాళ్ళమ్మతో మాట్లాడుతుంది అమ్మ.....

భూషణ్ అంకుల్, నాన్నకి కాలేజి నుండి కూడా తెలుసంట. ఇద్దరు కలిసి వాళ్ళ కాలేజి నాటకాల్లో కాక కొన్ని

సినిమాల్లో కూడా  పనిచేసారంట.  ఆ తరువాత, నాన్న ఆర్మీలో జాయిన్ అయితే, అంకుల్ మాత్రం సినిమా ఫీల్డులో సెటిల్ అయ్యాడంట..

నాకు  వాళ్ళ  విషయాలన్నీ ,అప్పుడప్పుడు నాన్న చెబుతుంటారు..

ఫోన్ పెట్టేసాక మాకు సంగతి చెప్పింది అమ్మ.  మరునాడు ఆదివారం, వాళ్ళ స్టుడియోలో సినిమా ప్రీవ్యూకి,  తరువాత డిన్నర్ కి మమ్మల్ని ఇన్వైట్ చేసారంట  భూషణ్ అంకుల్.

బాబుని  కన్నన్ కి  అప్పజెప్పి  సినిమా  ప్రీవ్యూ కి  వెళదామంది అమ్మ.



ప్రీవ్యూకి  కొద్ది మందే వచ్చారు. వచ్చిన వాళ్ళంతా ఆ సినిమాలో యాక్ట్ చేసిన వాళ్ళంట. దేవుళ్ళ  సినిమా.  పేరు 'శ్రీ లలితా శివజ్యోతి'.. మేము వెళ్ళి రెండో వరసలో సోఫాల్లో కూర్చున్నాము.

కాసేపటికి  భూషణ్ అంకుల్, నీరూ ఆంటీ, రాణి వచ్చి పలకరించారు.

***

డిన్నర్ వద్ద అక్కడున్న వాళ్ళల్లో చాలా మందిని  పలకరించి మాట్లాడారు నాన్న.. మమ్మల్ని,  సినిమా హీరోయిన్

వసంత కుమారికి  పరిచయం చేసారు.ఆవిడ ఇల్లుకూడా మా కాంప్లెక్స్ దగ్గరేనట.  మాటల్లో  నాన్న నా డాన్స్ క్లాస్ గురించి చెప్పారామెకి. "శివరామ మాస్టారు నాకు తెలుసు.  నన్ను సినిమాల్లోడైరెక్ట్ చేసారు.  ఈ మధ్య, మన ఏరియాలోనే డాన్స్ స్కూల్  స్టార్ట్ చేసారు," అంది వసంతకుమారి.

ఇంతలో భూషణ్ అంకుల్ మా దగ్గరికి వచ్చారు.

"ఏమ్మా కళా, నీ గురించి వింటూనే ఉన్నాము.  నీ పర్ఫార్మెన్స్  మన స్టుడియో  కల్చరల్  క్లబ్బుకి  ఏర్పాటు చేద్దాము.  ఎప్పుడు నీకు వీలుంటుందో చెప్పు," అన్నారు నా తలపై తాకి.

నేను నాన్న వంక చూసాను.

"ఏమంటావ్  సత్యం?  మీ డాటర్ తన ఇద్దరి పేరెంట్స్ నుండి టాలెంట్ పుణికి పుచ్చుకుందోయ్.  ఎంకరేజ్ చెయ్యాలి," , "మన స్టుడియోలో డాన్స్ రిసైటల్ ఏర్పాటు చేద్దాం," అన్నారు  భూషణ్ అంకుల్, నాన్నతో.

"డాన్స్  విషయంలో మా కళ  ఎవరెడీ.. అది  డాన్స్  చేయడం  అసలాపింది  ఎప్పుడు?" అంటూ నవ్వారు నాన్న.

"కానివ్వండి, ఇంకా పద్దతిగా నేర్చుకొన్నాక  చేస్తుందిలెండి," అంది అమ్మ...

"ఈ సారి సమ్మర్ లో మా రాణికి కూడా కాస్తతర్ఫీదు ఇచ్చి, మెల్లగా మ్యూజిక్ పర్ఫార్మెన్స్ కి తయారు  చేయమని మీకు  మా  రిక్వెస్ట్," అన్నారు అంకుల్ అమ్మతో.

**

మునపటి కంటే తన మ్యూజిక్ క్లాసులతో  బిజీ అయినా,  నా డాన్స్ విషయంలో చాలా శ్రద్ధ పెడుతుంది అమ్మ.  నాకు స్పెషల్ డైట్  అని  కూడా  కేర్  తీసుకుంటుంది.

అమ్మ తన చిన్నప్పుడు చేసిన డాన్స్ ఐటమ్స్ కొన్ని, ఒకదాని వెంట ఒకటి నాకు నేర్పుతూనే ఉంది.

ఈ మధ్యనే 'మధురానగరి ' పాటకి డాన్స్ ప్రాక్టీస్ తో పాటు, 'మొక్కజొన్న తోటలో ' ఫోక్ డాన్స్ నేర్పిస్తుంది.

"కళా, నీ అదృష్టం రా. మీ అమ్మ నీకు గురువు కూడా!" అని నాన్న అన్నప్పుడు ,

"నా ఫస్ట్ ఎండ్ బెస్ట్ గురువు అమ్మ," అంటూ, నా తల బ్రష్ చేస్తున్న అమ్మని ముద్దుపెట్టుకున్నాను.

**

మరో మూడేళ్ళు గడిచాయి.......

డాన్స్ క్లాస్ లో కొన్ని మంచి నృత్యాలు నేర్చుకున్నాను. ఒక్కోసారి అమ్మ దగ్గరుండి ప్రాక్టీస్ చేయిస్తుంది. అవకాశం వచ్చినప్పుడల్లా ఒకటీ, రెండు ఐటమ్స్ పర్ఫాం చేస్తున్నాను. ప్రతిసారి నా డాన్స్ గురించిన మంచి కామెంట్ గాని, రీవ్యూ గాని నాకు ఎంతో సంతోషాన్నిస్తున్నాయి. అమ్మా, మాస్టారు కూడా చాలా గర్వపడతారు. సమ్మర్ లో జరిగే డాన్స్ వర్క్- షాప్స్ అటెండ్ అయి అభినయం, థియరీ కూడా నేర్చుకుంటున్నాను.

ఈ మూడేళ్ళలో నేను బాగా పొడవయ్యాను కూడానట.

**

డాన్స్ క్లాస్ నుండి,అలసటగా ఇంటికెళ్ళేప్పటికి, అమ్మ ఫోన్ లో మాట్లాడుతుంది. లోనికెళ్ళి షవర్ చేసి వచ్చాక కూడా ఇంకా ఫోన్ మీదే ఉంది....ఆకలేస్తుందని సైగ చేసి, హోమ్-వర్క్ చేస్తున్న బాబు వద్ద కూర్చున్నాను. ఢిల్లీనుంచి

రాంమామయ్య, మణత్తయ్య వాళ్ళ ఫోన్ అని అర్థమయ్యింది. ఎప్పుడు మాట్లాడినా మీరు రండంటే, మీరు రమ్మని ఆర్గ్యూ చేసుకుంటారు అమ్మ, మణత్తయ్య. రాంమామయ్య నిజానికి అమ్మకి కజిన్ బ్రదర్. చిన్నప్పటి నుండి సొంత అన్నయ్య లా ప్రేమగా ఉంటాడట. ఆస్ట్రేలియాలో ఉన్న సుశీల పెద్దమ్మ కంటే పెద్దవాడట. అమ్మమ్మ తాతయ్య సొంత కొడుకులా భావిస్తారట ఆయన్ని.

**

అమ్మ ఫోన్ పెట్టేసి, "రండి రండర్రా, మాటల్లో పడిపోయాను," మమ్మల్ని డిన్నర్ కి పిలిచింది అమ్మ. "ఈ సారి సెలువల్లో మణత్తయ్య వాళ్ళు ఒక వారం రోజులు చెన్నై వస్తున్నారు.తిరుపతి కూడా వెళ్ళాలనంట," అంది వడ్డిస్తూ.

"గుడ్, ఇన్నాళ్ళకన్నా వస్తున్నారు," భోంచేస్తూ రాంమామయ్య గురించిన కబుర్లు చెప్పసాగారు నాన్న. భూషణ్ అంకుల్ క్లాస్మేట్ అయితే,కాలేజిలో, రాంమామయ్య వీళ్ళకి సీనియర్ అట. ఆయనే ముందు ఇండియన్ ఆర్మీలో సెలక్ట్ అయి, తనను కూడా జాయిన్ అవమని ఎంకరేజ్ చేసాడట. అమ్మతో, తన పెళ్ళి కూడా, రాంమామయ్య కుదిర్చిందేనని గుర్తుచేసుకున్నారు నాన్న.

**

**

అలవాటుగా, సండే బ్రేక్ ఫాస్ట్ తరువాత, నాన్నతో బోర్డ్ - గేమ్స్ ఆడడానికి హాల్లోకి వచ్చాను. గేమ్ సెటప్ చేసి, ఆడ్డం మొదలుపెట్టేలోగా ఫోన్ రింగయింది.

నాన్నే తీసారు...

"హలో.... ఆ..ఆ.. భూషణ్, గుడ్ మార్నింగ్" ఫోన్లో మాట్లాడుతూ పక్కనే వరండాలోకి వెళ్ళారు నాన్న.... ఇక ఆ ఫోన్ కాల్ అయ్యేంత మటుకు వెయిట్ చేయక తప్పదు కనుక, నాన్న మాటలు వింటూ, టి.వి ఆన్ చేసి వాల్యూం తగ్గించేసాను.....

“....నీది సెన్సేషనల్  ఐడియా భూషణ్.... అలా చేస్తే బ్రహ్మాండంగా ఉంటుంది.  పైగా వచ్చే వారం నుండే సమ్మర్ హాలిడేస్ కదా!  రెండు నెలల  టైం పెట్టుకొని బాగా చేయవచ్చు,” , “అదే  టైంకి, ఢిల్లీనుంచి మన రాం వాళ్ళ ఫామిలీ కూడా ఉంటారేమో భూషణ్! ఇదిగో ఒక్క నిముషమాగు,  శారదకి విషయం చెపుతాను,” అని ఫోన్ టేబిల్ మీదుంచి,   అమ్మని పిలిచి  సంగతి వివరించారు నాన్న.

“భూషణ్ నాన్నగారి వర్ధంతికి,  స్టుడియోలో  గ్రాండ్ గా ఫంక్షన్ చేస్తార్ట,  ఈ సారి ఆ  ఫంక్షన్ లో  వాళ్ళమ్మాయి  రాణి చేత పాట,  మనకళ చేత  కూచిపూడి  డాన్స్  చేయిస్తే బాగుంటుందని  భూషణ్ వాళ్ళ ఆలోచన.  వీలుంటుందా!  అని నిన్ను  అడగడానికి  ఫోన్ చేసారు,” అంటూ బల్లమీదున్న ఫోన్ అమ్మకందించారు.

ఫోను తీసుకొని, “హలో,  బాగున్నారా?” అంది అమ్మ.

అంకుల్, అమ్మకి మళ్ళీ సంగతి చెప్పారనుకుంటా.

“అవును నిజమే,  ప్రోగ్రాం  అని  అనుకుని  కూడా దగ్గర దగ్గర  మూడేళ్ళవుతుంది.  ఈ సమ్మర్ ఎండింగ్ అంటే,  అదే టైంకి మా  అన్నయ్య వాళ్ళు  కూడా వస్తున్నారు,” క్షణమాగింది అమ్మ..“అదేలెండి,  వాళ్ళు  మీకూ తెలిసిన వాళ్ళే గా! పోతే  క్లాసికల్  ప్రోగ్రాం కాబట్టి, చంద్రవాళ్ళ గురువుగారితో కూడా మాట్లాడాలి.  అన్నీ ఆలోచించి మళ్ళీ చెబుతానండీ,” అని ఫోన్ పెట్టేసింది అమ్మ.

నేను వెళ్ళి  నాన్న కుర్చీ హాండిల్ మీద కూర్చున్నాను.

మా ఇద్దరి వంక చూసిన అమ్మ,  “నన్ను అలోచించనివ్వండి.  బాబు పుట్టినరోజు, అన్నయ్యా  వాళ్ళు రావడం, అన్నీ ఒకేసారి..,” తల పట్టుకుంది అమ్మ.

“చూడు శారద, మీ అన్నయ్యా వాళ్ళ రాక, ఈ ప్రోగ్రాముకి అడ్డం రాదు.  బాబు పుట్టిన రోజుకి, మన కళ డాన్సుకి కూడా వాళ్ళుంటారు.  పోతే తిరుపతికి ట్రిప్పు,ఈ ప్రోగ్రాముకు ముందో, వెనకో రెండురోజుల్లో వెళ్ళి రావచ్చు.  అలోచించి  ఏ తేదీ మనకి  వీలో  చెప్పు.  భూషణ్ తో డిస్కస్  చేద్దాము,”  అన్నారు నాన్న.  పట్టలేనంత ఆనందంగా అనిపించింది నాకు.

“ఇటువంటి ‘వేదిక’ మీద చేయడం మంచి అవకాశం. ఈ వయసుకే క్లాసికల్ డాన్సులో అవార్డ్స్, పేరు వచ్చినా, ఇలాటి ప్రోగ్రామ్స్ చేస్తేతప్ప, మన కళ టాలెంట్ కి తగ్గ గుర్తింపు రాదు.

భూషణ్ ఏది చేసినా పెద్దెత్తున చేస్తాడు. ఫంక్షన్ కి ఆర్ట్ ఫీల్డులో హేమాహేమీలు వస్తారు.

ఈ ప్రోగ్రాముకి స్పెషల్ గా కళకి మంచి కాస్ట్యూమ్స్ కుట్టించి, అన్నీ ప్లాన్ చేద్దాము. అయినా నువ్వు తలుచుకుంటే, చక్కగా చేయగలం,” అన్నారు నాన్న మళ్ళీ.

మరునాడు, మా మాస్టారు గారితో డిస్కస్ చేసింది అమ్మ. ఓ సింగర్ తో పాటు ఆర్కెస్ట్రాని, నట్టువాంగం చేసేందుకు శేషు మాస్టారుని ఏర్పాటు చేస్తారట. వారానికి రెండుసార్లు రిహార్సల్స్ చేయిస్తారట.

ఇక, భూషణ్ అంకుల్ తో కూడా మాట్లాడి, స్కూల్ రి-ఓపెన్ కి ముందు, ప్రోగ్రాం డేట్ ఫిక్స్ చేసింది అమ్మ.

**

సమ్మర్ లో మ్యూజిక్ క్లాసులు ఎక్కువవడంతో, కామాక్షి అక్క మీనాక్షిని కూడా యింటి పనికి పెట్టింది అమ్మ. ఒకళ్ళు పైపని. ఒకళ్ళు వంట చేసి రోజంతా ఉండేలా అంట....పదిహేనేళ్ళ మీనాక్షి వంట బాగా చేస్తుందట కానీ, నత్తివల్ల సరిగ్గా మాట్లాడలేదట..భూషణ్ అంకుల్ వాళ్ళ వంటమనిషి ‘అంబుజ’ కూతుళ్ళే కామాక్షి, మీనాక్షి. అంబుజ వచ్చి జీతం మాట్లాడుకొని వెళ్ళింది.

“బీదవాళ్ళైనా, పద్ధతిగా ఉన్నారు,” అంది అమ్మ వాళ్ళ గురించి.

**

మొదటి రెండు రోజులు దగ్గరుండి మీనాక్షి చేత వంట చేయించింది, అమ్మ.

“బాగానే ఉన్నాయి రుచులు,” అన్నారు నాన్న భోంచేస్తూ.

“అంత మాత్రం నచ్చితే మంచిదే, అన్నీ చేస్తుంది మీనాక్షి... ఇక వీళ్ళ డాన్స్, పాట ప్రోగ్రాముల ప్రాక్టీసులకి, నాకు బోలెడంత సమయం ఉంటుంది,” అంది అమ్మ....

నా ప్లేట్లో కర్రీ వడ్డిస్తూ, “అది సరే గాని, చంద్రా, ఇప్పటి వరకు చేసిన ప్రోగ్రాములకి, ఒకటో రెండో డాన్సులు మాత్రమే చేసావు. ఈ ప్రోగ్రాం అలా కాదు. ఇటువంటి ‘వేదిక’ మీద, పద్ధతిగా కొన్ని ఐటమ్స్ చెయ్యాలి,” ,”నువ్వు ఇప్పుడు పెద్దయ్యావు కూడా. ఈ ప్రోగ్రాం చక్కగా ప్లాన్ చేసి చెయ్యాలి,” అంది అమ్మ.

మరి అమ్మ ప్లాన్ ప్రకారమే - గణపతి కౌత్వం, జతిస్వరం, రామ పట్టాభిషేక శబ్దం, గోవర్ధన గిరిధారి, మొక్కజొన్న తోటలో –ప్రాక్టీసు చెయ్యడం మొదలుపెట్టాను.



భూషణ్ అంకుల్ ఏర్పాట్లన్నీ దగ్గరుండి చేయిస్తున్నారు. వాళ్ళ నాన్నగారి వర్ధంతితో పాటు మా ప్రోగ్రాం, తమ్ముడి పుట్టిన రోజు సెలబ్రేషన్స్ కూడా జరుగుతాయట.

రాణి పాట ప్రాక్టీస్ వినడానికి, అప్పుడప్పుడు ఆంటీ, అంకుల్, మ్యూజిక్ క్లాస్ కి వస్తున్నారు. రాణీని క్లాసికల్ సింగర్ గా తీర్చిదిద్దాలని వాళ్ళ కోరికట....

ఇన్విటేషన్స్, పబ్లిసిటీ, మీడియా కోసం అంటూ రాణీవి, నావి స్టిల్స్ తీయించారు అంకుల్. వాళ్ళ స్టూడియోలో మా ప్రదర్శన గురించి పెద్ద బ్యానర్స్ పెట్టించారు. నన్ను అమ్మని తీసుకువెళ్ళి చూపించారు కూడా. ప్రోగ్రాంకి నాన్న తన ఆర్మీ ఫ్రెండ్స్ ని కూడా ఇన్వైట్ చేస్తున్నారు. అసలైన 'వేదిక' మీద నేను చేయబోయే మొదటి డాన్స్ ప్రోగ్రాం ప్రాక్టీస్ ఉత్సాహంగా సాగుతుంది.

**

అదే టైంలో మాకు మరింత ఉత్సాహాన్ని కలిగించేలా, ఊహించని మరో విశేషం జరిగింది.....నేనైతే, ఆనంద తాండవం చేసేసాను. అమ్మా నాన్న కూడా నాకంతటి అవకాశం ఇంత త్వరగా వస్తుందని తామసలు ఏనాడూ అనుకులేదన్నారు.

......

ఆ సంతోషాలకి కారణం మా మాష్టారు గారు నాకందించిన ఓ గొప్ప ఆవకాశమే. అది వివరిస్తూ ఆయన మాకు పంపిన లెటర్ లో విషయాన్ని, అమ్మ చేత మళ్ళీ మళ్ళీ చెప్పించుకున్నాను.

...

'ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం వారు చేపట్టనున్న - కూచిపూడి నృత్య నాటికలు, ప్రదర్శనల నిమత్తం - టాలెంట్, ఆసక్తి ఉన్న డాన్సర్స్ లో, తామొక డాన్స్ ట్రూప్ ని తయారు జేయబోతున్నామని, దానికి సెలెక్ట్ అయిన వారిలో చిరంజీవి చంద్రకళ కూడా ఉందని తెలియజేస్తూ, త్వరలో ప్రాక్టీసులు, యేడాది తరువాత దేశ – విదేశ ప్రయాణాలు కూడా ఉంటాయి' అన్న ఆ లెటర్ తో పాటు, వెంటనే తమ అనుమతి తెలియ జేయమని,అమ్మా వాళ్ళకి మాస్టారు గారు పర్సనల్ మెసేజ్ కూడా పంపారు.

.......

అలా టూర్ మీద వెళ్ళ వలసి వస్తే, మరి స్కూల్ విషయం ఏమిటన్న లాంటి విషయాలు వివరంగా మాట్లాడాలంది అమ్మ.

మరునాడు తమ సమ్మతి, అనుమతి తెలుపుతూ నాన్న సైన్ చేసిచ్చిన కన్సెంట్ ని తీసుకువెళ్ళి మాస్టారు గారికి

ఇచ్చినప్పుడు,  ఆ  డాన్స్  గ్రూప్ కి 'నృత్యహేళి' అని పేరు పెట్టారని తెలిసింది....

**

మొట్టమొదటి 'నృత్యహేళి'  గ్రూప్' క్లాస్ లో, కాన్ఫిడెంట్ గానే అడుగు పెట్టాను., అప్పటికే, నలుగురు సీనియర్ స్టూడెంట్స్ డాన్స్ చేస్తున్నారు.  నేను వాళ్ళని మునుపెన్నడూ చూడలేదు.  కళ్ళు తిప్పుకోలేనంత అందంగా ఉన్నారు వాళ్ళు. మెల్లగా వెళ్లి ఓ పక్కగా కూర్చున్నాను.

అమ్మ, ఈ వేళ మామూలుకన్నా మంచి బట్టలు వేయించి, జడలు కూడా మరింత శ్రద్ధ పెట్టి వేసిందని గుర్తొచ్చి...నవ్వొచ్చింది....వీళ్ళంతా ఎంత అందంగా ఉన్నారో, ఎంత చక్కగా నాట్యం చేస్తున్నారో ! అమ్మకి చెప్పాలి అనుకున్నాను.  వాళ్ళని చూస్తుంటే, త్వరగా  పెద్దదాన్నయ్యి  వాళ్ళలా ఉండాలనిపించింది.

ఇంతలో మరికొందరు వచ్చారు క్లాసుకి.   హీరోయిన్ వసంత కుమారి కూతురు – నా క్లాస్ మేట్  'ఉదయ కూడా వచ్చింది...లంచ్ టైంకి క్లాస్ అవుతుందని చెప్పారు మాస్టారు గారు. మా చేత ముందుగా  అడుగులు, జతులు ప్రాక్టీసు చేయించాక,  'కస్తూరి తిలకం' శ్లోకం కి డాన్స్  మొదలుపెట్టారు.

**

క్లాస్ అవుతూనే పరుగున ఇంటికొచ్చి, చేతులు కడుక్కుని లంచ్ కి కూర్చున్నాను. అమ్మ వడ్డిస్తుంది.  నేను  క్లాస్ గురించి  చెప్పాలని  అనుకుంటుండగానే, "ఎలా ఉందమ్మా? మీ స్పెషల్ క్లాస్," అడిగారు నాన్న.

"నాన్నా, అమ్మా,  ఈ  క్లాసుకి మంజరి, కాంచన అని ఇద్దరు సినిమా యాక్టర్స్ వచ్చారు.

మాస్టారు నన్ను వాళ్ళకి పరిచయం చేసినప్పుడు, నేను 'అచ్చం  'తేజశ్విని' మేడమ్ లాగా' ఉన్నానన్నారు.దానికి మాస్టారు,  'అవును  పోలికలు,  టాలెంట్  కూడా  మన  తేజశ్విని లాగానే'  అన్నారు,"  గబగబా చెప్పాను.

అమ్మ నా వంక ఆశ్చర్యంగా చూసింది..

“నిజమా?…మంజరి అంటే, ఇప్పుడు టాప్ తెలుగు, తమిళ సినిమా హీరోయిన్. కాంచన కూడా ఇప్పుడిప్పుడే సినిమాల్లో వస్తుంది…ఇక తేజశ్విని చాలా ఫేమస్ కూచిపూడి డాన్సర్. మీ మాస్టారు శిష్యురాలు. ఇప్పుడు అమెరికాలో సెటిల్ అయిందని విన్నాను. అందంగా ఉంటుంది. మా కాలేజి టైములో కూడా, అవకాశం వచ్చినప్పుడల్లా మేము ఆమె ప్రోగ్రాములు మిస్ అవ్వకుండా చూసేవాళ్ళం. ఆంధ్రదేశంలో డాన్సర్స్ అవ్వాలనుకునే వారికి, ఆమె అప్పట్లోనే రోల్-మాడల్,” అంది అమ్మ.

**

ఈ స్పెషల్ క్లాస్ అంటే చాలా ఉషారుగా, ఆసక్తిగా అనిపించ సాగింది.

ఆదివారాలు పొద్దుటే జరిగే డాన్స్ క్లాస్ కి, పెద్ద కార్లల్లోవచ్చే ఆ సినిమా యాక్టర్లు – వీళ్ళేనని, ఇప్పుడు అర్ధమయ్యింది.. ఆ క్లాస్ కి నేను వెళ్ళను కాబట్టే, వాళ్ళని నేను ఇప్పటివరకు చూడలేదు….

పోతే వాళ్ళు నన్ను ‘తేజశ్విని’ లాగా ఉన్నానన్నారే? ఆమెలా ఉన్నానా? అమ్మ చెప్పడం ఆమె పేరున్న డాన్సర్ అని. నేను ఆమెలా అవ్వగలనా? ‘ఆమె ఫోటోలు చూపించమని’ మాస్టర్ గారిని అడగాలి అనుకుంటూ నిద్రపోయాను.

**

“త్వరగా లేవాలి చంద్రా. ఇవాళే రాంమామయ్యా వాళ్ళు వచ్చే రోజు….. నీ రూం సర్దుకో,” పొద్దున్నే వాకిట్లో నిలబడి చెప్పి వెళ్ళింది అమ్మ. అవును, నిన్న సాయంత్రం నుండీ ఇల్లంతా క్లీన్ చేసి, వచ్చే వాళ్ళకి అన్ని ఏర్పాట్లు చేసింది. వాళ్ళఫ్లైట్ సాయంత్రం ఆరింటికి వస్తుందట…ఇవాళే డాన్స్ కాస్ట్యూమ్స్ ట్రైల్స్ కూడా… చాలా ఉత్సాహంగా ఉంది….

'ఆర్డర్ చేసిన క్లాసికల్ కాస్ట్యూమ్స్, ఓ ఫోక్ స్టైల్ కాస్ట్యూమ్, మాచింగ్ జ్యులరీ తీసుకొని స్టూడియో నుండి టైలర్ కృష్ణ ఇవాళ లంచ్ టైంకి వస్తున్నాడు' అనుకుంటూ బెడ్ నుండి లేచాను..

**

కృష్ణ రావడం బాగా ఆలస్యం అవడంతో, కాస్ట్యూమ్స్ ట్రైల్స్ అయ్యేప్పటికి, రాం మామయ్య వాళ్ళు కూడా వచ్చేసారు.టైలర్ ని పంపేసి, అప్పటికే సిటింగ్ రూమ్ లో ఉన్న మామయ్యా వాళ్ళ దగ్గరికి వెళ్ళాము.

“సారీ అన్నయ్యా, వదినా సారీ....,” అంటూ మణత్తయ్య వద్దకు వెళ్ళింది అమ్మ...

“ఏం పర్వాలేదు శారదా, మేమూ ఇప్పుడేగా వచ్చింది,” అన్నారు మామయ్య. అమ్మ వెనకే ఉన్న నన్ను, మామయ్య పలకిరించారు. వచ్చి పక్కన కూచోమన్నారు. చాలా పొడవయ్యానన్నారు. “స్వీట్ క్యాండీ ఫర్ ఎ స్వీట్ గర్ల్,” అంటూ నాకు క్యాడ్బరీ చాక్లెట్ బాక్స్ అందించారు.. మణత్తయ్య తన చేతిలోని మరో గిఫ్ట్ బాక్స్ బాబుకి అందించి, వాడ్ని దగ్గర కూర్చోబెట్టుకుంది.

వాళ్ళబ్బాయి, జగదీష్ మా వంక చూస్తూ మాట్లాడకుండా దూరంగా కూర్చునున్నాడు. “మా వాడు కొంచెం రిజర్వ్ డ్. మనుషులు తెలిసి నచ్చితే మాత్రం, బెస్ట్ ఫ్రెండ్ అవుతాడు,” అన్నారు మామయ్య అతని గురించి. ”ఐనా మిమ్మల్ని చూసి సెవెన్ ఇయర్స్ అయిందేమో కూడా,” అన్నారు మళ్ళీ.

“ఇలా రావే, కోడలు పిల్లా, డాన్స్, పాట అన్నీ చేస్తున్నావంట. సన్నగా ఉన్నావు కానీ అందంగా ఉన్నావులే,” అంటూ నన్ను దగ్గరికి పిలిచి నా నుదుటిపై ముద్దు పెట్టింది మణత్తయ్య.

“పదహేడేళ్ళకే జగదీష్ బాగా పొడవయ్యాడే? వాడి నవ్వు, కర్లీ హెయిర్ తో కొంటెకృష్ణుడులా ఉన్నాడు. పెద్దవాడయిపోయాడు,” అంది అమ్మ జగదీష్ గురించి.

ఇంతలో నాన్న కూడా వచ్చేసారు.

**

అందరూ  ఫ్రెష్ అయి వచ్చాక, నాన్న, వాళ్ళతో  చాలా సేపు మాట్లాడుతూ కూర్చున్నారు. మీనాక్షితో పాటు నేనూ అమ్మకి కిచెన్ లో హెల్ప్ చేసాక,  డైనింగ్ టేబిల్ కూడా సెట్ చేసి అందరినీ డిన్నర్ కి పిలిచాను. అత్తయ్య వాళ్ళతో కలిసి భోంచేసాము. రాంమామయ్య  త్వరలో  ఆర్మీ ప్రొమోషన్ తో కర్నల్ అవుతున్నందుకు  అభినందించారు  నాన్న.

**

మరునాటి నుంచి, జగదీష్  మాతో  కొద్దిగా  మాట్లాడ్డం  మొదలు పెట్టాడు.   తను చెస్ బాగా ఆడుతాడట.  ఢిల్లీ స్టేట్ జూనియర్స్  చెస్  చాంపియన్ షిప్ గెలిచాడట.

......రోజూ నా క్లాస్ అయ్యాక,  చెన్నై లో చూడవలసిన ప్రదేశాలు ఒక్కోటి చూడ్డానికి వెళుతున్నాము....డిన్నర్ టైంకి మళ్ళీ ఇల్లు చేరేలా ప్లాన్ చేస్తుంది అమ్మ. రెండు రోజులుగా,  ఇంట్లో మా  ప్రోగ్రాం  ప్రాక్టీసులకి కూడా  కూర్చుంటున్నాడు జగదీష్.  నాతో, వినోద్ తో ఫ్రెండ్లీగా ఉంటున్నాడు.


నా డాన్స్ చూసి, అమ్మ పాట వింటుంటే,  క్లాసికల్ ఆర్ట్స్ నచ్చాయని కూడా చెప్పాడు....  జగదీష్ ని  పేరు పెట్టి కాదు, ‘బావ’ అని పిలవమంది అమ్మ, ఓ రోజు,  డిన్నర్ చేసేప్పుడు.

“ఏమిటూ పాత కాలం పిలుపులు.   పిల్లల్ని వాళ్ళ ఇష్టానికి వదిలేయి, శారదా,”  అమ్మతో అన్నారు నాన్న.

**

భూషణ్ అంకుల్, నీరూ ఆంటీ వచ్చి మామయ్యా వాళ్ళని కలిసారు.

“ప్లెజర్ మీటింగ్ యు” అంటూ జగదీష్ హ్యాండ్ షేక్ చేసి, చాలా ప్లెజెంట్ గా మాట్లాడింది రాణి. పెద్దవాళ్ళు చాలా సేపు కబుర్లు చెప్పుకున్నారు...వాళ్ళింటికి మా అందరిని భోజనానికి ఇన్వయిట్ చేసారు భూషణ్ అంకుల్.. తన వద్ద మంచి మూవి కలక్షన్ఉందని చెబుతూ, తమ హోం థియేటర్ లో మూవి చూడ్డానికి రోజూ రావచ్చని, జగదీష్ ని ఇన్వైట్ చేసింది రాణి .




మరునాటి సాయంత్రం ఏడింటికి భూషణ్ అంకుల్ వాళ్ళింటికి డిన్నర్ కి వెళ్ళాము. ఇల్లంతా చాలా చక్కగా డెకరేట్ చేసారు.

“ఏమ్మా చంద్రా, మీ అత్తయ్యా వాళ్ళని చెన్నై తిప్పి చూపించడంతో బిజీగా ఉన్నావంట?” అడిగింది నీరూ ఆంటీ నన్ను.

“చెన్నై చూడాలంటే ఐదు రోజులకే అవుతుందా? పదిహేను రోజులు పడుతుంది,” అన్నారు అంకుల్ రాంమామయ్యతో...

మాకు,  వాళ్ళ ఇల్లు- గార్డెన్ – గేం-రూమ్ – తన హోమ్-థియేటర్ అంతా తిప్పి చూపించింది, రాణి...   ఓ ఫ్రెండ్ గా, తనకి జగదీష్ చాలా నచ్చాడని కూడా మా అందరితో చెప్పింది.  డిన్నరప్పుడు, పక్కనే  కూర్చుని,  తనే  జగదీష్ కి అన్నీ వడ్డించింది.   డిన్నర్ అయ్యాక మమ్మల్ని వాళ్ళ ఐస్ క్రీమ్ పార్లర్ కి తీసుకు వెళ్ళింది.  జగదీష్, వినోద్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. నేను  మాత్రం, తెల్లారితే  'విజయభూషణ్ స్టూడియో' లో జరగబోయే  నా కూచిపుడి  ప్రోగ్రాం ఆలోచనలోనే  ఉన్నాను.  ఇక ఇది కల కాదు ... నిజం..... చాలా హ్యాపీగా, ఉత్సాహంగా ఉంది.  భయంగా లేదు.  ప్రోగ్రాం ఎప్పుడెప్పుడా అని ఉంది.

**

"ఇక లేచి పనులు కానివ్వు, ఈ రోజేగా 'బిగ్ డే' - నీ మొదటి కూచిపూడి ప్రోగ్రాం. తలంటుతాను... నాకు చాలా పనుంది,"  అన్న అమ్మ మాటలకు నిద్రలేచాను.

అందరి పనులు అయి, కామాక్షి చేత డాన్స్ సామానంతా సర్దించేప్పటికి లంచ్ టైం అయ్యింది....స్టూడియోకి  డ్రైవ్ ఒక గంట. లంచ్ అయ్యాక,  బయలుదేరాము.

**

మమ్మల్ని గ్రీన్ రూమ్ వద్ద డ్రాప్ చేసి,  మామయ్యవాళ్ళని  స్టూడియో చూడ్డానికి తీసుకువెళ్ళారు, నాన్న. నా మేకప్ అవుతుండగా,  నాన్న కోసం అనౌన్స్మెంట్  టెక్స్ట్  ప్రిపేర్  చేస్తూకూర్చుంది అమ్మ... మేకప్  అయ్యి,  కాస్ట్యూమ్ వేసుకునే  టైంకి,  ఆడిటోరియం  కూడా  చూసి  మరీ వచ్చారు నాన్నావాళ్ళు.   ప్రోగ్రాం  'వేదిక'  చాలా అందంగా డెకొరేట్ చేసారంట.  నావి, రాణివి ఫొటోలు ఎంట్రెన్స్ లో బానర్స్ లా పెట్టారంట.  బాగున్నాయని అత్తయ్య చెప్పింది.

**

కాస్ట్యూమ్ కూడా వేసాక, గజ్జెలు పెట్టున్న లెదర్ బ్యాగ్ నా చేతికందించింది అమ్మ.

“చిన్న దేవతలా ఉన్నావే,” అంటూ చెవి వెనుకగా దిష్టి చుక్క పెడుతూ, ముద్దు పెట్టుకుంది...

వినోద్ కూడా, “యు లుక్ లైక్ ఎన్ ఏంజల్, అక్క,” అన్నాడు. వాడి వెంటే ఉన్న మీనాక్షి నా దగ్గరగా వచ్చి, ఒక్కో మాట కూడబలుక్కుని ‘చక్కగా ఉన్నావు’ అని చెప్పి వెళ్ళింది.

ఇంతలో మా ఆర్కెస్ట్రా వాళ్ళు, వారి వెనుకే రాణి, నీరూ ఆంటీ, భూషణ్ అంకుల్ కూడా వచ్చారు.

“మీ ఇద్దరూ నాతో రండి,” అని నన్ను, రాణీని ఎంట్రెన్స్ లోని రిసెప్షన్ ఏరియాకి తీసుకు వెళ్ళి అక్కడ పోస్టర్స్ లా ఉంచిన మా ఫోటోలు చూపించారు అంకుల్.

ఇంకొంచెం లోపలికి, చుట్టూ దీపాలతో అలంకారం చేసిన వాళ్ళ నాన్నగారి పెద్ద ఫోటో ఓ పక్కగా, తమ్ముడి పుట్టిన రోజుకి ఏర్పాటు చేసిన ఏరియా మరో ప్రక్కన ఉంది.

“ఇది ఎంట్రెన్స్, అది ఫంక్షన్ ఏరియా .... ఇక మీ ఇద్దరి కోసమే ప్రత్యేకంగా అలంకరించిన ‘వేదిక’ చూద్దురు రండి,” అంటూ మమ్మల్ని వేదిక ముందుకి తీసుకొని వెళ్ళారు అంకుల్. మొదటి సారి నా గుండె వేగంగా కొట్టుకొంది.

‘వేదిక’ మీద లైట్స్ అన్నీ వేయించారు. ఒక్కసారిగా కళ్ళు జిగేల్ మన్నాయి.

అటువంటి ‘వేదిక’ నేనిప్పటివరకు సినిమాల్లో కూడా చూడలేదు అనిపించింది...

అమ్మా, అత్తయ్యవాళ్ళు కూడా మేము నిలబడ్డ దగ్గరికి వచ్చారు. “ఇట్స్ బ్యూటిఫుల్ డాడీ,” అంది రాణి.“థాంక్ యు అంకుల్,” అన్నాను నేను. నాన్న నావంక చూసి కళ్ళెగరేసారు. ‘చాలా హ్యాపీ’ అని సైగ చేసాను. మేమక్కడ ఉండగానే హాల్లోకి జనం రావడం మొదలైంది.. స్టేజి కర్టన్స్ క్లోజ్ చేయించారు నాన్న. అమ్మ నా చేతికిచ్చిన గజ్జెలని, స్టేజి మీదున్న నటరాజు విగ్రహం ముందుంచి దణ్ణం పెట్టుకున్నాను. అమ్మానాన్నల పాదాలు తాకి నమస్కరించాను. మా శేషు మాస్టారుకి నమస్కరించాను. ఆశీస్సులందుకొని తిరిగి గ్రీన్-రూముకి వచ్చేసాను.

**

అనుకున్న టైంకే ప్రోగ్రాం మొదలు పెట్టించారు అంకుల్. ప్రోగ్రాంకి నాన్నే 'మాస్టర్ ఆఫ్ సెరమొనీస్' . ముందుగా రాణి ప్రార్ధన గీతం, రెండు కృతులు పాడింది. నా వంతు వచ్చింది. నన్ను ఇంట్రడ్యూస్ చేయడానికి నాన్న వేదిక మీదకి వెళ్ళారు.

"చంద్రకళ కూచిపూడి నృత్యాన్ని అభ్యసిస్తున్న విద్యార్థిని. స్వతహాగా ఉన్న ఆసక్తి, మక్కువతో నిత్యం ఎటువంటి సంగీతానికైన అడుగులు వేస్తుండేది. 'హోలీ ఏంజిల్స్ కాన్వెంట్ ' టాలెంట్ షో లో రెండేళ్ళు సెలెక్ట్ అయ్యి 'చెన్నై యంగ్ టాలెంట్ ' ట్రోఫీని గెలుచుకుంది. ఈ యేడు చిన్మయ వారి 'యంగ్ రోల్ మాడల్ ' అవార్డ్ అందుకుంది. మీ ముందు ఈ 'వేదిక' పైన కూచిపుడి నృత్యాలు చేసే అవకాశం చంద్రకళ అదృష్టమే," అన్నారు నాన్న నా గురించి అనౌన్స్ చేస్తూ.

"ఈ అవకాశాన్ని కల్పించిన మంచి స్నేహితుడు విజయ్ భూషణ్ గారికి, మా అమ్మాయి చంద్రకళ తరపున కూడా కృతజ్ఞతలు. నృత్యాన్ని తిలకించి ఆశీర్వదించమని కోరుతున్నాను," అంటూ చేయబోయే డాన్స్ ఐటెం గురించి వివరించారు నాన్న.....

**

'వేదిక' పైకి అడుగు పెట్టి, చేతులతో వేదికనంటి కళ్ళకద్దుకొన్నాను. ఎంతో గర్వంగా అనిపించింది. 'పూర్వరంగం' అయ్యాక, ముందుగా 'ప్రార్ధనా శ్లోకంతో ' సభకి, భూమికి, నటరాజ స్వామికి, వాయిద్యాల వారికి నమస్కారాలు చేసాను.

'గణపతి కౌత్వం' ముగించి.....

"కస్తూరి తిలకం లలాటఫలకే వక్షస్థలే కౌస్తుభం

నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణం...!

సర్వాంగే హరిచందనంచ కలయన్ కంటేచ ముక్తావళిం

గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాలచూడామణి...!!"

శ్లోకానికి – నడకలు, అడుగులు, కదలికలతో ఆంగికాభినయం చేస్తూ...'వేదిక' పై కదులుతుంటే, రంగుల లైట్లు నా మీద, నా ముఖం మీదా పడుతున్నట్టు తెలుస్తుంది. గమ్మత్తుగా, అందంగా అనిపించింది. నేను, నా మీద మెరుస్తున్న వెలుగులు తప్ప మరేమీ లేనట్టే అనిపించింది. ముద్రలు పడుతున్నప్పుడు నా చేతి వేళ్ళ కదిలికలు నా కళ్ళకి మెరుస్తూచక్కగా అనిపించాయి. శ్లోకం చివరికి రాగానే, అప్పుడే అయిపోయిందా? అనిపించింది...

**

'ఆంగికం భువనం యశ్చ్యామి' అనే శ్లోకం తో మొదలుబెట్టి, 'నగుమోము కలవాని ' చక్కగా పాడింది రాణి. వింటూ కాస్ట్యూమ్ మార్చుకున్నాను. రాణి పాట ముగుస్తూనే,... నా డాన్స్ ఐటెం అనౌన్స్ చేసారు నాన్న. ...

'గోవర్ధన గిరిధారి హరే' అనే పాట ఈ సారి అమ్మ అందుకుంది. నాకెంతో ఇష్టమైన ఆ పాటకి 'వేదిక' మీద చాలా ఆనందంగా డాన్స్ చేసాను...ఆ వెంటనే 'జణుతా శబ్దం' కూడా చేసి ఆ ఐటెం ముగించాను. మళ్ళీ రాణి పాటలు రెండయ్యాక, కాస్ట్యూమ్ మార్చుకొని 'మొక్కజొన్న తోటలో' పాటకి ఫోక్ డాన్స్ చేసాను.ఆఖర్న, రాణి పాడిన తిల్లాన తో ప్రోగ్రాం ముగిసింది.

'అయిగిరినందిని నందితమేదిని విశ్వవినోదిని నందసుతే' స్తోత్రం మంగళగీతంగా పాడింది అమ్మతో పాటు మా సింగర్.

**

నేను మేకప్ తీసి, పరికిణీ - వోణీ వేసుకుని రెడీ అయ్యి వెళ్ళేప్పటికి, పక్కనున్న హాల్లోవర్ధంతి పూజ ముగిసింది. ప్రసాదాలు తీసుకున్న తరువాత, తమ్ముడు వినోద్ పుట్టినరోజు కేక్-కటింగ్ అయింది.

తమ్ముడితో కాసేపు గడిపాము. వాడు తన ఫ్రెండ్స్ తో బిజీ అయ్యాక, అమ్మ, నేను, డిన్నర్ హాల్లోకి వెళ్ళాము.

**

అందరితో కలిసి మాట్లాడుతూ, కాస్త దూరంలో కనబడ్డారు మామయ్యా వాళ్ళు. జగదీష్, రాణి కూడా వాళ్ళతోనే ఉన్నారు.మేము బఫే నుండి డిన్నర్ తీసుకొని, ఓ టేబిల్ వద్ద కూర్చున్నాము... ప్రోగ్రాం చూసిన పెద్దవాళ్ళు, చిన్న పిల్లలు కూడా దగ్గరగా వచ్చి 'కంగ్రాట్స్' చెప్పి వెళుతున్నారు.

**

మరి కాసేపటికి అత్తయ్య వాళ్ళు, రాణి, జగదీష్ మా వద్దకొచ్చి కూర్చున్నారు. అప్పటికే వాళ్ళందరి డిన్నర్ అయిందట.

"అసలు నా కోడలు పిల్లవేనా నువ్వు?" , "లేక ఎవరన్నా చిన్నారి అప్సరసా?" అంటూ నా బుగ్గలు నొక్కింది, పక్కనే కూర్చున్న అత్తయ్య.

"మీ అమ్మని, నాన్నని కూడా ఆకాశానికి ఎత్తేస్తున్నారు నీ డాన్స్ చూసిన వాళ్ళంతా," అన్నారు మామయ్య సంతోషంగా."యువర్ డాన్స్ ఇజ్ ఫాన్టాస్టిక్, వావ్ ," అన్నాడు జగదీష్ కూడా కాంప్లిమెంట్ చేస్తూ.....

"యు సింగ్ వెరీ వెల్ టూ రాణి," అన్నాడు తన పక్కనే ఉన్న రాణితో...

కబుర్లు-కంగ్రాచ్యులేషన్స్ తో ఆకలి కూడా ఎగిరిపోయింది నాకు.



ఏ డాన్స్ నచ్చిందో, ఏ పాట బావుందో అని అమ్మా, అత్తయ్య మధ్య డిస్కషన్ అవుతుండగా, భూషణ్ అంకుల్ వాళ్ళు మా వద్దకు వచ్చారు. వాళ్ళ వెంటనున్న పెద్దాయన్ని, కోదండం అయ్యర్ – 'హరివిల్లు' టి.వి చానల్ ప్రొడ్యూసర్ గా, మాకు పరిచయం చేసారు భూషణ్ అంకుల్. నేను, అమ్మ లేచి ఆయనకి నమస్కరించాము.. రాణి కూడా వచ్చి ఆయన్ని "గుడ్ యీవనింగ్' అంటూ గ్రీట్ చేసింది.

"మీ ఇద్దరూ కూడా సంగీత, నృత్యాల్లో ఆరితేరిన ఆర్టిస్టుల్లా పర్ఫాం చేసారు... మీతో మంచి టి.వి షో చేయిస్తాను," అంటూ బ్లెస్ చేసారు కోదండం గారు.... .

**

వచ్చిన గెస్ట్స్ అంతా వెళ్ళిపోయాక,  మేము మాత్రమే మిగాలాము అక్కడ..

ప్రోగ్రాం జరిగిన తీరుకి, చెప్పలేనంత  హ్యాపీగా ఉంది అందరికీ...

భూషణ్ అంకుల్, నీరు ఆంటీ దగ్గరగా వెళ్లి 'థాంక్స్' చెప్పాను.

"అలా కాదు, బ్లెసింగ్స్ తీసుకోవాలి పద్దతిగా," అంది నా వెనుకే ఉన్న అమ్మ.

"భూషణ్ అంకుల్ మేడ్ యువర్ డ్రీం కమ్ ట్రూ కళా," అన్నారు నాన్న.

పాదాలంటి  నమస్కరించబోతే, అంకుల్ నా భుజాలు పట్టి ఆపారు.

"చూడు కళా, తల్లితండ్రులకి, గురువుకి పాదాభివందనం చేసావుగా, చాలు.

నీలో ఉన్న ఈ టాలెంట్ తో నువ్వు బాగా పైకి రావాలని ఆశిస్తాను.  అందుకు నేను నా వంతు సహాయం  చేస్తాను.  నువ్వు మాకు మరో బిడ్డ లాంటి దానివే.  నువ్వు, రాణి ఇద్దరు వృద్ధిలోకి రావాలి," అంటూ ఆశీర్వదించారు.

రాణి చేత అమ్మ పాదాలకి నమస్కారం చేయించి, 'గురుదక్షిణ'  కానుకలు అందించారు అంకుల్ వాళ్ళు.

**

స్టూడియో నుండి బయలుదేరి, కబుర్లు చెప్పుకుంటూ, ఇల్లు చేరాము.

కాంప్లెక్స్  గేట్ ముందు అమ్మ నాకు దిష్టి తిప్పేసింది.

అర్ధరాత్రి దాటినా, సంతోషంతో నిద్రపట్టడంలేదు. నా 'డాన్సింగ్ డ్రీమ్స్' నిజమవ్వడానికి మా అమ్మ, నాన్న ఎంత చేస్తార్లో కదా! అని మనసంతా వాళ్ళంటే ప్రేమతో నిండిపోయింది… మరి భూషణ్ అంకుల్ ప్రోత్సాహం కూడా అంతే ముఖ్యంలా ఉంది. అంకుల్, ముందునుండీ నేనంటే ఆప్యాయంగా ఉంటారు కదా అనిపించింది… "ఐ యాం గ్రేట్ఫుల్ టు హిం," అనుకున్నాను.

'వేదిక' మీద నాట్యం చేసేప్పుడు నాకు కలిగేంత ఆనందం, నా నృత్యం చూస్తున్న వారికి కూడా కలుగుతుందని అనిపిస్తుంది. ఒక్కోసారి, నా నాట్యం చూస్తున్న వారందరి ముఖాల మీద చిరునవ్వు ఉందనిపిస్తుంది.

డాన్స్  చేస్తున్నంతసేపు నేనెలా ఫీల్ అయ్యానో, ఎంత బాగానిపించిందో ఆలోచిస్తూ మరేప్పటికో నిదురపోయాను.

**

మరునాడు తెల్లార్లుజామున, ట్రావెల్ వాన్ లో తిరుపతి బయలుదేరాము. కన్నన్, మీనాక్షి కూడా వెంట వస్తున్నారు. దారి పొడుగునా అమ్మ పాటలు, మణత్తయ్య మాటలతో ప్రయాణం సరదాగా ఉంది.

**

ప్రతి యేడు తిరుపతి, శ్రీశైలం, బెజవాడ కనకదుర్గ గుళ్ళకి తప్పక వెళుతూనే ఉంటాము. ప్రతియేడూ సత్యనారాయణ వ్రతం చేస్తారు అమ్మా నాన్నా. నాన్నకి దైవభక్తి ఎక్కువేనంటుంది అమ్మ..

మునుపటి ప్రయాణాల ముచ్చట్లు చెప్పుకుంటూ తిరుపతి చేరాము…

కొండపైన కాటేజీల్లో దిగి, స్నానాలు చేసి అందరం తయారయ్యాము.

గుడికి వెళ్లబోతుంటే, అత్తయ్య నా మెడలో ముత్యాల హారం వేసింది.

అది చూసిన అమ్మ, “అంత విలువైన వస్తువు చిన్న పిల్లకి వేయవద్దు వదినా, ఇప్పుడేమి అవసరం,” అంది అత్తయ్యతో.

“కాదనకు శారదా, అంత బాగా డాన్స్ చేసినందుకు కళకి ఈ హారం మా కానుక. అదీకాక, చంద్రకళ మా కోడలు పిల్ల” అన్నారు అక్కడే ఉన్న రాంమామయ్య.

**

తిరుపతి, దిగువ తిరుపతి లో అన్ని దేవుళ్ళ దర్శనాలు చేసుకొని ఆ మరునాడు బయలుదేరి, ఇల్లు చేరాము. పెద్ద అలసటగా లేకపోయినా, డాన్స్, పాట క్లాసుల నుండి రెండు రోజులు రెస్ట్ తీసుకున్నాము.

**

సమయమంతా అత్తయ్య వాళ్ళతో గడుపుతున్నాము.

రాణి కూడా వచ్చి మాతో కాసేపు గేమ్స్ అవీ ఆడుతుంది. రాణీతో ఓ రోజు వాళ్ళ స్టూడియోలో హిందీ సిమిమా ప్రివ్యూకి, మళ్ళీ ఓ సారి వాళ్ళ ఐస్ క్రీం పార్లర్ కి వెళ్ళాము.

**

తెల్లవారితే, అత్తయ్య వాళ్ళ ఢిల్లీ ప్రయాణమనగా భూషణ్ అంకుల్ వాళ్ళింటికి, మరోసారి డిన్నర్ కి వెళ్ళాము..తిరుపతిలో, తమకి కాటేజీల నుండి దైవ దర్శనం వరకు, ఏర్పాట్లు చేసినందుకు భూషణ్ అంకుల్ కి,

'థాంక్స్' చెప్పారు రాంమామయ్యా, నాన్న కూడా.వర్ధంతి ప్రోగ్రాం ఫోటోలు చూపించింది రాణి.... చాలా బాగా వచ్చాయి.. మా ప్రదర్శన గురించి కొన్ని తెలుగు, తమిళ్, ఇంగ్లీష్ న్యూస్ పేపర్స్ లో వచ్చిన ఆర్టికల్స్ చూపించారు అంకుల్. మా గురించి, మా ఇద్దరి టాలెంట్ గురించి గొప్పగా పొగిడారట. అమ్మా నాన్న కాసేపు అన్నీ చదివారు.

"మీ నాన్న సంతోషానికి అవధుల్లేవు కళా," అన్నారు అంకుల్.

"రాణికి, నీకు కలిపి 'జెమిని టి.వి' వారి ఇంటర్వ్యూ ప్లస్ పర్ఫార్మెన్స్ ఏర్పాటు చేయబోతున్నాను, మీ స్కూల్ మొదలయ్యే లోపే," మళ్ళీ నాతో భూషణ్ అంకుల్.

"వావ్, నీ 'టి వి షో' నా? గ్రేట్," అంటున్న జగదీష్ వైపు చూసారు అంకుల్....

"సరే, నీ సంగతి చెప్పు జగదీష్. నీవు హాండ్సమ్ ఫెల్లోవే. ఆసక్తి ఉంటే, సినిమా హీరో అవ్వచ్చు," అన్నారు.

"నో అంకుల్. నేను సర్జన్ అవుతాను," అని వెంటనే జవాబిచ్చాడు జగదీష్.

"సంతోషం. నోబుల్ ప్రొఫెషన్. ప్రౌడ్ ఆఫ్ యు, జగదీష్," అన్నారు అంకుల్.

డిన్నరయ్యాక, మరికాసేపు అక్కడే ఉండి, డిస్నీ మూవీ చూసి ఇంటికి వచ్చేసాము. అర్ధరాత్రి దాటేవరకు, అందరం హాల్లోకూచుని కబుర్లు చెప్పుకున్నాం.

**

మమ్మల్ని ఢిల్లీ రమ్మని మరీ మరీ చెప్పి, సాయంత్రం ఆరింటికి అత్తయ్యావాళ్ళు బయలుదేరిపోయారు.

వాళ్ళు వెళ్ళాక, ఇల్లంతా ఖాళీగా, ఎప్పుడూ లేనంత డల్ గా అనిపించింది... ఊహ తెలిసాక ఇలా రిలేటివ్స్ రావడం, క్లోజ్ ఫ్రెండ్స్ లా అనిపించడం, ఇదే మొదటి సారి.

జగదీష్ వచ్చిన ఫస్ట్ డే ఎలా పట్టనట్టుగా ఉన్నాడో, వెళ్ళేనాటికి మేమంటే ఎంత ఇష్టంగా ఉన్నాడో అని తలుచుకున్నాను. నా డాన్స్ అంటే కూడా ఇష్టమని చెప్పాడు కదా! అనుకున్నాను.

మరునాడు డాన్స్ క్లాస్ పొద్దున్నే ఉందని గుర్తొచ్చి, భోంచేసి, త్వరగా పనులు ముగించి, బెడ్ మీద వాలాను....

**

క్లాసుకి వెళ్ళేముందు, కాసేపు సిటింగులో అమ్మ పక్కనే కూర్చుని టి.వి చూస్తున్నాను.

కామాక్షి, మీనాక్షిల అమ్మ - అంబుజ వచ్చింది. మా ఎదురుగా గోడకానుకుని క్రింద కూర్చుంది.

“డాన్స్ చానా బాగా ఆడిందమ్మా, మీ పాప,” అందామె అక్కడే ఉన్న నన్ను చూస్తూ.

“భూషణ్ బాబుగారు, అమ్మగారు నిత్యం పాపని పొగుడుతారని, రాణమ్మ మండి పడిపోతున్నారు. ఆ విషయంగా బాబుగారికి, రాణమ్మకి రోజు గొడవే,” అంది నవ్వుతూ, అంబుజ.

అది విని, అమ్మ కూడా సర్ప్రైజ్ అయిందనుకుంటా.

“చిన్నపిల్లలేవే అంబుజా. ఇద్దరూ బాగా చేసారు,” అన్నది అమ్మ.

“సరేగాని, మొన్నామధ్య – అడ్వాన్సులు తీసుకున్నావు గుర్తుందా? అడిగింది అమ్మ. టైం అవడంతో, నేను క్లాసుకు

వెళ్ళిపోయాను..

**

క్లాసులో కాస్త హడావిడిగానే ఉంది. మాస్టారు ఫోన్ మీదున్నారు. మామూలుగా వెనుక హాల్లో క్లాస్ చెప్పే శేషు మాష్టారు కూడా తన శిష్యులతో సహా, పెద్దహాల్లోనే ఉన్నారు.



క్లాసు నుండి ఇంటికొచ్చాక కళ్ళు తిరిగినట్టయ్యి, ఎన్నడూ లేని తలపోటుతో సోఫాలో కూర్చుండిపోయాను. అమ్మ

మందు వేసి, పాలు తాగించి పడుకోబెట్టింది.

**

ఆ మరునాడు అస్సలు కదలలేక పోయాను. వొళ్ళంతా వేడిగా ఉంది. వెంటనే నన్ను ఆర్మీ హాస్పిటల్ కి తీసుకువెళ్ళారు. నాకసలు ఆ తరువాత ఏమయిందో తెలియదు.

**

కళ్ళు తెరిచేప్పటికి, హాస్పిటల్లోనే ఉన్నాను. అమ్మ దగ్గరగా వచ్చి, "ఏమ్మా, పెద్ద జ్వరం రా నీకు. వైరల్ ఫీవర్ అంట. ఇవాళ మూడో రోజు. నీరసించిపోయావమ్మా చిట్టితల్లినువ్వు," అంది అమ్మ.

నాకు మాత్రం తేలికగా, బాగానే ఉన్నాననిపించింది. ఆ సాయంత్రమే హాస్పిటల్ నుండి ఇంటికి వచ్చేసాను.

**

మా మాస్టారుగారు వచ్చి నన్ను చూసి వెళ్ళాక, భూషణ్ అంకుల్, ఆంటీ వచ్చారు.

"ఏమ్మా, కళా, హాస్పిటల్లో రెండు రోజుల క్రితం కంటే, ఇవాళ ఫ్రెష్ గా ఉన్నావు. నీకెప్పుడు పూర్తి ఓపిక వస్తే అప్పుడే జెమిని టి.వి. వారి ఇంటర్వ్యూ చేసేద్దాము. డాన్స్ షూట్ కి మాత్రం మరో వారం టైం అడుగుదాము.. కాబట్టి బాగా తిని త్వరగా కోలుకో," అన్నారు

అంకుల్."వారంలోగా పూర్తిగా కోలుకుంటుంది... మీ షెడ్యూల్ ప్రకారమే చేద్దాం. మీకు మాట రానివ్వదు లెండి మా చంద్రకళ. నేను భరోసా," అంది అమ్మ నవ్వుతూ..

“ఎల్లుండి శనివారం పొద్దున్న, నేను మిమ్మల్ని మా గురువుగారు వద్దకు తీసుకువెళతాను. ...ఈ సమయంలో చంద్రకళకి అయన బ్లెసింగ్ అవసరం... అదీ కాక, కళకి బాగా దిష్టి తగిలింది....ఆయనే అవన్నీ చూస్తారు... ఆయన చాలా మహత్తున్నవాడు. మామూలుగా అయితే, ఎక్కడెక్కడి వాళ్ళకైనా ఆయన్ని చూడాలంటే అసాధ్యం.... మనకి యేళ్ళగా తెలుసును కాబట్టి వెళ్ళగలం..... నిజానికి అయన ఓ ముస్లిం – ‘మస్తాన్ వలి’ అని,” అన్నారు అంకుల్....

**

సరీగ్గా స్కూల్ రి-ఓపెన్ కి ముందు, మా జెమిని టి.వి ప్రోగ్రాం బాగా జరిగింది. ఇంటర్వ్యూలో మా చదువులు, గురువులు, తల్లితండ్రుల గురించి అడిగారు. మా ఫ్యూచర్ ప్లాన్స్ గురించి అడిగారు. నేను మంచి కూచిపూడి డాన్సర్ అవుతానన్నాను. రాణి తానొక గొప్ప సింగర్ అవుతానన్నది.

మా ఆ ఇంటర్వ్యూ జెమిని వారు ఇంచుమించు రోజుకోమారు టెలికాస్ట్ చేస్తున్నారు..

**

స్కూల్ రీ-వోపెన్ అయిన సెకండ్ డే, నన్ను, రాణీ ని అసెంబ్లీలో అందరి ముందుకి పిలిచి, ‘స్కూలుకే ఎంతో పేరు తెచ్చిన టాలెంటెడ్ యంగ్ టీన్స్’ అంటూ, మా గురించి స్పెషల్ మెన్షన్ చేసారు, మా ప్రిన్సిపాల్. స్కూల్లో మా టి.వి ఇంటర్వ్యూ చూసిన ఫ్రెండ్స్, టీచర్స్ నాకు కంగ్రాచ్యులేషన్స్ చెప్పారు.

**

రీసెస్ టైములో, క్లాస్ నుండి బయటకి రాగానే, రాణి నా వద్దకు పరిగెత్తుకొచ్చింది.

“కళా, నిన్న జగదీష్ తో చాలాసేపు మాట్లాడాను. నా దగ్గరున్న వీడియో గేమ్స్, తన దగ్గరున్నవి కంపేర్ చేశాము. రేపు తన బర్త్డే కదా! కొత్తగా రిలీజ్ అయిన గేమ్స్, జగదీష్ కి బర్త్డే గిఫ్ట్ గా పంపాను,” అంది సంతోషంగా.

‘ఢిల్లీ తిరిగి వెళ్ళాక, ఈ పది రోజుల్లో అత్తయ్య అమ్మతో రెండు సార్లు మాట్లాడి ఉండచ్చు గాని, జగదీష్ నాతో మాట్లాడలేదే?’ అనుకున్నాను.

“అవునూ, మస్తాన్ సాబ్ నిన్ను బ్లెస్ చేసి, తావీజు ఇచ్చారటగా...అది వేసుకుంటున్నావా?” అడిగింది రాణి...

“ఆ... అమ్మ వాళ్ళకి ఆయన మీద బాగా నమ్మకం వచ్చింది... అమ్మ దాన్ని లాకెట్ గా వేసింది,” అన్నాను...

“అలా ఆయన బ్లెస్ చేసిన వాళ్ళు పెద్ద స్టార్స్ అయ్యారట కూడా......నీవేమన్నా స్టార్ అవ్వాలనుకుంటున్నావా? లేక మాలాగా స్టూడియో కడతావా? సినిమాలు తీసి మిలియనేర్ అవ్వాలనా?” నన్ను సూటిగా చూసింది రాణి... ఏమనాలో తెలియక తల దించుకున్నాను...

“మరి డాడీ ఎందుకు నిన్ను ఆయన వద్దకు తీసుకెళ్ళినట్టు? నీ మీద మా డాడీకి ఎక్కడలేని ఇంట్రెస్ట్, సిల్లీ... హి ఇజ్ టూ కైండ్ .....ఏమంటే నీలో మంచి టాలెంట్ ఉందంటారు...,” ఇంకా తను ఏదో అనబోయే లోగా, రీసెస్ బెల్ నన్ను కాపాడింది...

**

ఇంటికెళ్ళాక అమ్మకి చెప్పాను, మరునాడు జగదీష్ బావ బర్త్డే అని. అంతకు మించి రాణి అన్న మాటలేవీ చెప్పదలుచుకోలేదు.

“అవునా?” వాడికి పద్దెనిమిదేళ్ళు నిండుతాయి, నీకంటే నాలుగేళ్ళు పెద్ద. ఈ డిసెంబర్లో నీకు పద్నాలుగు నిండుతాయి కదా,” అంది అమ్మ.

బాక్-పాక్ గదిలో పెట్టి డాన్స్ క్లాస్స్ కి రెడీ అవుతుండగా, "త్వరగా వచ్చి ఏమన్నా తిని, హార్లిక్స్ తాగి, క్లాస్ కి వెళ్ళు," పిలిచింది అమ్మ

డైనింగ్ వద్ద, బాబు హార్లిక్స్ తాగుతూ, ఏదో లావుపాటి పుస్తకం చదువుతున్నాడు. వాడు ఎప్పుడూ ఏదో బుక్ చదువుతూనే ఉంటాడు. వెళ్ళి వాడి పక్కనే కూర్చున్నాను.

"చంద్రా, తేజ టి.వి వాళ్ళు ఫోన్ చేసారు. 'అన్నమయ్య సంకీర్తనం' అనే వాళ్ళ ప్రోగ్రాములో నిన్ను డాన్స్ చేయమని అడిగారు. మాట్లాడి రేపు ఫోన్ చేస్తాన్నాను," చెప్పింది అమ్మ.

"అయితే, 'చక్కని తల్లి' డాన్స్ చేస్తానమ్మా. అది కాక నీఇష్టం," అని అమ్మకి చెప్పి, పుస్తకం చదువుతున్న బాబు వంక తిరిగాను.

"ఏం చదువుతున్నావు?" అడిగాను వాడ్ని.

పుస్తకలోకంలో ఉన్న వాడికి నా మాటే వినబడలేదు.

"అరేయ్ వినోద్, మరీ చదవకు, కళ్ళు పాడయిపోతాయి," అంటూ వాడి చెవి పిండి, హార్లిక్స్ మాత్రం తాగేసి, డాన్స్ క్లాస్ కి వెళ్ళిపోయాను.

**

మరునాడు బ్రేక్ఫాస్ట్ దగ్గర తేజ టి.వి ప్రోగ్రాం విషయం ఎత్తింది అమ్మ. "మూడు ఐటమ్స్ చేయమన్నారు. 'చక్కనితల్లి, బ్రహ్మమొక్కటే, చిరుతనవ్వులవాడు' చేయవచ్చు. నీవు కొరియాగ్రాఫ్ చేసుకున్న ఐటెం 'చక్కని తల్లి' చేయడానికి మంచి అవకాశం. పది రోజుల్లోకాల్ షీట్ ఉంటుందన్నారు," అంది.

“ఇవాల్టి నుండే ప్రాక్టీస్ చేస్తా. కొత్త కాస్ట్యూమ్స్ కావాలమ్మా. కృష్ణని రమ్మను,” అన్నాను.

“షూట్ షెడ్యూల్ చేసాక చెప్పు. లీవ్ తీసుకుంటా,” అన్నారు నాన్న.

గబుక్కున జగదీష్ బర్త్ డే గుర్తొచ్చింది.

“అమ్మా జగదీష్ బావకి ఫోన్ చేయనా? బర్త్డే విషెస్ చెబుతాను,” అడిగాను.

లేచి ఫోన్ చేసింది అమ్మ.

అత్తయ్యతో మాట్లాడింది. “అవునా, ఏమిటో మరి! ఇద్దరూ పోటీ పడుతున్నారా వాడ్ని విష్ చేయడానికి? బాగుంది. చంద్ర స్కూల్ కి వెళ్ళబోతుంది. వాడ్ని పిలువు వదినా. విష్ చేసి వెళుతుంది,” అంటూ ఫోన్ నాకిచ్చింది.

“జగదీష్ బావ, హాపీ బర్త్డే,” అన్నాను.

“హాయ్ చంద్రా, థాంక్స్. ఈ బర్త్డే కొంచెం స్పెషల్ అంటుంది మమ్మీ...పొద్దున్నే, రాణి, ఇప్పుడు నువ్వు విష్ చేసారని. ఇప్పటివరకు నాకు ఇలా ‘అమ్మాయిలు’ ఫోన్ చేసి విష్ చేయలేదు మరి,” నవ్వాడు జగదీష్. “మళ్ళీ చేస్తాను. స్కూల్ కి టైం అయింది,” అన్నాడు.“

ఓకే, నాక్కూడా,” ఫోన్ అమ్మకిచ్చాను.

**వారం రోజులు ప్రాక్టీస్ చేసి, తేజ టి.వి. కి మొత్తం నాలుగు ఐటమ్స్ చేసాను. బాగా వచ్చిందన్నారు. అమ్మ చేతికి ‘పారితోషికం’ అంటూ కవర్ అందించారు.

**

‘తేజ’ టి.వి లో నా డాన్సస్ టెలికాస్ట్ అయినప్పుడల్లా చూసిన స్కూల్ మేట్స్ నాకు కంగ్రాచ్యులేషన్స్ చెబుతూనే ఉంటారు.

‘షూట్ అయ్యి అప్పుడే ఆరు నెలలవుతున్నా, వారానికి ఒకసారైనా ఏదో ఒక సందర్భంలో నా ఐటమ్స్ ఇలా టెలికాస్ట్ అవుతూనే ఉండడం బాగుంది’ అనుకుంటాను.....

**

ఎగ్జామ్స్ కి చదువుకోవాలని పొద్దున్నే లేచాను. హాల్లోనుండి టి.వి వినబడుతుంది. మామూలుగా అమ్మ పొద్దున్నే టి.వి పెట్టదు. అదీ అంత వాల్యూమ్?

‘హ్యాపీ బర్త్‌డే టు చంద్రకళ’ అని అనౌన్స్మెంట్ వినబడింది.

ఇవాళ డిసెంబర్ ట్వెల్త్, నా బర్త్‌డే.

టి.వి లో నా డాన్స్ ఐటమ్ టెలికాస్ట్ చేస్తున్నారు. పరుగున హాల్లోకి రాబోయాను.

డోర్-వే లో నవ్వుతూ అమ్మ నిలబడి ఉంది...నన్ను హగ్ చేసి ‘హ్యాపీ బర్త్‌డే’ తల్లీ” అంది....

“ఇవాల్టి టెలికాస్ట్ మాత్రం, నేను రిక్వెస్ట్ చేసానురా,” అంది అమ్మ....

అమ్మ వెనుకే నాన్న, బాబు కూడా ఉన్నారు....నన్ను విష్ చేసారు...

ఇంతలో ఫోన్ రింగ్ అవడంతో, అందరం హాల్లోకి వచ్చాము.

మణత్తయ్య ఫోన్...జగదీష్ కూడా నాకు విషెస్ చెప్పాడు



గురువుగారు 'పద్మశ్రీ' అవార్డు అందుకొని, ఢిల్లీనుండి తిరిగొచ్చారు. వెనువెంటనే, ఆయన బృందమంతా బిజీ అయిపోయారు. 'శ్రీకృష్ణావతారం' నృత్య నాటిక కోసం మ్యూజిక్ కాంపోజిషన్, నృత్యాంశాల కూర్పు - ప్రాక్టీసులతో అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ప్రదర్శనకి, అమ్మ చేత కూడా శ్లోకాలు పాడించనున్నారు.క్రిస్టమస్ హాలిడేస్ అవగానే,

ప్రోగ్రాం ప్రాక్టీసులు మొదలయ్యాయి..

కాళీయుని శిరస్సు పై నర్తించే కృష్ణుడుగా, నేను చేసేది పదకొండు నిముషాల నర్తనం - కొత్తరకంగా కూర్చారు మాస్టారు.

“తాళాలు, గతులు, జతులు, సంగతులు మారుతూ – శ్లోకంతో ముగియడం, ఓ కొత్త పద్ధతిలో ఉంది నీ జతి,” అంది అమ్మ.

అమ్మకి ఎంతో నచ్చింది. దగ్గరుండి ప్రాక్టీసు చేయిస్తుంది.సమ్మర్ బ్రేక్ రాగానే ఉంటుందట ప్రోగ్రాం. అదే వారంలో ‘టెరిటోరియల్ ఆర్మీ డే’ ప్రోగ్రాం కూడా.

**“

రోజూ పేరున్న ఆర్గనైజేషన్స్ ఒకళ్ళకొన్నా ఫోన్ చేస్తున్నారు, మన కళ ప్రోగ్రాం కోసం,” అన్నారు నాన్న

ఓ రోజు భోంచేస్తుండగా.“ నమ్మలేకుండా ఉన్నాను. ఇంత చిన్నపిల్లని, ప్రొఫెషనల్ గా పర్ఫామ్ చేయమని ఇంత మంది అడగడం ఎంతో ఉత్సాహాన్నిస్తుంది. నిజంగానే చంద్రకళలో ఏదో ఉంది,” నవ్వుతూ అమ్మ.“ఔను, మమ్మీ, దేర్ ఇజ్ ఎ డెవిల్ ఇన్ హర్, దట్ వాంట్స్ టు డాన్స్ ఆల్ ద టైం,” అన్నాడు పెద్దగా నవ్వుతూ వినోద్.“అయితే, నువ్వు డెవిల్ కి బ్రదర్,” అన్నాను వాడితో.

“కళకి, ఈ ప్రోగ్రాములకి రెమ్యునరేషన్ కూడా అందుతుంది. మరి దాని ఇష్టం. అంతా తనకే... షి ఇజ్ ఎ ప్రొఫెషనల్ డాన్సర్ నౌ,” నా వంక చూసారు నాన్న.

“ఈ యేడు భూషణ్ వాళ్ళ స్టూడియోలో కల్చరల్ ప్రోగ్రాం ఎలాగూ చేస్తాము. మదురై ఆర్ట్-ఫెస్టివల్లో మన కళ, రాణి పాల్గొనడానికి అప్లికేషన్లు పంపబోతున్నానని చెప్పాడు, భూషణ్. పోతే, మైలాపూర్ ఫైనార్ట్స్ వారి దసరా ప్రోగ్రాం ఒకటి ఒప్పుకున్నాను. అమ్మవారి గురించిన సాహిత్యం, నృత్యాలు కావాలని వారి రిక్వెస్ట్. ఇప్పుడింకా జనవరి కదా! వీటన్నిటికీ టైం ఉంది,” అన్నారు నాన్న.

“నీకు ‘ఓకే’ నా కళా?” అడిగారు నన్ను.

“అఫ్ కోర్స్,” అన్నాను ఉత్సాహంగా.

**

రాణి స్కూల్లో అప్పుడప్పుడు జగదీష్ గురించి ఏదో ఒక కబురు చెబుతుంది. ఇంటికొచ్చి, ఆ కబుర్లన్నీ అమ్మకి తప్పకుండా వినిపిస్తుంటాను. అమ్మతో చెప్పేప్పుడు మాత్రం జగదీష్ పేరుకి ‘బావ’ అని తగిలించడం మర్చిపోను.

**

శనివారం పొద్దున్నే రోజూ కన్నా పెందరాళే అమ్మ పిలుపుతో మేల్కొన్నాను.

“బ్రేక్ ఫాస్ట్ కి త్వరగా రండి అందరూ. చంద్రకి డాన్స్ రిహార్సల్స్, వినోద్ కి క్లబ్ లో ‘హారి పాటర్ ‘మూవి’ ఉన్నాయి. ఇద్దరికీ టైం అవుతుంది,” అంటూ పిలిచింది అమ్మ.

ఐదు నిముషాల్లో నాన్న సహా అందరం డైనింగ్ దగ్గరకెళ్ళాము. మామూలుగా శనివారాలు ‘కిచిడి’ చేస్తుంది. అందులోకి అమ్మ స్పెషల్ - కొబ్బరి పచ్చడి, సాంబార్....

అందరికీ వడ్డించింది. తిని ఎలా ఉన్నాయో చెప్పమంది. నాతో మాత్రం, “కాస్త లైట్ గానే తిను. డాన్స్ చెయ్యాలిగా, లేదంటే హార్లిక్స్ మాత్రం తాగి వెళ్ళు. లంచ్ కి తినవచ్చు నీకిష్టమైన ‘కిచిడి’,” అంది అమ్మ.

అమ్మ వంక గుర్రుగా చూసాను... కానీ ఆమె అన్నది అర్ధమయ్యింది...నా వంక చూసిన అమ్మ మాత్రం నవ్వేసింది.

“వినోద్, నిన్ను కన్నన్ కారులో డ్రాప్ చేస్తాడు.  వచ్చేయాలన్నప్పుడు  క్లబ్  నుండి ఫోన్ చేయి,” చెప్పింది వాడికి.

“ఇంకొంచెం తినండి,”  అంటూ నాన్నకి రెండోసారి కిచిడి వడ్డించి, పక్కనే కూర్చుంది.

“చూడండి,  శివరామశర్మ మాస్టారు మన చంద్రకి ఎంతో  శ్రద్ధగా నాట్యం నేర్పిస్తున్నారు. ఆయన స్పెషల్ క్లాసుకి ఫీజు కూడా తీసుకోడంలేదు.  ఆయనకి గురుదక్షిణగా పట్టు పంచెలు, క్యాష్ గిఫ్ట్ ఇద్దామని అనుకుంటున్నాను.  రేపు ఆదివారం ఆ పని చేస్తా,” అంది అమ్మ నాన్నతో.

నేను హార్లిక్స్ మాత్రం తాగేసి క్లాసుకి వెళ్ళిపోయాను.

**

మరునాడు,  పొద్దున్నే  ట్రేలో పళ్ళు, పట్టుపంచలు, ఒక కవరు సర్దింది అమ్మ. క్లాసు  టైంకి ముందే ట్రేతీసుకొని వెళ్ళాము.“గురువుగారికి  నమస్కరించు చంద్రా,”   అంది అమ్మ.  పాదాలంటి  నమస్కరించాను.

“ఇదంతా ఏమిటమ్మా,”  అన్నారు మాస్టారుగారు.

“మా తృప్తికోసం మాస్టారు. కృతజ్ఞతగా మీకు చిన్న కానుక.  ఇంత చిన్న వయసులో, చంద్ర ఇంత చేయగలుగుతుందంటే, కేవలం మీరు దానిపైనుంచిన శ్రద్ధ విశ్వాశం వల్లనే.  గురువుగారి ఋణం తీర్చుకోలేము,” అంటూ నా చేత మేము తెచ్చిన  ట్రేఆయనకి ఇప్పించింది అమ్మ.

“చూడండీ శారద గారు,  వయస్సుతో నిమిత్తం లేని మంచి టాలెంట్, శ్రద్ధ మీ అమ్మాయిలో ఉన్నాయి.  నా  స్టూడెంట్ తేజశ్విని  కళలున్నాయి  మీ అమ్మాయిలో.   నృత్యమంటే  ఉన్న ఆసక్తికి తోడు,  మీ నుండి అందుతున్న సహకారం చంద్రకళ  పూర్వజన్మ సుకృతం.  మనం  మరో  తేజశ్విన్ని  తయారు చెయ్యవచ్చు.   మీకు, నాకు కూడా కీర్తిని

తెచ్చిపెడుతుంది  మన చంద్రకళ,"  అన్నారు నన్ను ఆశీర్వదిస్తూ  మాస్టారు.

అమ్మ కళ్ళల్లో ఆనందం చూసాను.

**

ప్రోగ్రాం  ప్రాక్టీసులు  కూడా అయ్యి ఇంటికి వచ్చేసరికి, లంచ్ తినకుండా నా కోసమే ఆగారు  నాన్నా వాళ్ళు.  అమ్మ చేసిన వంటల ఘుమఘుమలతో ఆకలి రెట్టింపయ్యింది.

ప్రతి సండే  సాంబార్, ఎగ్ పులుసు, బెండకాయ వేపుడు... భోజనమయ్యాక మాంగో ఐస్ క్రీం  సహా స్పెషలే.  ......అన్నీ నాకిష్టమైనవే...క్లాస్ గురించే కబుర్లు చెబుతూ  లంచ్  కానిచ్చాను.

ఐస్ క్రీం తింటూ, అందరం సిటింగ్  రూములో టి.వి ముందు చేరాము.

డోర్ బెల్ మోగితే, నేనే వెళ్ళి తలుపులు తీసాను.

మా మాస్టారుగారే.   "ఏమ్మా నాన్నగారు ఉన్నారా?" అంటూ లోపలికి వచ్చారు.

"రండి శర్మగారు," అంటూ నాన్న లేచి ఎదురొచ్చారు.

చేతిలోని కవర్ ని, కాఫీ టేబిల్ మీద ఉంచి, సోఫాలో కూర్చున్నారాయన. అమ్మ ఏదో అనబోయింది. "చూడండి మేజర్ గారు,  ఇలా ఇంత డబ్బు పాపతో ఇప్పించడం ఏమిటండి? నేను తీసుకోలేను.  గౌరవంతో ఇస్తున్నారు  కాబట్టి  పట్టు పంచెలవరకు  తీసుకుంటాను," అన్నారాయన.

“అలా కాదు మాస్టర్ గారు, మీరు స్పెషల్ క్లాస్ కూడా చెపుతున్నారు. దానికి మీరు ఏమీ తీసుకోరు,” ఇంకా ఏదో అనబోయింది అమ్మ….

“ఇప్పుడు చంద్రకళకి తన సొంత బ్యాంక్ అకౌంట్ కూడా ఉంది మాస్టారు. కాబట్టి మీ ఫీజు ఏమీ తక్కువ కాకుండా ఇచ్చుకోనివ్వండి,” అన్నారు నాన్న.

“లేదండీ, చంద్రకళ డబ్బుని డాన్స్ దుస్తులకి వాడండి. నన్నింక ఫీజు అదీ అంటూ కించపరచకండి…మామూలుగా గ్రూప్ లెసెన్ కి కడుతున్నారుగా. అది చాలు,” అన్నారు.

“పోతే, మరో సంగతి. వచ్చే యేడు నుండి ‘నృత్యహేళి’ ప్రదర్శనల ఏర్పాట్లు ఉంటాయని సూచించారు సాంస్కృతిక సంఘం వారు. మంచి సభా వేదికలివి. చంద్రకళకి, మీకు అన్ని ఏర్పాట్లు మన మంజరి, కాంచనలతో పాటే ఉంటాయి,” అన్నారాయన అమ్మతో. అమ్మావాళ్ళు ఆయన చెప్పేది వింటున్నారు…నాకైతే చాలా చాలా హ్యాపీగా ఉంది…

“సమయం ఉంది కాబట్టి, ఆలోచించి ఏర్పాట్లు చేసుకోండి. ఉంటానమ్మా,” అంటూ సోఫా నుండి పైకి లేచారాయన. ఆయన్ని పంపి తలుపు వేసుకుని వచ్చారు నాన్న. సీరియస్ గా ఆలోచిస్తున్న అమ్మ పక్కనే సోఫాలో కూర్చున్నారు.“చూడు శారద, గొప్ప పేరున్న గురువు, ఈ అవకాశాలు అరుదుగా లభిస్తాయి. మా చిన్నక్క - కోటమ్మ, ఖాళీగానే ఉంది. ‘నీ దగ్గరే ఉంటానురా తమ్ముడు,’ అంటూ ఉంటుంది

నాతో. పిలిస్తే ఎప్పుడైనా వస్తుంది.. కొంత కాలం మన దగ్గర, అన్నింటా సాయంగా, వినోద్ కి తోడుగా ఉంటుందిలే….,” అన్నారు నాన్న.

*******

మంచి గ్రేడ్స్ తో పాస్ అయ్యి, నేను నైన్త్ స్టాండర్డ్ కి వచ్చాను… సమ్మర్ హాలిడేస్ మొదటి వారంలోనే, చాలా పబ్లిసిటీతో, మాస్టారి గారి - ‘కృష్ణావతారం’, నాన్న వాళ్ళ టెరిటోరియల్ ఆర్మీ ప్రోగ్రాములయ్యాయి.

“శ్రీకృష్ణావతారం” డాన్స్ బ్యాలెట్ లో నా పర్ఫార్మెన్స్ గురించి అన్ని పేపర్స్- మంచి రివ్యూ ఇచ్చాయి. ‘కూచిపూడి పట్లనాకున్నది అంకితభావమని, ధీటైన తాళ జ్ఞానం నా నృత్యానికి ఆయువు పట్టని’ మెచ్చుకున్నాయి కొన్ని రివ్యూలు..

అమ్మా, నాన్నా పొంగిపోయారు. “డాన్స్ చేసింది నా కూతురైతే, నన్నో పెద్ద ‘స్టార్’ లాగా చూస్తున్నారు మా ఆర్మీ కేడర్,” అంటూ నవ్వారు నాన్న, ఆర్మీ ప్రోగ్రాం జరిగాక....

*******

దాదాపు ప్రతివారం టి.వి. లోనో, న్యూస్ పేపర్లో నా ఫొటో, డాన్స్ రివ్యూ వస్తుండడంతో, బయటకి వెళ్ళినప్పుడు నన్ను జనం గుర్తుపడుతున్నారు.

ఒకటి రెండు సార్లు గుడిలో, షాపింగ్ మాల్ లో నాకు దగ్గరగా వచ్చి, కొందరు ఆడవాళ్ళు నా చేతులు పట్టుకుని మాట్లాడిన సందర్భాలు చూసారు నాన్న.

అలాటి ఓ సంఘటన జరిగిన రోజు, నాకు ఫాన్-ఫాలోయింగ్ ఎక్కువయిందని, అసంఖ్యాకంగా అభిమానులు పెరుగిపోతున్నారని టీజ్ చేస్తూనే, ఇంటికొచ్చాక, నాన్న కొత్తగా కొన్ని రూల్స్ పెట్టారు ...

‘తోడు లేనిదే, నేను ఎవరిళ్ళకీ వెళ్ళకూడదని, ఒంటరిగా ఎవరితోనూ మాట్లాడకూడదని, తమతో తప్ప వేరెవరితోనూ మెలగవద్దని’ సూచించారు. నిజానికి, నేను ఫ్రెండ్స్ తో బయటకి వెళ్ళడాలు లాంటివి చాలా అరుదు...



“..పొండి నాన్న, మీరు మరీ చేస్తారు... రేపే మనం గుంటూరు వెళుతున్నాముగా.... ఈ సారి ఆస్ట్రేలియా నుండి పెద్దమ్మ వాళ్ళు కూడా వస్తున్నారు.  అమ్మ నన్ను ఓ వారం అక్కడే ఉండమంటుంది  మరి..వాళ్ళతో సరదాగా అటు ఇటు తిరగడాలు ఉంటాయి,” అంటూ నవ్వేసాను నేను...

“.... అదేగా నేననేది... ఎవరిల్లైనా సరే,  మేము లేందే  అక్కడిక్కడ  ఉండిపోవడాలు  ఎందుకమ్మా?  ... గుంటూరులో మనం మూడు రోజులు ఉంటున్నాము కదా! నువ్వు మా వెంటే  తిరిగి వచ్చేయాలి,” అన్నారు నాన్న.

“కనీసం అమ్మమ్మ, నానమ్మల దగ్గర కూడా ఉండ కూడదా?” కావాలనే నవ్వుతూ అడిగాను. ..నేనిప్పటివరకూ ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళిందీ లేదు..... ఎవరింట్లోనూ

ఉన్నదీ లేదు..."

"అవునవును, కుదిరితే నిన్ను బంగారు పంజరంలో బంధిస్తారు మీ నాన్న," అంది ఇదంతా వింటున్న అమ్మ.

"అలాగా? అందుకేనా ఎప్పుడు లీవ్ పెట్టినా నీ ఇష్ట ప్రకారమే, ముందు గుంటూరు ప్రయాణం ఉంటుంది...మిమ్మల్ని పంజరాల్లోపెట్టి తిప్పడానికే," అని నాన్న  అనడంతో, 'మీ వాళ్ళు, మా వాళ్ళు' అనుకుంటూ వాదించుకోడం మొదలుపెట్టారు.

నవ్వుకుంటూ నేను అక్కడి నుండి బయటపడ్డాను.....ప్రయాణానికి సర్దుకోవాలి అనుకుంటూ....

**

ఆస్ట్రేలియా నుండి సుశీల పెద్దమ్మ, వారానికోసారైనా ఫోన్ చేస్తుంది అమ్మకి.  వాళ్ళు మెల్ బోర్న్ లో ఉంటారు.  వాళ్ళ గురించిన కబుర్లు అమ్మ నుండే వింటుంటాము.. వాళ్ళమ్మాయి, వీణ మెడిసిన్ లో చేరబోతుందట.  అవకాశం ఉన్నప్పుడల్లా అక్కడ జరిగే ఇండియన్ ఫంక్షన్స్ లో భరత నాట్యం  ఐటమ్స్  చేస్తుందట వీణ... కాకపోతే, తనకి డాన్స్ మీద కంటే చదువు మీదే ఇంట్రెస్ట్ ఎక్కువట.  మొత్తానికి,  ఈ సారి వాళ్ళని కలవబోతున్నందుకు సంతోషంగానే ఉంది...

**

మేము గుంటూరులో ట్రైన్ దిగి ఇల్లు చేరేప్పటికి, చీకటి పడింది.

ఆప్యాయంగా ఎదురు వచ్చారు అమ్మమ్మా, తాతయ్యా.....  మమ్మల్ని చూడగానే, నన్ను, వినోద్ ని,  ప్రేమగా దగ్గరికి పిలిచింది పెద్దమ్మ.  "చిన్నపిల్లప్పుడు చూసాను నిన్ను.  ఎంత ఎదిగి పోయావు చంద్రకళ, నువ్వు?" అంది నన్ను.

“నిన్నైతే, నెలల పిల్లాడిగా చూసానురా,  ముద్దుగా ఉన్నావు,” అంటూ వినోద్  తలపై ముద్దు పెట్టుకుంది…

పెద నాన్నగారు దూరం నుండే, “హలో కిడ్స్,” అన్నారు.  వీణ లేచి వచ్చి, నాకు, వినోద్ కి హ్యాండ్ షేక్ ఇచ్చి, “హవ్ ఆర్ యు?” అని పలకరించింది….

“మీరంతా ఫ్రెష్ అయి రండర్రా,  భోజనాలు కానిద్దాం,” అంది అమ్మమ్మ….

**

కబుర్లు చెప్పుకుంటూ భోంచేస్తున్నాము. ‘వీణ ఎక్కువగా ఇంగ్లీషు లోనే మాట్లాడుతుంది, వాళ్ళ నాన్న లాగా’ అనుకున్నాను.

“వీళ్ళు చూడు, శారదా,  చెప్పిన దాని కంటే మూడు రోజులు ముందే వచ్చారు సరే….కాని రేపే చీకటితో వెళ్ళిపోతున్నారు,”  అంది అమ్మమ్మ, ఫిర్యాదుగా…

“ఏం లేదు శారదా, ప్లాన్స్ కాస్త మార్చుకోవలసి వచ్చింది… ఈ సారి, కనీసం మిమ్మల్ని చూడ గలిగాము. సంతోషం,” అంది పెద్దమ్మ.

తాతయ్య కల్పించుకున్నారు.

“అసలు ఈ సారి, కొన్ని యాక్టివిటీస్  కూడా ప్లాన్ చేసాము,….ముఖ్యంగా, నీ డాన్స్  చూడాలని ఆదుర్దాగా ఉన్నాము, చంద్రా,  రాంబాబు, మణి ఎంతో చెప్పారు నీ నృత్య ప్రదర్శన గురించి,”  అన్నారాయన నా వంక చూస్తూ..

“అవును, మేమూ వింటున్నాము… నీ ప్రోగ్రామ్స్ అన్నీ యూ-ట్యూబ్ లో పెట్టమ్మా… చూడ్డానికి మాకు వీలుంటుంది,” అంది పెద్దమ్మ.

అమ్మ ఫక్కున నవ్వింది.

“ఇది పెద్ద ముసలామె. కనీసం సెల్ ఫోన్ కూడా వాడదు... యూ-ట్యూబ్ వరకు కూడానా? ఎదో స్కూల్ లోనే, స్కూల్ వర్క్ వరకే కంప్యూటర్ పరిమితమంటుంది,” అంది అమ్మ...

”టి.వి చానల్స్ కి చేసినవి తప్ప, డాన్స్ రికార్డింగ్స్ కొన్ని డి.వి.డి ఫార్మాట్ లో నా దగ్గరున్నాయి. యూ-ట్యూబ్ పనంటే నేనే పూనుకొని చేయించాలి,” మళ్ళీ అమ్మ....

**

అర్ధరాత్రి దాటేంత వరకు అరిసెలు తింటూ, అందరం కబుర్లల్లో ఉండి పోయాము....

నాన్న చేత ‘సాలీడా!' పద్యం పాడించారు తాతయ్య. పెద నాన్న గారు తన వంతుగా హిందీ గజల్ పాడి వినిపించారు. కళ్ళు మూతలు పడుతున్నా, వినోద్ తప్ప మిగతా అందరం మేలుకొని కూర్చున్నాము....

నాన్న, పెద నాన్నగారు, తాతయ్య గార్ల ఎడ తెగని కబుర్లలో, రెండు దాటింది...

“మళ్ళీ మనం ఇలాగే కలవాలి శారదా. ఈ సారికిలా కలిసి భోంచేసి, కాసేపు కూచుని కబుర్లు చెప్పుకో గలిగినందుకు సంతోషంగా ఉంది.

మేము రేపు పొద్దున్నే, ఆరింటికి వెళ్ళిపోతాం. మీరంతా నిద్రపోతుంటారనుకో,” క్షణమాగి మా వంక చూసింది... “బాగా అలిసి పోయున్నారు. ఇక పిల్లల్ని పడుకోబెట్టు,” అంటూ నన్ను, వినోద్ ని దగ్గరికి తీసుకొని, ‘గుడ్ నైట్’ చెప్పింది పెద్దమ్మ...

వీణకి, పెదనాన్న గారికి కూడా 'బై' చెప్పి బెడ్ రూమ్ లోకి వెళ్ళిపోయాము నేను, వినోద్.......

**

మరునాడు సాయంత్రం, పట్టు పంజాబీ డ్రెస్సు వేసుకొని, ప్రత్యేకంగా రెండు డాన్సులు చేసి చూపించాను అమ్మమ్మ, తాతయ్యలకి. వంట మనిషి, ఆయమ్మ కూడా త్వరగా పనులు ముగించుకొని వచ్చారు డాన్స్ చూడ్డానికి.

అమ్మమ్మ నన్ను దగ్గరికి తీసుకొని మెచ్చుకుంది.

"చిన్నప్పుడు మీ అమ్మ, పెద్దమ్మ కూడా నేర్చుకుని చేసేవారు. కానీ నీలో మాత్రం ఏదో ఉందిరా, చంద్రకళ. నువ్వు చూపించే హావ భావాలు, అభినయం, కళ్ళు తిప్పుకోలేనంత అందంగా చేస్తున్నావు... నువ్వు డాన్స్ మానవద్దు," అంది అమ్మమ్మ.

"అయితే, పెళ్ళి చేసుకోబోయే టైంకి, పెళ్లికొడుకుతో ముందే ఒప్పందం చేసుకోవాలి," నవ్వారు తాతయ్య.

"మన జగదీష్ నే చేసుకుంటే, అన్ని విధాల సుఖంగా ఉంటుంది చంద్ర. మొన్న డిసెంబర్ లో, వాళ్ళ అమ్మా, నాన్నలతో వచ్చెళ్ళాడుగా! జగదీష్ అందంగా ఉన్నాడు. చదువులో ఫస్ట్ అంట. చెస్, టెన్నిస్ ఆడుతున్నాడంట. మంచి మాటకారి కూడా. తాతయ్య వాడిని మెచ్చుకుంటే, వాడు మాత్రం తిరిగి చంద్రకళని మెచ్చుకున్నాడంటే, మంచి కళా హృదయుడు అని కూడా అర్ధమయింది," పొంగిపోతూ చెప్పింది అమ్మమ్మ.

"అవును, నిజమే, 'టీన్ టెన్నిస్ స్టార్' అని నేను వాడిని మెచ్చుకుంటే, 'మీరింకా చంద్రడాన్స్ చూడలేదు. చంద్రకళ డాన్స్ ముందు ఏదీ గ్రేట్ కాదు. షి ఇజ్ ఎ మార్వలస్ డాన్సర్, తాతయ్యా, అని నిన్ను మెచ్చుకున్నాడు వాడు," అన్నారు తాతయ్య... నా వంక చూస్తూ. ఆశ్చర్యమనిపించింది. ఆనందంగా అనిపించింది... జగదీష్ కి నా డాన్స్ అంటే అంత మంచి ఒపినియన్ ఉండడం గర్వంగా అనిపించింది కూడా...

"మేనరికాలు నాకు నచ్చవు అత్తయ్య గారు, అయినా పసి పిల్లలు. ఇప్పటి నుంచి పెళ్ళి మాటలు ఎందుకు లెండి,"

అమ్మమ్మతో, నాన్న.

"కళా, తమ్ముణ్ణి తీసుకొని, వెళ్ళి టి.వి చుడండమ్మా," అన్నారు.

పైకి లేచి పుస్తకం చదువుతున్న వినోద్ చేయి పట్టుకుని, ఎదురుగా ఉన్న గదిలోకి నడిచాను...

"అదేమిటి అల్లుడు గారు? రాంబాబు మాకు రక్తసంబంధీకుడు కాదే! కజిన్ అంటారే గానీ నిజానికి అతను మా దూరపు బంధువుకి కొడుకు. పైగా ఆ బంధువుకి, రాంబాబు దత్తపుత్రుడు. అటువంటి రాంబాబు కొడుకు జగదీష్ విషయంలో, మేనరికమంటూ అభ్యంతరాలేముంటాయి? భలే వారే మీరు," అన్న తాతయ్య మాటలు వినబడ్డాయి వెనుకనుండి....

"వాళ్ళుండేది పల్లెటూరని ఇక్కడ గుంటూరులో చదువుకున్నాడు, రాంబాబు. సుశీలకి, శారదకి అన్నిటా వాడు తోడుగా, సాయంగా ఉండేవాడు. మాకు కొడుకు లేని కొరత తీర్చాడు," అంది అమ్మమ్మ.

"మీ అల్లుడు గారు అన్నీ మరిచి పోతారులే అమ్మా. అయినా తప్పేముంది? జగదీష్ బంగారం లాంటి పిల్లాడు," నవ్వింది అమ్మ.

వాళ్ళున్న హాలు మా టి.వి రూమ్ కి ఎదురుగానే ఉండడంతో, వాళ్ళంటున్న చుట్టరికాలు అర్థమవ్వకపోయినా, వాళ్ళ మాటలు గట్టిగానే వినబడుతున్నాయి.

**

మరునాడు, అమ్మమ్మ వాళ్ళతో, అమరావతి - కాకాని గుళ్ళకి బయలుదేరాము..

"మీ నాన్నకి ఇష్టమైన మరో పుణ్య క్షేత్రం ఇది,..." అంది అమ్మ...

మా తిరుపతి, మదుర్రై ట్రిప్పుల గురించిన కబుర్లతో హాయిగా సాగింది ప్రయాణం. అమ్మ చెబుతున్న సంగుతులు వింటూ స్టుడియోలో మేము చేసిన ప్రోగ్రాంని గుర్తుచేసుకున్నాను.

"పొద్దున్నే బయలుదేరడంతో త్వరగానే వచ్చేసామర్రా అమరావతికి. గెస్ట్-హౌజ్ కూడా ఇంకా పది నిముషాల దూరంలోనే ఉంది. త్వరగా మీ పనులన్నీ అయితే, రావుగారి మనిషి వచ్చి, మనల్ని దైవ దర్శనానికి తీసుకెళతాడు," అన్నారు తాతయ్య మాతో...........

**

అమ్మవారి దర్శనం అయ్యాక, గుడి బయట, చెట్టు అరుగు మీద చేరాము. వెంటొచ్చిన ఆయమ్మతో, వినోద్ కాస్త దూరంలో ఉన్న గిఫ్ట్ షాప్ కి వెళ్ళాడు..... ఎక్కడికెళ్ళినా ఫ్రెండ్స్ కి చిన్న గిఫ్ట్స్, పోస్ట్ కార్డ్స్ కొనే అలవాటు వాడికి.

"ఇక్కడేనమ్మా కళా, నీలాంటి బిడ్డ పుట్టాలని ఈ గుళ్ళోని దేవతని మొక్కుకున్నాను," అన్నారు నాన్న, కొట్టిన కొబ్బరులు నాకిస్తూ.

ఆయన వంక చూసాను.

"మా పెళ్ళైన రోజున, ఇక్కడ అమ్మవారి దర్శనానికి వచ్చాము. ఈ గుళ్ళో, ఇక్కడి నుంచి అక్కడి వరకు కుంకుమార్చాన జరుగుతుంది. అందుకని, దూరాన్నుంచే అమ్మవారికి వినబడేలా పెద్దగా, గొంతెత్తి మరీ వేడుకున్నాను. అందమైన, కూతురు కావాలని," , "మీ అమ్మనడుగు నిజమా? కాదా?" అన్నారు నాన్న.

అమ్మ నవ్వింది. "నాకెందుకు గుర్తులేదు? పెళ్ళి బట్టల్లో అందరి ముందు, గొంతెత్తి అంత బిగ్గరగా 'కూతురు కావాలి' అని మీరు మొక్కడం.. అందరూ నవ్వడం," అంది అమ్మ.

“ఔనట…మేము చూడలేదు కాని, అంతా విన్నాము,” అంది అమ్మమ్మ…

“అందుకేరా నువ్వు నా చిన్న దేవతవే… ఆ అమ్మవారు నీకు ఎన్ని కళలు ప్రసాదించిందో చూసావా?” అంటూ నాన్న నా భుజాల చుట్టూ చేతులు వేసి తల మీద ముద్దు పెట్టుకున్నారు.

నాన్నకి నేనంటే అంత ప్రేమని తెలుసు…‘ఇంతటి నాన్న ప్రేమ చాలు నాకు… నాన్నని నేను కూడా ప్రేమగా చూసుకుంటాను’ అనుకున్నాను.

**

“మీరు వచ్చినట్టే లేదు,,, ఉన్నట్టే లేదు. ఎల్లుండి వెళ్ళిపోతున్నారు కూడా. ఇకనుండి ప్రతి యేడు రావాలి మీరు. మేము పెద్దవాళ్ళం అయిపోతున్నాము.,” అన్నది అమ్మమ్మ భోజనాల దగ్గర.

“వచ్చే యేడు మా పాలెం వెళ్ళి ఇటు వస్తాము లెండి అత్తయ్య గారు. సిక్ లీవ్ కాక నాకు మూడు వారాలు సెలవు వుంటుంది,” అన్నారు నాన్న.



చెన్నై చేరి,  ఇంట్లో అడుగు పెట్టగానే, మొదటి ఫోన్ భూషణ్ అంకుల్ నుండే.  నాన్న మాట్లాడారు.

“మనతో ముఖ్యమైన విషయాలు మాట్లాడాలంట. సాయంత్రం వాళ్ళింటికి  డిన్నర్ కి రమ్మంటున్నాడు  భూషణ్,” అన్నారు  నాన్న మాతో.

**

ఇంటి  పనులయ్యాక, మరునాటి మ్యూజిక్ క్లాసుల షెడ్యూల్ సెట్ చేసుకుంది అమ్మ.

వినోద్ ఇంట్లోనే ఉంటాననడంతో, కన్నన్ ని తోడుంచి, సాయంత్రం ఏడింటికి భూషణ్ అంకుల్ వాళ్ళింటికి వెళ్ళాము.

సగం సమయం మా గుంటూరు – అమరావతి కబుర్లతో గడిచిపోయింది.

రాణి నాతో పెద్ద ఫ్రెండ్లీగా ఎప్పుడూ ఉండదు...డిన్నర్ చేసినంతసేపు, నేనే తనకి అవీ-ఇవీ కబుర్లు చెప్పాను...

భోజనమయ్యాక, అందరం సిటింగ్ రూములో కూర్చున్నాము. నాకు ఇష్టమని, ఆంటీ 'మాంగో కసాట' ఐస్ క్రీం సర్వ్ చేసింది.

ఈ లోగా భూషణ్ అంకుల్ ఒక ఫైల్ తీసుకొచ్చి , మా ఎదురుగా కూర్చున్నారు.

"చూడమ్మా శారదా, మాకు, మీకు కూడా మన బిడ్డలని వృద్ధిలోకి తేవాలని గట్టి ఆకాంక్ష ఉంది. ఇప్పటికే మంచి టాలెంట్ ఉన్న యంగ్స్టర్స్ అని గుర్తింపు పొందారు. వాళ్ళకి తగ్గ అవకాశాలు, పేరు వచ్చేలా మనం తోడ్పడాలి.

అయితే, మన మేజర్ ఉద్యోగంతో బిజీగా ఉంటాడు.

కాని నాకు బోలెడంత టైం ఉందిగా! పైగా ఈ కళారంగం నాకు బాగా తెలిసిందే. ఎన్నో సాంస్కృతిక సంస్థలు నా ఆధ్వర్యంలోనో, నా సహకారంతోనో ముందుకు వెళుతున్నాయి. ....అందుకే పిల్లల కెరియర్ పై, నా దృష్టిని పూర్తిగా కేంద్రీకరించాలని నా ఆలోచన.

ప్రతియేడు, హేమాహేమీలని ఆహ్వానించి, మన స్టూడియో కల్చరల్ ప్రోగ్రాం తప్పనిసరిగా ఉంటుంది," ఒక్క నిముషం ఆగారు అంకుల్....

“ఇటు శారద గారు, అటు  నా భార్య నీరూ కూడా  పూర్తిగా  సహాయ  సహకారాలు అందిస్తే  పిల్లల భవిష్యత్తులు తారాజువ్వల్లాదూసుకుపోతాయి,”  అంటూ నాన్న వంక  చూసారు..

“ఏమంటావ్ సత్యం?  రెండు నెలలకో ప్రోగ్రాం, ఓ టి.వి షో ఉండేలా ఏర్పాటు చేస్తాను.  మనీ మాటర్స్, పేమెంట్స్ గురించి - నీరూ, శారద చూసుకుంటారు.  వచ్చింది పిల్లల వృద్ధికే ఖర్చు పెడతారు.  ఏమంటారు?”  అడిగారు అంకుల్.

నీరూఆంటీ కల్పించుకుంది. “ఇందులో మా స్వార్ధం కూడా ఉంది  సత్య గారు.  పిల్లలిద్దరూ  కలిసి  ప్రదర్శనలిస్తే డాన్స్ అండ్ మ్యూజిక్ ఆడియన్స్ వుంటారు.  మంచి కాంబినేషన్ కదా,” అంది నవ్వుతూ.

కాసేపు ఎవ్వరు ఏమి అనలేదు.

ఫైల్ నుండి ఓ కవర్ తీసి, అమ్మ చేతికిచ్చింది నీరుఆంటీ..  “మదురైలో ‘కళామంజరి’ ఆర్ట్స్ ఫెస్టివల్ ఉంటుందని భూషణ్ చెప్పారుగా! చంద్రకళ, రాణిల  పార్టిసిపేషన్ కంఫర్మ్ అయిన వివరాలు కూడా అందాయి.... ఆ ఫెస్టివల్ లో పాల్గొని గుర్తింపు పొందడం మామూలు విషయం కాదు...అందుకే మనం తప్పక వెళ్ళాలి...ఈ కవరులో రిజిస్ట్రేషన్ తో పాటు ఆ సంస్థ గురించి బుక్ లెట్ ఉంది,” అంది ఆంటీ.

మదురై ప్రోగ్రాం  ఉంటుందని’  నాన్న చెప్పిన గుర్తే నాకు......

“నాకైతే,  బ్రహ్మాండంగా ఉంది మీ ప్రపోజల్,” , “గాడ్ ఇజ్ గ్రేట్. ఇట్ ఇజ్ ఆల్ డెస్టినీ ’  వీళ్ళిద్దరిని  ప్రొమోట్ చేయాలన్న ఆలోచనకి,  మీకు  కృతజ్ఞతలు”  అన్నారు నాన్న, అంకుల్ వాళ్ళతో.

అమ్మ కూడా ఔనన్నట్టు తల ఆడించింది.

“చంద్రునికో  నూలు పోగులా  నీవు  నాకు  చేసిన  మేలు  ముందు  ఇదెంతోయ్ సత్యం....

నా ఈ పేరు, హంగామా, ఈ లైఫ్ స్టైల్ నీ వల్లేకదా!. నా చేయి పట్టి సినిమా ఫీల్డ్ కి

నడిపించావుగా...." క్షణమాగారు అంకుల్...

"అదటుంచితే, నీ బిడ్డ టాలెంట్ ఏమీ తక్కువ కాదని నీకూ తెలుసుగా!" అన్నారు మళ్ళీ నాన్నతో..

"అందరం హ్యాపీ కాబట్టి మరో రౌండ్ ఐస్ క్రీం," అంటూ లోపలి వెళ్ళింది ఆంటీ.

"ఓకే! డాడీ, ఇప్పుడు నా సర్ప్రైజ్ చెప్పొచ్చా? అసహనంగా అంది రాణి.

"కానీయ్, చెప్పు తల్లీ" అంకుల్ రాణితో.

"గెస్ వాట్, ఈ సారి కూడా మన కల్చరల్ ప్రోగ్రాంకి, ఢిల్లీ నుంచి జగదీష్ వాళ్ళు వస్తామని కంఫర్మ్ చేసారు. రెండు వారాలు ఉంటారట. మదురైకి కూడా మనతో ట్రావెల్ చేస్తామన్నారు. మా ఇంట్లోకూడా ఓ వారం ఉంటామన్నారు," అంటూ సంతోషంగా చప్పట్లుకొట్టింది రాణి.

అందరికీ మరోసారి ఐస్-క్రీం తెచ్చి, సర్వ్ చేసింది నీరూఆంటి..

"అల్లరికి తోడు ఒట్టి మొండిపిల్ల మా రాణి. తరచుగా ఢిల్లీకి ఫోన్ చేసి మాట్లాడుతుంది. జగదీష్ ఇప్పుడు తన బెస్ట్ ఫ్రెండ్ అంటుంది. వాళ్ళికక 'సరే చెన్నైకి వస్తాము' అనే వరకు ఊరుకోలేదు. మీకూ బంధువులు కదా! వీళ్ళు కూడా మళ్ళీ కలుస్తారులే అనుకున్నాము. మాకు అభ్యంతరం ఏముంటుంది?" అంది ఆంటీ.

నేను, అమ్మనాన్నల వంక చూస్తే, ఐస్ క్రీం తింటున్నారు.

మరో ఐదు నిముషాలకి, అంకుల్ వాళ్లకి థాంక్స్ చెప్పి, ఇల్లు చేరేప్పటికి లేట్ అయింది. అలిసి పోయున్న మేము ఎవరి గదుల్లోకి వాళ్ళం వెళ్ళిపోయాం.

అంకుల్ వాళ్ళింట్లో విన్న సంగతులు, జరిగిన విషయాల గురించే ఆలోచిస్తూ, పక్క మీద చేరాను.

నన్ను కళారంగంలో ముందుకు తీసుకు వెళ్ళడానికి భూషణ్ అంకుల్ చూపిస్తున్న శ్రద్ధకి నాన్న అమ్మ కూడా సంతోషించడం తెలుచుకున్నాను...

ఆయన ప్రోత్సాహంతో, గొప్ప డాన్సర్ అవ్వాలన్న నా కల నిజమవుతుందని అనిపిస్తుంది...

నృత్యమంటే నాకున్న ఇష్టం వల్లనే కదా! ఇక్కడ, భూషణ్ అంకుల్ ప్రోత్సాహం, అక్కడ, అమ్మమ్మ - జగదీషుల అభిమానం పొందగలిగాను అని సంతోషంగా అనిపించింది....

జగదీష్ గురించి మొన్న గుంటూరులో అమ్మమ్మ వాళ్ళు అన్న మాటలు గుర్తొచ్చాయి. అంతలోనే, ఇవాళ నిరుఆంటీ వాళ్ళు అన్నది కూడా గుర్తొచ్చింది.

జగదీష్ తో మాకంటే, రాణి ఎక్కువగా మాట్లాడ్డం కొంత కష్టంగా అనిపించింది....

ఏమైనా, అత్తయ్యా వాళ్ళు చెన్నై వస్తున్నట్టు మాకు ఇంకా చెప్పలేదే? అనుకుంటూ నిదురపోయాను.

**

మరునాడు - శనివారం పొద్దున్నే డాన్స్ క్లాస్ కి తయారయి, అందరి కంటే ముందు నేనే బ్రేక్ ఫాస్ట్ టేబిల్ వద్దకి

వెళ్ళాను. అమ్మ హార్లిక్స్ కలిపిచ్చింది. చదువుతున్న న్యూస్ పేపర్ పక్కన పెట్టి, హాల్లోనుండి నాన్న వచ్చారు. వినోద్ ని కూడా పిలిచి, అమ్మ అందరి ప్లేట్లల్లో ఉప్మా వడ్డించి, తనూ కూర్చుంది.

"మీ అన్నయ్య నీకు ఫోన్ చెయ్యలేదా, వాళ్ళ చెన్నై ట్రిప్పు గురించి? అడిగారు నాన్న.

అమ్మ పలకలేదు.

"నువ్వు, మీ అమ్మ, ఏవో కలలు కంటున్నారు గానీ, మీ అన్నయ్య వాళ్ళ ఆలోచనలు వేరుగా ఉన్నాయి. పెద్ద పెద్దవాళ్ళతో స్నేహాలు చేస్తున్నారు. మనని మర్చిపోయారని తెలుస్తూనే ఉంది," అన్నారు నాన్న.

"ఏమోలెండి, ఫోన్ చేస్తారేమో. చూద్దాం లెండి. అయినా మనం ఊళ్ళో లేముగా!"

అమ్మ కాస్త కోపంగానే ఉందనిపిస్తుంది.

"జగదీష్, 'బంగారం' అని నువ్వు మురిసిపోతే చాలదు శారదా. నాకైతే, మీ అన్నయ్యవాళ్ళ వ్యవహారమంతా గమ్మత్తుగా ఉంది," మళ్ళీ నాన్న."అమ్మా, నిజంగా మామయ్యా వాళ్ళు భూషణ్ అంకుల్ వాళ్ళింట్లో ఉంటారా?" నమ్మలేక అడిగాను.

"ఏమోలేవే, నీ క్లాసుకి టైం అయింది, తినేసి రెడీ అవ్వు. మాస్టారి గారితో మాట్లాడాలి, కాస్తముందుగా వెళదాము," అంది అమ్మ.

**

అమ్మ నాతో పాటు డాన్స్ క్లాస్ కి వచ్చింది.

రాత్రి భూషణ్ అంకుల్ చెప్పిందంతా మాస్టారికి  వివరించింది.  మైలాపూర్ ఫైన్-ఆర్ట్స్ వారి దసరా ప్రోగ్రాం గురించి కూడా ఆయనకి చెప్పింది...

"ఇక పైన, మీరు ఈ  ప్రోగ్రాములకి  ఐటమ్స్ కూర్చి,  మీ  ఆధ్వర్యంలో  జరిపిస్తే బాగుంటుందని అనుకుంటున్నాను. ఎలా చేయవచ్చో, మీరే నిర్ణయించండి.  ఇదంతా మాకు కొత్త.  ఏ తప్పులు జరగకుండా సంప్రదాయంగా జరగాలని  నా కోరిక," అంది అమ్మ.

"సంతోషం శారద గారు. ఎగిసే కెరటాన్ని ఆపేది ఎవరు.  సరే,  నేను  కొంచెం  ఆలోచించి రెండు రోజుల్లో మీతో మాట్లాడుతాను,"  అన్నారు మాస్టారు.

**

మళ్ళీ  వారానికి,  ప్రోగ్రాంల ప్రాక్టీసు మొదలు  పెట్టించారు.  ఎంతో ఉత్సాహంగా ఉంది.

ఆయన కూర్చిన ప్రోగ్రాముల్లో అమ్మవారి స్తోత్రాలు, అష్టపదులు,  తమిళ పాటలు కూడా ఉన్నాయి......'నగు మోము కలవాని' అనే త్యాగరాయ కీర్తన నాకు బాగా నచ్చింది.

అది అమ్మ పాడగా విన్నాను... జతులు స్వరాలు చేర్చి చాలా అందమైన డాన్సుగా మలిచారు మాస్టారు.

**

క్లాస్ అయ్యాక  పైకి వచ్చేప్పటికి అమ్మ ఫోన్ లో మాట్లాడుతుంది.  నాన్న, వినోద్ కేరమ్స్  ఆడుతున్నారు.  నేను ఫ్రెష్ అయ్యి వచ్చాక కూడా, అమ్మ ఫోన్ లో మాట్లాడుతూనే ఉంది.

“నాకు ఆకలి వేస్తుంది. అమ్మ ఎవరితో మాట్లాడుతుంది నాన్న?” తగ్గు స్వరంలో అడిగాను.

“మీ అత్తయ్యతో,” అన్నారు నాన్న. ఆశ్చర్య పోయాను.

“మీ అత్తయ్యే చేసింది,” మళ్ళీ నాన్న.|

ఇంతలో, “ఇదిగో, చంద్రా ఫోన్,” అంది అమ్మ.

“అమ్మా, నేనేమి మాట్లాడాలి? అన్నట్టుగా చూసాను…

ఫోన్ నాచేతిలో పెట్టి, “ముందు అత్తకి హలో చెప్పు,” అంది.

“హలో,” అన్నాను.

“ఏమ్మా చంద్రకళా, ఎలా ఉన్నావు? కుదిరితే, నీ రెండు ప్రోగ్రాములకి మీ వెంటే ఉంటాము.

జగదీష్ అయితే నీతో పాటు కూచిపూడి డాన్స్ నేర్చుకునేలా ఉన్నాడు. ఇదిగో మాట్లాడు,” నవ్వుతూ అత్తయ్య.

“హలో,” అన్నాడు జగదీష్.

“హలో,” తిరిగి అన్నాను.

“చంద్రా వి ఆర్ కమింగ్ టు చెన్నై ఇన్ ఎ ఫ్యూ డేస్. వి విల్ సీ యు పర్సొం,” అన్నాడు.

“ఆహా,” అన్నాను.

“బాగా ప్రాక్టీస్ చేస్తున్నారంటగా నువ్వు, రాణి?”, “రోజు  చెబుతుంటుంది  తను,”  అన్నాడు జగదీష్.

“ఔను,” నవ్వాను.

“సరే ఫోన్ మమ్మీకి ఇస్తున్నా,” అన్నాడు.

**


లంచ్ వడ్డించింది అమ్మ.  నాకిష్టమైన కర్రీస్.  తింటూ  ఆలోచించాను.

అత్తయ్యే అమ్మకి  ఫోన్ చేసిందన్నారు.

‘ఏమి కబుర్లు చెప్పిందో! ఆమె’ అనుకున్నాను...

“ఇప్పటి వరకు నీతో తమ ట్రిప్పు సంగతి చెప్పకపోవడానికి ఏమిటంట మీ వదిన గారి సాకులు,” తింటూ అడిగారు నాన్న.

..మళ్ళీ వచ్చేవారం..................



“ పెద్ద విషయమేమీ లేదు. ఈ యేడు కూడా తిరుపతి ట్రిప్ కలుపుకొని, రెండు వారాల కోసం చెన్నై రావాలనే అనుకున్నారట వాళ్ళు. ఇకపోతే, హాలిడేస్ కి రమ్మని, రాణి ప్రతి రోజు ఫోన్ చేస్తుందట. వస్తామనే ఆ అమ్మాయికి చెప్పుంటారు మరి. వదిన మాత్రం, మన చంద్రడాన్స్ ప్రోగ్రాములు, వినోద్ స్కూల్ హాలిడేస్, అన్నీ మనతో మాట్లాడి డేట్స్ తెలుసుకొని ప్రయాణమౌతామని అంటుంది... ప్రాక్టీసులకి అడ్డం లేకుండా చెప్పమంది,” క్షణమాగింది అమ్మ.

“అంతా విని, సరే అన్నాను,

అన్నీ చూసి మళ్ళీ ఫోన్ చేస్తానని చెప్పాను. అదీ సంగతి," అమ్మ సంతోషంగానే ఉంది. 'అమ్మయ్య! గొడవలు లేవేమోలే' అనుకున్నాను.

మరి నీ ప్లాన్ ఏంటి. ఎప్పుడు రమ్మని చెబుతావు?" అడిగారు నాన్న.

అమ్మ ఏమీ అనలేదు...ఆలోచిస్తున్నట్టుగా ఉంది... ఆమె ప్లాన్ ఏమిటోనని నేనూ వింటున్నా...... "ఏముంది, సరిగ్గా వర్ధంతి ప్రోగ్రాం టైంకి వస్తే ఆ వారంలో, మనతో మదురై కి కూడా వస్తారు. అదయ్యాక తిరుపతి ట్రిప్. ఆ తరువాత ఇక్కడే ఉండి, కాస్త అటు ఇటూ తిరిగేప్పటికి అందరికీ స్కూల్స్ రి-ఓపెన్ అవుతాయి. కరెక్ట్ గా డేట్స్ కుదురుతాయి," అంది.

**

ఈ సారి అత్తయ్య వాళ్ళకి మరింత కంఫర్టబిల్ గా ఉండేలా, ఇంట్లో అన్ని ఏర్పాట్లు చేస్తుంది అమ్మ. డాన్స్ ప్రాక్టీసులు, మ్యూజిక్ క్లాసుల మధ్య, వాళ్ళ డైలీ రొటీన్ గురించి పదే పదే ఆలోచించి, అత్తయ్యతో మాట్లాడి మరీ ప్లాన్ చేయసాగింది.

'అన్నీ పర్ ఫెక్ట్ గా ఉండాలి... చక్కగా జరగాలి' అని అన్నిటా శ్రద్ధ పెడుతుంది అమ్మ. నా ప్రాక్టీసులప్పుడు కూడా చాలా కష్టపడుతుంది. కొత్త సింగర్, ఆర్కెస్ట్రా వాళ్ళకి దగ్గరుండి సూచనలిస్తూ 'ఇదివరకటి కంటే ప్రోగ్రాం బాగుండాలి' అని వారితోనూ అంటుంది...,.

నా కొత్త కాస్ట్యూమ్స్ కి చిన్ని ముత్యాలు, చిట్టి మువ్వలు కుట్టించింది. మొత్తం మూడు కాస్ట్యూమ్స్. అన్నీ నా ఫేవరెట్ కలర్స్. పాత సినిమాలు, మాగజైన్స్ చూసి, కొత్త కొత్త డిజైన్లు - అమ్మే క్రియేట్ చేసింది కూడా. ** 'మా అమ్మ ఎమేజింగ్!' అన్నాను కాస్ట్యూమ్స్ చూసాక.

"ఊ, మరి నా బిడ్డ 'చిన్న దేవతలా' ఉండాలి వేదికల మీద," అంది.....

"నువ్వింత ఇష్టంతో, కష్టపడి ప్రాక్టీసులు చేస్తుంటే, దానికి తగ్గట్టు నీ వేషం ఉండాలిగా. అదీ గాక, మంజరి, కాంచన వాళ్ళ

కాస్ట్యూమ్స్ లాగా కావాలన్నావుగా!" నవ్వింది అమ్మ.

**

వర్ధంతి ఫంక్షన్ కి ముందు రోజు, సాయంత్రం ఏడింటికి వచ్చారు రాం మామయ్యా వాళ్ళు. జగదీష్ బాగా పొడవయ్యాడు. గొంతు కూడా మారింది. భోంచేసి, మేము హాల్లో టి.వి ముందు చేరితే, పెద్దవాళ్ళంతా వరండాలో కూర్చున్నారు. తన బ్యాక్-పాక్ నుండి క్యాండి బాక్స్ తీసాడు జగదీష్.

"నీకిష్టమైన క్యాండీ అంటగా. డాడీ తెచ్చారు. మరీ ఎక్కువ తింటే, రేపు డాన్స్ చెయ్యలేవు," నవ్వుతూ క్యాండీ బాక్స్ నాకిచ్చి,

"నీకు ఈ పజిల్ గేమ్.... చూద్దాం నీవెలా సాల్వ్ చేస్తావో," అంటూ వినోద్ కి గేమ్ బాక్స్ అందించాడు...

**

టి.వి చూస్తూ మాకు వాళ్ళ అమ్మమ్మ గురించి చెప్పసాగాడు జగదీష్. రెండేళ్ళ క్రితం వరకు, సమ్మర్ వెకేషన్ కి, తప్పనిసరిగా రాజమండ్రిలో ఉన్న తన అమ్మమ్మ దగ్గరికి వెళ్ళేవాడట. "అమ్మమ్మ ఒక్కత్తే ఉండేది కదా! తన ఇల్లు పొలం వదిలి ఎక్కడికీ వచ్చేది కాదు.... అందుకే ఎప్పుడో తప్ప, ప్రతిసారి సెలవలకి నన్ను అటు అమ్మమ్మ వద్దకు పంపేవారు... అమ్మమ్మంటే నాకు చాలా ప్రేమ, ఇష్టం. ఆమెతో తెలుగులోనే మాట్లాడేవాణ్ణి. ఇంతగా తెలుగులో మాట్లాడ్డం నేర్పిందే మా అమ్మమ్మ. రెండేళ్ళ క్రితం 'హార్ట్ ప్రాబ్లం'తో చనిపోయింది...," చెబుతూ దిగులుగా అయిపోయాడు జగదీష్. నేనేమనలేక పోయాను.

"అమ్మమ్మ వల్లే నేను డాక్టర్ అవ్వాలని డిసైడ్ అయ్యాను," అన్నాడు జగదీష్....

ఇంతలో వరండాలో నుండి హాల్లోకి వచ్చారు అమ్మావాళ్ళు...

“కిడ్స్, రేపు ప్రోగ్రాం హడావిడి ఉందిగా, అందరూ త్వరగానే పడుకోండి. గుడ్ నైట్,” అన్నారు రాంమామయ్య...

**

మరునాడు లంచయ్యాక హడావిడిగా స్టూడియో చేరి మేకప్ మొదలు పెట్టుకున్నాము. పక్కనే సెట్స్ మీద జరుగుతున్న షూటింగ్ చూడ్డానికి వెళ్ళారు మామయ్యా వాళ్ళు. ప్రోగ్రాం అనౌన్స్ మెంట్ కి, డాన్స్ ఐటమ్స్ వివరాలు రాసాక, మేకప్-మాన్ సాయంతో నా జుట్టు కట్టి, కొప్పు పెట్టి, జడ వేసి దాని అలంకారమంతా చేసింది, అమ్మ...

సరిగ్గా, నా మేకప్ అయ్యే సమయానికి, మూవీ షూటింగ్ చూసుకొని, గ్రీన్-రూమ్ లో అడుగు పెట్టారు అత్తయ్య వాళ్ళు...

“ఈ సారి కూడా విశేషంగా అలంకరించారు చంద్రకళా మీ ‘ వేదికని ’. నీవు రెడీయేగా, పద చూద్దువు గాని,” అని మణత్తయ్య అంటుండగానే, భూషణ్ అంకుల్ వాళ్ళు కూడా వచ్చారు.

చాలా హ్యాపీగా అత్తయ్యని హగ్ చేసి, జగదీష్ హ్యాండ్ షేక్ చేసి, మామయ్యకి నమస్కరించింది రాణి. అందంగా తయారయింది. తన డ్రెస్సులు స్పెషల్ గా డిజైన్ చేయిస్తుందట నీరూ ఆంటీ.

అందరం వేదిక వద్దకు వెళ్ళాము. భూషణ్ అంకుల్ నా వెనకే వచ్చారు, “ఈ సారి ఎలా ఉంది మీ ‘వేదిక’, కళా?” అడిగారు. వేదిక మీద కళ్ళు చెదిరే లైట్లల్లో బ్యాక్-డ్రాప్ గా సరస్వతీ దేవి బొమ్మ, అటు ఇటూ చిన్నవిగా రాణి, నాది పోస్టర్స్ పెట్టించారు.

“చాలా బాగుంది. థాంక్యూ అంకుల్,” అన్నాను.

“సరస్వతీ దేవికి అటు ఇటు, లక్ష్మీ, పార్వతులని పెట్టినట్టుగా ఉంది ‘వేదిక’,”, “మీ ఏర్పాట్లు, మీ ఆసక్తికి జోహార్లు అన్న గారు,” అంది ఐత్తయ్య భూషణ్ అంకుల్ తో. అందరూ మెచ్చుకున్నారు. అతిధులని రిసీవ్ చేసుకోడానికి నాన్న,

అంకుల్ అక్కడి నుంచి కదిలారు. మేము గ్రీన్ రూంకి వెళ్ళిపోయాము.

**

"మీ ఇద్దరి పాట, డాన్స్ ఓ పోటీ లా, ఓ జుగల్బందీలా బాగుంది పాప. ఇంత చిన్న వయస్సులో, మంచి ప్రావీణ్యత సంపాదించారు. బేష్! చాలా బావుందమ్మా," అన్నాడు ప్రోగ్రాం జరుతుండగా, మా మృదంగం సార్, అమరేంధ్ర ఆయన చేతే, అమ్మ నాకు నెలకి రెండు మార్లు ట్యూషన్ చెప్పిస్తుంది. సంగీతంలో రాగాలు, తెలుగు భాషా ప్రయోగం గురించి అర్ధమయ్యేలా చెబుతారాయన.

**

బ్రేక్ తరువాత, రాణి పాట మొదలవ్వబోతుంటే, వేదిక పక్కనే కూర్చున్న నా వద్దకు వచ్చారు జగదీష్, అత్తయ్య.

"నీ డ్రెస్సులు, నీ వేషం మెరిసి పోతున్నాయని, చాలా అందంగా డాన్స్ చేస్తున్నావని అంటున్నారు ఆడియన్స్," అంది తగ్గు స్వరంలో అత్తయ్య.

"నీ కొత్త ఐటమ్ – జావళి - ఎమేజింగ్. నీ ఫేషియల్ ఎక్స్ ప్రెషన్స్ మాజికల్ గా ఉన్నాయి," అన్నాడు జగదీష్.

అంతలా డాన్సుల్లో అన్నీ నోటీస్ చేస్తున్నాడు జగదీష్ అని ఆశ్చర్యంతో పాటు సంతోషంగా ఉంది…నృత్యం పట్ల నిజమైన ఆసక్తి అన్న మాట అనిపించింది.

"ష్, సాఫ్ట్ గా మాట్లాడండర్రా. కాసేపు ఇక్కడే కూర్చుని పాట విని వెళదాం. ఇప్పుడు అందరి మధ్యనుంచి వెళ్లడం బాగోదు," అని మణత్తయ్య అనడంతో, వెళ్ళకుండా నా పక్కనే కుర్చీల్లో కూర్చుండిపోయారు..

**

నాకు ఎంతో ఇష్టమైన, సరస్వతీ అష్టకం పాడుతుంది రాణి.

..భవాం భోజ నేత్రాబ్జ – సంపూజ్యమానాం లసన్మందహాస ప్రాభా – వక్త్ర చిహ్నామ్ | చలచ్చంచలా చారు – తాటంక కర్ణాం భజే శారదాంబా - మజస్రం మదంబామ్ ||......

'పూర్తిగా అర్థాలు తెలియకపోయినా, క్లాసులో విని విని చక్కగా పాటలు మాత్రం వచ్చేస్తాయి మాకు' అనిపించి నవ్వొచ్చింది. పాటయ్యాక 'వేదిక' నుండి దిగుతూ, జగదీష్ వాళ్ళని చూసి ఆశ్చర్య పోయింది రాణి. "అదేమిటి? ఇక్కడ ఉన్నారు. నేను పాడుతుంటే మీరు ఆడియన్స్ లో కదా ఉండాలి!" అంది కాస్త కోపంగానే.

నాన్న నా తరువాతి డాన్స్ ఐటం అనౌన్స్ చేయడంతో, నేను అక్కడి నుండి కదిలాను......

నాకు ఎంతో ఇష్టమైన దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారి - 'కొలువైతివా రంగసాయి'. తేజశ్విని మేడమ్ కొరియాగ్రాఫ్ చేసిన ఐటం. అందులోని నడకలు, అడుగులు, స్వరాలు, జతులు అందంగా, కాస్త భిన్నంగా, ఎదురు తాళాన కూర్చారామె. రెట్టింపు ఉత్సాహంతో మృదంగంతో అడుగు కలిపాను....నా డ్రెస్సులకి అమ్మ కుట్టించిన ముత్యాలు, మువ్వలు అందంగా నాతో పాటుగా కదులుతూ, సవ్వడులు చేస్తూ, ఏదో కొత్తదనం తోచింది. 'నేను-నా నాట్యం' తప్ప, మరింకేమీ లేనట్టు, నీలాకాశంలో ఆనందంగా ఆడుతున్న భావన కలిగింది........

ఔరా.. ఔరౌరా ! ఔరా... ఔరౌరా!! రంగారు జిలుగు బంగారు వలువ సింగారముగ ధరించి వురమందు తులసి సరులందు కలసి మణి అందముగ వహించి సిస్నైన నొసట కస్తూరి బొట్టు ముస్తాబుగ ధరించి ఎలదమ్మి కనుల ఎలదేటి కొనల తులలేని నెనరులుంచి

జిలిబిలి పడగల శేషాయి తెలిమల్లె శయ్య శయనించి ముజ్జగములు మోహంబున తిలకింపగ పులకింపగ శ్రీ రంగ మందిర నవసుందరా పరా ! // శ్రీ రంగ //

ఆఖరి జతి అయ్యి, డాన్స్ ముగిసేప్పటికి, హాల్లో ఆడియన్స్ లేచి నిలబడి కరతాళ ధ్వనులు చేసారు. పాట చివరిలో

ఐదు నిముషాల సేపు సాగే జతికి కూర్చిన అడుగులు, నడక ఆ డాన్స్ కి 'హైలైట్' అని అమ్మ అంటూనే ఉంటుంది. … దానికే ఆ ప్రేక్షకుల స్పందన ….

ఆ పాటకి నర్తిస్తూ నేనెంత ఆనందించానో, ఆ నాట్యం చూస్తున్న వారికీ, అంతే ఆనందం కలిగిందని అనిపించి, నాకు మరింత సంతోషమనిపించింది..

ఆడియన్స్ అప్లాజ్ ఆగేంతవరకు 'వేదిక' మీదే ఉండాలని అమ్మనడం గుర్తొచ్చి, నమస్కరించి అక్కడే నిలబడిపోయాను. తరువాతి అనౌన్స్ మెంట్ కి నాన్న వేదిక మీదకి రావడంతో, నేను పక్కకి వెళ్ళ గలిగాను. అమ్మ, రాణి పాడిన 'అయిగిరినందిని శ్లోకం' తో ప్రోగ్రాం ముగిసింది.

"తదుపరి ప్రోగ్రాం - వర్ధంతి పూజ, భోజనాలు," అంటూ అనౌన్స్ చేయడంతో గెస్ట్స్ మెల్లగా ఆడిటోరియం నుండి కదిలారు.



నేను మేకప్ తీస్తుంటే, కబుర్లు చెపుతూ జగదీష్  మాతో పాటే ఉన్నాడు.

“వన్ ఇయర్ లో, నీ పర్ఫార్మెన్స్ చాలా ఇంప్రూవ్  అయ్యింది చంద్రా,” అంటూ అమ్మతో పాటు నా మేకప్ సామాను సర్దడం మొదలు పెట్టాడు.

ఇంతలో రాణి గ్రీన్-రూంలోకి వచ్చింది.  జగదీష్ చేతి నుండి మేకప్ బ్రష్ తీసేసి,

“నాతో పద జగదీష్,  అక్కడ వర్ధంతి పూజ జరుగుతుంది,” అంది.

“నేను మా వాళ్ళతో వస్తానులే రాణి,” అన్నాడు జగదీష్.

“అయితే, నేనూ ఆగుతాను.  కలిసే వెళదాము,” అంటూ జగదీష్ పక్కనే స్టూల్ మీద కూర్చుంది.

“అయ్యో, తాత వర్ధంతికి నువ్వు లేకపోతే ఎలామ్మా రాణీ, జగదీష్ కూడా వస్తాడు. ఇద్దరూ వెళ్ళండి,” అమ్మ అంటుండగానే,

”రాణీ, అమ్మా రాణీ,”  నీరుఆంటీ గొంతు రూం బయట వినబడింది.

“జగదీష్, వెళ్ళు  నువ్వు. చంద్రబట్టలు మార్చుకున్నాక, అంతా సర్దుకుని మేము వస్తాము. నువెళ్ళు,”  అంది అమ్మ జగదీష్ తో.

**

మేము వెళ్ళేప్పటికి వర్ధంతి పూజ ముగిసింది...

మరో పక్కనున్న టేబిల్ మీద వినోద్ బర్తడే కేక్ కట్ చేయించాము. వాడు చాలా హ్యాపీ.

అతిథులు చాలామంది నాకు, అమ్మకి అభినందనలు చెప్పి వెళుతున్నారు....

భోజనాల హడావిడి మొదలయ్యాక కూడా, మమ్మల్ని కలవడానికి వచ్చే వాళ్ళతో మాట్లాడుతున్నాము.

మాతో ఉన్న అత్తయ్యవాళ్ళని  డిన్నర్ కి వెళ్ళమంది అమ్మ....

‘తేజ’ టి.వి. ప్రొడ్యుసర్ గోవిందన్ గారు కలిసారు. నేను కొత్తగా చేసిన  డాన్సులు,  త్వరలో వాళ్ళ చానల్ కి రికార్డింగ్ చెయ్యాలని అమ్మతో మాట్లాడారు.

ఆయన వెంటున్న మరొకర్ని ‘అమెరికా ఆంధ్రమహా సభ’ ప్రెసిడెంట్ – రావు గారని ఇంట్రడ్యూస్  చేసారు.

“చూడండి శారద గారు, అమెరికాలో నివసించే ‘నృత్య శిఖర’ డైరెక్టర్ - తేజశ్విని మేడమ్,  డాన్స్ సబ్జెక్ట్ తో టెలి-ఫిలిం తీస్తున్నారు.  ఆవిడ మా వదినగారు. ఆ ఫిలింకి చంద్రకళ లాంటి  ఆర్టిస్ట్ ల కోసం వెతుకుతున్నాము. మీ అమ్మాయికి ఆ ఫిలింలో యాక్ట్ చేసే అవకాశం వుండవచ్చు. మీ సమాచారం, పాప వివరాలు తీసుకుంటాను, వచ్చి మాట్లాడుతాను,” అన్నారాయన అమ్మతో.

**

అమ్మ, నేనూ బఫే టేబిల్ వైపు నడిచాము. జగదీష్ కోసం చూసాను.

కాస్తదూరంలో ఓ టేబిల్ వద్ద, రాణితో కూర్చుని, భోంచేస్తున్నాడు.  వాళ్ళకి దగ్గరలో మామయ్యా, మణత్తయ్య, నీరూ ఆంటీ  కూడా. డిన్నర్ సర్వ్ చేసుకుని, వెళ్లి అక్కడే కూర్చున్నాము.

ముఖ్య అతిధులని సాగనంపి భూషణ్ అంకుల్, నాన్న కూడా మా వద్దకు వచ్చారు.

“వండర్ ఫుల్ పెర్ఫామెన్స్’ బై దీజ్ బ్యూటిఫుల్ లేడీస్ - చంద్రకళ ఎండ్ రాణీ ‘...అని వచ్చిన అతిధులంతా అంటున్నారు,” అంటూ అప్లాడ్ చేస్తున్న భూషణ్ అంకుల్ తో, చుట్టూ ఉన్న ఫ్రెండ్స్ కూడా చేతులు కలిపారు.

“బ్రహ్మాండంగా జరిగింది మీ పర్ఫార్మెన్స్. మూడు టి.వి చానల్స్ వారి ప్రోగ్రాములు, ఫెమినా, ఈవ్స్ వీక్లీవారి ఇంటర్వ్యూలు సెటప్ అయ్యాయి. కంగ్రాచ్యులేషన్స్ టు బోత్ ఆఫ్ యు,” అన్నారాయన మళ్ళీ.

“హావ్ సమ్మోర్ ఐస్ క్రీం అండ్ కేక్,” అందరికీ మరో రౌండ డెజర్ట్ తెప్పించారు నాన్న.

ఐస్ క్రీం ఎంజాయ్ చేస్తూ, నాలుగు రోజుల్లో మదురై ప్రయాణం అని గుర్తుచేసుకున్నాము.

**

ప్రోగ్రాం ప్రాక్టీసులతో, అమ్మవాళ్ళ వంటలతో, కబుర్లతో ఇంట్లో సందడిగా పండుగలా ఉంది.

రాణి పొద్దున్నే వచ్చి, తన మ్యూజిక్ ప్రాక్టీస్ అయ్యేంత వరకు ఉండి వెళుతుంది.

మదురై ప్రయాణానికి ముందు రోజు, రాణి వాళ్ళ హోం-థియేటర్ లో మూవీ చూడ్డానికి వెళ్ళాము.

**

మదురైకి ట్రైన్ జర్నీ ఉత్సాహంగా, సరదాగా ఉంది.

ఆర్కెస్ట్రా వాళ్ళు కూడా మాతో పాటే ట్రావెల్ చేస్తున్నారు.. మీనాక్షి, కన్నన్ సహా.

..వాళ్ళంతా, మాకు పక్కన కంపార్ట్ మెంట్ లోనే...

ఆరింటికి డిన్నర్ అయ్యాక, బోర్డ్-గేమ్స్ ఆడుతూ, పెద్దవాళ్ళ కబుర్లు వింటున్నాము.

**

“ఓ సారి మీరంతా మా పాలెంకి రావాలి.. అక్కడి నుంచి శ్రీశైలం, త్రిపురాంతకం చూసుకొని నాలుగు రోజుల్లో వచ్చేయచ్చు,” అన్నారు నాన్న-మామయ్య, అంకుల్ వాళ్ళతో..

“మీ పాలెం పేరు వినగానే, నీ చిన్నతనం గురించి నీవు చెప్పింది గుర్తొస్తుందోయ్, సత్యం. పన్నెండేళ్ళ వరకు స్కూల్ కి వెళ్ళకుండా గోలీలతోనే కాదు, పాములతో కూడా ఆడుతూ తిరిగేవాడివని, చెరువుల్లో బావుల్లో ఈత కొట్టేవాడివని,”

అన్నారు భూషణ్ అంకుల్ నవ్వుతూ.

“మీ పిల్లలకి తెలుసా?  నీ  డేరింగ్  చైల్డ్-హుడ్ గురించి, సత్యం?”  మళ్ళీ నవ్వుతూ అడిగారు.

‘నిజమా? నాన్న స్కూల్ కి వెళ్ళలేదా చిన్నప్పుడు’  అనుకుని నాన్న వంక చూసాను.

“అదిగో మా చిన్నామె.  నాన్న చదువుకోలేదా అని  నా వంక అనుమానంగా చూస్తుంది.  ఇప్పుడెందుకులే భూషణ్. మరో సారి చెబుతానులే,” నవ్వేసారు నాన్న.

“చదువు ఎందుకు లేదు? లేటుగా మొదలు పెట్టినా స్కాలర్ షిప్ లతో బేషుగ్గా చదివి మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాడుగా.. ఇక  కాలేజీలో,  మీ నాన్న పెద్ద హీరో,  స్టూడెంట్ లీడర్ కూడానమ్మా చంద్రా.  ఇక్కడే మీ నాన్నకి, నేను, భూషణ్  ఫ్రెండ్స్  అయింది మరి,”  అన్నారు  రాం మామయ్య  నా వంక చూసి నవ్వుతూ.

“సత్యా,  నీ  ఫేమస్ – సాలీడ- పద్యం పాడవోయ్.  చాలా ఏళ్ళయింది నీ పాట విని,” ఆయనే మళ్ళీ నాన్నతో.

అత్తయ్య, నీరు ఆంటీ కూడా మరీ మరీ అడగడంతో, కాసిన్ని నీళ్ళు తాగి నాన్న గొంతు  క్లియర్ చేసుకున్నారు.

తాను పాడబోయే పద్యం, ఫేమస్ కవి జాషువా రచన అని చెప్పి, గొంతు  సవరించి  పద్యం అందుకున్నారు  నాన్న.

…సాలీడా ……నీలో నూలు తయారు చేయు మర గానీ, ప్రత్తి రాట్నంబు గానీ

లేదీశ్వర శక్తి నీ కడుపు లోనే లీనమై యుండునో

యే లీలన్ రచియింతు వీ జిలుగు నూలి పట్టు పుట్టంబుల

సాలీడా; నిను మోసగాడవని విశ్వంబేల ఘోషించెడిన్?…….

ఎంత బాగా పాడారో?  నాతో సహా అందరం చప్పట్లు కొట్టాము. ‘ఆ పాటకి, మాటలకి అర్థం  అడగాలి నాన్నని’ అనుకున్నాను.

“మంచి సింగర్, యాక్టర్ కూడా మీ నాన్న,” అన్నారు భూషణ్ అంకుల్.

“వాళ్ళమ్మ, అంటే మీ నానమ్మ, అతన్ని సినిమాల్లోకి వెళ్ళ వద్దని గొడవ చేయబట్టి మిలిటరీలో చేరాడు గాని... లేకపోతే హీరోగా బుక్ అయ్యాడు కూడా. అప్పట్లో నిలవేణి, కళ్యాణి వంటి టాప్ హీరోయిన్లతో యాక్ట్ చేయ వలసిన వాడు. సహకార దర్శకుడుగా కూడా పని చేసాడు సత్యం,” మళ్ళీ అంకుల్.

“నిజమా? ఎందుకు వద్దంది వాళ్ళమ్మ,” అడిగింది మణత్తయ్య.

“ఒక్కడే కొడుకు, కుటుంబాన్ని పోషించకుండా చేయి దాటి పోతాడని ఆమె అనుకుందట,” అంకుల్ చెప్పేది మేమందరం ఓ కథలా వింటున్నాము...


“అదుగో, సరిగ్గా ఆ టైం లోనే నేను కాపాడాను మీ నాన్నని. ఏం చేయాలో డిసైడ్ చేసుకోలేక బాధ పడుతుంటే, ఆర్మీలో చేరమని సలహా ఇచ్చాను. మొత్తానికి, డైరెక్ట్ కాప్టెన్ గా ఆర్మీలో సెలెక్ట్ అయ్యి, మా చెల్లెల్ని పెళ్ళి చేసుకున్నాడు. ఆ తరువాత, ఇటువంటి కూతురుని కన్నాడు... ఈ చంద్రకళ లోని నాట్యకళ వాళ్లకి ప్రస్తుతం ఉత్సాహాన్ని, సంతోషాన్ని ఇస్తుంది,” అన్నారు మామయ్య నా భుజం మీద తడుతూ.

నాన్న గురించి వింటుంటే బాగుంది. ‘నాకు తెలుసును. నాన్న అందరిలా కాదని, చాలా గ్రేట్ మాన్ అని’ అనుకున్నాను.

“ఓకే, బాగుంది రాం. ఈ స్టోరీ సెషన్ చాలా ఇంటరెస్టింగ్. కాకపోతే టైం తొమ్మిది... రేపు తెల్లర్లు జామునే మదురై చేరుతాము. కాబట్టి ఎక్కడి వాళ్ళు అక్కడే హాయిగా నిద్రపొండి. నేను వెళ్ళి పక్కన కంపార్ట్ మెంట్ లో మన వాళ్ళందరినీ ఓ రౌండ్ చూసి వస్తా” అంటూ పైకి లేచారు నాన్న.

**

నాన్న యాక్టింగ్ గురించి, అమ్మ సంగీతం గురించి ఆలోచిస్తూ పడుకున్నాను. ‘అవును నాన్న సినిమా హీరోలా, అమ్మ హీరోయిన్ లా అనిపిస్తారు నాకు’ అనుకుంటూ నిద్రపోయాను.



“పది నిముషాల్లో మదురై వచ్చేస్తుంది. ఇక లేవండి,” అంటూ నాన్న, అంకుల్ అందరినీ నిద్రలేపారు. ఇంకా పూర్తిగా తెల్లారలేదు.

ట్రైన్ దిగి అరగంటలో మేముండబోయే పామ్-గ్రోవ్ రిసార్ట్స్ చేరాము.

అందరి స్నానాలు, బ్రేక్ ఫాస్ట్ అయ్యాక, గుడికి వెళ్ళి అమ్మవారిని దర్శించుకొని తిరిగి రిసార్ట్స్ కి వచ్చాము.

రిసార్ట్స్ లోని వెజిటేరియన్ బఫే హాల్లో లంచ్ చేద్దామన్నారు అంకుల్.

"నేను, చంద్రఏదన్నా లైట్ గానే తింటాము… మేకప్ స్టార్ట్ చేసుకోవాలి," అంది అమ్మ….

"ఔను కదా! అయితే మీరు కాటేజికి వెళ్ళిపొండి. మీకు రూమ్ సర్వీస్ ఆర్డర్ చేస్తాను… ప్రోగ్రాం ముందు మీరు ఏం తింటారో నాకు తెలుసులే," అన్నారు నాన్న.

"డాడీ, మేము పక్కనే ఉన్న 'పీట్జా' – ఇటాలియన్ ప్లేస్ కి వెళతాము…" అంకుల్ తో అంటూ పక్కనే ఉన్న జగదీష్ చేయందుకొంది రాణి.

"ష్యూర్… అలాగే తల్లీ… జస్ట్ ఐస్ డ్రింక్స్ తాగవద్దు. నువ్వు పాడాలి కదా!" అన్నారు అంకుల్…

"పాటకి ముందు నీకు రెస్ట్ కూడా అవసరం. లంచ్ చేసి వచ్చేయండమ్మా రాణి, ప్రోగ్రాం కి ఎక్కువ టైం కూడా లేదుగా మరి…," గుర్తుచేసింది నీరు ఆంటీ…

రాణి చేతి నుండి తన చేయి విడిపించుకుంటూ, "హోల్డ్ ఆన్ రాణీ. నీకు, నాకే కాదు వినోద్ బాబుకి కూడా ఇటాలియన్ ఫుడ్ చాలా ఇష్టం," అంటూ వినోద్ వైపు తిరిగి, "కమాన్ వినోద్, మనం పీట్జా తిందాం," అంటూ వాడి చేయందుకున్నాడు జగదీష్.

**

కాటేజిలోనే నా మేకప్ కానిచ్చి, ఆడిటోరియంకి వెళ్ళాము. అప్పటికే, 'కళామంజరి' వారి గ్రీన్ రూమ్స్ లో, ఫెస్టివల్ పార్టిసిపెంట్స్ – మరికొందరు వచ్చున్నారు. వాళ్ళల్లో ముగ్గురు డాన్సర్స్, నలుగురు సింగర్స్. అందరూ పద్దేనిమిదేళ్ళ లోపు వాళ్ళేనట.

ఫెస్టివల్ వారు నాకిచ్చిన పర్ఫామెన్స్ టైం ఇరవైఐదు నిముషాలు. నాలుగు ఐటమ్స్ చెయ్యాలి.

రాణి కూడా అలాగే, తన పాటలన్నీ వరసగా పాడాలి.

‘వేదిక’ మాత్రం మునుపెన్నడూ చూడనంత పెద్దదిగా ఉంది. ఓ పక్కన వాయిద్యాల వారికి పెద్ద ప్లాట్ ఫాం, చుట్టూ టి.వి కెమెరాలు. ‘వేదిక’ ని ‘మహా శివుని కైలాసం’ సీన్ లా ఏర్పాటు చేసారని కామెంట్ చేసింది అత్తయ్య. ఆడియన్స్ కూడా మామూలు కంటే ఎక్కువగా, వేల సంఖ్యలో ఉన్నారు…

వచ్చిన న్యాయనిర్ణేతలు నాట్య సంగీత రంగాల్లో పేరున్న వారట. ఉత్తమ నర్తకిని ఎంపిక చేసి, అవార్డ్ ఇస్తారట. అవార్డు వచ్చిన వారికి ఆ రంగంలో జాతీయంగా గుర్తింపు ఉంటుందట.

ఫెస్టివల్ కో-ఆర్డినేటర్ ఒకామె మా నుండి, నా ఐటమ్స్ వివరాలు తీసుకున్నారు..

**

ఉత్సాహంగా వేదిక మీద అడుగుపెట్టాను…. మునుపెన్నడూ తెలియని ఓ కొత్త ఆనందం లోచింది… నన్ను అనుసరిస్తున్న స్పాట్-లైట్స్ రంగులు మారుతుంటే, ఓ హరివిల్లు మీద నర్తిస్తున్న భావం కలిగింది…

‘‘రామ పట్టాభిషేకం’, ‘నీలమేఘ శరీర-తరంగ నృత్యం’ చేస్తుండగా, ప్రేక్షకుల చప్పట్లనుండి రెట్టింపు ఉత్సాహాన్ని పొందాను. అలుపనిపించలేదు.

‘జావళి’ చేస్తున్నప్పుడు మాత్రం, ఒక్క క్షణం జగదీష్ చేసిన కామెంట్ గుర్తుచేసుకున్నాను …

‘ఈ ‘జావళి’ డాన్సులో, ని ఫేషియల్ ఎక్స్ ప్రెషన్స్ మాజికల్ ‘ అన్నాడు వర్ధంతి ప్రోగ్రామప్పుడు….

‘జావళి’ కోసమే, సున్నితమైన ఎక్స్ ప్రెషన్స్ అద్దం ముందు ప్రాక్టీస్ చేయించింది అమ్మ.

ఆఖరి ఐటంతో పాటు మంగళం చేసి, ఆగని కరతాళధ్వనుల నడుమ 'వేదిక' మధ్యకి వెళ్ళి సభకి నమస్కరించాను..........

**

వేదిక మెట్లు దిగుతుండగా, బయట హాల్లోనుండి, జగదీష్ నావైపు రావడం కనిపించింది. ...ఆ వెనుకే రాణి, అమ్మ కూడా. వాళ్ళని చూస్తూ వేదిక మెట్లు దిగుతుండగా, కాలికి ఏదో తగిలి పడబోయాను. "వాచ్ ఔట్, బి కేర్ ఫుల్ ," అంటూ చేయందించాడు జగదీష్. పక్కనే చాచి ఉన్న అమ్మ చేయి అందుకొని దిగాను. కాలు నొప్పిగా అనిపించింది. గ్రీన్ రూం వైపు నడిచాము.

**

రాణి పర్ఫామెన్స్ కి ఇంకా పదిహేను నిముషాల సమయం ఉందట.

అంకుల్, నాన్న మా వద్దకు వచ్చారు.

"బాగా చేసావు చంద్రకళా, అవార్డు నీకే వస్తుంది చూడు," అన్నారు అంకుల్.

"గజ్జెలు మాత్రం తీసేసి, వెళ్ళి రెండో వరసలో మణత్తయ్య పక్కన కూర్చోండి. మన రాణి పాడబోతుంది... ఇంకా, గంట ప్రోగ్రాం వుంది. అంతా అయ్యి, అవార్డ్స్ అనౌన్స్ చేసిన తరువాతే మనం వెళ్ళేది," అని చెప్పి వెళ్ళారు నాన్న.

**

అమ్మ సాయంతో మెల్లగా వెళ్ళి ఆడియన్స్ లో కూర్చున్నాను. జగదీష్ నాకు తాగడానికి మిల్క్-షేక్ తెచ్చిచ్చి పక్కనే కూర్చున్నాడు.

పాదం నొప్పెడుతుంది. రాణి పాట తరువాత, లాస్ట్ పర్ఫామెన్స్ వింటూ మిల్క్-షేక్ ఫినిష్ చేసాను.

ఫెస్టివల్ వారు అవార్డ్స్ అనౌన్స్ చేసేలోగా, మ్యూజిక్ ప్రోగ్రాం ఎంజాయ్ చేయమని అనౌన్స్ చేసారు కోఆర్డినేటర్.

సీటులో వెనక్కి వాలి, అమ్మ భుజం పైన తల ఆన్చి కళ్ళు మూసుకున్నాను.

**

గొల్లుమని గొడవ, చప్పట్లు, "చంద్రా, లే," అంటూ నా భుజాలు పట్టి కుదిపేస్తున్న జగదీష్. ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. అంటే నేను కాస్త చిన్న కునుకు తీసానేమో! ..... చుట్టూ చూస్తే అంతా హడావిడిగా కనిపించారు...

"నేను చెప్పింది కరెక్ట్, చంద్రకళా రామ్మా, నువ్వు 'వేదిక' పైకి వెళ్ళాలి," అంటున్న భూషణ్ అంకుల్.

"పర్వాలేదు, మెల్లగా నడువు. ఆగుతారులే," అంటూ నా భుజాల చుట్టూ చేతులు వేసిన అమ్మ. మరి కాస్త దూరంలో చేయందిస్తూ నిలబడున్న నాన్న. నాన్న వంక చూసాను. ముఖం వెలిగిపోతుంది. నాన్న కళ్ళల్లో ఆనందం, నా మీద ప్రేమ కనిపించాయి. మెల్లగా లేచి నాన్న చేయందుకున్నాను. కుంటుతూ, వెంట నడిచాను. ఎప్పటిలా నా భుజాల చుట్టూ చేయి వేసి, అమ్మ వెనుక రాగా, నాన్న చేయూతతో 'వేదిక' పైకి నడిచాను..

చప్పట్లతో మోగిపోయింది ఆడిటోరియం. ఇంతలో మైకులో ప్రకటన..

.నాట్యమయూరి చిరంజీవి చంద్రకళని ఈ యేడు 'కళామంజరి' ఉత్సవంలో, సాంప్రదాయ నృత్య విభాగంలో విజేతగా ఎన్నుకున్నాము. ఆ చిన్నారికి యాభైవేల నగదు బహుమతి అందిస్తారు ఉత్సవ కార్యదర్శి..."

అమ్మనాన్నల్ని కూడా వేదికపైకి ఆహ్వానించాక, నా మెడలో పూల దండ వేసి, ట్రోఫీతో పాటు, నాకు నగదు బహుమతి అందించారు.ముఖ్య అతిథి - నృత్య కళాకారిణి, పద్మశ్రీ. డా. కాదంబరి మైక్ ముందుకు వచ్చారు.

"....ఇంతటి పిన్న వయస్సులో, అంత చక్కగా హావభావాలు చూపించడం అరుదైన విషయం. ఆమె పాదాలు లయబద్ధంగా అడుగులు వేసిన తీరుకి, పాదరసంలా సాగిన ఆమె కదలికలకి, చక్కని మోమున మెరిసిన ఆ కనుదోయికి, ఆ చిరునగవుకి ఇక్కడున్న నాట్యాభిమానులతో పాటు, న్యాయ నిర్ణేతలు కూడా ముగ్ధులయ్యారు.

చంద్రకళకి బంగారు భవిష్యత్తు ఉంది. ఆ నాట్యమయూరిని, ఆమె తల్లితండ్రులైన శారద, మేజర్. సత్యదేవ్ గార్లని అభినందిస్తున్నాను," అంటూ ముగించాక, నా భుజాల చుట్టూ షాల్ కప్పి పూల గుచ్ఛాన్ని అందించారు......

**

కరతాళధ్వనుల నడుమ, నాన్న సాయంతోనే 'వేదిక' పై నుండి దిగాను. నాకు తెలియకుండా నా కళ్ళలో నీరు నిండింది. తెలియని సంతోషంతో నా ఊపిరి నాకు చల్లగా హాయిగా అనిపించింది.

ఈ అనుభూతి నాకు ఎంతో శక్తినిస్తుంది....

అడుగడుగునా మమ్మల్ని జనం ఆపి మెచ్చుకుంటుంటే, నాన్న ముఖం చూశాను. ఎంతో గర్వంగా నన్ను దగ్గరగా పట్టుకుని నవ్వుతూ నడుస్తున్నారు. అమ్మని చూశాను. ముఖం మీద చిరునవ్వుతో మా వెంట నడుస్తుంది.

నాలో డాన్స్ అంటే ఉన్న ఇష్టానికి ఇంత గుర్తింపు, డాన్స్ చూస్తున్న అందరికీ, నేనంటే కలుగుతున్న అభిమానం నాకు బాగుంది. ఆ 'వేదిక' అంటే నాకిప్పుడు - నాన్న, అమ్మలంటే ఉన్నంత ఇష్టం. అందుకే అమ్మ చెప్పినట్టు, ప్రతిసారి 'వేదిక' నెక్కే ముందు దానికి నమస్కరిస్తున్నాను.

**

రిసార్ట్  చేరగానే, నాకు కాటేజి బయట దిష్టి తిప్పేసింది అమ్మ.  కాలు నొప్పితో నడవడానికి కష్టంగా ఉంది. రూంలోకి వెళ్ళాక చూసుకుంటే,  కాలు బాగా వాచిపోయింది.

మేకప్ తీసేసి,  వేడినీళ్ళతో కాపడం పెట్టిన కాసేపటికి కొంచెం నయమయింది.

నాన్న హోటల్ మానేజ్మెంట్ కి ఫోన్ చేసి, డాక్టర్ కోసం అడిగి, అపాయింట్మెంట్ తీసుకున్నారు.   డిన్నర్ విషయమై అంకుల్ కి ఫోన్ చేసారు.

**

నా కాలు పరీక్షించి గట్టిగా బేండేజి వేసారు డాక్టర్.  స్ప్రైన్  అని చెప్పి,  రెండు వారాలు  రెస్ట్ ఇవ్వమన్నారు.  నొప్పికి పిల్స్ ఇచ్చి వెళ్ళారు....

ఇంతలో అంకుల్ అందర్నీ తీసుకొని మా కాటేజికే వచ్చారు.

వినోద్ బాబు పరుగున వచ్చి నన్ను ముద్దు పెట్టుకొని, “నీ డాన్స్ బాగుంది.  అయితే ఆ మనీ, ఆ ట్రోఫీ మాత్రం నాకిచ్చేయి అక్కా,” అన్నాడు.

“చెప్పలేనంత, సంతోషంగా ఉంది, అలాగే అమ్మనడిగి తీసుకో,” అన్నాను.

జగదీష్, అత్తయ్య, మామయ్యా, అంకుల్, ఆంటీ తో పాటు కన్నన్, మీనాక్షి కూడా నన్ను మెప్పుల్లోముంచేసారు.

దూరంగా మౌనంగా ఉండిపోయిన రాణి వద్దకు వెళ్ళారు రాంమామయ్య.

…" ఏమ్మా, అలిసిపోయావా?  ఇలా రా," అంటూ  రాణిని  పిలిచుకొచ్చి నా పక్కనే  సోఫాలో కూర్చోబెట్టారు.

"నీవు శ్రావ్యంగా పాడావు.  ఆణిముత్యాల్లాంటి పాటలు, స్వరాలు సునాయాసంగా ఆలపించావు…. నీవేం తక్కు వ కాదు. "గోల్డెన్ వాయిస్" నీది," అన్న రాంమామయ్య తో పాటు అందరం చప్పట్లు కొట్టాము….

దాంతో, రాణి హ్యాపీగా కనిపించింది. నవ్వులు చిందించింది.  నేను కూడా అభినందనలు తెలిపాను..

ఇంతలో అంకుల్ ఆర్డర్ చేసిన డిన్నర్ రావడంతో అందరం మా కాటేజిలోనే భోంచేసాము.  చాలా సేపు కబుర్లు చెప్పుకున్నాము.

**



మరునాడు, త్వరగా బ్రేక్ ఫాస్ట్ ముగించుకొని తిరిగి చెన్నై ప్రయాణమయ్యాము.

ట్రైన్ వేగం పుంజుకున్నాక, అందరూ కబుర్లకి దిగారు. మదురై ప్రోగ్రాం గురించి పెద్దవాళ్ళు చెప్పుకుంటున్న విషయాలు వింటూ కూర్చున్నాను.

"మునపటి కన్నా చంద్ర బాగా డాన్స్ చేసింది. రాణి బాగా పాడింది కూడా.

వాళ్ళకి టాలెంట్ ఉండడంతో పాటు, మీలాంటి పేరెంట్స్ ఉండడం ఆ పిల్లల అదృష్టమే.

ముఖ్యంగా మా చంద్రకి శారద, సత్యదేవ్ గారు ఇచ్చే ప్రోత్సాహం అంతా ఇంతా కాదు," అంది మణత్తయ్య.

"నిజమే, కళలంటే ఎంతో ఆసక్తి ఉన్నవారే చంద్రకళ తల్లితండ్రులు. అయితే, ఆసక్తి ఉండీ, అప్పట్లో సినీరంగం వదులుకున్నారంటే, పాపం సత్యగారు చాలా బాధపడుంటారు," అంది నీరూఆంటీ నాన్న గురించి..

నాన్న వంక చూస్తే నవ్వుతూనే మౌనంగా వింటున్నారు.

"మొన్ననే అడుగుదామనుకున్నాను. మీ అమ్మగారు, సినిమాల్లో యాక్ట్ చేయవద్దన్నారు సరే. మరి మీరు ఏమీ అనకుండా ఇలా మిలిటరీకి వెళ్లిపోయారా? ఎలా సత్యగారు?" అంది నీరూఆంటీ నా పక్కన కూర్చున్న నాన్నతో

"ఏముందమ్మా? అప్పట్లోనాకు నా చెల్లెలు పెళ్ళి, తల్లితండ్రుల బాధ్యత ఉండేవి. త్వరగా ఉద్యోగస్తుడనై, తమని ఆదుకుంటానని ఎదురుచూస్తున్న కుటుంబం మాది. నేను యాక్ట్ చేయవలసిన సినిమాలేమో, సెట్స్ మీదకి వెళ్ళడానికి యేడాది పడుతుందని తెలిసింది. అదంతా తట్టుకుని నిలబడగల ఆర్థిక స్తోమత లేక, మా అమ్మ మాట సరయినదనిపించి,

మిలిటరీలో చేరాలని నిర్ణయించుకున్నాను. నాకు స్థిరత్వాన్ని ఇచ్చింది ఆ నిర్ణయమే మరి...మీ ఆయనలా లక్ష్మీ పుత్రుడని కానయ్యే," నవ్వుతూ ముగించారు నాన్న.

ఇదంతా వింటున్న అంకుల్ అందుకున్నారు...

"ఏమైనా, తను చెన్నై నుండి వెళ్ళే ముందు మాత్రం, నన్ను తీసుకెళ్ళి ఆ సినిమాల డైరెక్టర్స్ కి పరిచయం చేసాడు సత్యం. మంచి యాక్టరునని సిఫారసు చేసి, మేకప్ టెస్ట్ కూడా చేయించి, తనకున్న అవకాశాల్ని నా చేతికందించాడు నా ఈ మిత్రుడు," క్షణమాగారాయన. "సత్యం చొరవ చేసుండకపోతే, ఎటూ కాకుండా అయ్యేవాడిని. ఎందుకంటే, అప్పట్లో నాకటు పైచదువుల మీద ఆసక్తి గాని, ఇటు వ్యవసాయంపై మక్కువ గాని

ఉండేవికావు. సత్యం చేసిన మేలు ఎప్పటికీ మరువలేను," ఆసక్తిగా వింటున్న మా అందరి వంక చూసారు, భూషణ్ అంకుల్........

"సినిమారంగం కాకపోతేనేమి? మా సత్యం - మేజర్. సత్యదేవ్ గా సెటిల్ అయ్యాడు. తనూ మంచి పొజిషన్ లో ఉన్నాడు. మీకు తెలుసో లేదో?. ఆంధ్రరాష్ట్రంలో మేజర్ ఒక్కడే ఇటూ మిలిటరీలోనూ, అటు రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూశాఖలో ఆఫీసరుగానూ చక్రం తిప్పుతున్నాడుగా," అన్నారు మళ్ళీ ఆయన......

"అదెలా సాధ్యం?" అడిగింది నీరూఆంటీ.

"ఆయన్నే అడుగు," అన్నారు అంకుల్...

అందరం నాన్న వంక చూసాము.

"ఇండియన్ ఆర్మీ నన్ను సెలెక్ట్ చేసి రిజర్వ్డ్ సర్వీస్ లో ఉంచింది. వాళ్ళ అవసరాన్ని బట్టి ఇండియాలో ఎక్కడైనా పోస్టింగ్ ఇస్తారు. మిగతా సమయంలో ఆంధ్రరాష్ట్రంలో డైరెక్ట్ రిక్రూట్ - గెజటెడ్ ఆఫీసరుగా సర్వీస్ చేస్తాను. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వంకి, ఆర్మీకి మధ్యన, నా విషయంలో ఉన్న అవగహన అది. ఏమైనా, పెద్దగా లక్ష్మీకటాక్షం లేకపోయినా, పొజిషన్ బాగుంటుంది," అంటూ నవ్వారు నాన్న.

'మా నాన్న అలా ఉద్యోగంలో కూడా స్పెషల్ అన్నమాట,' గర్వంగా అనిపించింది. రెండు ఉన్నత స్థాయి ఉద్యోగాలు ఎలా సాధ్యమో, అర్థమయ్యేలా చెప్పమని నాన్నని అడగాలి.

ఇంతలో రాంమామయ్య, "సందర్భం వచ్చింది కాబట్టి చెబుతున్నా...మా చెల్లెలు శారద కూడా ఏమీ తక్కువది కాదు. అందమైనది. పద్ధతి, సంప్రదాయాల నడుమ పెరిగి, గ్రాడ్యుయేట్ అయింది. నాట్యం, సంగీతం నేర్చుకొని కర్ణాటక సంగీతంలో పట్టా పుచ్చుకొంది. సంగీతం గురువుగా పేరు ప్రతిష్ఠ సంపాదించింది మరి," అన్నారు.

"అబ్బో ఇంక పోటీ కొచ్చేసారు ఆడపిల్లవారు," అంటూ నవ్వేశారు అందరూ.

“నిజమే కదా ! శారదకి విద్య, తెలివి, ఓర్పు, నేర్పు ఉండబట్టే ఓ తల్లిగా చంద్రకళని ఇలా సపోర్ట్ చేయగలుగుతుంది. ఇంత చిన్నవయస్సులోనే ఆ అమ్మాయి ఇంత సాధించగలగడం కేవలం ఆ తల్లివల్లే. తన బిడ్డని సాన పెట్టిన వజ్రంగా మలచగలదు,” మళ్ళీ రాంమామయ్య.

అమ్మ సంగతి అలా వింటుంటే, నాకు దుఃఖమొచ్చింది. అటువంటి అమ్మ నాకు అమ్మవడం నా అదృష్టమే....‘ఐ యాం బ్లెస్డ్’ అనుకున్నాను...

ఈలోగా, అమ్మ ఒకసారి, వద్దంటున్నా జగదీష్ ఒకసారి, నా పాదానికి డాక్టర్ ఇచ్చిన ‘బెంగే క్రీం’ రాసి కట్టు కట్టారు.

కథలు, కబుర్లతో సాగిన మా జర్నీ...ముగిసి, ఇల్లు చేరేప్పటికి అర్ధరాత్రి దాటింది.

**

మరునాడు నేను నిద్రలేవకముందే, నాన్న డ్యూటీకి వెళ్ళి పోయారు.

ఇంట్లో సందడిగా ఉన్నా, నాన్నని పొద్దున్న చూడకపోవడం నన్ను బాధపెట్టింది. నాకు తెలిసి నాన్నతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చెయ్యకపోవడం ఇదే మొదటిసారి.....

**

రోజూకంటే ఆలస్యంగా, చీకటి పడ్డాక వచ్చారు నాన్న. వెళ్ళిపక్కన కూర్చున్నాను. “నాన్నా, ఇవాళ పొద్దుట డ్యూటికి వెళ్ళేముందు నన్ను నిద్రలేపవచ్చుగా. చెప్పకుండా అలా వెళ్ళావెందుకు?” అడిగాను.

“అలిసిపోయి నిద్రపోతున్నవుగా! అందుకని,” అన్నారు నవ్వుతూ.

సిటింగ్ లో ఉన్న మా అందరికీ అమ్మ స్నాక్స్, కాఫీ అందిస్తుండగా, డోర్ బెల్ మోగింది.

కామాక్షి డోర్ తెరిచింది.

“ఇ యామ్ హియర్,” అంటూ సర్ప్రైజ్ చేసింది రాణి. వెంట వాళ్ళ సర్వెంట్ బాయ్ కూడా ఉన్నాడు.

“నమస్తే ఆంటీ, అంకుల్,” అంటూ అందర్నీ విష్ చేసింది.

మాకు ‘హలో’ చెప్పింది.

“మణిఆంటీ, నేను మీకోసం వంట చేయించాను. జగదీష్ కి ఫిష్, రాంఅంకుల్ కి మటన్.

శారదా ఆంటీకి, మీకు కొబ్బరి పచ్చడి. అమ్మేమో సత్యఅంకుల్ కి చికెన్ రైస్ చేసింది,” అంటూ, అమ్మ వంక తిరిగి, “ఇవన్నీ డైనింగ్ మీద పెట్టించనా?” అడిగింది రాణి.

“అయ్యో, ఏమిటమ్మా ఇంత శ్రమ పడ్డారు?” అంటూ ఆ డిషెస్ ని తీసుకొని టేబిల్ మీదకి సర్దసాగింది అమ్మ.

“నిజానికి, భోజనం టైం కదా భోంచేయండి. స్నాక్స్ పక్కకి ఉంచండి. అన్నీ వేడిగా ఉన్నాయని అమ్మ చెప్పమంది. నేను తినే వచ్చాను కాబట్టి సర్వ్ చేస్తాను…” అంది రాణి.

అందరు భోజనానికి కూర్చోక తప్పలేదు.

**

“అన్నీ చాలా బాగున్నాయమ్మా.  మాకేమేమి ఇష్టమో, కనుక్కుని మరీ చేయించావు.  నేనూ, శారద కూడా అన్నమంతా కొబ్బరి పచ్చడితోనే తినేస్తున్నాము, చూస్తున్నావుగా!” రాణి తో అంటూ భోజనం ముగించింది అత్తయ్య.

“మణిఆంటీ, మరి  రేపటి నుంచి  మీరు మా అతిధులుగా మా ఇంట్లోఉంటారుగా! నేను, అమ్మా మీ కోసం అన్నీ రెడీ చేయించాము,” అంది రాణి మణత్తతో.

అత్తయ్య ఏమీ మాట్లాడలేదు.  ఆమె మామయ్యా వంక చూసింది.  జగదీష్ మా వంక చూసాడు.

“తప్పకుండానమ్మా,  ఇప్పటి వరకు ప్రయాణాలు,  ప్రోగ్రాములే కదా.  ఇదిగో ఇప్పుడే  ఇలా కూర్చున్నాము.  రేపు, ఎల్లుండి తిరుపతి వెళ్లివచ్చిన తరువాత, చెపుతామమ్మా రాణి,” ,

“సరేనా?”  అన్నారు మామయ్య భోజనం ముగించి, నాన్నతో పాటు డైనింగ్ నుండి లేస్తూ...

అందరి భోజనాలయి మళ్ళీ లివింగ్ రూంలో చేరాము.

“నాకు ప్రామిస్ చేసాడు జగదీష్.  మణిఆంటీ  కూడా చెప్పింది మా ఇంట్లోఉంటామని.   మీరు వస్తారని మేమెంతో ప్రిపేర్ అయ్యి ఉన్నాము.  డిజపాయింట్  చేయకండి  అంకుల్,” అంది రాణి.

“తప్పకుండా వస్తాము రాణి,  రేపు చెపుతానుగా,” అంది మణత్తయ్య.

...రాణి ఇంకాసేపు కూర్చుని  వెళ్ళింది.

**

“ఓ గ్లాసుడు మంచి నీళ్ళు తెచ్చిపెట్టమ్మా కళా,” అన్నారు నాన్న. లేచి వెళ్ళి తెచ్చిచ్చాను.

“ఇలా కూర్చో, అమ్మతో పాటు. నీక్కూడా ఈ విషయం చెప్పాలి,” అన్నారు నాన్న.

ఏమి సంగతో అనుకుంటూ, ఎదురుగా మోడా మీద కూర్చున్నాను. పక్కనే ఉన్న అమ్మ కూడా వింటుంది.

“నన్ను ఓ ఆరునెలల పాటు ‘భూటాన్’ కి పంపుతామని, పొద్దున్నే మా హెడ్క్వార్టర్స్ నుంచి ఇంటిమేషన్ వచ్చింది. నేను, ఆర్టిలరీ, రైఫల్ షూటింగుల్లో ట్రైనింగ్ క్యాంప్స్ కండక్ట్ చేస్తానుగా! ఇప్పుడు భూటాన్ లో కూడా క్యాంప్, ట్రైనింగ్ సెటప్ చెయ్యాలి.,. వచ్చే వారం వెళ్ళి మార్చి మొదట్లో వచ్చేస్తాను,” అన్నారు నాన్న.

అమ్మ ఉలిక్కిపడింది. నాకు ఒక్క సారిగా ఏడుపొచ్చేసింది. ‘నాన్నని వదిలి ఎలా ఉంటాము?’ అంటూ తోచకుండా అయిపోయాను.

“డాడీ, నేనూ వస్తా” అంటూ వెళ్లినాన్న పక్కనే కూర్చున్నాడు వినోద్.

“ఈ అసైన్మెంట్ ఉంటదని నేను ఎప్పటినుంచో అనుకుంటున్నదే. మరి తప్పదుగా,” అన్నారు నాన్న మళ్ళీ. అందరం ఏమనకుండా వింటున్నాము,,,

“ఏమ్మా, దిగులేమీ వద్దు. ఏం పర్వాలేదు, ఆరు నెలలేగా! నీ డాన్స్ ప్రాక్టీసుల్లోనివు బిజీగానే ఉంటావు. నేను ఇంట్లో లేనని గుర్తుండదులే,” అన్నారు నావంక చూస్తూ.

లేచి వెళ్ళి నాన్న చైర్ ఆర్మ్ మీద కూర్చున్నాను.

అంతా వింటున్న రాంమామయ్యా, "అయితే, నాట్ మచ్ టైం, పనులుంటాయిగా. కానివ్వండి శారదా," అన్నారు.

"మీరు ఏం బెంగపెట్టుకోకండి అన్నగారు. శారదా, పిల్లలు డిసెంబర్ సెలవల్లో మా వద్దకు వస్తారులెండి," అంది అత్తయ్య.

"లేదంటే, మేమే ఇక్కడికి వస్తాము," అన్నాడు జగదీష్.

"డిసెంబర్ సంగతి అలాగే ప్లాన్ చేద్దాము. ఇకపోతే, రేపు పొద్దున్నే మేము ముగ్గరం తిరుపతికి వెళ్ళి, ఎల్లుండి సాయంత్రానికి తిరిగి వచ్చేస్తాము. ఆ తరువాత రెండురోజులు భూషణ్ వాళ్ళ ఇంటికి వెళతాము," తమ ప్లాన్ వివరించారు మామయ్య.

**



నాన్న వెళ్ళడానికి ఇంకా వారం కూడా లేదు.  నేను, వినోద్ నాన్నని అంటిపెట్టుకుని ఉంటున్నాము.  మాకు ఎన్నో జాగ్రత్తులు చెబుతున్నారు నాన్న.

ప్రతిరోజు నాన్నకిష్టమైన  గుడికో,  రెస్టారెంటుకో  వెళ్ళి వస్తున్నాము.

తను భూటాన్ లో ఉండగా, ‘మైలాపూర్  ఫైనార్ట్స్’ దసరా  ప్రోగ్రాం ఉంటుందని, ఊళ్ళోనే కనుక భూషణ్ అంకుల్ సాయం చేస్తారని గుర్తుచేశారు నాన్న.

**

జగదీష్ వాళ్ళ తిరుగు ప్రయాణానికి ముందురోజు, మమ్మల్ని పార్టీకి ఇన్వైట్ చేసింది నీరూ ఆంటీ. సర్ ప్రైజ్ పార్టీ అని అందట అమ్మతో. ఎవరికి సర్ ప్రైజ్ అని మేము అడిగినా అమ్మ నోరు విప్పలేదు. వివరాలు తనకి తెలియదంది.

ఆమెకి తెలుసని నా అనుమానం....

**

సాయంత్రం ఏడింటికి, భూషణ్ అంకుల్ వాళ్ళ డిన్నర్ కి వెళ్ళాము. ఇల్లంతా చాలా బాగా డెకొరేట్ చేసారు. వాళ్ళ గార్డెన్ హాల్లో పార్టీ ఏర్పాటు చేసారు. గార్డెన్ లోని రకరకాల పువ్వులని చూస్తూ పార్టీ హాల్లోకి నడిచాము. ఓ పక్కగా మ్యూజిక్ బాండ్ కూడా సెటప్ చేస్తున్నారు...

అప్పటికే రాణి ఫ్రెండ్స్ వచ్చున్నారు. గణపతి దేవుడు గురించి నాతో పోట్లాడిన నా క్లాస్ మెట్ లీనా జోసెఫ్ తో సహా.

వాళ్ళు కూర్చున్న టేబిల్స్ దాటి వెళ్ళి కాస్త దూరంగా కూర్చున్నాము. నాన్న తన కుర్చీని టెన్నిస్ కోర్ట్స్ వైపు వేసుకొన్నారు. ఎవరాడుతున్నారో చూస్తానంటూ వినోద్ కోర్ట్స్ లోకి వెళ్ళాడు.

లీనా వచ్చి, మా వద్ద చేరింది. తన అక్క రీనాతో వచ్చానని, రీనా రాణికి క్లాస్ మెట్ అని వివరించింది. ఐదు నిముషాల సేపు కబుర్లు చెప్పి వెళ్ళింది.

**

కాసేపటికి ఇంటిలోపలి నుండి ముందుగా జగదీష్, వెనుకే అత్తయ్య, మామయ్య పార్టీ హాల్లోకి వచ్చారు.

జగదీష్ బ్లాక్ సూట్ వేసుకున్నాడు. మామయ్య పైజమా కుర్తా వేసుకున్నారు. అత్తయ్య మెరిసిపోయే మూవీ యాక్టర్ల చీరల్లాంటిది కట్టుకుంది. మమ్మల్ని చూసి, మా వద్దకు వచ్చారు.

"అబ్బో, ఏమిట్రా జగదీష్ బాబు, ఏదో షూటింగ్ నుండి వచ్చిన డాషింగ్ హీరోలా ఉన్నావే?" అంది అమ్మ నవ్వుతూ.

జగదీష్ కోపంగా ఉన్నాడు. "ఇదిగో మా మమ్మీని అడుగు. రెండు రోజుల నుంచి నన్ను పార్టీ ప్రిపరేషన్స్ తో చంపేస్తున్నారు. ఇంత ఫార్మల్ వేషం ఇప్పుడెందుకు?" అని వెళ్ళి నాన్న వాళ్ళ పక్కగా కూర్చున్నాడు.

నాకు నవ్వొచ్చింది.

"అయినా తన ఫార్మల్ సూట్ బాగుందిగా! ఎందుకు కోపం?" అడిగాను పక్కనే కూర్చున్న అత్తయ్యని.

"మామయ్య, నువ్వూ కూడా చక్కగా ఉన్నారుగా," అని కూడా అన్నాను ఆమెతో నవ్వుతూ.

ఓ నిముషం సేపు మణత్తయ్య ఏమీ అనలేదు.

"ఈ ఫంక్షన్ కి మీ అమ్మిచ్చిన సిల్క్ షర్టు వేసుకోవాలనుకున్నాడు. కాని, రాణి ఇష్టప్రకారమే మేమంతా తయారయ్యాము. అదీ కోపం," అంటూ నవ్వేసింది అత్తయ్య.

"అసలేమిటి ఈ ఫంక్షన్ వదినా? అడిగింది అమ్మ.

"ఏమో! ఏదో సర్ ప్రైజ్ అంట. మరి ఎవరికో ఏమిటో. వచ్చేవారమే వాళ్ళమ్మాయి రాణి పుట్టినరోజనైతే అన్నారు. ఆ అమ్మాయికి అతిగారాబం అనుకుంటా. మమ్మల్ని కూడా తన మాట వినే వరకు ఊరుకోడం లేదు. మాతో

ప్రేమగా అయితే ఉంటుంది,"  అంది అత్తయ్య.

**

పార్టీ హాలంతా అతిధులతో నిండిపోయింది.  భూషణ్ అంకుల్, నీరూ ఆంటీ వచ్చి  మమ్మల్ని పలకరించారు.  ఎవరెవరో సినిమా యాక్టర్లు వచ్చారు.  వాళ్ళ చుట్టూ మనుషులు  పరిగెడుతున్నారు.

**

"పదండి స్నాక్స్ తెచ్చుకుందాము," అంటూ నన్ను, వినోద్ ని పిలిచాడు జగదీష్.  వెళ్ళి స్నాక్స్  తెచ్చుకుని  టేబిల్ వద్ద కూర్చున్నాము.

రెండు రోజులుగా, రాణితో, చెన్నై మ్యూజియం - పార్క్ – రివాల్వింగ్ రెస్టారెంట్ కి వెళ్ళాడట.

తమతో ఆమె ఫ్రెండ్స్ కూడా కొందరు వచ్చారని చెబుతూ,

"నువ్వు కూడా వచ్చుంటే బాగుండేది, చంద్రా  పిలిచాను కూడా.  కాలు నొప్పన్నావు...నిజంగా చాలా నొప్పా? ఇప్పుడు ఎలా ఉంది," అడిగాడు జగదీష్.

ఇంతలో మ్యూజిక్  మొదలైంది.   సెంటర్  టేబిల్  మీద  రెండు టాల్  కేక్స్ ఏర్పాటు చేసారు.

"ఐ వాంట్ మోర్, జగదీష్ బావ,"  అన్న వినోద్ తో,  ఇద్దరు మళ్ళీ స్నాక్స్ టేబిల్ వద్దకు వెళ్ళారు.

**

లేటెస్ట్ మూవీ హిట్స్ ప్లే చేస్తున్నారు... అందరు మ్యూజిక్ ఎంజాయ్ చేస్తుండగా...రాణి వచ్చి మమ్మల్ని పలకరించింది.. కళ్ళు జిగేల్ మనే లాంటి మెరిసిపోయే వైట్ పరికిణీ వోణి వేసుకొంది. అలాగే జ్యువలరీ కూడా. చాలా చక్కగా ఉంది. ఆమెనలా చూస్తూండిపోయాను....

రాణి మాతో మాట్లాడుతుండగా, భూషణ్ అంకుల్, నీరు ఆంటీ మైక్ ముందుకి వచ్చారు.

'హలో, నమస్తే గుడ్ ఈవినింగ్' అంటూ అందర్నీ గ్రీట్ చేసారు....

"ఫ్రెండ్స్, లేడీస్ ఎండ్ జెంటిల్మెన్, ఈ సందర్భాన్ని మాతో కలిసి సెలెబ్రేట్ చేయడానికి మీరంతా వచ్చినందుకు, మా ధన్యవాదాలు. ఈ టేబిల్ పైన రెండు కేక్స్ ఉన్నాయిగా!....ఈ రోజున, మా స్నేహితులు - ఢిల్లీవాస్తవ్యులు ఐన మేజర్. రాంబాబు - మణిగార్ల అబ్బాయి, జగదీష్ బాబు పుట్టినరోజు సెలెబ్రేషన్. అతనికిది సర్ప్రైజ్. రెండో బర్త్డే మా రాణిదే. నిజానికి, వాళ్ళిద్దరి అసలు పుట్టినరోజులు వచ్చేవారం.

జగదీష్ కి పందొమ్మిదేళ్ళు నిండితే, రాణికి పదిహేడేళ్ళు నిండుతాయి.

ఈ యంగ్స్టరస్ ఇద్దరూ, మరిన్ని పుట్టినరోజులు ఆనందంగా జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలుపుతూ, వి విల్ కట్ ది కేక్స్. ఎండ్ ఎంజాయ్ డిన్నర్ అండ్ మ్యూజిక్ ఆఫ్టర్....." హ్యాపీ బర్త్డే టు యు' అని పాడుతూ లీడ్ చేసారు అంకుల్.

ముందుగా రాణి, తరువాత జగదీష్ కేక్ కట్ చేసారు....

భూషణ్ అంకుల్ మళ్ళీ మైక్ తీసుకొని, "మరో సర్ప్రైజ్ కూడా ఉంది ఫ్రెండ్స్...మేజర్ సత్యదేవ్, శారద గార్ల అమ్మాయి, చంద్రకళ. గత ఏడేళ్ళగా కూచిపూడి నృత్యంలో నిర్విరామ కృషి చేస్తున్న ఓ యువ కళాకారిణి. ఆరేళ్ళ వయస్సు నుండే ఎన్నో సార్లు టాలెంట్ షోల్లో గెలుపొంది 'చెన్నై యంగ్ టాలెంట్' అవార్డ్స్ తీసుకుంది.

ఆ అమ్మాయిని అప్పట్లోనే “చైల్డ్ ప్రాడిజీ” గా ఎన్నో పత్రికలు ప్రశంసించాయి.. అంతేకాదు. గత వారం మదురైలో తన నృత్యానికి -

“కళామంజరి’ వారి - ప్రతిష్టాత్మక “నృత్యమంజరి” అవార్డు అందుకుంది. చంద్రకళని ఆశీర్వదిస్తూ, అభినందిస్తున్నాము. చంద్రకళని వచ్చి ఈ ‘అభినందన’ కేక్ కట్ చేయమని కోరుతున్నాను. వెంట తమ్ముడు, మాస్టర్ వినోద్ కూడా ఉండాలి” నవ్వుతూ

అనౌన్స్ చేసారు....

లోపలినుండి, అంబుజ మరో కేక్ తెచ్చి ఆంటీకి అందించింది.... ఆంటీ టేబిల్ మీద దాన్నుంచి, దానిపై ఓ కాండిల్ కూడా వెలిగించింది...

అంకుల్ నాగురించి చేసిన అనౌన్స్మెంట్ కి, జరుగుతున్న విషయానికి, నేను సర్ప్రైజ్ అయ్యాను. మమ్మల్ని టేబిల్ వద్దకి తీసుకెళ్ళి, నాచేత కేక్ కట్ చేయించారు నాన్న.

మా నలుగిరికి అంకుల్ – గిఫ్టులందించారు..

మరి కాసేపటికి, డిన్నర్ కూడా అయ్యాక, అంకుల్ వాళ్ళకి థాంక్స్ చెప్పి ఇల్లు చేరాము.

**

గబగబా బట్టలు మార్చుకుని సిటింగ్ లోకి వచ్చాను. అంకుల్ మాకిచ్చిన గిఫ్ట్స్ ఓపెన్ చేసాము. నాకు ఒక గోల్డ్ చైన్-లాకెట్, వినోద్ కి ‘కిడ్స్ వరల్డ్’ గిఫ్ట్ సర్టిఫికేట్.

చైన్ అమ్మకందించి, మెళ్ళో పెట్టమన్నాను.

“ఇంత ఖరీదైన గిఫ్ట్ ఎందుకు ఇచ్చారాయన? అవార్డ్ గెలిచినందుకు చంద్రచేత కేక్ కట్ చేయిద్దాము అన్నారు. అక్కడ వరకు బాగానే ఉంది, కాని ఇంతింత కానుకలు ఎందుకు,” అంది అమ్మ.

“దానిదేముందిలే గాని, శారదా, మీ అన్నయ్యవాళ్ళు ఇంకాసేపట్లో మనింటికి వస్తారు. రేపు సాయంత్రమే వాళ్ళ ఢిల్లీ ప్రయాణం. వాళ్ళ పడకలు, ఏర్పాట్లవీ చూసావుగా!” క్షణమాగారు.

“పోతే, మరో విషయం. భూషణ్ వాళ్ళకి, వీళ్ళు అంతగా దగ్గరవడం విడ్డూరంగా ఉంది. ఓ కంట కనిపెట్టు. ఇదంతా ఎందుకో? ఎటు దారి తీస్తుందో అని నాకు అర్ధంకాడం లేదు. ఆ అబ్బాయిని ఎలాగోలా పట్టేయాలని చూస్తున్నారా ఏమిటి?” అన్నారు నాన్న.

“అంత అవసరం ఏముందిలెండి. ఆ అమ్మాయే కాస్త అతిగారాబం. అందుకే అలా చేస్తుంది, తన మాట నెగ్గించుకోవాలని పంతం,” అంది అమ్మ.

“అసలు ఇది వినండి. ఈ ఫంక్షన్ విషయంగా, వీళ్ళంతా మొన్న షాపింగ్ వెళ్ళారంట.

జగదీష్ కి సూటు, వదిన చీర, అన్నయ్య బట్టలు అన్నీ తనే కొంటానని గొడవ చేసిందట రాణి. అన్నయ్య ససేమిరా కుదరదన్నారట. ‘మా బట్టలు మేమే కొంటామని గట్టిగా చెప్పారట’ మొత్తానికి ఇలాటివే సూట్స్ వాళ్ళకి ఇంట్లో ఉన్నా, అవసరం లేని బట్టలు కొనడం అయిందని మొత్తుకుంది వదిన,” నవ్వింది అమ్మ.

డోర్ బెల్ మోగడంతో వెళ్ళి తలుపు తీసాను. రాంమామయ్యా వాళ్ళు లోనికొచ్చారు.

**

పెద్దవాళ్ళు వరండాలో కూర్చుని, కబుర్లు చెప్పుకుంటున్నారు.

మేము సిటింగు రూములో చేరాము....

జగదీష్ కూడా, కబుర్లు చెబుతూ, మధ్యమధ్యలో వినోద్ ప్రశ్నలకి జవాబులు చెప్పి నవ్విస్తున్నాడు.

"జగదీష్, నీ గిఫ్ట్ చూపించు అత్తయ్యకి," అంది మణత్తయ్య.

బాక్ ప్యాక్ నుండి 'రోలెక్స్' వాచ్ తీసి చూపించాడు జగదీష్.

"బాగుంది," అన్నాము.

మరి కాసేపు కూర్చుని టి.వి చూస్తూ అక్కడే సోఫాల్లోనిద్రకి పడ్డాము.

**

నాన్న భూటాన్ లో ఉన్నప్పుడు, తాము మళ్ళీ ఓ సారి చెన్నై వచ్చే ప్రయత్నం చేస్తామని చెప్పి, సాయంత్రం ఫ్లైట్ కి ఢిల్లీ వెళ్ళిపోయారు జగదీష్, మణత్తయ్య, మామయ్య.



“వినోద్ బాబు, చంద్రా ఇటు వినండి.  రేపు పొద్దున్నే నాన్న ఫ్లైట్. నాన్న వెళ్ళేప్పుడు మీరు ఏడుపు ముఖాలతో ఉండకూడదు....ఎయిర్ పోర్టులో కూడా నవ్వుతూ ‘బై’ చెప్పాలి,” అంది అమ్మ డిన్నర్ దగ్గర.

“అవును, రేపు నాకు సెండ్-ఆఫ్  ఇవ్వడానికి, మా కర్నల్ నాగ రత్నం ఫామిలీ, మరి కొందరు ఆఫీసర్స్ వస్తారు. వాళ్ళ ముందు ఏడుస్తూ కాకుండా డిగ్నిఫైడ్ గా ఉండాలి మీరు,” నవ్వారు నాన్న.

డిన్నరయ్యాక, అర్ధరాత్రి వరకు నాన్నతో కబుర్లు చెబుతూ గడిపాము.... తను సెటప్ చేయబోయే రైఫిల్ షూటింగ్ క్యాంప్, ట్రైనింగ్ గురించి కొంత వివరించారు.

**

నాన్న భూటాన్ చేరి, క్వార్టర్స్ లో సెటిల్ అయ్యారని తెలిసాక, అమ్మ కాస్త రిలాక్స్ అయింది. సాయంత్రమయ్యాక, మైలాపూర్ లోని అమ్మవారి ఆలయానికి వెళ్ళాము.

అర్చన చేయించి, తిరిగి వస్తూ దారిలో భూషణ్ అంకుల్ వాళ్ళింటి వద్ద ఆగాము.

గేటులో నుండి లోనికి వెళుతుంటే, సిట్-అవుట్ లో రాణి, కనబడింది. ఆమెకెదురుగా చేతిలో కాఫీ కప్పుతో, కూర్చునున్న ఒకతినితో, నవ్వుతూ మాట్లాడుతుంది.

మమ్మల్ని చూసి, లేచి ఎదురొచ్చింది. "లోపలికి రండి" అంటూ తనతో మాట్లాడుతున్న వ్యక్తిని, యాక్టర్ - మహేందర్ సూరి కొడుకు – రంజిత్ సూరిగా పరిచయం చేసింది.

"పదండి ఆంటీ, లోపల కూర్చోండి," అంది మా చేతుల్లోని ప్లాస్టిక్ బాగ్స్ వంక చూస్తూ.

"రేపటి నుండి స్కూల్స్ కదా! గుడికెళ్ళి వస్తున్నాము.... ఇదిగోమ్మా మీక్కూడా ...ప్రసాదం, లోపల పెట్టు," తన చేతిలోని ఒక బ్యాగ్ అందించింది అమ్మ....

"థాంక్స్ ఆంటీ, అమ్మని పిలుస్తాను," అంటూ వెళ్ళిన రాణి వెనుకే నడిచి, సిటింగ్ రూములో కూర్చున్నాము.

"వినోద్ కొత్త బుక్స్ కి కవర్స్ వేసి, లేబిల్స్ రాస్తానని ప్రామిస్ చేసానమ్మా. త్వరగా వెళ్ళిపోదాం. ఐనా ఆంటీతో ఫోనులో మాట్లాడచ్చుగా," అంటుండగానే ఆంటీ వచ్చింది......

“శారద, సత్యగారు క్షేమంగా భూటాన్ చేరారుగా!” అంది మా ఎదురుగా కూర్చుంటూ. అంబుజని పిలిచి, అమ్మకి తనకి కాఫీ, నాకు జ్యూస్, తెమ్మని చెప్పిందామె.

ఇంతలో, డ్రెస్ మార్చి కిందకొచ్చిన రాణి, “మామ్ నేను రంజిత్ తో క్లబ్ కు వెళుతున్నా. పది సార్లు కాల్ చేయకు. నేను వచ్చే టైంకే వస్తాను. బై,” అంటూ దూసుకు వెళ్ళింది.

“చూడమ్మా రాణీ,” వాళ్ళమ్మ పిలుస్తున్నా ఆగకుండా వెళ్ళిపోయింది రాణి..

అంబుజ తెచ్చిన ట్రేనుండి, కాఫీ అందుకుంటూ, “ఇదేమో మాట వినదు, భూషణ్ గారు నన్ను కోప్పడతారు, ఎలాగో ఏంటో,” తనలో తను అనుకున్నట్టుంది నీరూ ఆంటీ.

మరో నిముషానికే, హడావిడిగా అంకుల్ బయట నుండి వచ్చారు. వస్తూనే, చేతిలోని బ్రీఫ్-కేస్ నేల మీదకి విసిరారు. చాలా అప్సెట్ గా ఉన్నారు.

“ఆ క్రిమినల్ రంజిత్ గాడితో ఎక్కడికి వెళుతుంది రాణి? నువ్వు ఏమనలేదా నీరూ? ఆపలేక పోయావా?” అన్నాక, మేమున్నామని గ్రహించి, క్షణం సేపు మౌనం వహించారు. వచ్చి మా ఎదురుగా సోఫాలో కూర్చున్నారు. ఆంటీ అందించిన వాటర్ సిప్ చేసి, తలెత్తి మా వంక చూసారు.

“సారీ శారద గారు... ఆ రంజిత్ గాడు చాలా రెక్లెస్ ఫెలో అని అందరికీ తెలుసు. ఎంత చెప్పినా, రాణి అర్ధం చేసుకోదు,” అంటూ తల పట్టుకున్నారు అంకుల్...

“పర్వాలేదు, మీరు కానివ్వండి. మేము మళ్ళీ వస్తాము,” అంటూ నేను, అమ్మ అక్కడినుండి బయట పడ్డాము.

**

స్కూల్ రి-వోపెన్ అయిన రెండో రోజున, ఇంటికి వస్తూనే, వంట చేయిస్తున్న అమ్మకి, స్కూల్ కబుర్లు చెప్పసాగాను.......

హైస్కూల్  క్లాసెస్ కొత్త బిల్డింగ్ లో ఏర్పాటు చేసారని, ఫెసిలిటీ చాలా బాగుందని,  వచ్చిన  కొత్త టీచర్స్ అందరినీ కూడా మేమింకా కలవలేదన్నాను.

నా కబుర్లు వింటూ, వేయించిన బొరుగులు బౌల్లోవేసి నాకందించింది అమ్మ.

"సెకెండ్ డే ఆఫ్ స్కూల్ కదా!.... పెద్దగా హోం వర్క్ కూడా లేదు," అంటూ హాల్లోకి  వచ్చి, టి.వి చూస్తూ కూర్చున్నాను.

డోర్-బెల్ మోగితే,  తలుపు తీసాను. అంబుజ లోనికొచ్చింది. చాలా నీరసంగా హాల్లోవరకు కాలీడ్చుకుంటూ  వచ్చి గోడకానుకుని  కింద కూర్చుంది.  పాదానికి  కట్టు  వేసుంది.

"కాలుకేమయింది అంబుజా?" అడిగాను.

"ఏం చెప్పను తల్లీ? నడవలేకుండా ఉన్నా,"  అని అంబుజ అంటుండగానే, అమ్మ హాల్లోకి  వచ్చింది.

కాలు చాపుకొని కూర్చున్న ఆమెని చూసి, "ఏమయింది, అంత కట్టు వేసావు?" అడుగుతూ,

కాబినెట్  నుండి లెక్క పుస్తకం అందుకుని సోఫాలో కూర్చుంది అమ్మ.

"ఏం చెప్పనమ్మా?  దెబ్బ తగిలినప్పుడు చూడకపోతివి నా బాధ.  మూడు రోజుల పాటు పనిలోకి కూడా పోలేదుగా," అంది. "అదే,

ఏమయిందని అడుగుతున్నా," అంది అమ్మ.

"ఏం చెప్పమంటావు? చెపితే నీకు, నాకు కూడా ఇబ్బందే. ఏమీ లేదులే తల్లీ" క్షణమాగింది. "లెక్క చూసి జీతం ఇప్పించడమ్మా. జ్వరం వచ్చినట్టుగా ఉంది. ఇంటికి పోతా," అంది అంబుజ పాదం మీదున్న కట్టుపై చేత్తో రాస్తూ.

"చంద్రా, వినోద్ లేచాడేమో చూడు, స్కూల్ నుండి వచ్చాక, కొత్తగా పడుకుండిపోతున్నాడు" అంది అమ్మ, నన్ను అవతలికి వెళ్ళమన్నట్టు.

"వంకర మాటలు కాకుండా తిన్నగా చెప్పు. నీ కట్టుకి కారణం ఏమిటంటే, నాకు ఇబ్బందంటావే?" అంది అమ్మ కటువుగా.ఒక్క క్షణం ఊర్కుంది అంబుజ.

పక్కకెళ్ళినా, నాకు అంతా వినబడుతూనే వుంది. పొర లాంటి కర్టన్ లోంచి కనబడుతూనే వుంది.

"కోప్పడమాకమ్మ, నాకు బతుకునిచ్చిన అయ్యగారు భూషణ్ బాబు. ఆళ్ళ విషయాలు ఈడ నీకు చెప్పాలంటే కష్టం కాదా? అంది."సరేలేవే, మాకు సంబంధం లేని విషయాలు చెప్పొద్దులే," అంటూ "ఇదో నీ అడ్వాన్స్ పోగా, నీ ఇద్దరి పిల్లల జీతం," అంటూ అంబుజకి డబ్బిచ్చింది అమ్మ.

అమ్మకి దగ్గరగా జరిగి, డబ్బందుకుని నడుముకున్న సంచీలో కట్టింది అంబుజ.

"నా నోట్లోగింజ నానదుగా శారదమ్మా! మీకు సంబంధం ఉన్న విషయమే తల్లీ అందుకే అట్టాగన్నా," అంది అంబుజ.

అమ్మతో పాటు, నేనూ వింటున్నాను.

“మొన్న బాబు గారింట సంబరాలయిన తెల్లార్రి, నేను ఎప్పటిలా చీకటితో ఆరింటికి పనికెళ్ళానా? వంటింటి తలుపు గుండా లోనికెళ్ళి పొయ్యి కాడ శుభ్రం చేసుకున్నా.

రోజూలా ఫ్రిజ్ నుండి కూరలవీ తెచ్చుకోడానికి, వంటింట్లో నుంచి భోజనాల గదిలోకి అడుగేసాను. లైట్ స్విచ్ వరకు వెళ్ళేలోగానే, కసుక్కున కత్తుల్లా పాదంలోకి ఏదో దిగింది. బాధతో కేకేసేప్పటికి, హాల్లో ఉన్న అమ్మగారు, బాబుగారు వచ్చి గదిలో లైట్లువేసారు. లైట్లవెలుగులో చూస్తే రక్తమోడుతున్న నా పాదంలోకి దిగిపోయిన ఓ పెద్ద గాజు ముక్క....

గదంతా, పగిలిన కాఫీ కప్పులు, విరిగిన గాజు పెంకులు, ప్లేట్లు, సీసాలు, ఒకటి కాదు.

తెగిన నా పాదం చూసి, ఇద్దరు కంగారు పడ్డారు. నన్ను కుర్చీ మీద కూకుండ బెట్టి, పరుగున లోని కెళ్ళి మందుల డబ్బా తెచ్చారు అయ్యగారు.

అమ్మ నా కాలు మీద గాయానికి దూది అద్ది, గట్టిగా తడి గుడ్డ చుట్టి, కార్లో వరకు సాయం పట్టింది... బాబు గారే నన్ను కార్లో ఆసుపత్రికి తీసుకెళ్ళారు.

ఆయనే చెప్పారు జరిగిన ఇషయమంతా. పార్టీ అయిన తెల్లార్రు జామునే, తల భారంగా ఉందని కాఫీ కలుపుకొని భోజనాల బల్లకాడ కూచున్నారట బాబుగారు.

ఆ టైంలో రాణమ్మ కిందకొచ్చి, ఆయనతో గొడవ పడ్డదంట.

తనకి చెప్పకుండా మన చంద్రకళ తో కూడా ఆ దినం కేక్ కోయించినందుకు కోప్పడి, తన పార్టీ నాశనమయిందని కేకలేసిందట, ఆ రాణమ్మ. నానా రభస చేసి, గుణపాఠం నేర్పిస్తానని బాబు గారిని బెదిరిస్తూ, భోజనాల గదిలో చేతికందినవన్నీ పగల గొట్టిందంట. అమ్మ గారొచ్చి, ఇద్దర్నీ బలవంతంగా అక్కడినుంచి ముందు హాల్లోకి తీసుకెళ్ళారంట. రాణమ్మని అదిలించి, మేడ మీదకి పంపినారంట. ఇగ అప్పుడే నేనెళ్ళినట్టున్నా. ఇట్టా కాలు గాయం చేసుకున్నా,” అంది అంబుజ.

ఆమె చెప్పిన విషయం విని, నేను, అమ్మ షాక్ అయ్యాము. ఏమనుకోవాలో తెలియక, ఆలోచనల్లో ఉండిపోయాను.

**

నాన్న భూటాన్ నుండి రోజూ, రాత్రిపూట ఫోన్ చేస్తారు.

అత్తయ్య వాళ్ళు కూడా తరుచుగా మాట్లాడుతూనే ఉన్నారు.

భూషణ్ అంకుల్ ఏర్పాటు చేసిన టి.వి ప్రోగ్రామ్స్, ఇంటర్వ్యూలు, ఒక్కోటి బాగా జరుగుతున్నాయి..

రాబోయే అకడెమిక్ ఇయర్ నుండి స్పోర్ట్స్ తగ్గించేసి, డాన్స్ మీద మరింత దృష్టి పెట్టాలని అనుకున్నాము నేను, అమ్మా కూడా.

**

మైలాపూర్ ఫైన్ ఆర్ట్స్ వారి దసరా ప్రోగ్రాం కి ఐటమ్స్ అన్నీ సెట్ చేసారు మాస్టారు గారు.ప్రాక్టీసులు మొదలయ్యాయి.

దసరా పండుగ ఆఖరి రోజున 'కామరాజ్ కల్లై అరంగం' లో, సాయంత్రం ఆరు గంటలకి ప్రోగ్రాం జరగనుంది.

**

పండుగ రోజు పొద్దున్నే పూజ ముగించి ప్రసాదం, బ్రేక్ ఫాస్ట్ అయ్యేప్పటికి, భూషణ్ అంకుల్ వచ్చారు.

సాయంత్రం ఆరు గంటలకి జరగనున్న ప్రోగ్రాం వివరాలు అమ్మతో మాట్లాడి, తాము ముందుగానే ఆడిటోరియంకి వచ్చి కలుస్తామని చెప్పి వెళ్ళారు.

ప్రోగ్రాం కి నాన్న దగ్గర లేక పోవడం కష్టంగా ఉంది.....

**

మేము గ్రీన్-రూములో ఉండగా, ఆర్గనైజర్ రావుగారు మమ్మల్ని కలిసి, ఓ సారి 'వేదిక' చూసి ఏదైనా మార్చాలంటే చెప్పమన్నారు. వెళ్ళి చూశాము. ఇరు ప్రక్కల, ఆలయ ద్వారంలా, గుడి లోనే నాట్యం చేస్తున్నట్టు ఉండేలా ఏర్పాటు చేసారు. అందంగా ఉంది...

"ఈ ఆడిటోరియం ఈ రోజున నిండిపోతుంది శారద మేడమ్. మా సభ్యులే పదిహేను వందల మంది. సభ్యులు కాని వారు కూడా వస్తారని అంచనా. మా వాళ్ళంతా చంద్రకళ పాప నాట్యం చూడాలని ఎదురు చూస్తున్నారు. అందుకే యేడాది క్రితమే మీ ప్రోగ్రాం అడిగి, ఫిక్స్ చేసాము. అమ్మ వారి డాన్సులే చేయమని అడిగింది కూడా దసరా పండుగకనే. మీడియా వాళ్ళ కవరేజ్ బాగా ఉంటుంది. అలాగే, ప్రోగ్రాం రివ్యూస్ అన్ని ప్రముఖ తెలుగు, తమిళ్, ఇంగ్లీష్ పత్రికల్లో వస్తాయి మేడమ్," అన్నారు రావు గారు.

ఆయన మాటలు వింటూ, 'అందుకేగా, ఈ నాటి ప్రోగ్రాంకి 'దేవీ స్తోత్రమాలిక' అని టైటిల్ పెట్టించింది అమ్మ' అనుకున్నాను. గత ఏడాదిగా మాస్టారు ప్రత్యేకంగా నేర్పిన ఐటమ్స్ అన్నీ 'అమ్మవారివే' – 'అమ్మవారి' ముఖంలో కనబడే లాలిత్యం, రౌద్రం, లాంటి విభిన్న భావాలని సునాయాసంగా చూపించ గలగడం ముఖ్యమని చెబుతూ ప్రాక్టీసు చేయించింది అమ్మ. అందు కోసం కొన్ని అమ్మవారి సినిమాల డివిడి లు కూడా చూసాను.



ప్రోగ్రాం మొదలైంది... అమ్మవారంటే ఉన్న ఓ పవిత్రభావం నుండి – ఓ కొత్తఉత్సాహం తోచింది. “దేవిస్తోత్రమాలిక’ లోనివిఆణిముత్యాల్లాంటి డాన్సులు ఇవన్నీ,” అంటుంది అమ్మ..

క్రౌర్యం చూపిస్తూదేవిస్తోత్రం, సౌకుమార్యం - సోయగం జాలువారుతున్న వధువుగా ‘ఆండాళ్ స్వప్నం’, శ్రీనివాసుని మురిపిస్తున్న అలిమేలుగా ‘చక్కనితల్లికి చాంగుభళా’.. – ఇలా నర్తించడం ఓ అద్భుతమైన అనుభూతిగా అనిపిస్తుంది..

ప్రతి పదాన్ని అనుసరిస్తూ భావాలతో మమేకమై ఉత్సాహంగా నాట్యం చేస్తున్నాను........

రెండు గంటల సేపు సాగిన ప్రదర్శనలో, "అయిగిరినందిని శ్లోకం, తారంగం, హిమగిరి తనయే కీర్తన,చక్కని తల్లికిచాంగుభళా హైలైట్స్," అన్నది అమ్మ, ప్రోగ్రాం అయ్యాక.

"ప్రేక్షకులు కరతాళధ్వనులతో హోరెత్తించారు. తమ అభిమానాన్ని తెలిపారు," అని కూడా అన్నది.

**

ప్రోగ్రాం అయ్యాక,స్టేజి మీద నన్ను కలిసి, అభినందించి ఫోటోలు, ఆటోగ్రాఫులు తీసుకున్నవాళ్లుకాక, నాకోసంగ్రీన్ రూం ఎదుట వెయిట్ చేస్తున్న మరికొందరిని కలవగలిగాను.దుర్గాదేవిగా నేను చేసిన 'మహిషాసురమర్దిని' ఘట్టం తమకి చాలా నచ్చిందని, చూస్తున్నంతసేపు భక్తితోగగుర్పాటు కలిగిందన్నారు.

వారిలో ఓ పెద్దామె నా వద్దకు వచ్చి,ఎర్రని దుస్తుల్లోదుర్గాదేవిలా ఉన్నాననంటూ, నాకు నమస్కరించింది.

"అయ్యో, అది చిన్నపిల్ల మీరు పెద్దవారు. ఆశీర్వదించడమ్మా," అంది ఆవిడ చేతులు పట్టుకొని అమ్మ.

అంతలో నీరూఆంటి, అంకుల్ వచ్చారు. "చిన్నారి దేవతే! దుర్గాదేవిగానిజంగానే బాగా చేశావురా కళా, నిన్ను అలా చూస్తుంటే, నాకళ్ళల్లోనీళ్ళు తిరిగాయమ్మా," అన్నారు భూషణ్ అంకుల్.

"అవును, కాస్ట్యూమ్ కూడా చాలా అందంగాఉంది. ఇంటికి వెళుతూనే దిష్టి తీయండి శారద," అంది నీరూఆంటి.

**

చూసి, మాట్లాడాలని వస్తున్న జనం ఎక్కువుగా ఉన్నారని, ప్రస్తుతానికి మేము ఆడిటోరియం నుండి నిష్క్రమిస్తే మంచిదన్నారు, రావుగారు.భూషణ్ అంకుల్ నన్ను ఇంచుమించు పరిగెత్తించినట్టే జనంలో నుంచి కారు వద్దకు తీసుకెళ్ళారు.

**

ఆ మరునాడు సిటీ న్యూస్ పేపర్స్ లో, మంచి రీవ్యూలతో పాటు కాస్ట్యూమ్స్ ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ,డాన్స్ ఫోటోలు పబ్లిష్ అయ్యాయి.... న్యూస్ క్లిప్స్ కలెక్ట్ చేసి, అంకుల్ పంపారు. ఈ వారమంతా కేబిల్ టి.వి చానల్స్ వాళ్ళు నా ప్రోగ్రాం రిలే చేస్తారని, 'సిటీ రౌండప్' లో టెలికాస్ట్ చూడమని కూడా చెప్పారు.

'కూచిపూడి నృత్యానికి వన్నెలద్దిన యువనర్తకి చంద్రకళ'

అని, ఓ తెలుగు పేపర్ లో హెడ్లైన్స్ వేస్తే

'ఇంతటి చిన్న వయస్సులో అతిక్లిష్టమైన హావభావాలకి అద్దంపట్టిన అభినయం...

అందమైన శరీర సౌష్టవంతో, చంద్రకళ మేటి నర్తకిగా ముందుకు దూసుకుపోగలదు'...

అంటూమరో పేపర్లోరాసారు. బ్రహ్మాండమైన రీవ్యూస్ రాసారని మురిసిపోయింది అమ్మ..

**

ఎప్పటిలా ఏడింటికి నాన్న ఫోన్ చేసారు. ప్రోగ్రాం గురించి అడిగారు.

“అందరూ దాన్ని దేవత అని పొగిడేస్తున్నారు.  బాగానే చేసింది.  కాస్ట్యూమ్ లో పొందికగా, నిజంగానే నా దిష్టే తగిలేలా ఉందనుకోండి,”  అంది అమ్మ.

అమ్మ మాటలు,  ప్రేక్షకుల నుండి అంతటి స్పందనకి కారణం - ప్రత్యేకంగా ‘అమ్మవారి’ పాటలకి  కూర్చిన నృత్యాలు చేయడమేననిపించింది. ‘ఇకనుండి అమ్మవారి నృత్యాలే ఎక్కువ నేర్చుకోవాలి’..అనుకున్నాను.

“ఇదిగో నాన్నతో మాట్లాడు,” ఫోన్ అందించింది అమ్మ.

“ఏమ్మా కళా,  అలిసిపోయావా?  ప్రోగ్రాం బాగా జరిగిందటగా.  అమ్మవారిలా కళకళ లాడిపోయావని చెబుతున్నారంట అందరూ.  టి.వి వాళ్ళ నుండి డి.వి.డి తెప్పించమని అంకుల్ కి చెప్పు,” అన్నారు నాన్న.

“అలాగే చెబుతాను.... నువ్వెప్పుడు వస్తున్నావు నాన్నా?  అడిగాను.

“ఇంకా త్రీ మంత్స్ ఓన్లీ.. త్వరగా అయిపోతాయి.  ఓకేనా? ఐ మిస్ యు తల్లీ.... ఒకసారి వినోద్బాబుని పిలువు,” అన్నారు నాన్న.

**

శనివారండాన్స్ క్లాస్ అయ్యాక, నా ఫేవరెట్ కర్రీస్ తో లంచ్ చేసేసి, టి.వి చూస్తున్న అమ్మ పక్కన చేరాను.వినోద్, మీనాక్షితో కేరంబోర్డ్ ఆడుతున్నాడు.

“క్లాస్ నుండి వచ్చినప్పుడు, మాస్టారుగారు ఏదో కవర్ ఇచ్చారన్నావు! కవర్ ఏది చంద్రా?” అడిగింది అమ్మ.

పరుగున వెళ్ళి, నా రూంలో ఉంచిన కవర్ తెచ్చిచ్చాను.

కవర్ వోపెన్ చేసి, లోనుండి పేపర్స్, ఓ బ్రోష్యూర్ తీసింది.

కొన్ని తెలుగులో  కొన్ని ఇంగ్లీషులో ఉన్నాయి.

చదివి,తనే విషయం చెబుతుంది కదానిటి.వి చూస్తూవెయిట్ చేసాను.

ఎంతసేపైనా, అలా చూస్తూచదువుతూ ఉండిపోయిన అమ్మని, చేయి పట్టిలాగాను.

“పెద్దగా చదువు.  ఏమిటది?” అడిగాను.

“ఇదిగో ఒక్క నిముషం.ఈవిడ ఫొటోని చూస్తుండిపోయాను. ఎంత అందంగా ఉంది - తేజశ్విని మేడమ్! ఆవిడ తన అకాడెమి తరపున డాన్స్ ఫిలిం తీస్తుందట,” అంది అమ్మ తన చేతిలోని పేపర్స్ వంకే చూస్తూ.

“ఏదీ చూపించు,” అమ్మ చేతినుండి తీసుకొని చూసాను.

నిజమే! రెడ్మీద గోల్డ్ చుక్కలున్న సారీ కట్టుకునుంది..  కర్లీహెయిర్.  చాలా చక్కగా ఉంది.

“ఆమె నవ్వు, ముఖము – కళ్ళు తిప్పుకోలేని ఆకర్షణ,” అంది అమ్మ.

బ్రోచర్ పైన ఉన్న ఫొటో వంక మళ్ళీ చూసాను…

‘నన్ను తేజశ్వినిలా  ఉంటానంటారే? నేను అమెలాగా ఉన్నానా?’ అనుకుని నమ్మలేకపోయాను.

“షి ఇజ్ రియల్లీ బ్యూటిఫుల్. ఇంతకీ వాట్ ఇజ్ ఇట్ అమ్మా? తెలుగు బ్రోష్యూర్ నువ్వు చదువు వింటాను,” అన్నాను.

చదవడం మొదలు పెట్టింది అమ్మ.....

కూచిపూడి నర్తకి, నటి, తేజశ్విని చేపట్టనున్న ‘రాగం-తానం-పల్లవి’ టెలిఫిలిం చిత్రనిర్మాణం......వివరాలు......

అమెరికాలో స్థిరపడిన ప్రఖ్యాతకూచిపూడినృత్యకళాకారిణి -తేజశ్విని, గత రెండు దశాబ్దాలగా కళారంగంలో తన కృషికి, ప్రతిష్టాత్మక అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు.

ఆవిడ చేపట్టబోయే టెలిఫిలిం ‘రాగం-తానం-పల్లవి’ నిర్మాణం, వచ్చే యేడాది జనవరిలో

అమెరికాలోకొంతషూటింగ్ జరుపుకుని, మార్చ్ నెలలో భారతదేశంలో అడుగిడుతుంది.

ఈ  టెలి-ఫిలింలో ఓ ముఖ్య పాత్రకి – బాగా నృత్యం చేయగల, పదహారేళ్ళ వయస్సు లోపు అమ్మాయిలకి డిసెంబర్ నెలలో,  చెన్నైలోఆడిషన్స్ జరపబోతున్నారు.  ఆసక్తిఉన్నవారు తమ ఫోటోలు, బయోడేటా ఈ క్రింది ఇ-మెయిల్ కి పంపవచ్చు -Tejaswiniarts@gmail.com.

చదవడం ముగించి, వెంటనే లేచి నాన్నకి ఫోన్ చేసింది.  నాన్న ఆర్మీ హెడ్క్వార్టర్స్లో ఉండే సమయం అది.

“అమ్మయ్యా, దొరికారు.  మీకో ముఖ్యమైన సంగతి చెప్పాలి,” అంటూ మొదలుపెట్టి, తన చేతిలోని సమాచారమంతా చదివింది అమ్మ.  “మాస్టారు ఈ సమాచారం మనకి పంపారంటే, ఈ ఆడిషన్స్ చెయ్యమనే కదా!సరిగ్గా మన చంద్ర కోసమే అన్నట్టుగా ఉందీ అవకాశం.  ఏం చేయమంటారు? టైంకి మీరు ఇక్కడ లేరు,” అంది అమ్మ.

నాన్నతో కాసేపు డిస్కస్ చేసింది.

“చంద్ర ఇక్కడే ఉంది, మాట్లాడండి,” అమ్మ ఫోన్ నాకిచ్చింది.

“హలో, నాన్న,” అన్నాను.

“ఏమ్మా కళా, ఎలా ఉన్నావు? అడిగారు.

“బాగున్నా. నేను తేజశ్విని మేడమ్ ప్రాజెక్ట్ కి ఆడిషన్స్ చేస్తాను నాన్నా. ఓకే నా? అడిగాను.

“నీకు ఆసక్తి ఉంటే తప్పక చేయమ్మా. నీ మేనేజర్, భూషణ్ అంకుల్ ఉన్నారుగా! ఆయనకి ఈ పేపర్స్ ఇచ్చి, ఏర్పాటు చేయమను. కాకపోతే నీ స్కూల్ కి అడ్డం రాకుండా ఉండాలి మరి,” అన్నారు.

**

ఫోన్ పెట్టేసి, “అమ్మా, భూషణ్ అంకుల్ నా మేనేజరా? నాన్న అలా అంటున్నారే,” అడిగాను.

నవ్వింది అమ్మ.

“అంతే కదా!...అంకుల్ చాలా హైక్లాస్ మేనజర్ నీకు. అయినా గమ్మత్తుకి అన్నారులే నాన్న,” మళ్ళీ నవ్వింది.

**

మరునాడు ఆదివారం డాన్స్ క్లాసుకి పేపర్లు తీసుకుని నాతో పాటుగా వచ్చింది అమ్మ.

"చంద్ర ఆడిషన్స్ కి వెళతానంటుంది మాస్టారు, మీరేమంటారు?" అడిగింది మాస్టార్ని.

"నా పూర్తి ఆశీర్వాదం, సహకారం ఉంటుందనే అంటాను. ఈ ఫిలిం చేయడం, మన చంద్రకళ కళా జీవితంలో ఓ మైలురాయే అవుతుంది. అదికాక తేజశ్విని వంటి కళాకారిణితో, చంద్రకళ కలయిక మంచి భవిష్యత్తుకి నాంది అని అనుకుంటాను," అన్నారు ఆయన నా తల మీద చేయుంచి ఆశీర్వదిస్తూ..

"తేజశ్వినితో మాట్లాడి, ఆడిషన్స్ కి వీళ్ళని తయారు చేస్తానులేమ్మా," అని కూడా అన్నారు.

**

క్లాస్ అయ్యాక, లంచ్ చేసి, అమ్మతో కలిసి భూషణ్ అంకుల్ వాళ్ళింటికి వెళ్ళాము.

పేపర్స్ అన్నీ పరిశీలించి, "బాగుందమ్మా, మంచి ప్రాజెక్ట్ లా ఉంది. నృత్యకళకి ప్రాధాన్యత కాబట్టి, మనకి కరెక్ట్... ఇవాళ నవంబర్ పదో తేది. మరి నీ మేనేజర్ గా, నేను వెంటనే నీ బయోడాట, పిక్చర్స్ వారికి అందేలా చూస్తానమ్మా, కళా," అన్నారు భూషణ్ అంకుల్.

నేను అమ్మ వంక చూసాను. అమ్మ నవ్వింది.

"నీరూ, మాకు కాఫీ, కళకి జ్యూస్ ఉంటుందా? అలాగే రాణీని కూడా ఆ ఫోన్ పెట్టేసి రమ్మను," అన్నారు అంకుల్ ఆంటీతో.

"అయ్యో, ఎందుకుండదు? మీ ఇద్దరికీ - కాఫీ, చంద్రకళకి ఏదైనా స్వీట్ ఇప్పుడే తెస్తా" అని, రాణీ కోసం పిలుస్తూ ఆంటీ లోనికెళ్ళింది.

“కూచిపూడి  నర్తకి  తేజశ్విని అంటే ఈవిడన్నమాట,  పేరు వినడమే కానీ చూడలేదు.  అమెరికాలో ఉంటూ నృత్యకళకి ఆమె చేస్తున్న కృషి  మెచ్చుకోతగ్గది.  ఈ ప్రాజెక్ట్ లో చంద్రకళకి అవకాశం వస్తేమాత్రం, స్టూడియో నుండి వాళ్ళకి, ఎటువంటి సహాయం కావాలన్నా చేద్దాము,”  ప్రాజెక్ట్ గురించిన పేపర్లు చూస్తూ అంకుల్....

ఆయన మాటలు వింటూ, కాఫీ టేబిల్ మీదున్న మాగజీన్ అందుకున్నాను...

**

నీరూఆంటీ అందరికీ ఫ్రెష్ ఫ్రూట్ సర్వ్ చేసింది.  “రాణిని రమ్మన్నావా? ఈ టెలిఫిలిం గురించి చెబుదాము.  కొంచెం ఇన్స్పైర్అవుతుంది,” అన్నారు అంకుల్ ఆమెతో....

“వస్తుందిలెండి.  ఇందాకేచెప్పాను.  మన జగదీష్ తోనే ఫోన్మాట్లాడుతుంది.  విసిగిస్తే మళ్ళీ గొడవ చేస్తుంది,” అంది ఆంటీ.

మా వంక చూసి నవ్వారు అంకుల్...”పిల్లల పెంపకం కష్టం శారదగారు... పాట వల్ల, ప్రోగ్రామ్స్ వల్ల కాస్తకుదురు వచ్చింది రాణికి.  క్లబ్బులు, డిస్కోలు తగ్గాయి.  మీ నుండి, కళ నుండి సాంప్రదాయం, పద్ధతి  కూడా అంటుతాయని అనుకుంటున్నాను.  ఈ మధ్య శనాదివారాలు ఇలా గంటల తరబడి ఫోన్లోమాట్లాడ్డానికి ఇంటిపట్టునేఉండిపోతుంది. జగదీష్ స్నేహంతో, మరికాస్తకుదురు వస్తుందని ఆశిస్తున్నాము,” అన్నారాయన.

రాణి గురించి మాతో, అంకుల్ అలా చెప్పడం ఏమిటని ఆశ్చర్యపోయాను.  ఆయన రాణి విషయంలో ఏదో బాధపడుతూనే ఉన్నారని అర్ధమయింది.....

“మీరు మరీ చెప్తారండి.  గంటల తరబడి మాట్లాడ్డం ఏమిటి...స్పోర్ట్స్ ప్రాక్టీసులతో, జగదీష్ చాలా బిజీగా ఉంటాడట. ఆదివారాలు ఈ టైంకి, ఫ్రీ అవుతాడులా ఉంది.  రోజంతా వెయిట్ చేసి, ఇక ఆ టైంకి మన రాణీయే ఆ అబ్బాయితో బాతాఖానీ వేస్తుంది... అయినా, జగదీష్ కూడా సరదాగానే చాలాసేపు కబుర్లు చేబుతాడట తనకి,”... అంది ఆంటీ.

సగం తిన్న ఫ్రూట్, చేదుగా అనిపించి, ఆ ఫ్రూట్ కప్పుని బల్లమీదుంచాను...

'అయితే, అదన్నమాట సంగతి...... మేము ఎక్కువుగా ఆదివారాలే అంకుల్ వాళ్ళని విజిట్ చేస్తుంటాము... అందుకే రాణి – జగదీషుల ఫోన్ కాల్స్ గురించి తెలుస్తుంది...'

చికాకుగా అనిపించింది. ఎప్పుడెప్పుడు ఇక్కడినుండి బయటపడదామా అనుకుంటుండగానే, చేతిలో ఫోనుతో, రాణి హడావిడిగా కిందకి వచ్చింది.



వస్తూనే సంతోషంగా వాళ్ళ డాడీని హగ్ చేసింది. ఎన్నడు లేనిది, నా వద్దకు వచ్చి, నన్నూ హగ్ చేసింది. నా భుజం తట్టి, వెళ్ళి ఎదురుగా సోఫాలో కూర్చుంది....

“ఎందుకురా ఈ సంతోషం?” అడిగారు అంకుల్ రాణిని.

“ఐ యాం ఎగ్జైటెడ్ డాడీ. ఇప్పుడే జగదీష్ తో మాట్లాడాను,”, “తన కజిన్స్ ని చూడ్డానికి క్రిస్టమస్ హాలిడేస్ లో చెన్నై వస్తాడట. ఇక మరో సంగతేమంటే, చెస్ టోర్నమెంట్ లో ఫస్ట్ ప్లేస్ గెలుచుకున్నాడట, హి ఈజ్ సో కూల్ ,” అంటూ మా వంక చూసింది రాణి.

“ఇంతకీ, నీకు చెప్పాడా తను వస్తున్నట్టు?” నన్నడిగింది.

నేను ఏమనలేదు.

“చంద్ర పెద్దగా ఫోన్ వాడదు, మాట్లాడదు,”, “నేను మాట్లాడి తెలుసుకోవలసిందే,” అంది అమ్మ.

“చూసావా రాణీ? నువ్వు కూడా ఫోన్ వాడకం తగ్గించాలి...,” నవ్వుతూ రాణీతో అంకుల్.

“సరే, నువ్వేదో అంటున్నావు.. జగదీష్ గురించి...అదే....చెస్ టోర్నమెంట్ గెలిచాడని.... అయితే అతను ఓ మంచి క్రీడాకారుడన్నమాట,” అన్నారాయన.

“ఔను డాడీ, ఈ సారి జగదీష్ ని మీ క్లబ్ చెస్-టీమ్ కి పరిచయం చెయ్యండి...

పోతే, సరిగ్గా క్రిస్టమస్ టైంకే, జగదీష్ ఢిల్లీనుండి వస్తున్నాడంటే, మన స్టుడియోలో జరగబోయే క్రిస్టమస్ పార్టీ కూడా స్పెషల్ గా ఉండాలి. అసలీసారి పార్టీ ఫార్మాట్ మార్చేయాలి... ముందునుంచే ప్లానింగ్ చెయ్యాలి. కొందరు క్లోజ్ ఫ్రెండ్సుని ఇన్వైట్ చేస్తాను,” ఆగకుండా మాట్లాడుతూనే ఉంది రాణి.

**

వాళ్ళింటి నుండి వచ్చేసాక కూడా, రోజంతా, రాణి మాటలే గుర్తొస్తున్నాయి. ఆ మాటలకి అమ్మ ఏమనుకుందో గాని, నాకు కొంచెం ఇబ్బందిగానే ఉంది.

‘జగదీష్ తనకేదో సొంత కజిన్ అయినట్టు, తన కోసమే చెన్నై కి వస్తున్నట్టు ఆ అమ్మాయి మాట్లాడ్డం ఏమిటి!’ అని

అసహనంగా ఉంది.అయినా జగదీష్ చెన్నై వస్తున్న ప్రతిసారి, మాకంటే ముందు రాణీకి తెలియడం కూడా నచ్చలేదు నాకు. ఇవే ఆలోచనలతో మౌనంగా డిన్నర్ కూడా అయిందనిపించాను..

బట్టలు మార్చి పడుకోబోతుంటే, అమ్మ వచ్చి నా బెడ్ మీద కూర్చుంది...

"ఏమిటమ్మా?" అడిగాను...

"చూడు చంద్రా, రాణి గురించి అంకుల్ వాళ్ళు అన్నవి ఎవరితోనూ అనవద్దు. నువ్వు కూడా మరిచిపోవాలి. మనమీద నమ్మకంతో ఆ విషయాలు మనతో పంచుకున్నారు... నిజానికి, హైసొసైటీలో, అతిగారాబంగా పెరుగుతుంది రాణి. కాబట్టి పెంకితనం, ఫార్వార్డ్ గా ఉండడం మామూలే.

పోతే, అంకుల్ నీతో ఆప్యాయంగా ఉంటారు కదా! ఎంతో సపోర్ట్ చేస్తారు. దాంతో ఆ అమ్మాయికి నీవంటే అసహనంగా ఉండడం కూడా సహజమే మరి," అని భుజం మీద చేయి వేసింది.

"ఏమైనా, నీవు మాత్రం బుద్ధిగా నీ డాన్సు, చదువు మీదే దృష్టి పెట్టు, సరేనా?" అంది...

ఔననట్టు తలూపాను...

అసలు ఇకనుండీ, ముఖ్యంగా ఆదివారాలు రాణి వాళ్ళింటికి వెళ్ళకూడదనుకున్నాను. ... రాణి మాటలు, చేష్టలు ఎప్పుడూ ఏదోగా అనిపిస్తాయి. ముఖ్యంగా జగదీష్ తో తన ఫ్రెండ్షిప్, అతనికి చాలా క్లోజ్ అన్నట్టు మాట్లాడ్డం - నాకు నచ్చడం లేదు.

"వచ్చేవారం నుండి, గుళ్ళో భగవద్గీత క్లాసుకి వెళదాము. నెలకి రెండు ఆదివారాలు, ప్రత్యేకంగా చిన్నవాళ్ళకోసమే, ఆ క్లాస్ నిర్వహిస్తున్నారట. మధ్యాహ్నం మూడు నుండి నాలుగు వరకు జరిగే ఆ క్లాసులో మనం ఎంతో నేర్చుకోవచ్చు. ఆ గురువుగారు చక్కగా చెబుతారని విన్నాను.... సరేనా," అంటూ నా భుజం మీద తట్టింది, అమ్మ.

సరేనన్నాను.

“ఇక ఆలోచన కట్టిపెట్టి, లైట్ ఆర్పి, నిద్రపో మరి,” అంటూ బయటకి నడిచింది....

**

సండే నాటి డాన్స్ క్లాసులో, ప్రోగ్రాములకని కొత్తనాట్యాంశాలు నేర్పుతూనే ఉంటారు మాస్టారు... రెండునెల్లగా నేర్చుకుంటున్న ‘శృంగారలహరే, ఆశ్రితజన శుభకరి’ అనే కీర్తన – ఎదురు తాళన సాగే జతితో, ఈ రోజు ముగిసినందుకు, అందరికీ ఉత్సాహంగా ఉంది.

....’పదునెనిమిది కరంబులు బరుగు దుర్గా...సింహవాహిని మమ్ము రక్షించుగాక ‘...

శ్లోకం లోని ఆ చివరి వరస పాడుకుంటూ, క్లాసు ముగిసాక ఇల్లు చేరాను...

భూషణ్ అంకుల్, నీరూఆంటీ, అమ్మతో మాట్లాడుతూ హాల్లో కూర్చునున్నారు... విష్ చేసి, వెళ్లివారికెదురుగా కూర్చున్నాను..తేజశ్విని మేడమ్ తో అంకుల్ మాట్లాడారంట. డిసెంబర్ పదిహేనో తేదీ నుండి, టెలి-ఫిలిం ఆడిషన్స్ మొదలవుతాయట. నా స్క్రీన్ టెస్ట్ – రెండు సెషన్స్ గా, రెండురోజుల పాటు ఉండవచ్చంట.

“క్రిస్టమస్ సెలవలే కనుక ఆలోచించి చెబితే, మీ వీలుని బట్టి డేట్స్ ఫిక్స్ చేద్దాము,” అన్నారు అంకుల్. మరికసేపు కబుర్లు, కాఫీ, అయ్యాక వాళ్ళు వెళ్ళిపోయారు.

**

భగవద్గీత క్లాసుకి వెళ్ళొచ్చి, హోం-వర్క్ అయ్యేప్పటికి లేట్ అయింది. ఆడిషన్స్ గురించి ఆలోచిస్తూ పడుకున్నాను. అంతలో, అమ్మ పిలిచింది. "చంద్రా! ఇలా రా!"

వెళితే, "జగదీష్ బావ ఫోన్..... మాట్లాడు," అంది ఫోనందిస్తూ..

క్షణమాగాను. మాట్లాడమని సైగ చేసింది అమ్మ.

'హలో'' అన్నాను.

"సారీ, లేట్ అయింది. రేపు నీకు స్కూల్ అని తెలుసు గాని, నేను చెప్పేది విను. సెలవల్లో నన్ను మీ వద్దకు పంపాలని నాన్న ప్లాన్ చేసారు. నేను డిసెంబర్ ట్వంటియత్ న చెన్నై వస్తాను. నీ ఆడిషన్స్ ట్వంటిఫస్ట్ నుంచి ఫిక్స్ చేస్తే నేను మీకు తోడుగా వస్తా" అటునుండి జగదీష్ అంటుంటే ఆశ్చర్యపోయాను..

ఇంతలోనే, అమ్మైతే ఆడిషన్స్ గురించి ఎవరికీ చెప్పుండదు. చెప్పలేదని తెలుసు..

మరి ఇంత త్వరగా విషయం జగదీష్ కి తెలిసిందంటే.....

'నీకెలా తెలిసింది? ఆడిషన్స్ సంగతి' అని నేనడిగే లోగానే...

"నేను మా స్కూల్ 'హైకింగ్ ట్రిప్' నుండి వచ్చేప్పటికి, అర్జెంటుగా ఫోన్ చేయమని రాణి మెసేజులు పెట్టింది. కాల్ చేస్తే టెలిఫిలిం ఆడిషన్స్ విషయంగా, మీరు వాళ్ళింటికి వచ్చివెళ్ళారని చెప్పింది. డిటైల్స్ కోసం భూషణ్ అంకుల్ తో మాట్లాడాను. మొత్తానికి వెరీ ఎగ్జైటింగ్ చంద్రా," అన్నాడు జగదీష్.

"అవును...నీవు వచ్చే డేట్స్ అమ్మకి చెబుతాను," అన్నాను.

“అత్తయ్యకి ముందే చెప్పానులే,’ అంటూ ‘బై’ చెప్పి ఫోన్ పెట్టేసాడు.

“అయితే, మనకి జగదీష్ తోడుంటాడు. వాడన్న డేట్స్ లోనే, ఆడిషన్స్ అయ్యేలా చూడాలి. మన గురించి ఎంత ఆలోచిస్తాడు వాడు,” అంది అమ్మ.

నాకూ సంతోషంగానే ఉంది...జగదీష్ ఉంటే సరదాగా ఉంటుంది... అదీ నాన్న దగ్గర లేనప్పుడు, కాన్ఫిడెంట్ గా ఉంటుంది... జగదీష్ వస్తున్నట్టు వినోద్ కి చెప్పాలని చూస్తే, వాడు నిద్రపోతున్నాడు....

**

ఆతృతగా ఎదురు చూసిన రోజు వచ్చేసినట్టే....రేపే నా టెలిఫిలిం ఆడిషన్స్ ....

ఇవాళ సాయంత్రం ఫ్లైట్ కి వస్తున్నాడు జగదీష్.

పొద్దున్నించి అమ్మ హడావిడి పడిపోతుంది. ‘వాడికి ఏ రూమ్ వీలుగా ఉంటుందో’ అనుకుంటూ ఇల్లు సర్ధించడంతోనే సరిపోయింది ఆమెకి. అతనికి ఇష్టమైన వంటకాలు తనే స్వయంగా చేసింది. కాక, మధ్యాహ్నం వరకు, దగ్గరుండి మీనాక్షితో స్నాక్స్ కూడా చేయించి డబ్బాలకి వేసి, అతని రూములో సర్దింది.

సాయంత్రమయ్యాక, జగదీష్ కోసం ఎయిర్పోర్ట్ కి వినోద్ బయలుదేరగానే, నేను డాన్స్ క్లాసుకి వెళ్ళిపోయాను...

**

ఆడిషన్స్ గురించి, జగదీష్ రాక గురించిన ఆలోచనలతో, డాన్స్ ప్రాక్టీసుపై పూర్తి మనసు పెట్టలేకపోయాను.

‘జగదీష్ వచ్చేసుంటాడు’ అనుకుంటూ క్లాస్ అవగానే, పరుగున ఇల్లు చేరాను,,,

వరండాలో అమ్మతో, వినోద్ తో కబుర్లు చెబుతూ కూర్చునున్నాడు జగదీష్.

నన్ను చూస్తూనే, “వెరీ హంగ్రీ. నీ కోసమే వెయిటింగ్,” అన్నాడు.

“ఒక్క నిముషంలో వస్తా” వాష్-రూమ్ వైపు నడిచాను.....

“తను వచ్చేస్తుంది, మీరిక లేవండి… నేను వడ్డించేస్తా” లేచి నా వెనుకే నడిచింది అమ్మ.

ఫ్రెష్ అయ్యి, బట్టలు మార్చుకున్నాను… అమ్మ వడ్డనల ఘుమఘుమలతో, నాకూ విపరీతంగా ఆకలి వేస్తుంది…వెళ్లి డైనింగ్ వద్ద వినోద్ పక్కన కూర్చున్నాను. జగదీష్ చెప్పే కబుర్లు వింటూ, డిన్నర్ కానిచ్చాము.

అమ్మ అందించిన ఐస్క్రీం కప్స్ పట్టుకుని, హాల్లో టి.వి ముందు చేరాము. పాత హిందీ సినిమా – ‘మిస్టర్ ఇండియా’ – చూస్తూ తన హైకింగ్ ట్రిప్, చెస్ గేమ్స్ గురించి చెప్పాడు జగదీష్…

సినిమా అవ్వగానే, “లేట్ అయింది. అత్తయ్యా..... ఇక మీరంతా వెళ్లి పడుకోండి. కాసేపు స్పోర్ట్స్ చూసి నేనూ పడుకుంటాను,” అన్నాడు మాతో....

**

పొద్దున్నే నైన్ కంతా, ఆడిషన్స్ కి, ‘మ్యూజియం థియేటర్’ చేరాము. నాకంటే ఎక్కువగా వినోద్, జగదీష్ టెన్షన్ పడిపోతున్నారు....లోపలున్న ‘వేదిక’ మీద కనీసం నాలుగు

టెలి-కెమెరాలతో కొత్తరకం  సెటప్ గా ఉంది.

మా మృదంగం మాస్టారు, సింగర్ వేద, ఫ్లూటిస్ట్ అప్పటికే వచ్చున్నారు.

**

మరికాసేపటికి, గ్రీన్ రూములో ఉన్న మా వద్దకు వచ్చి, తనని తాను ఇంట్రడ్యూస్ చేసుకొన్నారు తేజశ్విని మేడమ్. ఎర్రటి చూడిదార్ వేసుకొని, ఫోటోలో లాగానే అందంగా ఉన్నారమె....

ఆమెని చూస్తూనిలబడున్న నన్ను, "ఏమ్మా చంద్రకళా,  నీ పేరుకి తగ్గట్టుగా ఉన్నావు.  నర్వస్ గా ఫీలయ్యే అవసరం లేదు.... రెడీనా డాన్స్ కి?" అడిగారామె.

**

'వేదిక'నంటి నమస్కరించి,  ఇరవైఐదు నిముషాల్లోమూడు ఐటమ్స్ వరసగా చేసి, మంగళంతో ముగించాను.

హాల్లో తేజశ్విని మేడమ్ వెనుకే కూర్చున్న అమ్మవాళ్ళ దిశగా వెళుతుంటే,  తేజశ్విని మేడమ్ నన్ను దగ్గరకు రమ్మని సైగ చేసారు...

"వేరి నైస్. ఇవే ఐటమ్స్, అమెరికాలో నా స్టూడెంట్స్ కూడా చేస్తున్నారు.  నీవు మాత్రం, ఎంతో మెచ్యూరిటీతో హావభావాలు చక్కగా చూపించావు.  నీ గురించి మాస్టారుగారు చెప్పినది అక్షరాల నిజం," అని మెచ్చుకున్నారావిడ.

మరునాడు  కూడా  మమ్మల్ని  తొమ్మిదికల్లారమ్మన్నారు.

నా తరువాత ఆడిషన్  చేసే అమ్మాయి రావడంతో, మేము అక్కడినుండి కదిలాము.

**

“నైస్ పర్ఫామెన్స్,” అన్నాడు,  ఇంటికి  తిరిగొచ్చేప్పుడు, జగదీష్.

సంతోషంగా అనిపించింది..

ఇల్లు చేరాక, లంచ్ తినేసి చాలా సేపు కేరమ్స్, బోర్డ్ గేమ్స్ ఆడాము.

వినోద్ బాబు చేత తన ల్యాప్టాప్ మీదున్న గేమ్స్ ఆడించాడు జగదీష్…

నిజంగా, రాణి పక్కన లేకుండా, అతను, మాతో మాత్రమే సమయం గడపడం హాయిగా అనిపించింది.

‘కాని రేపటి నుండి మ్యూజిక్ క్లాస్ కి వస్తుందిగా రాణి… ఈ రెండు రోజులే, నా ఆడిషన్స్ వల్ల తన నుండి డిస్టర్బెన్స్ ఉండదు’ అనుకున్నాను.

తలగడలు  వేసుకుని టి.వి. చూస్తూ సిటింగ్ లోనే, తలా ఒక సోఫాలో పడుకుండిపోయాము..

**



రెండవ రోజు ఆడిషన్స్ కి – టెలిఫిలిం లోని ‘కల్యాణి’ పాత్రకి సంబంధించి, కొత్తరకం గెటప్ వేయించారు.  తేజశ్విని మేడమ్ దగ్గరుండి స్టిల్స్ తీయిస్తే, డైరెక్టర్ గారు డైలాగులు చెప్పించారు..

పనయి, మేము వెళ్ళిపోయే ముందు మా వద్దకు వచ్చారు తేజశ్విని మేడమ్.  “ఈ అబ్బాయి ఎవరు?  అచ్చం మా అబ్బాయి ‘విక్రమ్ లా ఉన్నాడు.  నిన్న చూసినప్పుడే అనుకున్నాను,” అడిగిందామె జగదీష్ వంక చూస్తూ.

“మా అన్నగారబ్బాయి జగదీష్ బాబు.  అన్నయ్యా వాళ్ళు ఢిల్లీలో ఉంటారు,” చెప్పింది అమ్మ.

“మరి ఈ యంగ్ హీరో ఎవరు? దిస్ గుడ్-లుకింగ్ బాయ్,” అంది వినోద్ ని చూస్తూ.

“వాడు మా అబ్బాయే, వినోద్ బాబు,” అంది అమ్మ.

దగ్గరగా వచ్చి, నా తలపై చేయి వేసారామె. “చూడమ్మా చంద్రకళా, నిన్ను చూస్తే ఆనందంగా ఉంది. నీ అంతప్పుడు, నృత్యం పట్ల నేనూ ఇలాగే క్రమశిక్షణతో, ఆసక్తితో ఉండేదాన్ని. విష్ యు గుడ్ లక్,” అంటూ అమ్మకి ఓ కవర్ అందించారామె.

“ఇందులో మా ప్రాజెక్ట్ వివరాలున్నాయి. ఆడిషన్ చేసిన వారందరికీ ఇచ్చే సమాచారం. హైదరాబాదులో కూడా మా పనయ్యాక, మన భూషణ్ గారితో మాట్లాడుతాను,” అన్నారామె.

**

ఇంటికి వస్తూ తేజశ్విని మేడమ్ గురించే మాట్లాడుకున్నాము. వినోద్ కి కూడా ఆమె చాలా నచ్చిందట.

“తేజశ్విని మేడమ్ లాంటి గ్రేట్ ఆర్టిస్ట్ ని మీట్ అయినందుకు సంతోషంగా ఉంది,” అంటూ నా వంక చూసాడు జగదీష్...

“నువ్వు ఫ్యూచర్ లో ఆమె లాగా అవ్వాలి. షి షుడ్ బి యువర్ రోల్-మాడల్,” అన్నాడు.

“అవునమ్మా చంద్రా! కళాకారిణిగా, నాట్యరంగంలో తేజశ్విని గారి వారసురాలివైతే, మనకింకేమి కావాలి? ఆమె గొప్ప కళాకారిణే కాదు, ఓ పరిపూర్ణ వ్యక్తి,” అంది అమ్మ.

“మేమంతా నీకు ఫుల్ సపోర్ట్. భూషణ్ అంకుల్ మాత్రం నీకు బిగ్గెస్ట్ సపోర్టర్, తెలుసా? అందుకే, ఆ రాణి జెలసీగా ఫీల్ అవుతుంది. అయినా, పట్టించుకోకుండా, ఆయన మీ ఇద్దరి విషయంలో ప్లాన్స్ వేస్తూనే ఉంటారు,” నవ్వుతూ జగదీష్.

‘ఈ రెండు రోజులు నన్ను ఎంకరేజ్ చేస్తూ జగదీష్ మా వెంట ఉన్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. చాలా మంచోడు జగదీష్.

‘ఐ లైక్ హిమ్, హి ఇజ్ స్వీట్ ’ అనుకున్నాను.

**

ఆవురావురుమంటూ లంచ్ తినేసి, హాల్లో ఉన్న సోఫాల్లో సెటిల్ అయిపోయాము. కామాక్షి కోసం ముందు తలుపులు వోరగా తీసి, అమ్మ, తన రూములోకి వెళ్ళిపోయింది.

అందరం అలిసిపోయున్నాము.... జగదీష్, వినోద్ క్రికెట్ వాచ్ చేస్తూనే, పది నిముషాల్లో నిద్రకి పడ్డారు. చేసేది లేక, ఛానల్ మార్చుకొని మూవీ చూస్తూ పడుకున్నాను.

**

ఉన్నట్టుండి నా వెనుక అడుగుల చప్పుడికి తల తిప్పి చూసాను. రాణి నిలబడి ఉంది.

తన క్లాస్ టైం కంటే ముందే వచ్చింది రాణి. మాట్లాడవద్దని సైగ చేసింది.

వెళ్ళి సోఫాలో పడుకునున్న జగదీష్ పక్కనే కూర్చుని, “హాయ్ ఫ్రెండ్, నిద్రలే, నిన్ను

చూడ్డానికే ముందుగా వచ్చాను,” అంటూ జగదీష్ భుజాలు పట్టి కుదిపేసింది.

ఉలిక్కి పడి లేచి కూర్చున్నాడు జగదీష్.  పకపకా నవ్వింది రాణి.  “నేను క్లాసుకి వెళ్ళేంత వరకు కబుర్లు చెప్పు,” అంది.

“ఓకే,” అని నా ఆడిషన్ సంగతులు చెప్పాడు.

అంతా విన్నాక, “నేను మాత్రం ఆడిషన్  లేకుండానే,  వచ్చే నెల ఒక సినిమాలో పాట పాడబోతున్నాను,” అంది రాణి.

**

తన మ్యూజిక్ క్లాస్ అయ్యాక, వాళ్ళ హోం-థియేటర్ లో మూవీ చూడ్డానికి రమ్మంది రాణి. మూవీ చూసే ఇంట్రెస్ట్ లేదంటూనే,  ఆమె పేరెంట్స్ ని  కలవడానికి మాత్రం, కాసేపట్లో వస్తానని చెప్పాడు జగదీష్.....

జగదీష్ చెన్నైలో ఉన్న మిగతా రోజుల ప్రోగ్రాం ఏమిటని వాకబు చేసింది.

“మీ స్టూడియో క్రిస్టమస్ పార్టీ రోజు తప్పించి, నాకు ఫ్రీటైం లేదు రాణి,”  అన్నాడు నవ్వుతూ ఆమెతో..

మౌనంగా ఆ సంభాషణ వింటూ, ‘ఆ  క్రిస్టమస్ పార్టీకి,  మమ్మల్ని ఇప్పటి వరకైతే  ఇన్వైట్  చేయలేదు  రాణి’ అనుకున్నాను.....

“ఒకే, ఐ విల్ సీ యు సూన్,” అంటూ కదిలింది రాణి.

**

సాయంత్రమవుతుండగా, భూషణ్ అంకుల్ వాళ్ళింటికి, జగదీష్ తో నేనూ వెళ్ళాను.  ఇంటి  ముందు నాలుగైదు వెహికల్స్ ఆగున్నాయి.  వాటిని దాటుకుంటూ గేటు లోనికి వెళ్ళాము.

కాస్తదూరంగా, ఇంటి ముందున్న లాన్ లో, రాణి కూర్చునుంది.  చేయూపి, అటుగా రమ్మని  పిలిచింది.  వెళ్ళి తన వద్ద కూర్చున్నాము...

ఊరి నుండి, బంధువులు వచ్చున్నారని, ఇంట్లో హౌజ్-ఫుల్ అని నవ్వింది.  మేమొచ్చామని పనిపిల్ల చేత, లోపలున్న అంకుల్ వాళ్లకి కబురు పంపింది.

కాసేపటికి, ఆంటీ అంకుల్  వచ్చి, జగదీష్ ని ఆప్యాయంగా పలకరించి, మా ఎదురుగా కూర్చున్నారు.  హార్ట్-పేషంట్ అయిన తన మేనత్తని, పల్లెనుండి చెన్నైకి తరలించే ఏర్పాట్లల్లో ఉన్నామంది ఆంటీ.

నా టెలి-ఫిలిం ఆడిషన్స్ గురించి వాకబు చేసాక, జగదీష్ తో, అంకుల్ సంభాషణ చిన్న ఊళ్లల్లోని వైద్య సదుపాయాల దిశగా సాగింది.

వాచ్ మెన్ గోవిందాన్ని పిలిచింది, నీరూ ఆంటీ.  స్టెమ్స్ తో పాటు, ఒక డజన్ లిల్లీ ఫ్లవర్స్ కోయించి, నేను వెళ్ళే లోగా నాకందించమని పురమాయించింది. అమ్మకి పూలంటే ఇష్టమని  గుర్తుపెట్టుకుని, అప్పుడప్పుడు తమ గార్డెన్ నుండి పువ్వులు పంపుతుంటుంది ఆంటీ.

మరి కాసేపు మాట్లాడి వారిద్దరు, లోనికెళ్ళిపోయారు.

**

రాణి, ప్రత్యేకంగా తెప్పించిన హాట్-చాక్లెట్ సిప్ చేస్తూ, లాన్ లోనే కూర్చున్నాము. తనకిష్టమైన సినిమాలు, మ్యూజిక్, దుస్తులు, హెయిర్ స్టైల్స్ – ఇలా తన రుచులు, అభిరుచుల గురించి చెప్పి, జగదీష్ కిష్టమైనవన్నీ అడిగి కనుక్కుంది.

అక్కడి నుండి ఎప్పటికి బయట పడతానోననుకుంటూ కూర్చున్నాను.

మరింత సేపటికి, "అత్తయ్య ఒక్కతే ఉంది.  వెళతాము," అంటూ లేచాడు జగదీష్.

ఇంకా ఉండమని జగదీష్ చేయి పట్టి కూర్చోబెట్టేసింది రాణి.

నాకు విసుగ్గా అనిపించినా, జగదీష్ తో పాటు మళ్ళీ కూర్చున్నాను....

"ఇప్పుడు క్రిస్టమస్ పార్టీ వివరాలు చెబుతాను విను. నిన్ను మీట్ అవ్వాలని నా గర్ల్-ఫ్రెండ్స్ అందరూ వెయిటింగ్ తెలుసా? మన పార్టీకి, వాళ్ళంతా డేట్స్ తో వస్తారు," అంది రాణి.

జగదీష్ ఏమనలేదు.

"జగదీష్, నువ్వు నా డేట్ వి కదా! మరి  చంద్రికి  ఫ్రెండ్ లేడని నాకు తెలుసు.  తను ఈ పార్టీ మిస్ అవుతుంది," మళ్ళీ రాణి....విని, మౌనంగా ఆలోచిస్తున్నట్టు ఉండిపోయాడు జగదీష్.

ఇంతలో, "చంద్రమ్మా, ఇవిగోనమ్మా మీ అమ్మగారికి పూలు," అంటూ నన్ను పలకరించి, టిష్యూలో చుట్టిన లిల్లీ స్టెమ్స్ నాకందించి వెళ్ళాడు వాచ్ మెన్ గోవిందన్.

అతనికి థాంక్స్ చెప్పాను...

తన ఆలోచన నుండి బయటపడి, జగదీష్ నోరు విప్పాడు...

“అయితే, ఓ పని చెయ్యి, రాణి. ఇది మీ స్టుడియోలో నువ్వు ఏర్పాటు చేసిన పార్టీ కదా!” మేక్ ఇట్ ఫామిలీ పార్టీ. అత్తయ్య వాళ్ళని ఎలా వదిలి వస్తాను?

అత్తయ్య, వినోద్ బాబు, మీ పేరెంట్స్ కూడా మనతో ఉంటే బాగుంటుంది....,” అన్నాడు జగదీష్.

రాణి ఏదో అనబోయింది.

“ఐ కేమ్ టు చెన్నై టు బి విత్ మై కజిన్స్ ఎండ్ అత్తయ్య. అందుకే, ఫామిలీ పార్టీ అయితే హ్యాపీ,” అని కూడా అన్నాడు జగదీష్.....

రాణి అప్సెట్ అవుతుందని నాకు భయంగా ఉంది.

“ఎలా కుదురుతుంది జగదీష్...? అన్న రాణి గొంతులో కోపం, దుఃఖం వినిపించాయి....

“కుదరాలి రాణి...ఆలోచించు. నేను అత్తయ్య కోసం వచ్చాను. ఫామిలీని వదిలేసి నీ డేట్ గా ఎలా పార్టీ ఎంజాయ్ చేస్తాను? కాబట్టి... మేక్ ఇట్ అ ఫామిలీ పార్టీ...,” అంటూ నన్ను బయలుదేరదీసాడు...

మేము గేటు దాటుతుండగా, అంకుల్ వాళ్ళ బంధువులు కూడా బయటకి వచ్చి టాక్సీలలో బయలుదేరి పోయారు.

**

ఇంటికొచ్చి, అమ్మతో వాకింగ్ కి బయలుదేరాము. మా కాంప్లెక్స్ లోనే, ట్రైల్ మీద చాలా సేపు నడిచి, అలిసిపోయి ఇల్లు చేరాము..డిన్నరయ్యాక, ‘ఘోస్ట్’ ఇంగ్లీష్ మూవీ చూశాము. దాంతో, ‘భయం భయం’ అంటూ వినోద్ చేసిన గోలకి, అమ్మతో సహా అందరం హాల్లోనే పడుకుండిపోయాము....

**

బ్రేక్ ఫాస్ట్  దగ్గర  జగదీష్ కి, వినోద్ కి, కొసరి కొసరి వడ్డించింది అమ్మ.

ఇంతలో హాల్లో ఫోన్ రింగయితే, తనే వెళ్ళి తీసింది.

"హలో నీరూ! చెప్పండి," అంటూ అక్కడే కూర్చుని మాట్లాడ సాగింది...

"అయ్యో, అదేమిటి?  పాపం! మరి ఇప్పుడు ఎలా ఉంది? బాధ పడుతుందా?" ఇలా సాగాయి అమ్మ మాటలు. నేను, జగదీష్ ఏమయిందోనని వింటున్నాము.

"అవునా? అయితే పర్వాలేదు....అలాగే నీరూ, తప్పక టైంకే వచ్చేస్తాము,"  అంటూ ఫోన్ పెట్టేసాక, మా వంక చూసింది అమ్మ.

"ఏమర్రా,  నిన్న మీరు వచ్చేసాక, ఎలా జరిగిందో గాని, రాణి చేయి కార్ డోర్ లో పడి బాగా నలిగి పోయిందట. కార్లో ఉండి పోయిన తన పర్స్ కోసం వెళ్ళినప్పుడు ఆక్సిడెంటల్ గా వేళ్ళు నలిగి, రక్తమట.  హాస్పిటల్ కి వెళితే, ఓ వేలికి నాలుగు స్టిచెస్ కూడా వేసారంట.

తీరా పార్టీ రేపనగా ఇలా అయ్యిందని నీరూ ఆంటీ బాధ పడుతుంది," చెప్పింది అమ్మ.

"అయ్యో," బాధనిపించింది నాకు

"రియల్లీ?  పూర్ తింగ్," అన్నాడు జగదీష్.

“పోనీ కాసేపు మీరే  రాణి దగ్గరికి వెళ్ళి రండి,” అంది అమ్మ.

**

తన చేతికి బ్యాండేజి ఉన్నా, క్రిస్టమస్ పార్టీలో ఉత్సాహంగానే తిరుగుతుంది రాణి.  పార్టీలో గేమ్స్ స్టాల్స్  కూడా ఏర్పాటు చేసింది.  అతిధుల్లో ఎక్కువ మంది తన స్నేహితులే  అవడంతో, కొంత బిజీగానే ఉంది.  నా క్లాస్మేట్ - లీనా జోసెఫ్, తన అక్క  రీనాతో వచ్చింది.

చక్కగా అలంకరించిన పెద్ద క్రిస్టమస్ ట్రీ చుట్టూ రంగురంగుల లైట్స్.  పార్టీ ఏరియా అంతా వెలిగిపోతుంది.   అందరూ మంచి ఫెస్టివ్ మూడ్ లో ఉన్నారు…

అమ్మకి తెలిసిన వాళ్ళు కూడా చాలా మందే వచ్చారు…

అమ్మ తన ఫ్రెండ్స్ తో బిజీ అయితే,  మేము ముగ్గురం  గేమ్స్ లో మునిగిపోయాము.. అన్నిటా వినోద్ ని గెలవనిస్తున్నాడు జగదీష్…

కాసేపటికి, మా గేమింగ్ టేబిల్ వద్దకు వచ్చింది రాణి.  జగదీష్ చేయిపట్టుకుని, “మా ఫ్రెండ్స్ ని పరిచయం చేస్తాను,” నవ్వుతూ అటుగా దారితీసింది.

**

అందర్నీ గమనిస్తూ కూర్చున్న నన్ను, భుజం పై తట్టి పలకరించి, వచ్చి పక్కనే కూర్చుంది లీనా.

దూరంగా హడావిడిగా తిరుగుతున్న రాణి వంక చూస్తూ "షి ఇజ్ సో బ్యూటిఫుల్, కదా! అంది.

ఔననట్టు తలాడించాను.

"ఆ పక్కనున్నది మీ కజిన్ జగదీష్ అంట కదా!" అడిగింది. ఔనని తలూపాను.

"అతను రాణి 'బాయ్ ఫ్రెండ్' అంటగా! అతనంటే తనకి చాలా ఇష్టమని చెప్తుంది ఫ్రెండ్స్ కి. సమ్మర్లో వచ్చి వెళ్ళినా, తనని చూడ్డానికే మళ్ళీ ఇప్పుడు చెన్నై వచ్చాడంటగా. మా అక్కా వాళ్ళంతా 'సో స్వీట్ ఆఫ్ హిమ్, అంటున్నారు," ఆగకుండా చెబుతూనే పోయింది లీనా.

మౌనంగా లీనా మాటలు వింటున్న నన్ను, కాసేపటికి జగదీష్ పిలిచాడు. కూడా వెళ్ళి, ప్లేట్స్ లోకి డిన్నర్ సర్వ్ చేసుకొని, అమ్మావాళ్ళు కూర్చున్న గజేబో దిశగా నడిచాము. అప్పటికే, అమ్మ, వినోద్ డిన్నర్ తెచ్చుకున్నారు.

ఆలోచిస్తూ తినడం మొదలుపెట్టాను. జగదీష్, రాణిల గురించి, లీనా అన్న మాటలు తలుచుకుంటే, కోపంగా ఉంది.

తలెత్తి పక్కనే ఉన్న జగదీష్ ని చూసాను.

"జగదీష్ బావా, నీకు న్యూస్..." అన్నాను. ఏమిటన్నట్టు చూసాడు.

"నువ్వు తన 'బాయ్ ఫ్రెండ్' అని రాణి మా స్కూల్లో వాళ్ళకి చెప్పింది," నవ్వుతూ అన్నాను.

"అవునా?" అడిగింది అమ్మ.

"అంతే కదా, ఐ యామ్ ఎ ఫ్రెండ్ ఎండ్ ఐ యామ్ ఎ బాయ్," అన్నాడు జగదీష్ నవ్వుతూ.

“ఏ? నీకు ‘జెలసీనా? అడిగాడు నన్ను.

“ఛీ, ఏం లేదు,” అన్నాను.

పెద్దగా నవ్వడం మొదలు పెట్టింది అమ్మ.

“అయితే, నువ్వు కూడా అందరికీ చెప్పు. జగదీష్ ఇజ్ మై ‘బాయ్ ఫ్రెండ్’ ఎండ్ కజిన్ అని. నేను నీక్కూడా ఫ్రెండ్ నే కదా!” అన్నాడు అమ్మతో పాటు నవ్వుతూ..

తలెత్తి ఏదో అనబోయేలోగా, సర్వెంట్ చేత ప్లేట్ పట్టించుకొని, రాణి, మా దిశగా రావడం కనబడింది. పింక్ కలర్ చూడిదార్ లో ఎప్పటిలా మెరిసిపోతుంది.....

వచ్చి నా ఎదురుగా, జగదీష్ పక్కనే కూర్చుంది రాణి.

**

డిన్నర్ అవుతుండగా, మా వద్దకు నీరూఆంటీ అంకుల్ వచ్చారు. అందరికీ పేరు పేరునా క్రిస్టమస్ గిఫ్టులు అందించారు వాళ్ళు. అమ్మ పక్కనే కూర్చుని, నీరూఆంటీ, అమ్మ చేతులకి రంగురంగుల అద్దాల గాజులని తొడిగింది,. హైదారాబాద్ నుండి తెప్పించారట.

“ఒక్క నిముషం, ఆల్మోస్ట్ ఫర్గాట్, అమ్మ నీకు కూడా గిఫ్ట్ పంపింది,” అంటూ జగదీష్ తన బ్లేజర్ పాకెట్ నుండి ఓ గోల్డ్ కలర్ బాక్స్ తీసిచ్చాడు రాణికి.

రాణి చాలా సంతోషంగా బాక్స్ ఓపెన్ చేసింది. కెంపుల పొదిగిన గణేష్ లాకెట్. చాలా బాగుంది.

“వెరీ నైస్ గిఫ్ట్, బాగుంది,” అన్నారు అంకుల్, ఆంటీ కూడా....

‘థాంక్యూ, ఇట్స్ బ్యూటిఫుల్,” అంటూ జగదీష్ హ్యాండ్ షేక్ చేసింది రాణి.

“డోంట్ మెన్షన్, మా అమ్మ కదా తీసుకొంది, అమ్మకి చెపుతాను, నీకూ నచ్చిందని,” అన్నాడు జగదీష్.

“ఏమ్మా కళా, ఫుడ్ బాగుందా? టేబిల్ అవతలి నుండి నా వద్దకు వచ్చారు అంకుల్....

“చాలా బాగుంది అంకుల్. స్పగేటీ, ఇటాలియన్ బ్రెడ్ నాకూ ఇష్టమే,” అన్నాను...

“అయితే, ప్లేట్లు ఖాళీగా ఉన్నాయే? మళ్ళీ సర్వ్ చేసుకొని ఎంజాయ్ చేయండి,” అని వెనుతిరిగిన అంకుల్, “మర్చిపోయాను కళా, ఓ సారి ఇలా రా, సాహిత్య అకాడెమీ మేడమ్ కి నిన్ను పరిచయం చేస్తాను,” అన్నారు. లేచి ఆయన్ని అనుసరించాను.



గజేబో నుండి దూరంగా వచ్చాక,  పక్కకి వేసున్న గార్డెన్ చైర్ లో కుచోమన్నారు.  మరో చైర్ లాక్కొని, నా ఎదురుగా కూచున్నారాయన.

“కళా, మొన్న మీరు మా యింటికి వచ్చినప్పుడు,  జగదీష్, రాణి ఏమన్నా గొడవ పడ్డారా?  రాణి అప్ సెట్ అయిందా? చెప్పు,” అడిగారు.

కాస్త ఆశ్చర్య పోయాను. వెంటనే తేరుకుని ఆనాటి విషయాలు చెప్పాను.

అంతా విన్నాక, "కరక్టే, పెద్ద గొడవేమీ లేదుగా!" క్షణమాగారు..

"మన రాణి ఆ రోజు జగదీష్ తో మాట్లాడుతూ అప్ సెట్ అయిందని, మీరు వెళ్ళి పోయాక, ఒక్కత్తే తన కార్ లో కూచుని కాసేపు మ్యూజిక్ విన్నదని, కోపంగా ఉండడం వల్లనేమో, కార్ డోర్ గట్టిగా బాది, తన చేతిని తానే గాయపరుచుకుందేమో! అని, అక్కడే ఉన్న వాచ్ మెన్ గోవిందన్ నాతో అంటున్నాడు," నా వంక సూటిగా చూసారు అంకుల్.

"చూడు కళా, మన రాణిని చిన్నప్పటి నుండి చూస్తున్నాడు, గోవిందన్. దాన్ని షికార్లు తిప్పి ఆడించేవాడు . రాణి కోపం, నడవడి వాడికి బాగా తెలుసు. అందుకే బాధ పడుతూనే, నాతో అలా వివరించాడు.నువ్వు మాత్రం ఈ సంగతి ఎవరితోనూ అనకు," కుర్చీ నుండి లేచారు..

"సరే, పద వెళదాము," అన్న అంకుల్ వెనుకే నడిచాను. మధ్యలో ఆగి, అకాడెమీ కమిటీ మెంబర్ సరస్వతమ్మకి నన్ను పరిచయం చేసారు....

మరికాసేపుండి, పార్టీ నుండి అర్ధరాత్రయ్యాక ఇల్లు చేరాము....

**

జగదీష్ తిరిగి ఢిల్లీ వెళ్ళిపోయాక, అతన్ని చాలా మిస్ అవుతున్నాము. అన్నిటికి హడావిడి చేసేవాడు.... నత్తిగా మాట్లాడే మీనాక్షితో కూడా కబుర్లు చెప్పేవాడు. మూలన పడున్న రాయిని కూడా మాట్లాడించగలడు జగదీష్' అనిపిస్తుంది...

"తుఫాను వచ్చి వెలిసినట్టుంది," అని అమ్మ అతని గురించి అన్న మాటలు నిజం..

క్రిస్టమస్ హాలిడేస్ సరదాగా సందడిగా గడిచాయి.

నాన్నకి, టెలి-ఫిలిం ఆడిషన్స్ బాగా జరిగాయని చెప్పాను.

మార్చ్ బదులు, ఫిబ్రవరి లోనే, తను తిరిగి చెన్నై వచ్చే అవకాశం ఉందంటున్నారు నాన్న.

అందరం రోజులు లెక్కపెడుతున్నాము...

స్కూల్స్ రి-వోపెన్ అయ్యాక, హోం వర్క్, ప్రాజెక్ట్స్ వర్క్ బాగా ఎక్కువగానే ఉంది..

ఎంత బిజీగా ఉన్నా, పార్టీ ముందురోజు సంఘటన గుర్తొస్తూనే ఉంటుంది. కావాలని, రాణి తన చేతిని, గాయపరుచుకుందేమో అన్న విషయం గుర్తొచ్చినప్పుడల్లా మనసు తొలిచేస్తుంది. ఉండబట్టలేక, అమ్మకా విషయం చెప్పినప్పుడు, కాసేపు ఆలోచించింది అమ్మ. రాణి విషయాలు ఎప్పటికప్పుడు మరిచిపొమ్మని గట్టిగా చెప్పింది..

**

'రేపే, నాన్న భూటాన్ నుండి వచ్చే రోజు. ఫిబ్రవరి14. లంచ్ టైంకంతా, నాన్న ఇంట్లోఉంటారు. లక్కీగా శనివారం. స్కూల్ కి వెళ్ళే పనిలేదు' అనుకుంటూ బ్రేక్ఫాస్ట్ ఫినిష్ చేసాము నేను, వినోద్....

బ్యాక్-ప్యాక్ అందుకుని, స్కూలుకి బయలుదేరబోతుంటే, అంకుల్ ఫోన్చేసారు. .టెలి-ఫిలింప్రాజెక్ట్ కి, నేను, సెలెక్ట్ అయ్యానని చెప్పారు. పట్టలేని ఉత్సాహంగా అనిపించింది.

"వెంటనే నాన్నకి చెప్పమ్మా," అన్నాను...

"రేపటి వరకు ఆగితే ఏం పోయింది?" అడిగింది...

క్షణం ఆలోచించాను.

నాన్న ఇంటికి వచ్చాకే, టెలిఫిలిం సంగతి చెప్పి సర్ప్రైజ్ చేద్దామని నిర్ణయించుకున్నాము...

సంతోషంగా, మేఘాల మీద నడుస్తున్నట్టుగా స్కూలుకి వెళ్ళిపోయాను...

**

రీసెస్ టైంలో, కెమిస్ట్రీ లాబ్ వైపు నడుస్తున్న నన్ను, ఎవరో, భుజంమీద చేయి వేసి ఆపారు. పక్కకి చూస్తే లీనా జోసఫ్. న్యూ-జెన్ మాగజిన్ లో నా ఫోటోస్, ఇంటర్వ్యూ చూసిందట. అభినందించింది.

నాతో పాటే నడుస్తూ కబుర్లు చెప్పడం మొదలు పెట్టింది.

“ఔనూ, రేపు ఫిబ్రవరి 14 వేలెంటైన్స్ డే. అదే, ప్రేమికులరోజున ఏం చేస్తున్నావు?” అడిగింది నన్ను..

“హాపి యెస్ట్ డే ఫర్ మి. ఆరునెల్ల తరువాత, మా నాన్న భూటాన్ నుండి ఇంటికి వచ్చేస్తున్నారు,” అన్నాను.

“ఓహో“ అలాగా! నైస్,” అనేసి, కొద్దిక్షణాలు మౌనంగా ఉంది...

“నీకు తెలుసా? వేలెంటైన్స్ డే గిఫ్టుగా, జగదీష్ బాబుకి లేటెస్ట్ మాడల్ లెనోవా లాప్ టాప్ పంపిందట, రాణి. అతను ఇవాళ ఫోన్ చేసి, అంతఖరీదైన గిఫ్ట్ పంపినందుకు గొడవ చేసినా, తరువాత నచ్చిందని చెప్పాడంట ... రాణి ఇజ్ సో హాపి. సెలెబ్రేషన్స్ కి తన ఫ్రెండ్స్ ని ఐస్ క్రీం పార్లర్ కి తీసుకువెళుతుంది. మా అక్క కూడా వెళుతుంది. ఇదంతా తనే చెప్పింది నాకు,” గబ గబా విషయం చెప్పింది లీనా.క్లాస్ రూమ్ వరకు వచ్చేసాము. మా వెనుకే టీచర్ కూడా లోనికి వచ్చారు..

“ఇదంతా ఎంత ఎగ్జైటింగ్ కదా!” , “మళ్ళీ మాట్లాడుతాను,”  అంటూ తన సీటులోకి వెళ్ళిపోయింది లీనా.

‘చాలా అనీజీగా అనిపించింది…  లీనా చెప్పిందంతా నిజమేనా?  రాణికి మరొకరు దొరకనట్టు జగదీష్ తోనే ఫ్రెండ్షిప్ చేయడం, విలువైన వేలెంటైన్స్ గిఫ్టులివ్వడం నాకస్సలు నచ్చడం లేదు..   అమ్మకి చెబితే ఏమంటుంది?’ అనుకున్నాను.

**

ఇంటికెళ్ళాక,  డాన్స్ క్లాసుకి తయారయి వెళ్లి డైనింగ్ దగ్గర కూర్చున్నాను.

అమ్మ నాకు హార్లిక్స్ కలిపిచ్చింది.  స్కూల్లో లీనాజోసెఫ్ నుండి విన్న విషయం అమ్మకి చెబుదామని తలెత్తాను.

“నీకోసం ఇదేదో ప్యాకేజి కొరియర్లో వచ్చింది,” అంటూ షెల్ఫ్ మీదున్న ఓ పార్సెల్ వంక చూపించింది అమ్మ.

నాకు ఎప్పుడూ కొరియర్ రాదే! …..

“ఏంటమ్మా అది?  అదేమిటో నువ్వే తీసి చూడు?” అన్నాను.

అమ్మ ప్యాకెట్ వోపెన్ చేసింది.

అందులో రెండు సెల్ ఫోన్లు,  ఒకటి రెడ్ కలర్.  ఒకటి బ్లాక్.

ఆశ్చర్యపోయాను.  నాకు ఫోన్లు పంపేదెవరు?

అమ్మ కవర్నుండి లెటర్ తీసి,  నాకు వినపడేలా చదివింది...

డియర్ చంద్రా,

మై సర్ప్రైజ్ టు యు బోత్.... (నీకు, వినోద్ కి).

మీకు నా వేలంటైన్స్ డే గిఫ్ట్ గా–సెల్ ఫోన్స్ పంపుతున్నాను

... నాకు మంచి డీల్ వచ్చింది.

నీకు రెడ్ ఫోన్, వినోద్ కి బ్లాక్.

అత్తయ్యకి చెప్పు,  ఏమీ స్పెండ్ చేసే అవసరం లేదు.   ఆ ఫోన్స్ కి ఇన్ – కమింగ్ కాల్స్ ఫ్రీ.  చార్జ్ చేసుకుంటే చాలు.  ఫోన్స్ విల్వర్క్. నేనే మీకు ఫోన్ చేస్తాను ఎప్పుడన్నా.

హోప్ యు లైక్ ద గిఫ్ట్.

టేక్ కేర్,

జగదీష్ బాబు.....

అరె, ఏంటిది? నమ్మలేకపోతున్నాను.. రియల్ సప్రైజ్....అప్పుడే మీనాక్షితో పార్క్ నుంచి వచ్చిన వినోద్ తనకి ఫోన్ గిఫ్ట్ వచ్చిందని ఎగిరిగంతేశాడు..

అమ్మ కూడా సప్రైజ్ అయింది. ప్యాకేజి వోపెన్ చేయకుండా నా కోసం వెయిట్ చేసిందట.

'థాంక్స్ చెప్పాలి జగదీష్ కి. నాకు, వినోద్ కి కూడా చాలా నచ్చాయి ఫోన్స్' అనుకుంటూ క్లాసుకి వెళ్ళిపోయాను.

"ఫోన్లు రెండు నేను చార్జ్ పెడతానులే, " వెనుక నుంచి అమ్మ అనడం వినబడింది.

**

పొద్దున్నే లేచి నాన్న రాక కోసం నిముషాలు లెక్కపెడుతూ, మరోసారి ఇల్లంతా సర్దేసాము.

పదయ్యాక ఎయిర్పోర్ట్ కి కన్నన్ జీపు తీసుకెళ్ళాడు.

నాన్న కిష్టమైన కిచిడి చేసి, వెజిటబిల్ ఆమ్లెట్ కి తయారు చేసింది అమ్మ.

నేను, వినోద్ బాల్కనీ లోనే వెయిటింగ్.....

**

సరీగ్గా ట్వెల్వ్ కి నాన్న వచ్చారు. వస్తూనే నన్ను, వినోద్ ని దగ్గరికి తీసుకున్నారు.

మాతో కబుర్లయ్యాక, స్నానం -పూజకానిచ్చి లంచ్ కి వచ్చారు.

ఆనందంగా ఉంది. కానీ, నాన్న సన్నగా అయ్యారు. జ్వరం వచ్చినట్టుగా వీక్ గా కనిపిస్తున్నారు..

నాన్నని చూస్తూ టిఫిన్ తింటున్న నాకు ఆపుకోలేని ఏడుపొచ్చేసింది. అమ్మకి కూడా.

“ఆరునెలలు కూడా అవ్వలేదు. ఎందుకలా చిక్కిపోయారు. మాకు అన్ని జాగ్రత్తలు చెప్పే మీరు ఇలాగైతే ఎలా?” అంది.

“ఏముంది శారదా? అక్కడ రెస్ట్ లేదు కదా! ఇక్కడ రొటీన్ డ్యూటీ లోపడి, నీ చేతివంట తింటే బాగయి పోతా. ఏరా వినోద్ బాబు, ఔనా కాదా? నువ్వు చెప్పు,” వినోద్ తో అంటూ, అమ్మని ఇంకొంచెం కిచిడి వడ్డించమన్నారు, నాన్న.

ఫోన్ రింగయితే, వెళ్ళితీసాను. భూషణ్ అంకుల్. “కళా, నాన్న వచ్చారు కదా! హ్యాపీనా?” అడిగారు. “నేను ఒకఫైల్ పంపుతానమ్మా. నాన్నకివ్వు. రేపు మేమే వచ్చి కలుస్తామని డాడీకి చెప్పు,” అన్నారాయన.

“అవును, ఇవాళ పూర్తిరెస్ట్ నాకు. ఏ పనులైనా రేపటి నుంచే,” విషయం విన్న నాన్న....

భూటాన్ నుండి మాకు తెచ్చిన వస్తువులు తీసిచ్చి, అక్కడి విశేషాలు, అక్కడి వారి తిండి – దుస్తులు- ఆచారాల గురించి, రాత్రివరకు కబుర్లు చెప్పారు.....

నాన్న అలిసిపోయి నిద్రపోయాక గాని మేము ఆయన వద్ద నుండి కదలలేదు.

**

పొద్దున్నే, బ్రేక్ ఫాస్ట్ అయ్యాక, అంకుల్ పంపిన 'రాగం- తానం- పల్లవి' టెలిఫిలిం ఫైల్ రీవ్యూ చేస్తూ అమ్మతో డిస్కస్ చేస్తున్నారు నాన్న. నేనూ వెళ్ళికూర్చున్నాను.

"ఏమ్మా, తేజశ్విని గారి ప్రొఫైల్ చూడు. అమెరికా, మలేషియా, జొహానెస్బర్గ్, సింగపూర్ లో—స్వచ్ఛందంగా- ఆలయాలకి, నేత్రదాన శిబిరాలకి, బీదవిద్యార్థుల స్కాలర్ షిప్పులకి మరెన్నో సాంఘిక కార్యక్రమాలకి.. తన నృత్యకళ ద్వారా నిధులు సేకరించారట. ఎంత అదృష్టం, ఎంతటి మానవీయత?

స్పెక్టాకులర్ కెరియర్ ఆమెది. ఈ'రాగం- తానం- పల్లవి' ప్రాజెక్ట్ తన తల్లితండ్రులకి అంకితం చేస్తారట ఆమె.

నా వంకచూస్తూ, "అర్ధమయ్యిందా? చిట్టితల్లీ" అన్నారు నాన్న.

అయిందన్నట్టు తలాడించాను.

"నేను కూడా తేజశ్విని అంతటి దాన్నవ్వాలని- మనకి, మాస్టారు గారికి, ఇంకా జగదీష్ బావకి కూడా అనిపిస్తుంది," అన్నాను నవ్వుతూ.నన్ను దగ్గరికి తీసుకొని, తలమీద ముద్దుపెట్టుకున్నారు నాన్న.



“ఆ భగవంతుడు ఇచ్చిన టాలెంట్ తో, నీవూ అంతటి స్థాయిని చేరుకోగలవని ఆశిద్దాము రా,” అన్నారు నాన్న.

నా కోసం కలలు కనే అమ్మానాన్న ఉండడం ఎంత అదృష్టం అనిపించి, నా కళ్ళల్లోనీరు తిరిగింది. ..... నాన్నకి, అమ్మకి కనబడకుండా గబుక్కున తుడిచేసాను.

“దేశదేశాల్లోఉన్న సాంస్కృతిక సభలు నీ నృత్యానికి ‘వేదిక’ లవ్వాలి. నీలోని కళకి కళాభిమానుల హృదయాలు ఉప్పొంగిపోవాలి,” అన్నారు నాన్న నా వంక చూసి.

నాలో ఒక కొత్త ఉత్సాహం తోచింది. నాన్న కోరిక తీరాలి. అందుగ్గాను నేను కృషి చెయ్యాలి. నాన్న అడుగుతున్నది అసాధ్యమేమీ కాదు.

'గాడ్ విల్ హెల్ప్ మీ! ఐ విల్ మేక్ మై ఫాదర్ ప్రౌడ్ ఆఫ్ మీ ' అనుకున్నాను.

గబుక్కున, నా క్లాస్మేట్ వాణి గుర్తొచ్చింది. --- తన పేరెంట్స్, తనని డాక్టర్ చెయ్యాలని కలలు కంటారంటూ, మండి పడుతుంది.......

అమ్మానాన్నల కలలను, మన కలలుగా చేసుకుంటే తప్పేముంది... అంత కోపం ద్వేషం ఎందుకో వాణికి?...

**

నాన్న హెల్త్ కోసం, స్పెషల్ డైట్ అంటూ, అమ్మ రకరకాల వంటకాలు చేయసాగింది.

ఆదివారం లంచ్ కి కూర్చున్నప్పుడు, దగ్గరుండి నాన్న చేత బోన్ సూప్ తాగించింది.

"సూప్ సరే, కానీ ఆ మాంసం కూరలు మాత్రం తినలేను శారదా," అన్నారు నాన్న...

"కాస్తన్నా తినేసి, కాసేపు రెస్ట్ తీసుకోండి. సాయంత్రం నీరూ, భూషణ్ వాళ్ళు వస్తారు," అంటూ నాన్నకి కర్రీ వడ్డించింది.

**

చీకటి పడుతుండగా వచ్చారు అంకుల్, ఆంటీ. నాన్నని చూసి, చాలా చిక్కారేమని ఆశ్చర్య పోయారు. నాన్న హెల్త్ గురించి వాకబు చేసారు.

“కొద్ది రోజులు ఇంటి పట్టునే ఉండి, మంచి డైట్ తీసుకొని, త్వరగా కోలుకో మేజర్,” అన్నారు భూషణ్ అంకుల్.

“అదే అనుకుంటున్నాను. అక్కడ ఫుడ్ పడలేదు. పైగా ‘యాసిడిటి’ డెవెలప్ అయినట్టుంది,” అన్నారు నాన్న.

“అదలా ఉంచితే, ఇక్కడ చంద్రకళ విషయంలో, నీ సపోర్ట్ కి, చాలా థాంక్స్,” అన్నారు నాన్న.

“ఇట్స్ మై డ్యూటీ ఎండ్ ప్లెజర్,” అన్నారు అంకుల్.

“మీ విషయాలు చెప్పు భూషణ్... మీరెలా ఉన్నారు? ఈ ఆరు నెలల్లో ఏమన్నా కొత్త ప్రాజెక్ట్స్ టేక్-అప్ చేసావా?” అడిగారు నాన్న...

“మేము బాగున్నాము. బిజీగా ఉన్నాము. త్వరలో, మా తండ్రిగారి పేరిట మేము స్థాపించిన ‘రాజ్ భూషణ్ మెడికల్ కాలేజ్’ పూర్తవుతుంది. అలాగే, నగర శివార్లలో హండ్రెడ్ బెడ్ అధునాతన హాస్పిటల్ కూడా. రెండిటి ప్రారంభోత్సవం త్వరలోనే పెట్టుకుంటాము. అర్హత ఉండీ, స్తోమత లేని విద్యార్థులకి ఈ సంస్థల్లో ఉచిత విద్య, ట్రైనింగ్ లభింపచేయాలని ప్రయత్నిస్తున్నాను,” అన్నారు అంకుల్.

“బాగుంది. లక్ష్మీ పుత్రులందరికీ నీ కున్న దూరదృష్టి, మంచి మనసు ఉంటే, సమాజానికి కూడా ఎంతో మేలు జరుగుతుందోయ్ భూషణ్. కంగ్రాచ్యులేషన్స్,” అంటున్న నాన్నకి,

తన చేతిలోని బుక్-లెట్ అందించారు అంకుల్ ....

“ఇది మన చంద్రకళ చేయబోతున్న టెలిఫిలిం ప్రాజెక్ట్ షెడ్యూల్. షూటింగ్ అంతా వేసవి సెలవల్లోనే జరుగుతుంది. ఒక నెల పని ఉంటుంది కళకి. కథానాయకి కళ్యాణి పాత్రలో మన కళ చక్కగా ఇముడుతుంది. రెండో మూడో సంప్రదాయ నృత్యాలు ఉంటాయి.

ఇక్కడ జెమిని చానల్ ద్వారా సీరియల్ గా టెలికాస్ట్ అవుతుంది. విదేశాల్లో కూడా ఎడ్యుకేషనల్ ఫిలింగా, పంపిణీకి ఏర్పాటు అయిందట," అని ప్రాజెక్ట్ గురించి అన్ని వివరాలు చెప్పారు అంకుల్...

"ఇక రెండో విషయం.... హైదరాబాద్ నుండి వంశీ ఆర్ట్స్ వాళ్ళు మన చంద్రకళ ప్రోగ్రామ్స్ భారిగా ఆంధ్రప్రదేశ్ లో స్పాన్సర్ చేస్తారంట. తీరిక చేసుకొని మాట్లాడమన్నారు," అన్నారు ...

"మన వీలు కూడా చూసుకుని, అన్నీ మాట్లాడుదాములే," అన్నారు నాన్న.

"మరో కప్పు కాఫీ కావాలి శారద గారు," అడిగారు అంకుల్ అమ్మని.

"మీకు మషాల దోసె ఇష్టం కదా. తిని వెళ్ళండి. మన రాణికి కూడా ఇష్టం. వచ్చి తినమని ఫోన్ చెయ్యండి భూషణ్ గారు," అంటూ, నీరూఆంటీ సహా అమ్మ కిచెన్ వైపు వెళ్ళింది.

"ఇవాళ వేలంటైన్స్ డాన్స్ పార్టీ అంటూ తన ఫ్రెండ్స్ తో వెళ్ళిందమ్మా, రాణి. కాబట్టి, దాని షేర్ దోసెలు కూడా నాకే," నవ్వుతూ అంకుల్.

**

నీరూ ఆంటీ, అంకుల్ వెళ్ళిపోయాక, అంతా హాల్లో చేరాము. తన రూములో నుండి సెల్ ఫోన్లో మాట్లాడుతూ వచ్చి, నాన్న పక్కనే చేరాడు వినోద్.... జగదీష్ తో మాట్లాడుతున్నాడని అర్ధమయింది...

"ఏరా కళా, మన జగదీష్ ఒక కేరింగ్, ఎఫెక్షనేట్ యంగ్-మాన్ అనిపిస్తున్నాడు కదూ!" అన్నారు ఉన్నట్టుండి నాన్న.

"అవును నాన్న, నువ్వు లేనప్పుడు మమ్మల్ని చూడ్డానికి వచ్చాడు కదా! బావ నా ఆడిషన్స్ కి తోడుగా ఉన్నాడు కూడా. హి ఇజ్ గుడ్ మాన్ ఎండ్ హెల్ప్ ఫుల్," అన్నాను.

“అవునా? శారదా,” అమ్మ వంక చూస్తూ నాన్న.

అప్పటికి ఫోన్ పెట్టేసిన వినోద్, “ జస్ట్ గుడ్ మాన్ కాదు డాడీ, బావ ఇజ్ మై హీరో , నాకెంతో మంచి ఫోన్ ఇచ్చాడు,” హ్యాపీగా వినోద్.

“అలాగా? డాడీ ఇజ్ మై హీరో అనేవాడివిగా! రాస్కెల్,” అన్నారు నాన్న వాడి చెవి పిండి.

“నువ్వు నా ఫస్ట్ హీరో. జగదీష్ బావ నా సెకండ్ హీరో,” అని వాడు అన్నాక గాని, వాడి చెవి వదల్లేదు నాన్న.

**

ఇంటిపట్టునే ఉన్నా నిరసంగా అనిపిస్తుందని వారం రోజులు సెలవు పొడిగించారు నాన్న…

పొద్దున్నే వాకింగ్ చేస్తున్నారు… ఇంట్లో యోగాసనాలు వేస్తున్నారు…నాన్న శీర్షాసనం వేసేప్పుడు, చాలా ఆశ్చర్యమనిపిస్తుంది. నేను, వినోద్ చూస్తూ ఉండిపోతున్నాము… నాన్న ఆర్మీ మాన్ కాబట్టి, అలా అంత సులువుగా చేస్తున్నారనుకున్నాము.

నాన్న యోగ అయ్యాకే, ఆయనతో బ్రేక్ఫాస్ట్ చేసి స్కూల్ కి వెళుతున్నాము…

నాన్న ఇలా ఇంట్లో ఉంటే, సరదాగా ఉందన్నాడు వినోద్.

**

స్కూల్ నుండి వచ్చేప్పటికి, సిటింగ్ రూం నుండి అమ్మ గొంతు పెద్దగా వినబడుతుంది. ఏదో మొత్తుకుంటుంది.

“ఎలాగండి? మొన్ననే కదా ఒక ఎస్సైన్మెంట్ నుండి హెల్త్ పాడయి వచ్చి, లీవ్ మీదున్నారు. అంతలో మళ్ళీ ఈ పిలుపేంటి?” అమ్మ కోపంగా.

“నేనో ఆర్మీ ఆఫీసర్నని మరిచిపోవద్దు. అస్సాం లోని మా యూనిట్ కి వెళ్ళే డ్యూటి రొటీన్గా నాకు పడింది. అన్నీ తెలిసి కూడా గోల చేస్తే ఎలా? అయినా నెలన్నర టైం ఉంది. వచ్చే వారం ఎలాగు, మెడికల్ చెకప్ కి, హాస్పిటల్లో ఎడ్మిట్ అవుతాను. అంతా బాగానే చెకౌట్ అవుతాను. నువ్వింత గొడవ చేస్తుంటే, పిల్లలు ఏమనుకుంటారు?” అడిగారు నాన్న.

వాకిట్లోనే నిలబడి ఇదంతా వింటున్న నేను, లోనికి వెళ్లి సోఫాలో నాన్న పక్కన కూర్చున్నాను. నాన్నకి మరోపక్క వినోద్ అంటిపెట్టుకుని కూర్చునున్నాడు.

ఏమిటి నాన్నా, బయట వరకు మీ మాటలు పెద్దగా వినబడుతున్నాయి. ఏమయింది?” అడిగాను ఆత్రుత్రగా.

“నువ్వు ముందు ఫ్రెష్ అయి రా, స్నాక్ తింటూ నేను చెప్పే కొన్ని విషయాలు వినచ్చు ,” అన్నారు నాన్న.

**

పది నిముషాల్లో ఫ్రెష్ అయి వెళ్ళి, నాన్న ఎదురుగా కుర్చీలో కూర్చున్నా, ‘చెప్పండి’ అన్నట్టు…

“ఫస్ట్ విషయం - నీ టెలి-ఫిలిం షూటింగ్ అయ్యాక, ఒక ఏడాది గడువులో - అంటే ఈ సమ్మర్ నుండి మళ్ళీ సమ్మర్ వరకు - మీ మాస్టారు గారి ‘నృత్యహేళి’ ప్రోగ్రాములు చాలు. పైగా ఇవన్నీ బయట ఊళ్ళ ప్రోగ్రాములు.. చదువు అశ్రద్ధ చేయకూడదు,” అని నావంక చూసారు.

తల ఊపాను, ఔనన్నట్టు.

“తరువాతి విషయం - నా జాబ్ గురించి.  నేను అస్సాం వెళ్ళవలసి ఉంటుంది.  దానికే మీ అమ్మ గొడవ చేస్తుంది. మరి డ్యూటీ కదా! అయినా ఎక్కువ  కాలం  అక్కడ ఉండాల్సిన అవసరం ఉండకపోవచ్చు,” అన్నారు నాన్న.

వెళ్ళి నాన్న పక్కనే కూర్చుని, ఆయన భుజం మీద తల ఆన్చాను.  నాన్న మళ్ళీ మమ్మల్ని వదిలి వెళ్ళడం తలుచుకుని ఏడుపొచ్చేసింది.

**

శనివారం  పొద్దున్నే వరసబెట్టి చుట్టాలందరికీ ఫోన్లు చేసే కార్యక్రమం పెట్టుకుంది అమ్మ. ముందుగా  కోటమ్మత్తతో చాలా సేపు మాట్లాడింది.  నా డాన్స్ ప్రోగ్రాములు నుండి, నాన్న మళ్ళీ ఉద్యోగానికి దూరంగా వెళ్ళవలసి రావడం వరకు, అన్ని సంగతులు చెప్పిందామెకి.  ఆమెతో ఫోన్ పెట్టేసాక,  రెండు వారాల్లో కోటమ్మత్త చెన్నైకి వచ్చేస్తుందని  అనౌన్స్ చేసింది కూడా. తరువాత  ఫోన్ కాల్  అమ్మమ్మకి.  ‘రాగం - తానం - పల్లవి’ గురించి  మాట్లాడి,  జగదీష్, గిఫ్ట్ గా పంపిన ఫోన్ల గురించి చెప్పింది.  జగదీష్ గురించి కూడా కాసేపు కబుర్లాడారు.  ప్రతివారం వారితో మాట్లాడి,  వారి యోగక్షేమాలు కనుక్కుంటాడని  చెప్పిందట  అమ్మమ్మ.

‘నాకూ, వినోద్ కి కూడా ఫోన్ చేస్తుంటాడు జగదీష్.

‘హలో ట్వింకిల్ టోస్’  అని పిలుస్తాడు నన్ను.   ఆ పిలుపు నాకు చాలా నచ్చుతుంది. వారమంతా జరిగిన సంగతులన్నీ చెప్పేవరకు ఊరుకోడు’ ...అని గుర్తు చేసుకున్నాను.

ఇంతలో అమ్మ, “హలో, వదినా,” అనడం వినిపించింది... ఢిల్లీ కాల్ అని అర్థమయింది....

చాలా సేపు కబుర్లు చెప్పింది మణిత్తయ్యకి.  రాణి, నీరూ ఆంటి పేర్లు కూడా వినబడ్డాయి అమ్మ మాటల్లో.

“చదువు విషయంగా, ఇటుపైన సమ్మర్లో కూడా బిజీ అయిపోతున్నాడట  జగదీష్,”  అంది అమ్మ,  ఫోన్ పెట్టేసాక.

**



నాన్న ఆర్మీ హాస్పిటల్ లోఎడ్మిటయ్యి వారమయింది.  చాలా మెడికల్ టెస్ట్స్ చేసారట కాని, ఇప్పటి వరకు నాన్న హెల్త్ స్టాటస్ మాత్రం క్లియర్ చేయ లేదట.  మరి కొన్ని రోజులు ఉండాలన్నారట. పగలంతా నాన్న దగ్గరే ఉండి, సాయంత్రానికి ఇంటికి వస్తుంది, అమ్మ.

ఆదివారం నాన్నని చూడ్డానికి నేను, వినోద్ వెళ్ళినప్పుడే, భూషణ్ అంకుల్, నీరూ ఆంటీ వచ్చారు.

“ఏమిటోయ్ మేజర్, వారం నుంచి ఇక్కడే ఉన్నావు? ఏమిటి కంప్లైన్ట్?” అన్నారు అంకుల్ నాన్నకి ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ..

“నిజమే, నా హాస్పిటల్ స్టే ఇన్ని రోజులు పడుతుందని అనుకోలేదు.

మొదటి సారి ‘డయాబెటిస్’ డిటెక్ట్ అవడమే కాక, బాగా హెచ్చుగా ఉందని రిపోర్ట్స్. ఇన్సులిన్ హైడోసెస్ మీద ఉన్నాను. బాగా ఫిజికల్ వీక్ నెస్ ఫీల్ అవుతున్నాను. అది గాక, రైఫల్ ట్రైనింగప్పుడు ఇంజ్యూరి అవడంతో కుడి కన్ను ఇబ్బంది పెడుతుంది. అన్ని పరీక్షలు చేసి స్పెషలిస్ట్ ని కన్సల్ట్ చేస్తున్నారు,” క్షణమాగారు నాన్న…

“ఇప్పటి నా హెల్త్ కండిషన్ లో, మళ్ళీ వెంటనే అస్సైన్ మెంట్ తీసుకుని, అస్సాంకి వెళ్ళే పరిస్థితి ఉండక పోవచ్చని అంటున్నారు డాక్టర్లు” అన్నారు.

“డయాబెటిస్ కంట్రోల్ అవుతుంది లెండి, సత్య గారు. మెడికల్ లీవ్ మీద ఇంటి పట్టునే ఉంటే హెల్త్ కుదుట పడుతుంది,” అంది ఆంటీ.

“మీరంతా వర్రీ అవకండమ్మా.. బాగానే ఉన్నాను, ఇక్కడ బోలెడంత రెస్ట్. రెండు రోజుల్లో ఇంటికి వచ్చేస్తాను,” జవాబుగా నాన్న.

నాన్న, అస్సాంకి వెళ్ళక పోవచ్చని మాత్రం అర్ధమయింది నాకు. అందరం హ్యాపీ. ఇంకా కొద్ది రోజులు లీవ్ మీద ఉండి

రెస్ట్ తీసుకుంటే నాన్న బాగయి పోతారు.

**

మళ్ళీ ఆదివారం నాడు పొద్దుటే, ఊరి నుండి కోటమ్మత్త వచ్చింది.. మమ్మల్ని ఆప్యాయంగా దగ్గరికి తీసుకొంది.... వినోద్ ని చూసి, అచ్చంగా నాన్న చిన్నప్పుటిలా ఉన్నాడంది. చిన్నప్పటి నాన్న లాగా డాన్సులు, డ్రామాలు, చేస్తున్నానంటూ, నన్ను ముద్దు పెటుకుంది.

ఫ్రెష్ అయ్యి, కబుర్లు చెబుతూ, కాఫీ టిఫిన్ కానిచ్చింది.

నేను డాన్స్ క్లాస్ కి వెళుతుంటే, నాతో పాటే బయలు దేరింది కోటమ్మత్త.

**

రెండు గంటల సేపు జరిగిన మా ప్రాక్టీసులు చూసి, ఇంటికొచ్చాక నన్ను చాలా మెచ్చుకుంది.

నాకన్నా పెద్ద వాళ్ళతో, సినిమా యాక్టర్లతో కలిసి నాట్యం చేస్తున్నానంటూ ఆశ్చర్య పోయింది కోటమ్మత్త...

కబుర్లు చెబుతూ భోంచేసి, ఆమె సర్దుకునే లోగా, నాన్న హాస్పిటల్ నుండి డిస్చార్జయ్యి, ఇంటికి వచ్చేసారు. తన తమ్ముణ్ణి చూసి కన్నీళ్లు పెట్టుకుంది. నాన్న కి ఇష్టమైనవి తానే వండి పెట్టి, నాన్నన్ని మళ్ళీ ఆరోగ్యం గా బొద్దుగా చేస్తానని నవ్వేసింది కూడా.

**

మెడికల్ లీవ్ మీద ఇంట్లోనే ఉన్న నాన్న, మరిన్ని టెస్ట్స్ చేయించుకోడానికి హాస్పిటల్కి వెళ్లివస్తున్నారు. ఆయన హెల్త్ గురించి అమ్మ దిగులుగా ఉంటుంది.

ఆర్మీ నుండి బయట పడి, సివిల్ జాబ్ చేయమని, ఉండుండి, నాన్నతో గొడవ పడతుంది కూడా.

ఓ మారు భోజనం వడ్డిస్తూ కూడా అదే విషయం మాట్లాడుతున్న అమ్మని వారించారు నాన్న.

"చూడు శారదా, ఇక్కడ ప్రస్తుతం, మనముంటున్న ఫ్లాట్, బాబు ఎడ్యుకేషన్ ఆర్మీ వాళ్ళే ఇస్తున్నారు. అస్సాం వెళ్ళడం లేదు కదా! నా మెడికల్ లీవ్ మరో మూడు నెలల వరకు పొడిగించ వచ్చు. ఈలోగా, ఆర్మీ నుండి తప్పు కోవడం గురించి అలోచించి, నిర్ణయం తీసుకుంటాను. కాస్త ఓపిక పట్టు" అమ్మకి నచ్చ జెప్పారు నాన్న....

అది విన్న తరువాత, అమ్మ ముఖం కాస్త ప్రశాంతంగా మారింది...

చిరునవ్వుతో, నాన్నకి కొసరి కొసరి వడ్డించ సాగింది...

"అసలు నువ్వు మర్చి పోతున్న ముఖ్యమైన విషయం ఒకటుంది, శారదా..- నాట్య రంగంలో మన చంద్రకళ వృద్ధిలోకి రావాలంటే, చెన్నైలో ఉండడమే కరెక్ట్. ఔనా?" అమ్మ వంక చూస్తూ అడిగారు...

"అంతే కాదు, ఇన్నాళ్ళుగా నీ మ్యూజిక్ క్లాసుల విషయంగా కూడా స్థిర పడ్డావిక్కడ. కాబట్టి, అన్నీ అలోచించి నిర్ణయాలు తీసుకుందాము.. నాకు తెలుసు కదా! కాబట్టి, నువ్వు బాధ పడుతూ నన్ను విసిగించకు,"... అంటూ భోజనం ముగించారు నాన్న.......

**

ఆ సంభాషణ జరిగిన వారానికి, తేజశ్విని గారి డాన్స్ బ్రోష్యూర్స్ కలెక్ట్ చేసి, నన్ను వెంట బెట్టుకొని, మాస్టారు గారిని కలిసింది అమ్మ.  తేజశ్విని గారి అనుమతితో ఆవిడ కూర్చిన 'దేవి స్తోత్రమాలిక', 'సంభవామి యుగే యుగే', 'గురువే నమః', 'కన్య', 'మానస పుత్రి' లాగా ఓ కథా వస్తువు ఉన్న నృత్యాంశాల్లో నాకు శిక్షణ ఇవ్వమని రిక్వెస్ట్ చేసింది. సంగీతం, పాటల విషయంలో తాను కూడా వీలైన సహకారాన్ని అందిస్తానని చెప్పిందాయనికి.

మాస్టారు గారు అంతా విని, 'తప్పకుండా ఆలోచిద్దాము శారద గారు," అన్నారు.

ఇలా ప్రోగ్రాములు తగ్గించి నృత్య శిక్షణ పైన దృష్టి పెట్టడమే సరయిందన్నారు నాన్న, జగదీష్ కూడా....

**

తలకి నూనె రాసి, కోటమ్మత్తలాగా మర్దనా చేయడం, మరెవ్వరికీ సాధ్యం కాదంటారు నాన్న.

అది గుర్తొచ్చి, శనివారం లంచ్ అయ్యాక, నూనె సీసా తీసుకుని వెళ్ళి ఆమె ముందు కూర్చున్నాను.

"మీ అమ్మ లాగా మంచి సిరి గల జుట్టు, చంద్రకళా నీది," అంది కోటమ్మత్త జుట్టు చిక్కు తీస్తూ.

"మీ నాన్న కూడా చిన్నప్పుడు, ఇలాగే తలకి తైలం పట్టించి మర్దనా చేయమనే వాడని చెప్పానా?" నవ్వుతూ కోటమ్మత్త.....

“నాన్న సంగతులు ఇంకా చెప్పత్తా” అడిగాను.

“నువ్వు సరిగ్గా కూర్చో...నూనె పెడుతూ చెబుతా మీ నాన్న అల్లరి గురించి,” అంది ఆత్త.

ఆమె చెప్పిన దాన్ని బట్టి- ముగ్గురాడపిల్లల తరువాత, వాళ్ళమ్మ సత్యనారాయణ స్వామికి మొక్కుకుంటే పుట్టిన వారసుడట-నాన్న. అతి గారాబంగా పెరిగాడట. ఐదేళ్లవరకు వాళ్ళమ్మ దగ్గరే పాలు తాగేవాడట. చిన్నప్పుడు, స్కూలుకి వెళ్ళకుండా, నిక్కర్ మాత్రమే వేసుకొని, ఊరంతా గోలీలాడుతూ తిరిగేవాడట. స్నేహితుల్ని వెంటేసుకొని, బావుల్లో, చెరువుల్లో ఈత కొట్టేవాడట.

ఓ రోజు, కత్తెర్తి కాయలు కోసం, చెట్టుని రాళ్ళతో కొడుతుంటే, ‘బుస్సుమంటూ ’ఓ పదహారు పడగల పాము, నాన్న మీదకి పడగ విప్పిందట. దాంతో దడుసుకొని జ్వరమొచ్చి, నాలుగు రోజులు పడకేసాడట, పాపం, నాన్న. అప్పుడు నాన్న వయస్సు తొమ్మిదేళ్ళట. ...

అట్లా జబ్బు పడి లేచాక మాత్రం స్కూలుకి వెళ్లడం మొదలు పెట్టాడట.

బడికి వెళ్ళినా, అక్కడ కూడా అల్లరేనట.

“చదువులో ఫస్ట్ ఉండేవాడు మీ నాన్న. డ్రామాలు, పాటలంటే ఇష్టంతో అదే పని మీద ఉండే వాడు. కృష్ణుడు వేషం వేయిస్తే సత్య భామ వేసే అమ్మాయి అందంగా లేదని గొడవ చేసి ఆడపిల్లలకి పేర్లు పెట్టేవాడు.

ఏమైనా, చాలా తెలివి గలవాడవడంతో, డబుల్ ప్రమోషన్స్ వచ్చి చదువులో దూసుకు పోయాడనుకో. మీ

నాన్నలాంటి వాళ్ళు చాలా అరుదేనమ్మా, చంద్రకళా," అని జడ వేయడం ముగించింది, కోటమ్మత్త.

నాన్న గురించి వింటుంటే, నాకు ఏడు పొచ్చేసింది. నేను కళ్ళు తుడుచుకోడం చూసి, అత్తా అమ్మా కూడా కాస్త గాభరా పడ్డారు.

నాన్న చిన్నతనం గురించి విన్నాక, నాన్న మీద నాకు ప్రేమ మరింత ఎక్కువైంది.

చిన్నప్పుడు అల్లరి వాడైనా, పాపం! నాన్న అమాయకుడు....

ఎంతో కష్టపడి పైకొచ్చానని చెబుతూనే ఉంటారు' అనుకున్నాను.

'నాన్నని సంతోష పెట్టాలి. 'ఐవిల్ మేక్ హిమ్ ప్రౌడ్ ఆఫ్ మి' అని మనస్సులో గట్టిగా అనుకున్నాను..

**

ఆదివారం డాన్స్ క్లాసుకి వెళ్ళేప్పటికి, కాంపౌండులో గవర్నమెంట్ వెహికల్స్ పార్క్ చేసి ఉన్నాయి. 'ఎవరై ఉండవచ్చో' అనుకుంటూ, అప్పుడే వచ్చిన కాంచన, మంజరి వాళ్ళతో పాటు క్లాసు లోపలికెళ్ళాను.

అక్కడ, మా గురువు గారితో మాట్లాడుతూ, చాలా మందే ఉన్నారు. ఆయన పక్కన బల్లమీద పూల హారాలు, బొకేలు ఉన్నాయి.

మమ్మల్ని, పక్కనే ఉన్న శేషు మాస్టారి క్లాస్ రూములో వెయిట్ చేయమన్నారాయన.

**

మరో అర గంటకి, చేతిలో కవర్లతో, ఆయనే మా వద్దకు వచ్చారు. కల్చరల్ కమిటీ మెంబర్స్ తో, రాబోయే టూర్ గురించి సంప్రదింపులు జరుపుతున్నానని చెబుతూ, చేతిలోని కవర్లుమాకందించారు. వాటిల్లో 'నృత్యహేళి' కార్యక్రమాల వివరాలున్నాయన్నారు.

ఉన్నట్టుండి ఏర్పాటయిన సమావేశమవడంతో, క్లాస్ కాన్సెల్ చేసే వ్యవధి కూడా లేక పోయిందని చెప్పి, మమ్మల్ని బ్రేక్ తీసుకోమని కోరారు.

**

'నృత్యహేళి' కవర్ తీసుకొని, గబగబా ఇంటికొచ్చేప్పటికి, ఇంటి ముందు తలుపులు తీసే ఉన్నాయి. వరండాలో ఎవరివో షూజ్, సాండల్స్ ఉన్నాయి.

హాల్లోకి వస్తుంటే, అమ్మ వాళ్ళ గది నుండి అమ్మ గొంతు వినబడింది. ఎందుకో అప్ సెట్ అయినట్టుగా ఉంది. ఇంచు మించు ఏడ్చేస్తుంది.



“ఊరుకోమ్మా శారదా, నువ్వింత బాధ పడితే ఎలా?” కోటమ్మత్త అమ్మని సముదాయిస్తుంది.

ఏం జరుగుతుందో అర్థం కాక…. వాళ్ళున్న గదికి దగ్గరగా అడుగులు వేసాను.

అంతలో భూషణ్ అంకుల్ గొంతు వినబడింది.

“చూడండి, మీరిద్దరు ఇంతగా డీలా పడకండి. మీ పిల్లలు పసివాళ్ళు. ఇప్పుడు వాళ్ళు ఇంట్లోలేక పోవడం నయమయింది. మిమ్మల్ని ఇలా చూస్తే బెంబేలెత్తిపోతారు,” అన్నారాయన.

కొద్ది మౌనం తరువాత,..  "చూడు సత్యం, నీకు వచ్చిన ఈ 'మయస్తీనగ్రావిస్' అనే వ్యాధి మామూలుగా అయితే, 'మజిల్ వీక్ నెస్' అనవచ్చు.  అంటే 'కండరాల బలహీనత'.  ఇదే హెల్త్ కండిషన్ –నాకు తెలిసిన ఓ ఆర్టిస్ట్ క్కూడా ఉంది.  వ్యాధి సోకిన తరువాత కూడా ఇరవైయేళ్ళగా సినిమాల్లో యాక్ట్ చేస్తున్నాడు.  అతని జీవితం బాగానే ఉంది. కాబట్టి, నీవు మరీ అధైర్య పడే పని లేదు.

ఆర్మీ డ్యూటి నుండి విరామం తీసుకొని, కమర్షియల్ టాక్సెస్ లో పొజిషన్ తీసుకో.

పోతే, ఎటువంటి అవసరానికైనా మీకు మేమున్నామని కూడా గుర్తుపెట్టుకో," , "ఇక బాధ పడకు...ఆల్టర్నేట్ ప్లాన్స్ ఆలోచించవోయ్,"  మళ్ళీ అంకుల్...

నా గుండెలు జారినట్టయ్యింది.  ఏడుపొచ్చింది.. నాన్న కేమయిందో...

ఇంతలో నీరసంగా నాన్న గొంతు....

"అది కాదు భూషణ్,  చంద్రకళని కళాకారిణిగా పైకి తేవాలంటే, ఇక్కడ ఎన్నో అవకాశాలతో పాటు నీ సపోర్ట్ ఉంది.. పోతే, నా సివిల్ జాబ్ కూడా, అనువైన పోస్టింగ్ రావాలంటే టైం పడుతుంది... ఫామిలిని ఇక్కడే చెన్నైలో ఉంచి, నేను వెళ్లి వస్తుండాలి.

అలా చేయాలన్నా, ఈ వ్యాధితో లైఫ్ ఎలా ఉంటుందో! ఒక కన్ను పూర్తిగా వీక్ అవ్వడంతో, అదొక పెద్ద అడ్జస్ట్ మెంట్...అంతా అగమ్య గోచరంగా ఉందోయ్," నాన్న గొంతు కూడా బరువుగా మారింది.

"ఇంక ఊరుకో సత్యం. శారద గారిని చూడు, యేడ్చేస్తున్నారు.  ప్రస్తుతం నీది తీవ్రమైన పరిస్థితి కాదనే చెప్పారుగా!

నాకు తెలిసిన మంచి నిపుణులు ఉన్నారు.  సెకెండ్ ఒపీనియన్ కోసం మరో న్యూరాలజిస్ట్ ని కూడా సంప్రదిద్దాము. కాబట్టి, అధైర్య పడవద్దని పదే పదే చెబుతున్నా, విను,"  నమ్మ పలికారు అంకుల్.

ఒక్క క్షణం అంతా మౌనం... ఏం చేయాలో తోచలేదు. అడుగు ముందుకు వేయ బోయి, ఆంటీ మాట విని ఆగాను..

"మమ్మల్ని పరాయి వాళ్లగా భావించకండి సత్య గారు. మా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి. చంద్రకళ మాకు సొంత బిడ్డ లాంటిదే. ఆ అమ్మాయంటే మాకు అభిమానం, ప్రేమ," అందామె మృదువుగా...

అమ్మ వెక్కి వెక్కి దుఃఖ పడటం వినబడుతుంది...

"శారద,.  నా తమ్ముడు బాగయి పోతాడమ్మా. నమ్మకముంచు. భూషణ్ గారు కూడా చెబుతున్నారుగా... భయ పడ వద్దని భరోసా ఇస్తున్నారుగా.  ఇక నువ్వు లేచి ముఖం కడుక్కో..క్లబ్బు నుండి బాబు,  క్లాస్ నుండి చంద్రా వచ్చేస్తారు..," కోటమ్మత్త గొంతు...

"అవును శారద, కాస్త మీరు మనసుని కుదుట పరుచు కొండి...... ఆ రిపోర్ట్స్ లోపల పెట్టేయండి.  మనం అన్ని సంగతులు అలోచించి ముందుకు సాగుదాము," మళ్ళీ నీరూ ఆంటీ గొంతు...

"ఇక నుండి, కొద్ది కాలం, చంద్రకళ టెలి ఫిలిం షూటింగ్–ప్రోగ్రాముల విషయాలు పూర్తిగా నాకు వదిలేసి, నీ విషయాలు చూసుకో సత్యం," అన్నారు అంకుల్..

“ఇంకా మూడు నెలల వరకు అయితే, మెడికల్ లీవ్ కొనసాగించమని వైద్యులే సూచించారు.  పరిస్థితిని బట్టి అవసరమయితే మరో మూడు నెలలు పొడిగిస్తారు కూడా,” జవాబుగా నాన్న గొంతు…

**

నేనిక గబ గబా అక్కడి నుండి కిందకి వచ్చేసాను. గేట్ వెనుక గార్డెన్ లో బెంచ్ మీద కూర్చున్నాను.

‘అసలేమిటిదంతా? ఏమవుతుంది? మెడికల్ రిపోర్ట్స్ వచ్చాయన్న మాట. నాన్నకి ఏదో వ్యాధి ఉందని తెలిసిందన్నమాట.. అంకుల్ మాటల్ని బట్టి, ఇదే వ్యాధి ఉన్న ఒకాయన బాగానే ఉన్నాడుగా! అలాగే నాన్న కూడా బాగుంటారు.

కాని, మరి తనకి ఒక కన్ను కనబడదు అంటున్నారే నాన్న?….ఆలోచనలతో కంగారుగా ఉంది. ఆపుకోలేని దుఃఖం వచ్చింది…

నాన్న హెల్త్ విషయంగా, అమ్మ వాళ్ళు, ఎవరికి ఏమి చెబుతారో, ఏమి చేస్తారో వాళ్ళిష్టం… నేను మాత్రం అన్ని విధాల వాళ్లకి సహాయంగా ఉంటాను… అంతా అయోమయంగా ఉంది.

కళ్ళు తుడుచుకుని, గేటు వైపు చూస్తూ కూర్చున్నాను….

కాసేపటికి, భూషణ్ అంకుల్ వాళ్ళ కారు గేటు ముందు నుండి కదలడం, క్లబ్ నుండి మా కార్ లోనికి రావడం ఒకే సారి జరిగాయి.

చేతిలోని కవర్ తో, పార్క్ ఏరియా నుండి కదిలి, ఫ్లాట్ కి మెట్లెక్కాను….నా వెనుకే, వినోద్ కూడా…..

**

ఇంట్లో అంతా నిశ్శబ్దం... కోటమ్మత్తే మాకు లంచ్ పెట్టింది. నాన్నెందుకు గమ్మున పడుకున్నారని అడిగాడు వినోద్. నాన్నకి నడుం నొప్పి ఎక్కువైందంటూ, కన్నన్ ని పిలిచి, అతని చేత నాన్న నడుం పట్టించింది. అమ్మకేమో బాగా తలనొప్పి, గొడవ చేయద్దంది.

లంచ్ చేసి, నేను, వినోద్ ఎవరి గదుల్లోకి వాళ్ళం వెళ్ళి పోయాము...

దిగులుగా అనిపించి, జగదీష్ కి ఫోన్ చేసాను.

“హాయ్ ట్వింకిల్ టోస్, వాట్స్ హాపెనింగ్,” అన్నాడు.

“నేనే చేద్దామనుకుంటున్నా..గ్రేట్ న్యూస్ చెప్పడానికి.. అసలు ఊహించ గలవా? ఈ ఇయర్ చెస్ చాంపియన్ని నేనేనని.. అదీ సీనియర్ డివిజన్ లో పార్టిసిపేట్ చేసి గెలిచాను,” అన్నాడు సంతోషంగా.......

కంగ్రాట్స్ చెప్పాను....

“ఇప్పుడు చెప్పు, ఈ టైం లో ఫోన్ చేసావంటే, ఏమిటి సంగతి. కొత్త డాన్స్ ప్రాజెక్ట్స్ ఏమన్నా?” అడిగాడు...

“ఉన్నవే... వివరాలు, డేట్స్ తెలిసాయి....సమ్మర్ మొదటి వారంలోనే హైదరాబాద్ ప్రోగ్రాం ఉంటుంది. రాగానే, టెలి-ఫిలిం షూటింగ్ అట. నువ్వు రాలేవుగా. యువిల్ బి మిస్డ్,” అన్నాను...

“అవును చాంద్, మరో రెండు సమ్మర్స్ వరకు ఎక్కడికీ కదల కుండా ఇక్కడ వర్క్ చేస్తేనే నా కాలేజ్ అడ్మిషన్ ఈజీ అవుతుంది.... అయినా షూటింగ్ జరిగేప్పుడు, ప్రతి రోజు ఫోన్ చేసి వివరాలు కనుక్కుంటాగా...

ఐ విల్ మిస్ యు ఎండ్ ఆల్ యువర్ డాన్స్ యాక్టివిటీ,” అన్నాడు...

అప్పుడప్పుడు నన్ను ‘చాంద్’ అని కూడా అంటుంటాడు..నాకదీ ఇష్టమే..

“అవునూ, హైదరాబాద్ ప్రోగ్రాం అంటే ఆ మూవీ స్టార్స్ తో కలిసి చేసే ప్రోగ్రామేనా?” అడిగాడు..

అది విని నవ్వొచ్చింది...

“చాంద్, నువ్వు వాళ్ళ కన్నా బెటర్ గా చెయ్యాలి... నీ స్ట్రాంగ్ పాయింట్ – నీ అభినయం... వర్క్ ఆన్ దట్,”, “ఇక వెళ్ళనా? జిమ్ లో ఉన్నాను, ” అన్నాడు....

జగదీష్ తో మాట్లాడాక నా మనసు కాస్త తేలికయింది...

**

ఫస్ట్ ప్రోగ్రాం కి హైదరాబాదు, అక్కడి నుండి అహ్మదా బాదుకి, మా ట్రైన్ జర్నీ ఎంజాయ్ చేసాము. మంజరి, కాంచన ఆపకుండా కబుర్లు చెప్పారు.

సినిమా హీరాయిన్స్ తో జర్నీ కూడా, సరదాగా ఓ అనుభవమే...

ప్రోగ్రాముల్లో ముందుగా నేను కాళీయ కృష్ణుడిగా నర్తించి, తరువాతి సెగ్మెంట్ కి హెయిర్-స్టైల్, కాస్ట్యూమ్ మార్చి,  విడి గా డాన్స్ ఐటమ్స్ తో పాటు, మంజరి కాంచనలతో కలిసి అన్నమయ్య కీర్తనలు చేసాను.....

వాటిల్లో

కులుకక నడవరో కొమ్మలారా!

జల జల రాలే నే జాజులు మా అమ్మకు, ....అనే పాట ఒకటి...

చిరుత నవ్వుల వాడు సిన్నక్క...

వీడు వెరపెరుగడు సూడవే సిన్నక్కా...అనే పాట మరోటి...

ఈ రెండు ఐటమ్స్ - ప్రోగ్రాములకి హైలైట్ అన్నారు అందరూ...

నా పర్ ఫామెన్స్ ని ఆర్గనైజర్స్, పెద్దలు విశేషంగా కొనియాడారని గురువుగారు చెప్పారు.

ఒక్కో సారి మంజరి, కాంచనల కంటే నాకే పేరు, మెప్పు వచ్చాయని కూడా ఆర్కెస్ట్రా వాళ్ళు అన్నారు.

న్యూస్ రీవ్యులు కూడా అదే రాసాయి.  దొరికినంత వరకు ఆ రీవ్యూలు కలెక్ట్ చేసింది అమ్మ.

అలా 'వేదికల' మీద నాకెంతో ఇష్టమైన నాట్యం చేసి, అంత మంది ప్రేక్షకుల మన్నన పొందగలగడం చాలా అదృష్టం' అన్నది ఎంతో నిజం...అందరూ అన్నట్టు అది 'గాడ్స్ గిఫ్ట్'...

అని తెలుసును...చాలా ఉత్సాహాన్నిచ్చాయి మా ప్రోగ్రాములు.

**

ప్రోగ్రామ్స్ అయ్యి, చెన్నై చేరి ఇంట్లోకి అడుగు పెడుతూనే,  నా సూట్ కేస్ లోని న్యూస్ పేపర్స్ నాన్నకందించాను. కోటమ్మత్తని కూడా వచ్చి హాల్లో మా పక్కన కూర్చోమన్నాను.

నాన్న ఆ రీవ్యూస్ చదివి ఏమంటారో వినాలని ఆత్రుతగా ఉంది.

ఒక దాని వెంట ఒకటిగా చేతి కిచ్చిన పేపర్స్ చదువుతున్న నాన్నని చూస్తూ కూర్చున్నాను.

ఎంత సేపైనా చదువుతూనే ఉన్నారు నాన్న. అమ్మ ఇక ఆగ లేక పోయింది....

“ఎంత సేపు చదువుతారు… నేను చెబుతాను వినండి, “ అంది.

“చెప్పు చెప్పు… వింటాను,” అన్నారు నాన్న నవ్వుతూ.

“మీరు చూడాల్సింది, ఇద్దరు సినిమా స్టార్స్ మధ్య కూడా చంద్రమెరుపు తీగలా కనబడింది… అలాగే నర్తించింది…,” అంది అమ్మ.

‘ఆ, ఔనా,’…అన్నట్టు తలాడించారు నాన్న….

…. ‘యువ నర్తకి చంద్రకళ నాట్యం ప్రేక్షకులని మంత్రముగ్ధులను చేసింది.. పిన్న వయసులోనే, ‘భామా కలాపం లేఖ’, ‘నవ రసాలు’ నృత్యాంశ్యాల్లో ఆమె చూపిన హావ భావాలు కళాభిమానులని ఆశ్చర్య పరిచింది. ఉత్తమ నర్తకిగా చంద్రకళకి ఉజ్వల భవిష్యత్తు ఉందని ముఖ్య అతిథులుగా వచ్చిన శ్రీ స్వామీ దాసు గారు’ ప్రసంగించి, చంద్రకళకి తమ దీవెనలు అందించారు’…. తెలుగు పేపర్ రివ్యూ నుండి పెద్దగా చదివారు నాన్న’…

“మన చంద్రకళ హైట్, కదలికలు, అందరిలో ఉన్నతంగా ఉంటాయి మరి,” అన్నారు.

నేను అక్కడ లేనట్టే మాట్లాడుకుంటున్న వాళ్ళని చూస్తుంటే నవ్వొచ్చింది నాకు……



రాత్రి భోజనానికి, నాన్నకిష్టమైన అరటి పువ్వు కర్రీ, ఉర్లగడ్డ కారంతో పాటు, నాకిష్టమైన వంటకాలు చేసింది కోటమ్మత్త

'మేము ఊళ్ళో లేని ఈ వారం రోజుల్లో విశేషాలు ఏమిటి," అడిగింది అమ్మ నాన్న ప్లేటులో వడ్డిస్తూ.....

వినోద్ కల్పించుకున్నాడు...

"మీరు లేరుగా, నాన్న రోజూ నన్ను ఐస్ క్రీం తిననిచ్చారు. మాతో పాటు గ్రౌండ్స్ లో క్రికెట్ కూడా ఆడారు,"
సంతోషంగా వాడు.

“ఔనా? ఆటలు మంచిదే కాని, రోజూ ఐస్ క్రీం తినడం ఏమిటి?” నాన్న వంక చూస్తూ అమ్మ.

“అదేమీ లేదు. రెండు సార్లు వాడి ఫ్రెండ్స్ ని కూడా తీసుకుని పార్లర్ కి వెళ్లాను. అంతే,...” నవ్వారు నాన్న.

“ఇక పోతే, ఆర్మీ డ్యూటి విషయంగా, మా సుపీరియర్స్ ని, లాయర్ని కూడా కలిసాను. క్లియర్ గా డిస్కస్ చేసాను. రామ్ లో కూడా మాట్లాడాను. ఇంక రిటర్మెంట్ విషయంగా ముందడుగు వేయడమే. మీరు ఊరి నుండి వచ్చాక, భూషణ్ వాళ్ళకి కూడా చెబుదామని ఆగాను. వాళ్ళని, రేపు సాయంత్రం డిన్నర్ కి రమ్మందామా?” అడిగారు నాన్న.

భోజనమయ్యాక, భూషణ్ అంకుల్ కి ఫోన్ చేసి, వాళ్ళని మరు నాడు డిన్నర్ కి పిలిచారు.

**

నేను డాన్స్ క్లాస్ నుండి వచ్చేప్పటికే అంకుల్, ఆంటీ వచ్చున్నారు....

నాన్న వాళ్ళతో మాట్లాడుతుండగా, నన్ను, వినోద్ ని భోంచేసేయమంది అమ్మ.

ఆర్మీ నుండి ‘ప్రి-మెచ్యూర్ రిటైర్మెంట్‘ తీసుకోడానికి డిసైడ్ అయ్యానని, సమ్మర్ అయ్యాక అఫీషియల్ గా ఆర్మీ నుండి రిటైర్ అవుతానని, తన సివిల్ పోస్టింగ్ కూడా చెన్నైకి దగ్గరిగా వచ్చేలా ప్రయత్నాలు మొదలు పెడతానని, అంకుల్ కి వివరించారు నాన్న.

“మొత్తానికి ఇదో కొత్త చాప్టర్...నీలైఫ్ లో.....అంతా సవ్యంగా ఉంటుందిలే సత్యం. ఇక పోతే, నీ సివిల్ పోస్టింగ్ కి- నెల్లూరు, తిరుపతి, మంచి సెంటర్స్ కదా!,” అన్నారు అంకుల్...

వాళ్ళ మాటలు వింటూ, మేము మా డిన్నర్ ముగించాము....

డైనింగ్ టేబిల్ మీద మళ్ళీ వంటకాలన్నీ సర్ది, అంకుల్ వాళ్ళని భోజనానికి పిలిచింది అమ్మ.

**

'రాగం-తానం-పల్లవి' టెలి-ఫిలిం షూటింగ్ మొదటి రోజు, భూషణ్ అంకుల్ వాళ్ళ స్టూడియోలోనే ప్రారంభ పూజ చేసారు.

రెండు రోజుల పాటు కోటమ్మత్త కూడా షూటింగ్ చూడ్డానికి, వచ్చింది.

"అమ్మో, ఎంత కళ ఉందమ్మా నీలో! నీ వేషం కూడా చాలా నచ్చింది నాకు. ఎంత ముద్దుగా ఉన్నావో," , "పోనీలే, ఆ దేవుడే మీకు మేలు చెయ్యాలి," అంటూ ఆశీర్వదించిందామె.

షూటింగ్, ఓ కొత్త అనుభవం.. ఉత్సాహంగా జరుగుతుంది..నాన్న అప్పుడప్పుడు వచ్చి కాసేపు ఉండి, మాతో లంచ్ చేసి వెళుతున్నారు.

**

తేజశ్విని గారి ఫామిలిని కలిశాము. ఆమె కూతురు కవిత, హీరోయిన్ కళ్యాణి పాత్రలో నటిస్తుంది..నేను టీనేజర్ కళ్యాణి అయితే, ఆమె ఎదిగిన కళ్యాణి పాత్ర పోషిస్తుంది.

తేజశ్విని గారి కొడుకు విక్రమ్. జగదీష్ లాగానే ఉన్నాడు. ఇంకాస్త పొడవుగా, సన్నగా ఉన్నాడు. మంచి మాటకారి...అక్కా తమ్ముళ్ళు ఇద్దరు, నాతో ఫ్రెండ్లీగా ఉన్నారు.

షూటింగ్ కూడా, ఏ మాత్రం వొత్తిడి లేకుండా, పిక్నిక్ లా అనిపిస్తుంది.

**

రోజూ ఇంటికొచ్చి ఫ్రెష్ అయ్యేప్పటికి, నాన్న, కోటమ్మత్త షూటింగ్ కబుర్లకోసం చుట్టూ చేరుతారు. అదే టైం కి జగదీష్ కూడా ఫోన్ చేస్తాడు. ఫోన్ స్పీకర్ మీదుంచి, అందరికీ ఒకే సారి షూటింగ్ విశేషాలు చెప్పాకే భోంచేస్తాను.

రెండు రోజుల షూటింగ్ మిగిలుండగా, రోజూలా ఫోన్ చేసిన జగదీష్, “ఇవాళ ముందు నన్ను న్యూస్ చెప్పనివ్వు,” అన్నాడు. రాణి సంగతులు చెప్పడం మొదలు పెట్టాడు.

“రేపు వాళ్ళ స్టుడియోలోనే ఏదో తమిళ్ మూవీ కి రాణి సాంగ్ రికార్డింగ్ చేస్తుందట. మీ టెలి-ఫిలిం టెలి కాస్ట్ అయ్యే టైం కి ఆ తమిళ్ మూవీ రిలీజ్ అవుతుందట,” అన్నాడు...

నా ఆడిషన్స్ జరుగుతున్నప్పుడే, తను ఇలా మూవీ సాంగ్ రికార్డ్ చేయబోతానని చెప్పిందని గుర్తుచేసాను...

‘ఇక్కడ కబుర్లు కొన్ని నా కంటే ముందే రాణి నుండి తెలుసుకుంటాడు జగదీష్. అదే నాకు నచ్చదు. కాని ఏమంటాను!.

ఇదివరకంటే, నేను ఎక్కువ మాట్లాడేదాన్ని కాదు. ఇప్పుడు అన్ని కబుర్లు చెబుతూనే ఉంటాను అతనికి. ‘అయినా, అసలు రాణితో పోటీ పడ్డం అయ్యే పని కాదు’ అని మనసులోనే అనుకున్నాను.

ఇక మళ్ళీ రేపే మాట్లాడుతానని, ‘బై’ చెప్పి ఫోన్ పెట్టేసాను....

**

టెలి-ఫిలిం షూటింగ్ ముగిసిన సంధర్భంగా భూషణ్ అంకుల్ వాళ్ళింటికి డిన్నర్ కి వెళ్ళాము.

వాళ్ళ గార్డెన్-హౌజ్ లో నే డిన్నర్ ఏర్పాటు చేసారు.. నాన్నా వాళ్ళతో, విక్రమ్, కవిత కబుర్లు మొదలు బెట్టారు. విక్రమ్ మాట్లాడే, వచ్చీ రాని తెలుగు బాగుందన్నారు నాన్న. షూటింగ్ సందర్భంగా, గడిచిన నెల రోజుల్లో విక్రమ్ కి బాగానే దగ్గరయ్యాడు వినోద్. ఇద్దరూ కలిసి సెట్స్ మీద అల్లరి చేసేవారు.

**

డిన్నర్ కి, చైనీస్ ఫుడ్ సర్వ్ చేసారు. కబుర్లు చెప్పుకుంటూ, డిన్నర్ ఎంజాయ్ చేసాము. భోజనాలయ్యాక, అందరం తేజశ్విని మేడమ్ చుట్టూ చేరాము.

నాన్న వచ్చి నా వెనుకగా నిలబడ్డారు.

"మరైతే, తేజశ్విని గారు, మా అమ్మాయి మి అడుగు జాడల్లో నడవాలనుకుంటుంది. మి గురువుగారితో సహా, అంతా కళ ని మీతోనే పోలుస్తున్నారు. నాట్య రంగంలో ఎదగాలని, దేశ విదేశాలు పర్యటించి ప్రదర్శనలిచ్చి, మీలాగా స్థిర పడి, మా చంద్రకళ కూడా ఈ విద్యని తన తరువాతి తరం వారికి నేర్పించాలని, నా కోరిక, మా ఆశయం. మీరేమంటారు? మా బోటి వారికి అది సాధ్యమేనా?" అడిగారు నాన్న.

...."తేజశ్విని మేడమ్ ఏమంటుందో నేను చెప్పుతా," అన్నాడు విక్రమ్ చేయి పైకెత్తి..

నేనూ కుతూహలంగా అతని వంక చూసాను.

నా గురించి వాళ్ళమ్మ గొప్పగా చెప్పిందని, నన్ను మీట్ అయ్యాకే, అదంతా నిజమని తెలిసిందన్నాడు విక్రమ్. అక్కడితో ఆగకుండా, అతిశయం లేని నాలాంటి అమ్మాయిని తనెక్కడా చూడ లేదని, నేను తనకి చాలా నచ్చానంటూ, అందరికి వినబడేలా చెప్పాడు..

అతని మాటలు నాకు కాస్త ఇబ్బందిగా అనిపించింది.

“ఆ క్రెడిట్ వాళ్ళ పేరెంట్స్ కి ఇద్దాము విక్రమ్,” అన్నారు భూషణ్ అంకుల్...

“మరైతే అందరూ నోరు తీపి చేసుకోండి,” అంటూ డెజర్ట్ సర్వ్ చేయించింది నీరూ ఆంటీ...

“మా చంద్రకళ పై మంచి అభిప్రాయం ఉంచుకున్నందుకు థాంక్స్ తేజశ్విని గారు. మీ సలహా కూడా మాకు కావాలి,” అన్నారు నాన్న ఫ్రూట్ తింటూ.

“ఇంత డెడికేషన్ ఉన్న అమ్మాయికి అసాధ్యమేముంది మేజర్ గారు? ముందుగా అంతర్జాతీయంగా అవకాశం వచ్చి కొంత టూర్ చెయ్యాలి. మన భూషణ్ ఉన్నారుగా ప్లాన్ చేస్తారు. తన చదువయ్యాకే, చంద్రకళ అమెరికాకి రావచ్చు. మేము అక్కడ యోగ ఇన్స్టిట్యూట్ కూడా స్టార్ట్ చెయ్య బోతున్నాము.. ముందైతే, ఇటు డాన్స్, అటు యోగ కూడా సమ్మర్ క్యాంప్ కండక్ట్ చేయవచ్చు చంద్రకళ,” , “ఇక ఆ తరువాత, అక్కడే స్థిర పడాలంటే, నా ప్రోత్సాహం ఎలాగూ ఉంటుంది,”... అన్నారు తేజశ్విని మేడమ్ జవాబుగా, నాన్నతో...

**

అమెరికా లోని కళారంగం, కళాకారుల పరిస్థితి గురించి, నాన్న అడుగుతున్న ప్రశ్నలకి తాపిగా జవాబులిస్తున్నారు తేజశ్విని గారు...నేను అమ్మా కూడా ఆసక్తిగా వింటున్నాము.

“హే, చంద్రకళా, పూర్తిగా మర్చి పోయాను,” అంది ఉన్నట్టుండి కవిత నాతో.......

సెట్స్ మీద తను తీసిన ఫోటోస్ ఇ-మెయిల్ చేస్తానంటూ, నా ఇ-మెయిల్ ఐ.డి అడిగింది.

నాకు స్కూల్ మ్యూజిక్ గ్రూప్, అకడెమిక్ రిసోర్స్ ఇ-మెయిల్ తప్ప, పర్సనల్ కంప్యూటర్ గాని, వేరే ఇ-మెయిల్ ఐ.డి గాని లేదని చెప్పాను. విక్రమ్, కవిత ఒక్క సారిగా ఆశ్చర్య పోయారు.

“దట్స్ నాట్ రైట్,” అన్నాడు విక్రమ్.

మా టెలి-ఫిలిం డాన్సులు, ఫోటోస్ కూడా, వాళ్ళ ఇన్స్టిట్యూట్ వెబ్-పేజ్ మీద,

యూ-ట్యూబ్ లోనూ పెడతారు కాబట్టి, నాకు ల్యాప్ టాప్ చాలా అవసరమంది కవిత. త్వరగా ఒక ల్యాప్ టాప్ పర్ చేజ్ చేసి, తమతో చాట్ చెయ్యాలన్నాడు విక్రమ్.

ఇదంతా వింటున్న రాణి నవ్వింది. “చంద్రకళ ఈ మధ్యనే సెల్ ఫోను వాడడం మొదలు పెట్టింది. కంప్యూటర్ అంటే, మళ్ళీ ఢిల్లీలో ఉన్న తన కజిన్ ల్యాప్ టాప్ కొని పెట్టి, నేర్పిస్తేనే ఏమన్నా,” అంది గొంతెత్తి అందరికీ విన బడేలా.

ఒక్క నిముషం ఎవరు ఏమీ అన లేదు.

చాలా అవమానంగా అనిపించి, తల దించుకున్నాను.


“హే, యు రాణి. లీవ్ హర్ ఎలోన్. అంత రూడ్ గా మాట్లాడుతావేంటి. ఆమె ఒక ఆర్టిస్ట్, ఆమెకి కంప్యూటర్ మీద ఇంట్రెస్ట్ లేదేమో,” అన్నాడు విక్రమ్, అంతే గట్టిగా.

“వాట్ ఆర్ వి? మేము కూడా ఆర్టిస్ట్ ల మే విక్రమ్,” అంటూ నవ్వేసింది రాణి.

“అందరి అమ్మాయిల్లాకాదు చంద్రకళ, షి ఇజ్ డెడికేటెడ్ టు హర్ ఆర్ట్,” అన్నాడు విక్రమ్.

రాణి కాస్త షాకయినట్టుగా చూసి, మౌనంగా ఉండి పోయింది.

“మామ్, మనం వెళ్ళే లోగానే, మనస్వార్ కి ఓ ల్యాప్ టాప్, గిఫ్ట్ గా ఇవ్వాలి,” అన్నాడు విక్రమ్ వాళ్ళ మమ్మీతో.



ఇదంతా వింటున్న భూషణ్ అంకుల్ కలగజేసుకున్నారు.

“విక్రమ్, నేను చంద్రకళ మానేజర్ ని కూడా. వెంటనే తనకి ల్యాప్ టాప్ సెటప్ చేయిస్తాను. త్వరలో మీతో కమ్యూనికేట్ చేసేలా చూస్తాను. ఐ ప్రామిస్,” అన్నారు.

“డాన్స్, చదువులతో చాలా బిజీగా ఉంటుంది. చంద్రకళకి టైం ఎక్కడుంది?” అంటూ నవ్వేసింది నీరూ ఆంటీ.

వాళ్ళిద్దరూ రాణి దుడుకు తనం కప్పి పుచ్చబోయారు. వాళ్ళని ఇలాగే ఇంతకు ముందు కూడా ఇబ్బంది పెట్టింది, రాణి. అమ్మ, నాన్న, కోటమ్మత్త వినోద్, తేజశ్విని మేడమ్ సహా, ఇదంతా గమనిస్తున్నారు.

**

పార్టీ నుండి ఇంటికొచ్చి, రాణి అన్న మాటలు తలుచుకుంటూ, బట్టలు మార్చుకున్నాను. హాల్లోకి వెళ్ళి టి.వి చూస్తున్న నాన్న పక్కనే సోఫాలో కూర్చున్నాను.

లేట్-నైట్  న్యూస్ చూడ్డం నాన్నతో పాటు నాకూ అలవాటయింది.

కాసేపటికి కోటమ్మత్త అమ్మ, వినోద్ కూడా వచ్చి చుట్టూ చేరారు.

ఏదో చెప్పాలన్న ఆదుర్దా కనబడింది  కోటమ్మత్తలో....

"ఏందమ్మా!  వాళ్ళ పిల్ల భలే కుళ్ళు దానిలా ఉందే?  మన అమ్మాయి మీద బాగా ఏడుపే.  ఇంగ్లీషులో ఏమందో గాని, మన కళని అవమానించిందని, అందుకే ఆ అమెరికా అబ్బాయి తిరిగి ఆ పిల్లని కోపడ్డాడని మాత్రం అర్థమవుతూనే వుంది," అనేసింది కూడా అత్త.

"అవును, మీరన్నది నిజమే," క్షణమాగింది అమ్మ.

"మన అమ్మాయంటే, ఎందుకంత అసహనం,"  అడిగింది అత్త...

"ఏం లేదు వదినా, మన చంద్రకళ అంటే, భూషణ్ గారు ప్రేమగా ఉంటారని, డాన్స్ విషయంలో ప్రోత్సహిస్తారని,

కుళ్ళుకుంటుంది.

మరి ఉంటదిగా! ఆ అమ్మాయి కూడా చిన్నదేగా!" అంది అమ్మ.

**

సెలవులో ఉండడంతో, పాత ఫర్నిచర్ తీసేసి, కొత్తవి పెట్టించే పనిలో పడ్డారు, నాన్న. సోఫా సెట్ నుండి, బెడ్-రూమ్స్ వరకు ఓపిగ్గా సెలెక్ట్ చేసి, నాలుగు రోజుల పాటు, అందంగా అన్నీ సర్దించారు...

ఆ పని అవుతూనే, రెండు రోజులు కోటమ్మత్తతో పాలెం వెళ్ళొచ్చారు.

...అక్కడ చుట్టాల వైఖరి ఇది వరకులా లేదని, అమ్మ దగ్గర బాధపడ్డారు. నానమ్మ, తాత బాగా నీరస పడ్డారని... తన అక్కల పిల్లలు ఎదురు తిరిగి, ఆస్తులు, పొలాలు, మిద్దెలు కూడా ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని చెప్పుకొచ్చారు.....

మానసికంగా కూడా అలిసి పోయున్న నాన్న, ప్రయాణంతో మరింత నీరసించి పోవడం, అమ్మని కంగారు పెట్టింది..... అందుకేనేమో, రాత్రి భోజనం వడ్డిస్తూ కూడా ముభావంగా ఉంది.

అమ్మని గమనిస్తూ తినడం మొదలుపెట్టాను.

"ఇంతింత కూరలు తినలేను శారదా," అంటున్న నాన్న మీద చిరాకు పడింది.

"వంకలు పెట్టకుండా, వడ్డించింది తినండి. మీరు త్వరగా కోలుకోవడం ముఖ్యం. ఈలోగా చంద్రడాన్స్ విషయంగా ఓ ముఖ్యమైన పని కూడా చేయాలి మనం....దాని గురించి మీతో మాట్లాడాలి," అంది అమ్మ,

తన పళ్ళెంలో వడ్డించుకుంటూ..

**

ఆ మరునాడు, మాస్టారి గారిని కలిసి నా కూచిపూడి రంగప్రవేశం గురించి మాట్లాడింది అమ్మ. వీలయినంత త్వరగా ఆ కార్యక్రమం  జరిపించేయాలని ఆయన్ని కోరింది.

'అమ్మ అన్ని విషయాల్లో ఇలా ఎప్పటికప్పుడు కొత్తప్లాన్స్ వేస్తుంది' అనుకున్నాను.

'సంభవామి యుగే యుగే' అని రంగప్రవేశ కార్యక్రమానికి టైటిల్ నిర్ధారించి, ప్రాక్టీసులు మొదలు పెట్టించేయమంది..

అమ్మ చెప్పేది విని, కాసేపు ఆలోచించారు, మాస్టారు గారు. నాట్యాంశాల ఎంపిక, కూర్పు అయ్యాక, త్వరలోనే ప్రాక్టీసులు మొదలు పెట్టుకుందామన్నారు.

ప్రోగ్రాముకి సిద్ధమవడానికి, ఎనిమిది నెలల సమయమన్నా ఉండాలన్నారు....

రాబోయే ఉగాది పండుగ సమయానికి ఏర్పాట్లు చేసుకోమన్నారు.

**

ఆ మరునాడు నన్ను 'యోగ' శిక్షణలో ఎన్రోల్ చేసి, ల్యాప్ టాప్  ఆర్డర్ చేసారు నాన్న. సాయంత్రం అమ్మతో పాటు 'టీ' తాగుతూ,  'రంగప్రవేశం'  ఖర్చులు అంచనా వేయసాగారు.

“అయినా మన చంద్రకళ ఇప్పటికే గుర్తింపున్న  కళాకారిణి కదా! తన  ‘రంగప్రవేశం’  స్పాన్సర్  చేయడానికి ముందుకు వచ్చే కళా సంఘాలు ఉండవచ్చు...కాబట్టి,  నన్ను ముందు ఆ  దిశగా ప్రయత్నించనివ్వండి,”  అన్నారు సీరియస్ గా...

**

ఇదంతా ఇలా ఉంటే, ప్లాన్ ప్రకారమే  నాన్న  అఫీషియల్ గా ఆర్మీ నుండి రిటైర్ అయ్యారు. సివిల్ పోస్టింగ్ వచ్చేంత మటుకు,  నాన్నకి, తమ స్టూడియోలో ఎగ్జిక్యూటివ్ మానేజర్ గా జాబ్ ఆఫర్ చేసారు అంకుల్.  నాన్న సంతోషంగా ఒప్పుకున్నారు...

క్రిస్టమస్ హాలిడేస్ ముందు,  ఇండిపెండెంట్ ఇల్లు అద్దెకి తీసుకున్నాము. వినోద్ ఆర్మీ స్కూల్ నుండి మారి, ప్రైవేట్ స్కూల్లో చేరాడు... ఇప్పటికే, స్పోర్ట్స్ లోనే కాక చదువులో కూడా టాప్ అచీవర్  గా గుర్తింపు పొందాడు వాడు..

**

నా ‘రంగప్రవేశం’ ప్రాక్టీసులు చాలా ఉత్సాహంగా సాగుతున్నాయి.

లోక కల్యాణం కోసం, ఒక్కో యుగంలో - ఒక్కో రూపాన భూమిన వెలిసిన ఆ విష్ణుమూర్తికి, నీరాజనాలు పడుతూ సాగే ‘సంభవామి యుగే యుగే’ కాన్సెప్ట్  కి, నృత్యాంశాలని  చాలా అర్థవంతంగా, అందంగా  కూర్చారు మాస్టారు.

అదో అందమైన భావనలో ఒక్కో అంశానికి నృత్యం చేస్తుంటే, రాత్రింబవళ్ళు దేవుని సంకీర్తనలో, పవిత్రంగా ఉండి పోయింది మనసు... దైవానికి దగ్గరిగా ఉన్నట్టు అనిపించింది.

అమ్మవారి  స్తోత్రాలు  నాలో  నిత్యం మారుమ్రోగుతున్నాయి...

ఈ నృత్య  సాధన,  ఇంత గొప్ప  గురువు గారు,  ఇటువంటి తల్లితండ్రులు  నా పూర్వ జన్మ సుకృతమేనని పదేపదే అనిపిస్తుంది.

**

ప్రోగ్రాముకి, ఢిల్లీనుంచి మామయ్యా వాళ్ళు వచ్చారు.   సాంస్కృతిక, కళారంగాల నుండి  ప్రముఖులని ఆహ్వానించి, ముందుండి ప్రోగ్రాం  నడిపించారు భూషణ్ అంకుల్, నీరూ ఆంటీ.

ఓ కలలా జరిగిన నా 'కూచిపూడి రంగప్రవేశ కార్యక్రమాన్ని, పూర్తి ఖర్చు భరిస్తూ  వైభవంగా జరిపించారు 'మైలాపూర్ ఫైన్-ఆర్ట్స్' వారు.  షుమారుగా రెండువేల మంది ప్రేక్షకులు ప్రోగ్రాం చూసారని తెలిసింది....

నాన్నతో కలిసి అనౌన్స్ మెన్ట్  చేస్తూ ప్రోగ్రాంని హుందాగా నడిపించాడు జగదీష్.

రాణి ప్రార్ధనా గీతం  పాడింది.  వినోద్, వోట్-ఆఫ్-థ్యాంక్స్  చెప్పాడు...

ఇకపోతే ,  జగదీష్ ఉన్న రెండు రోజులూ, రాణి అతన్నే అంటి పెట్టుకుని, రాసుకు పూసుకు తిరుగుతుందని కోటమ్మత్త తెగ విసుక్కుంది.  ఆ రెండు రోజులు, ఎప్పటికప్పుడు రాణి గురించి నా వద్ద ప్రస్తావించింది.

కోపాలకి, ఈర్ష్యలకి  అతీతంగా, నేను మాత్రం నా మనస్సుని పూర్తిగా నా ప్రదర్శన మీదే ఉంచాను..

**

ఆ 'రంగప్రవేశం' ప్రోగ్రాం, ఊహించని విధంగా పెద్దౌతున్న  నన్ను ఓ మేటి కళాకారిణిగా నిలబెట్టింది కూడా.  పేరున్న కళాకారుల నుండి గుర్తింపు,  మీడియా నుండి, కళా సంస్థల నుండి రకరకాల ప్రాజెక్ట్  ప్రపోజల్స్, ఆహ్వానాలు.... కొన్ని ఫిలిం ఆఫర్స్ కూడా

తరుముకుంటూ వచ్చాయి.

ఊహకందని ఈ స్పందన నాకు ఊపిరి సలపకుండా అయింది....

రెండు సినిమా ఆఫర్లు అంకుల్ ద్వారానే రావడంతో, సంప్రదాయమైన కారెక్టర్ అయితే సినిమాల్లో చేయడానికి అభ్యంతరం లేదని నాన్న, అమ్మ అన్నారు. నన్నడిగితే, నేను కూడా అదే అన్నాను..

**

ఓ రోజు పొద్దున్నే చేతిలో డాక్యుమెంట్స్ ఫైల్ తో వచ్చారు అంకుల్... నా కళా జీవితానికి సంబంధించిన బాధ్యతలన్నీ, గార్డియన్ గా, ఐదేళ్ళ పాటు ఆయన చేపట్టనున్నట్టు, దానికి మేము అంగీకరిస్తున్నట్టు రాసున్న లీగల్ అగ్రిమెంట్స్ తెచ్చానన్నారు. మైనర్ ను కనుక, నాతో పాటు, నాన్న కూడా ఆ కాగితం పైన సైన్ చేయాలన్నారు అంకుల్.

అంతా విని, క్షణమాలోచించారు నాన్న. ఎటువంటి అగ్రిమెంట్ లేకుండానే, తమకి ఆయన పైన పూర్తి నమ్మకముందన్నారు.

లీగల్ ఫార్మాలిటీ కనుక తప్పదని నాన్నని ఒప్పించగలిగారు అంకుల్...

.. అమ్మ వంక చూసాను. 'మంచి పని' అన్నట్టుంది ఆమె చిరునవ్వు. నేను, నాన్న ఇద్దరం అగ్రిమెంట్ పై సంతకాలు చేసాము.

"నాకూ, మా కుటుంబానికి మీరు చేస్తున్న మేలుకి నా ధన్యవాదాలు అంకుల్," అంటూ చేతులు జోడించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నాను.

“చూడు తల్లి నాకు రాణి ఎంతో, నీవూ అంతేనమ్మా. నీవు నర్తకిగా ఉన్నతంగా ఎదగాలనే నా ఆశ. అలాగే మన రాణి సింగర్ గా పెద్ద పేరు తెచ్చుకోవాలని కూడా,” అన్నారు అంకుల్…

“మీ ఆశీస్సులతో చిన్నవాళ్ళిద్దరూ తప్పక వృద్ధిలోకి వస్తారు,” అంది అమ్మ.

“అది సరే భూషణ్ గారు, నీరూ వెంట లేకుండా మీరు మా ఇంటికి రావడం, ఇదే మొదటిసారి. ఆమెని చూసి కూడా కొద్ది రోజులయింది. ఎలా ఉన్నారామె,” అడిగింది..

“ఓ, మీకు తెలియదు కదూ. ఇవాళ పొద్దున్నే, రాణితో పాటు నీరూని ఢిల్లీ ఫ్లైట్ కి పంపించి, ఇటు వచ్చాను… వీళ్ళ ఢిల్లీ ట్రిప్ జగదీష్ కి మాత్రమే సర్ ప్రైజ్. అతను ఈ సమ్మర్ లో ఇటు రాలేనన్నాడట. అందుకని, ఢిల్లీ చూసొస్తానంటూ మొండికేసి ఒకత్తే బయలుదేరింది రాణి…ఇంకేం చేస్తాను? సరే అమ్మని కూడా వెంట తీసుకువెళ్ళమన్నాను,” అన్నారు తాపీగా ఆయన…

**

అమ్మ ఇచ్చిన కాఫీ తాగి, అంకుల్ వెళ్ళిపోయాక, అందరం కాసేపు అలాగే కూర్చుండిపోయాము…

రాణి ఢిల్లీ ట్రిప్పు సంగతి విని నేను చాలా డిస్టర్బ్ అయ్యాను… ఓ పక్క భూషణ్ అంకుల్ ప్రోత్సాహంతో మంచి భవిష్యత్తుని ఊహించుకొని సంతోషం. మరోపక్క… నా మనసు నాకు దూరమైపోతున్నట్టు… ఏదో వెలితి….

రాణి ఆలోచనలు, చేష్టలే దానికి కారణం.

కొద్దిపాటి మౌనం తరువాత, నాన్న నోరు విప్పారు. “ఇప్పటివరకు మనమైతే వెళ్ళనే లేదు ఢిల్లీకి… వీళ్ళు చూడు..ఎంత ఫాస్ట్ గా విషయాన్ని నడుపుతున్నారో… ఇదంతా ఎలా తిరుక్కుంటుందో కదా, శారద,” అన్నారు అమ్మతో…

నాన్న అన్న ఆ మాటలతో, నేనే ముందుగా తేరుకున్నాను..."నాన్నా, మీరు లేని పోని ఆలోచనలు పెట్టుకొని హెల్త్ పాడు చేసుకోవద్దు.. అంతా బాగుంటుంది...సరేనా?

ఉండండి, అసలివాళ అంకుల్ రావడం, ఇలా అగ్రిమెంట్ చేయడం గురించి, జగదీష్ బావకి చెబుతాను," అంటూ అక్కడి నుండి కదిలాను. "అయితే, మీరు కూడా జగదీష్ పైన ఎక్కువగానే ప్రేమ, ఇష్టం పెంచుకున్నారని అనుకోవచ్చా," అంటూ అమ్మ నవ్వడంతో పాటు,

"ఆ అబ్బాయిలోని ఆకర్షణ అలా ఉంది మరి," అన్న నాన్న సంజాయిషీ కూడా వెనుక నుండి వినబడ్డాయి....

**

జగదీష్ వెంటనే నా కాల్ ఆన్సర్ చేసాడు...

నేను చెప్పింది విని, "వండర్ ఫుల్, ఇలాగే జరగాలి. ఇక నీ కెరియర్ దూసుకు పోతుంది," అని సంతోషించాడు. అవుననే ఒప్పుకున్నాను...

"నేను ఫ్రీగా ఉన్నాను చాంద్...కబుర్లునువ్వన్నా చెప్పు, లేదంటే విను," అన్నాడు.

మొదటి సారిగా తన చదువు, కెరియర్ విషయాలు షేర్ చెప్పసాగాడు..

తన బి.ఎస్.సి కంప్లీట్ అయిందని, రెడ్-క్రాస్ వాళ్ళ హెల్త్ క్లినిక్ లో వాలంటరీ జాబ్ చేస్తూ ఇక మెడికల్ స్కూల్ ఇంటర్వ్యూలు చేసుకుంటానన్నాడు.

వాళ్ళ  రూరల్ హెల్త్ యూనిట్ తో, తను ఓ ఆరు నెల్లపాటు, టూర్ చేసే అవకాశం కూడా ఉందని చెప్పాడు..

"నీ ప్లాన్స్ అన్నీ చాలా ప్రాక్టికల్  గా ఉన్నాయి... ఈజీగా అవుతాయి," అన్నాను.

నాకై నేను మాత్రం రాణి వాళ్ళ ఢిల్లీ ట్రిప్ గురించి ఎత్తలేదు.

**

భూషణ్ అంకుల్ నన్ను ఓ కళాకారిణిగా ప్రొమోట్ చేయడానికి రంగం లోకి దిగాక, వ్యక్తిగతంగా కూడా నా లైఫ్ వేగం పుంజుకుంది.  డాన్స్ ప్రోగ్రామ్స్, టి.వి. షూట్స్ తో ఉత్సాహంగా కొనసాగుతూ  ఆర్థికంగా కూడా బలపడుతున్నాను.

యోగా  ట్రైనింగ్ తో పాటు, జూనియర్ కాలేజి  ఫైనల్ ఇయర్ చదువు నెగ్లెక్ట్ చేయకుండా కొనసాగుతున్నాను.....

నాన్న హెల్త్ విషయం కూడా ఎప్పటికప్పుడు అర్థం చేసుకుంటున్నాను.  ఆయనకి  సోకిన 'మయస్తీన గ్రావిస్' (యస్థినీ ఘ్రవిస్) వ్యాధి గురించి తెలుసుకున్నాను.

అప్పుడప్పుడు కాళ్ళ నొప్పులతో బాధ పడుతుంటారాయన.. స్టూడియో మేనేజ్ మెంట్ సులువు గానే ఉండడంతో, అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకో గలుగుతున్నారు.

కండరాల బలహీనతకి, ఆయన  వాడే మందు యొక్క డోసేజ్ తరుచుగా మార్చాల్సిన  అవసరం ఉంటుందట.   నాకు నాన్న వ్యాధి గురించి తెలుసునని అమ్మకి అర్థమయింది...

**

సంగీత అకాడెమీ వారి అసిస్టెంట్ డైరెక్టర్  పొజిషన్ కి వేకెన్సీ వచ్చిందని, అమ్మ చేత అప్లికేషన్ పెట్టించారు, భూషణ్ అంకుల్.  సహాయక కార్యదర్శి పొజిషన్ కి సెలెక్ట్ అయ్యే అన్ని అర్హతలు ఉన్నాయని  అమ్మని  ప్రోత్సహించారాయన.


మా కుటుంబాన్ని, అమ్మని  కూడా మంచి స్థితిలో చూడాలన్న ఆయన ఆలోచనకి, భూషణ్ అంకుల్ పట్ల నాకు గౌరవం రెట్టింపయింది..

రాణి మాత్రం ఎప్పటిలా జగదీష్ కి, జగదీష్ కుటుంబానికి దగ్గరవ్వాలనే ఆలోచనలోనే ఉందని నాఅంచనా..  జగదీష్ నుండే, రాణి విషయాలు ఎక్కువగా తెలుస్తుంటాయి, నాకు....

**

అమ్మ అన్నట్టు, అంతా సాఫీగా, కాలం చకచకా గడిచిపోతుంది.......ఎవరి పనుల్లో వాళ్ళం బిజీగా ఉంటున్నాము.

దాదాపు పదినెలల పాటు చేసిన ప్రయత్నాలు ఫలించి, నాన్నకి కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ గా, మొదటి పోస్టింగ్ నెల్లూర్లులో వచ్చింది.   స్టూడియో జాబ్ వదిలి పోతున్నందుకు బాధగా ఉన్నా, నాన్న పోస్టింగ్ విషయం సంతోషంగా ఉందన్నారు అంకుల్..



రెండేళ్ళ తరువాత....

సమయం చక చకా సాగి పోతుంది..... గడిచిన రెండేళ్ళల్లో మా జీవితాల్లో కొన్ని మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. ఆరు నెలల తేడాలో, అనారోగ్యం వల్ల నానమ్మ, తాత చనిపోవడం, మా మనస్సుల్లోఎంతో విషాదాన్ని కూడా నింపింది....

నాన్న, నెల్లూరులో కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ గా డ్యూటీలో ఉన్నారు. ఆయనకి వండి పెడుతూ, కోటమ్మత్త, నాన్న వద్దే నెల్లూరు లో ఉంటుంది...

దగ్గరే అవడంతో, ఇద్దరూ తరుచుగా చెన్నై వచ్చి వెళుతుంటారు.

అప్పుడప్పుడు ఆయన ఆరోగ్యం తిరగ బెట్టినా, విశ్రాంతి తీసుకొని కోలుకో గలుగుతున్నారు...నాతోనే కాక వినోద్ తో కూడా తన హెల్త్ విషయం డిస్కస్ చేస్తున్నారు..నాన్న.

మ్యూజిక్ అకాడెమి అసోసియేట్ డైరెక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తూ, అమ్మ, ఇప్పుడు వారాంతాల్లో మాత్రమే క్లాసెస్ చెబుతుంది...

తమ్ముడు వినోద్ , హై- స్కూల్ స్పోర్ట్స్ - టీమ్ కాప్టెన్ గా, బిజీగా ఉంటున్నాడు..

దాంతో, రెండు సార్లు పాలెం వెళ్ళడం తప్ప, వెకేషన్ అంటూ మేము ఎక్కడికీ వెళ్ళక, మా వద్దకు ఎవరూ రాక చాన్నాళ్ళయింది.

**

ఇన్నాళ్ళకి, వినోద్ షెడ్యూల్ అనుకూలించడంతో, వెకేషన్ ప్లాన్ చేశాము.

తన కొడుకు వద్దకి కోటమ్మత్త, అమ్మమ్మ వాళ్ళ వద్దకి మేము బయలుదేరాము.

క్రిస్టమస్ సెలవలే కనుక, ఢిల్లీనుండి జగదీష్ వాళ్ళు కూడా గుంటూరు రానున్నారు.

పొలం  విషయాలు చూసుకొని, నాలుగు రోజుల్లోమా కన్నా ముందే చెన్నై చేర బోతుంది కోటమ్మత్త.

**

భోజనాలు చేసి ఇంటి నుండి బయలు దేరాము. అత్తని కర్నూల్  ట్రైన్ ఎక్కించి, మేము గుంటూర్ వెళ్ళే ట్రైన్ ఎక్కాము.

బయలు దేరిన కాసేపటికే,  ట్రైన్ బాగా స్పీడ్ అందుకుంది..

అమ్మ అందించిన ఫ్రూట్ తినడమయ్యాక, నేను, వినోద్ పై బెర్తుల మీద సెటిల్ అయ్యాము.  పట్టాల మీద రైలు పరిగెడుతున్న చప్పుడు వింటూ, నవల చేతిలోకి తీసుకొన్నాను.

చేతిలో పుస్తకం పట్టానే కాని,  వెకేషన్  ఎలా ఉండబోతుందోనని ఆలోచించ సాగాను .....

జగదీష్ ని చూసి కూడా రెండేళ్ళకి పైనే అయింది.  ఇంచు మించు ప్రతి రోజూ మాట్లాడుతూనే ఉన్నా,  ఇన్నాళ్ళ తరువాత  జగదీష్  ని కలవడం, వారం రోజులు అందరితో గడపడం  బాగుంటుంది.   జగదీష్ తో  ఇన్-పర్సన్ మాట్లాడాలని ఉంది......

అమ్మ పెద్దగా నవ్వడం విని, పుస్తకం మూసేసి, కిందకి చూసాను.  నాన్నకి కబుర్లు చెబుతూ సంతోషంగా నవ్వుతుంది అమ్మ..

తన విద్యకు తగ్గ హోదా లభించినందుకు, అమ్మ సంతోషంగా ఉంది..  నాన్న హెల్త్ విషయంగా కూడా ఆమె మనసు కాస్త కుదుట పడింది...

అన్నిటా  అంకుల్ వాళ్ళ సలహా, అమ్మ తీసుకుంటే,  అంకుల్ని తన 'లైఫ్-లైన్' అంటుంటారు, నాన్న.  భూషణ్ అంకుల్ పైన అంతటి గౌరవం, అభిమానం పెంచుకున్నారు అమ్మావాళ్ళు.

ఆయన నాకందిస్తున్న చేయూత కూడా, ఆయన పట్ల వారికున్న అభిమానానికి ఓ కారణం.

నా కెరియర్  కి సంబంధించి, అంకుల్ ఈ కొద్ది వ్యవధిలో ఎంతో చేసారు...

రెండు పేరున్న టి.వి చానెల్స్ తో కాంట్రాక్ట్  తీసుకొని, నెలకి రెండు ఎపిసోడ్స్ చప్పున రికార్డింగ్ చేయిస్తారు.  దాంతో, నృత్య సంగీతాలకి  ప్రాధ్యానత ఉన్న  అరగంట ఎపిసోడ్స్ కి అమ్మతో కలిసి కళా ఖండాలే సృష్టించ గలుగుతున్నాను. ఈ స్పెషల్ ఎపిసోడ్స్ కి వ్యూయర్స్ నుండి, రీవ్యూయర్స్ నుండి మంచి రేటింగ్, ప్రోత్సాహం లభిస్తున్నాయి.

అలాగే,సాంప్రదాయ కార్యక్రమాలకి యాంకరింగ్ చేస్తుండడంతో,  ఫైనాన్షియల్ గా కూడా స్థిరత్వం వచ్చింది.

నృత్యకళాకారిణిగా,పైస్థాయిలో గుర్తింపుఅందుకోగలిగాను.

ఈ రెండేళ్ళల్లో 'టూర్ ఆంధ్రప్రదేశ్' పేరిట పది సోలో ప్రోగ్రామ్స్ భారీ ఎత్తున జరిగాయి... ఈ మధ్యనే, నాకు సన్మాన

సభలు, ప్రతిష్టాత్మకంగా స్వర్ణకంకణ బహుకరణ కూడా జరిగాయి. ఆర్ట్స్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతూ, స్వామి నాథన్ పిళ్ళై గారి వద్ద భారత నాట్యం, హంస గారి వద్ద 'మోహిని అట్టం' నేర్చుకుంటున్నాను.

నా షూటింగ్ డేట్స్, ప్రోగ్రాం షెడ్యూల్ మానేజ్ చేసి, నా అకౌంటింగ్ చూడ్డానికి, మూర్తి అనే మానేజర్ ని అపాయింట్ చేసారు అంకుల్.

అంతటితో ఊర్కోలేదాయన.... రెండు వారాల క్రితం నా బర్త్డే కి, నా చేత మంచి కార్ కొనిపించారు. పేమెంట్స్ చేసుకోగల స్తోమత బేషుగ్గా ఉందంటూ నచ్చజెప్పారు.

అయన ప్రోత్సాహానికి, మా సంతోషాలకి, మనసులోనే ఆయనకి కృతజ్ఞతలు తెలుపుకుంటుంటాను.

ఓ ప్రక్క అంకుల్ - మా ఫామిలీకి వెన్ను దన్నులుగా ఉండి సహాయ పడుతుంటే, మరో ప్రక్క రాణి, జగదీష్ మీద ధ్యాసతో, మా అందర్నీ ఎక్కువ ఇబ్బందే పెట్టిందని తలుచుకుంటే, చాలా కోపం వస్తుంది......

రాణి గుర్తురాగానే, నాకు తెలీకుండానే నా పిడికిలి బిగుసుకుంది..

ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాను.

**

ఉన్నట్టుండి కంపార్ట్ మెంట్ లో ఎదో విరిగినట్టుగా, పెద్ద చప్పుడవడంతో ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. అమ్మ కూడా చటుక్కున లేచి కూర్చుంది. చూస్తే వినోద్....తన బర్త్ మీద నుండి కిందకి గెంతాడు. ఉలిక్కిపడ్డ నన్ను చూసి, "సారీ, అన్నిటికీ భయపడతారేంటి? ...మళ్ళీ బెర్త్ మీద కెక్కేంత వరకు ఆగండి మరి," నవ్వుతూ అక్కడి నుండి కదిలాడు...

**

గుంటూరులో ట్రైన్ దిగి, ఇల్లు చేరేప్పటికి, మా కోసమే వెయిట్ చేస్తున్నారు అమ్మమ్మ, తాతయ్యా.

"రెండు మూడేళ్ళల్లో పిల్లలు ఎంతలా ఎదిగారు!" అంటూ మమ్మల్ని దగ్గరికి తీసుకున్నారు..

"వెళ్ళి స్నానం చేసి రండి. అందరం కలిసి బ్రేక్ ఫాస్ట్ చేద్దాము. అన్ని గదులు మీవే.. మీ కోసం రేవతి వాళ్ళ కుటుంబం మొత్తం ఈ వారం రోజులు ఇక్కడ పని చేస్తారు. అన్నీ చెప్పి చేయించుకోండి," అన్నారు తాతయ్య.

**

రెండు రకాల టిఫిన్లు చేయించింది అమ్మమ్మ. నాన్న కోసం కిచిడి, వెజిటబుల్ ఆమ్లెట్. అందరికీ ఇడ్లీ సాంబార్.

వినోద్ కి ఇష్టమని జున్ను.

"అమ్మమ్మ నీ కుకింగ్ బెస్ట్. నాకు దహీవడ, పెసరట్టు, మురుకులు, గులాబ్ జాం కూడా చేస్తావా?" అడిగాడు వినోద్ అమ్మమ్మని.

“తప్పకుండా మనవడా,” అంది నవ్వుతూ అమ్మమ్మ.

“మొన్న డిసెంబర్ పన్నెండున పందొమ్మిదేళ్ళు నిండాయి కదూ చంద్రకళకి! పైజామా లాల్చీలు సరే, బాగానే ఉన్నాయ్. దాని కోసం పట్టు పరికిణీ వోణీలు కొని పెట్టాను. ఏకంగా చీరలు కట్టినా అందంగా ఉండేటంత ఎదిగిందిగా! నీ లాగానే ఉంది శారదా. కాకపోతే, వాళ్ళ నాన్న రంగు వచ్చిందిలే,” అంది అమ్మమ్మ నా వంక చూస్తూ.

“మీ ‘రాగం-తానం-పల్లవి’ ఎంత బాగుందని? సీరియల్ గా రావడంతో మన వాళ్ళందరూ కూడా చూసారు… చాలా గర్వంగా ఉందమ్మా చంద్రమ్మా,” అన్నారు తాతయ్య.

నాకు సంతోషమనిపించింది.

అమ్మమ్మ సరదాగా కబుర్లు చెబుతూనే ఉంది…

ఓ రోజు అమ్మావాళ్ళని, మామయ్యా వాళ్ళని కూర్చోబెట్టి వ్రతం చేయించాలని, ఒక రోజు అందరం అమరావతి గుడికి వెళ్ళాలని ఆమె ఏర్పాట్లు చేసిందిట..

“మనది ఆ నాటి బంగళా… మీకు తెలిసిందేగా! ఎన్నో గదులు. అందరికీ తలా ఓ గదిలా ఏర్పాటు చేసేసాము. హాయిగా కాసేపు రిలాక్స్ అవ్వండి. సాయంత్రానికి జగదీష్ వాళ్ళు వచ్చేస్తారు,” అన్నారు తాతయ్య.

బ్రేక్ ఫాస్ట్ అయ్యే టైంకి టైలర్ వచ్చాడు. అంత పొద్దున్నే టైలర్ ని పిలిపించి నా కొలతలు కూడా ఇప్పించింది అమ్మమ్మ.

**

మధ్యాహ్నం భోంచేసి, సూట్ కేసు నుండి నా ల్యాప్ టాప్ తీసి కాసేపు ఇ-మెయిల్స్ చూసుకున్నాను. నాకు ల్యాప్ టాప్ లేదని, రాణి అందరిలో గేలి చేసిన సంఘటన ఎన్నటికీ మరువలేను.

ఆ సంఘటన జరిగిన వారం లోగానే, నాన్న నాకు ల్యాప్ టాప్ తెప్పించడం, నన్ను యోగ శిక్షణలో పెట్టడం, భూషణ్ అంకుల్ నాకో చక్కని ఇంటర్-యాక్టివ్ వెబ్-సైట్ ని, డిజైన్ చేయించడం చకచకా జరిగాయి, మరి....

ఆ ఒక్క సంఘటన వల్ల ఈనాడు నేను యోగ లెవెల్-3 పూర్తిచేసాను.

వెబ్-సైట్ వల్లకళా రంగాన నా కల్చరల్ యాక్టివిటీస్ ని ఫాలో అవుతున్న వారు అసంఖ్యాకంగా పెరుగుతున్నారు......

విక్రమ్, కవితలు టచ్ లో ఉంటూ, మంచి ఫ్రెండ్స్ అయ్యారు.

ఏమైనా, రాణి వైఖరి వల్లనాకెంతో మేలు జరిగినందుకు, ఇప్పటికీ సంతోషిస్తుంటాను.....

నా లోని నృత్య కళకి, ప్రేక్షకుల నుండి ఆదరణే కాదు, తేజశ్విని గారు, విక్రమ్ వంటి వారి స్నేహాన్ని కూడా పొంద గలుగుతున్నాను..

నా జీవితంలో మరో కోణమే లేదు మరి...అని తలుచుకొని నవ్వొస్తుంది....

కంప్యూటర్ మూసేసి, పుస్తకం  చదువుతూ  పడుకోగానే,  నిద్రపట్టేసింది..

**

ఎంత గాఢంగా నిద్రపోయానో! మెల్లగా కళ్ళు తెరిచి చూసేప్పటికి, సాయంత్రం ఆరయింది.  వినోద్ కి వేరే గది ఉన్నా, నా ఎదురుగా దివాన్ మీద అడ్డంగా పడుకొని నిద్రపోతున్నాడు.

బద్ధకంగా అనిపించినా లేచి బయటకి వచ్చి చూస్తే అందరూ ముందు వరండాలో ఉన్నారు.  వెళ్ళి అమ్మ పక్కన కూర్చోగానే, నాకూ కాఫీ అందించింది ఆయమ్మ, రేవతి.

"ఇదిగో, నీ పరికిణీ వోణీలు కూడా వచ్చేసాయి. చక్కగా  ఉన్నాయి. ట్రై చేయి," అంది అమ్మ తన పక్కనున్న ప్యాకెట్ అందిస్తూ.

**

కొత్తబట్టలు వేసుకుని,  మొహం కడుక్కుని, ఫ్రెష్ అయ్యి కొత్తబట్టలు వేసుకుని, కిచెన్ లో ఉన్న అమ్మమ్మ వద్దకు వెళ్లాను.  "ఏమైనా హెల్ప్ కావాలా అమ్మమ్మ," అడిగాను.

“నీ బట్టలు నచ్చాయా?” అడిగింది అలమారా నుండి స్టీల్ గ్లాసులు తీస్తూ.


“చాలా బాగున్నాయి, నాకు నచ్చాయి,” చెప్పాను.

చక్కగా కుందనపు బొమ్మలా ఉన్నావు వ్రతానికి, గుడికి వెళ్ళేప్పుడు కట్టుకో, అత్తయ్య వాళ్ళకి, జగదీష్ కి మనస్సుల్లో నువ్వు  తప్ప ఎవ్వరు ఉండ కూడదు,” అంటూ తల మీద ముద్దు పెట్టుకుంది అమ్మమ్మ.

అమ్మమ్మ మాటలకి కాస్త ఆశ్చర్య పోయాను కూడా.

“తరుచుగా ఫోన్ చేసి అత్తయ్యతో, అలాగే జగదీష్ తోనూ మాట్లాడు,” అంది.

“మాట్లాడుతూనే ఉన్నాములే అమ్మమ్మ,” అన్నాను.



“వొట్టిమాటలతో ఏమవుతుంది? ఈ మధ్య మీ ఫ్రెండ్ అంటగా! అదే భూషణ్ కూతురు - ‘రాణి’. ఓ మారు వాళ్ళమ్మతో, మరో మారు ఒక్కత్తే, ఢిల్లీవెళ్ళిందటగా. ఆ అమ్మాయిని , జగదీష్ వెంటబెట్టుకొని ఊరంతా తిప్పి చూపించాడట.. వీళ్ళిద్దరి బర్తడేలు కలిపి సెలబ్రేట్ చేసారట.

ఇదంతా వాడే నాకు చెబుతాడు. అలా వాడు చెబుతాడని కూడా మణికి తెలుసు. మీ మణత్తయ్య కూడా ఆ రాణి వాళ్ళమ్మతో, తెగ రాసుకు పూసుకు తిరుగుతున్నట్టు నా అనుమానం,” క్షణమాగింది అమ్మమ్మ.

“ఏముందమ్మా, ఆ పిల్లావాళ్ళు డబ్బున్నోళ్ళు. బరితెగించి మనుషుల్ని కట్టిపడేసుకుంటారు, ఎవ్వర్నీ నమ్మలేము,” మళ్ళీ అమ్మమ్మ.

“ఎవరు? దేనికి? నమ్మలేమంటున్నావు,” అంటూ వచ్చిన అమ్మకి, రాణి – నీరూ ఆంటి ఢిల్లీవెళ్లడం సంగతి మళ్ళీ చెప్పసాగింది అమ్మమ్మ.

నేను ఆలోచనలో ఉండిపోయాను.

అమ్మమ్మ అన్నట్టు, ఓసారి స్కూల్స్ రి-వోపెన్ కి ముందు, ఒక వారం ఢిల్లీవెళ్లారు రాణి, నీరూ ఆంటి.

మొన్నటి సమ్మర్ లో కూడా, రాణి ఒక్కతే ఢిల్లీవచ్చిందని జగదీష్ చెప్పగా విని, నవ్వాలో, కోపం తెచ్చుకోవాలో అర్థం కాలేదు…….. ఆ సమయంలో మేము డాన్స్ ప్రోగ్రాముకి ముంబాయిలో ఉన్నాము.

“అవన్నీ మాకు తెలిసిన విషయాలే, అమ్మా,” అమ్మమ్మకి జవాబుగా అమ్మ.

ఇంతలో, బయట నుండి హడావిడి, పలకరింపులు వినబడ్డంతో, నా ఆలోచనల నుండి బయటపడ్డాను. అమ్మమ్మతో కలిసి హాల్లోకి వెళ్లాము.

**

అత్తయ్య, మామయ్యా, లోనికి వస్తూకనబడ్డారు.. ఎదురెళ్ళి పలకరించాను. మణత్తయ్య నన్ను దగ్గరికి తీసుకుంది.

“గుర్తుపట్టలేనంతగా ఎదిగి పోయావుగా!” నాతో అంటూ, “ఏం శారదా ఏం పెడుతున్నావేంటి పిల్లలకి?” అంది అమ్మతో, నవ్వుతూ.

“ఏమ్మా? బాగున్నావా? మీ అమ్మ హైట్ వచ్చేసావులా ఉందే? ఇంకా పొడవైతే, కృష్ణుడు వేషం వెయ్యాల్సిందే,” నవ్వాడు మామయ్య నా తల మీద చేయి వేసి..

వెనకాలే, సూట్ కేసులు పట్టించుకుని, వినోద్ తో కబుర్లు చెప్పుకుంటూ లోనికొచ్చాడు జగదీష్.

అమ్మని హగ్ చేసి, “హలో అత్తయ్య,” అన్నాడు.

నాన్న హాండ్ షేక్ చేసి, “ఎలా ఉన్నారు మామయ్యా,” అంటూ పలకరించాడు. అమ్మమ్మ వాళ్ళతో కూడా పలకరింపులయ్యాక, నాకు దగ్గరగా వచ్చాడు.

”ఇజ్ ఇట్ చంద్రా?” నా ముఖంలో ముఖం పెట్టి చూసాడు. “థాంక్ గాడ్. ఎవరో సౌత్ ఇండియన్ మాడల్ అనుకున్నా. అందుకే అక్కడే ఉండి పోయాను,” నవ్వుతూ, నా హాండ్ షేక్ చేసి,”హలో చంద్రా,” అన్నాడు.

అందరూ నవ్వారు...

“నిన్ను కూడా మేము గుర్తుపట్టలేదు జగదీష్ , ‘అత్తయ్యా’ అంటూ నువ్వు దగ్గరికి రాబట్టి గానీ, లేకపోతే తెలిసేది కాదు.. నీ జీన్స్, గోటీ, చూసి, ఎవరో ఈ కౌబాయ్ అనుకున్నాము,” అమ్మ జోక్ చేసింది.

నేను కూడా నవ్వాను.

“పోనీలెండి, నా మనవలు పెద్దవాళ్ళయ్యారు. అందంగా ఎదిగారు,” అంది అమ్మమ్మ.

“నేను కూడానా అమ్మమ్మా? పొడుగయ్యానా? " అడిగాడు వినోద్.

“అందరిలోకి అందగాడు మాత్రం వినోద్ బాబే,” అంది ఆమె.

“పదండమ్మా, ఫ్రెష్ అయ్యి రండి. కాసేపట్లో భోజనాలు చెయ్యవచ్చు,” అన్నారు తాతయ్య.

**

మరునాడు, అందరం పొద్దున్నే బ్రేక్ ఫాస్ట్ కి వచ్చేసాము. రోజంతా ఏం చేద్దామని అనుకునే లోగా వర్షం మొదలయింది. చేసేది లేక, దినమంతా బోర్డ్-గేమ్స్ ఆడాము..

జగదీష్ చెపుతున్న కబుర్లు జోక్స్ తో, కడుపుబ్బ నవ్వుతూ గడిపేసాము.

సాయంత్రమయ్యాక, అమ్మమ్మ వాళ్ళ థియేటర్ లో తెలుగు సినిమాకి వెళ్ళాము...

హాయిగా జరిగిపోయింది రోజంతా....

రాత్రి భోజనాలయ్యాక, మరునాడు జరగబోయే సత్యనారాయణ వ్రతం ఏర్పాట్లల్లో ఉండిపోయారు పెద్దవాళ్ళంతా.

**

తెల్లవారక ముందే, పని వాళ్ళు అటు, ఇటు తిరుగుతూ పనులు చేస్తున్నారు. ఇల్లంతా సందడిగా ఉంది. అందరూ పూజకి తయారవుతున్నారు.

నేనూ లేచి పనులు కానిచ్చాను.  అమ్మమ్మ కుట్టించిన తెల్లపట్టు పరికిణీ, కుంకుం రంగు వోణీ వేసుకుని, అత్తయ్య  నా చిన్నప్పుడు ఇచ్చిన ముత్యాల హారం పెట్టుకున్నాను.  ముత్యాల గాజులు, జుమ్కాలు  సహా.  జడ వేసుకోడం మిగిలింది.

అందరూ హాల్లోచేరిన హడావిడి తెలుస్తూనే ఉంది. నా గదిలో నుండి అంతా కనబడుతున్నారు కూడా.  వినోద్, జగదీష్ - జీన్స్ వేసుకొని, పైన క్రీం కలర్ జుబ్బాలు వేసుకున్నారు.

అమ్మా, అత్తయ్య, అమ్మమ్మ కూడా పసుపు రంగు పట్టు చీరలు కట్టుకున్నారు.  ఇక నాన్న, తాతయ్య, మామయ్య గోధుమ రంగు పైజమా కుర్తాలు  వేసుకునున్నారు.

జడ అల్లడం ముగించి, హాల్లోకి వచ్చాను.

అందరూ నా వంక ఎగాదిగా చూశారు.

అప్సరలా ఉన్నానన్నారు, అత్తయ్య, అమ్మమ్మ.

“పందిరి నొదిలి మల్లెతీగ ఇంట్లోనడుస్తుందేమిటి?” అంటూ టీజ్  చేసారు తాతయ్య.

“తాత ఇజ్ కరెక్ట్. సరిగ్గాపోల్చారు,” అంటూ పరికిణీ, వోణీ వేసుకున్న నా  వంక తేరిపార చూసాడు జగదీష్.

“అవును చంద్రా, తాతగారి గార్డన్ లోని జాస్మిన్ క్రీపర్ లాగానే ఉన్నావు,” అంటూ నవ్వడం మొదలు పెట్టాడు. అదొక జోక్ లా అందరూ నవ్వడమే....

“ఎందుకురా ఆ అమ్మాయిని అలా టీజ్  చేస్తావు? ఊర్కో,” అన్నారు రాం మామయ్య.

“పర్వాలేదులే మామయ్యా,” నేనేమీ ఫీల్ అయి పోడం లేదు,” అంటూ దేవుని మందిరం వైపు నడిచాను, అక్కడ పని చేస్తున్న రేవతికి హెల్ప్ చేద్దామని.

**

పూజ, భోజనాలు బాగా జరిగాయి.. అమ్మమ్మ  స్నేహితులంతా  మమ్మల్ని కలిసినందుకు సంతోషపడ్డారు.

“మా మనమరాలు గొప్ప డాన్సర్,”  అంటూ, నన్ను ప్రత్యేకంగా అందరికీ పరిచయం చేసారు అమ్మమ్మ, తాతయ్య. నా ‘నృత్య మంజరి’ అవార్డు నుండి, నేను యాక్ట్ చేసిన టెలిఫిలిం వరకు, అందరికీ గర్వంగా చెప్పారు.

**

అతిధులు వెళ్ళాక, పెద్దవాళ్ళందరు వరండాలో చేరారు.  పూజ హాలు శుభ్రం చేయడమయ్యాక, వినోద్, జగదీషుల కోసం చూసాను.  వెనుక తోటలో క్రికెట్ ఆడుతున్నారు.  చేసేది లేక, హాలు పక్కనే గదిలో టి.వి ఆన్ చేసి సోఫాలో ఒరిగాను.  కళ్ళు మూతలు పడుతున్నా, బలవంతంగా కాసేపు సినిమా చూస్తూ, నిద్రలోకి జారుకోడం  తెలుస్తూనే ఉంది....

**

“హలో, చాంద్, హలో, వెకేషన్ అంటే నిద్రపోవడం కాదు”...అంటూ భుజాలు కుదిపి జగదేష్, కాళ్ళు తట్టి, వినోద్ నన్ను నిద్రలేపేసారు.

“సరే సరే,” అంటూ లేచి కూర్చున్నాను.  వచ్చి, నాకు చెరో వైపు కూర్చున్నారు వాళ్ళు.

"ట్వెల్వ్, ట్వెల్వ్ డిసెంబర్ నీ బర్తడే అయిందిగా. యు ఆర్ నైన్టీన్? దానికి ముందు, ఏప్రిల్ టెన్త్ న, వినోద్ బాబు బర్త్ డే అయింది. హి ఇజ్ థర్టీన్. మీ ఇద్దరికీ బర్త్ డే గిఫ్ట్ ఏం కావాలి?" అడిగాడు జగదీష్.

"నేను ఆలోచించి చెపుతా," అన్నాడు వినోద్..."మరి నీ బర్త్ డే కూడా అయిందిగా బావా, నీకేం కావాలి?" అడిగాడు వాడు...

నేనేదో అనబోయే లోగా జగదీష్ ఫోన్ మోగింది. ఫోన్ తీసి చూసి, ఆన్సర్ చేయకుండా పెట్టేసాడు. మళ్ళీ కూడా మోగితే ఆఫ్ చేసాడు.

ఎందుకు తీయవు?" అడిగాను.

"మీ ఫ్రెండ్ రాణి ఫోన్. ఇప్పుడు ఒక గంట సేపు టైం తినేస్తుంది. అందుకని," అన్నాడు.

"మాట్లాడ్డం అంత ఇష్టం లేకపోతే, మానేసేయవచ్చు కదా!" అన్నాను.

విని ఏమనలేదు జగదీష్.

కాస్త మౌనం తరువాత, "నీకు తెలుసా? నీ పర్సనల్ మేనేజర్ లా వ్యవహరిస్తున్నారని, అప్పట్లోవాళ్ళ డాడీతో గొడవపడింది రాణి. భూషణ్ అంకుల్ మాత్రం, నీ కెరియర్ కి తన సహకారం తప్పనిసరిగా ఉంటుందన్నారని, ఆయనతో మాట్లాడ్డం మానేసింది కూడా. నేనెంతో కన్విన్స్ చేసాక కొద్ది కొద్దిగా సర్దుకుంది," నవ్వుతూ నా వంక చూసాడు.

"మీ ఇద్దరి మధ్య శత్రుత్వం ఉండకుండా చూసే 'రెఫెరీ' అనుకో నన్ను. అందుకని ఫ్రెండ్ షిప్ ఉండాలి, మాట్లాడాలి," మళ్ళీ జగదీష్..

ఇదంతా వింటున్న వినోద్ కల్పించుకున్నాడు.

“నాతో మాత్రం,ఫ్రెండ్లీగానే ఉంటుంది, రాణి… అక్క అంటేనే ఆమెకి ఇష్టం లేదని అందరికీ తెలుసు,” నవ్వుతూ నా వంక చూసాడు.

నాకు మాట్లాడక తప్పలేదు.

“నేను రాణితో కలిసి ప్రదర్శనలు చేస్తున్నా, విడిగా కలుసుకునే అవకాశాలు తక్కువయిపోయాయి.అమ్మ వద్ద సంగీత సాధన చేయడానికి మాత్రమే వచ్చి వెళుతుంది..

సినిమాల్లో రాణి పాడుతున్న వెస్టర్న్ స్టైల్ పాటలకి, మంచి క్రేజ్ ఉంది. కనుక, తనకి జెలసీ ఫీల్ అయ్యే అవసరం కూడా లేదుగా” అన్నాను జవాబుగా…

“నీ కెరియర్ పట్ల వాళ్ళ డాడీ చూపే శ్రద్ధ రాణికి నచ్చదు… అదే వాళ్ళిద్దరి మధ్య దూరాన్ని పెంచుతుంది. ప్రతీకారంగా, మీ కంటే ఎక్కువగా, తనే నాకు దగ్గరవ్వాలని తన ఆలోచన,” వివరించాడు జగదీష్.

“సరే గాని, ఈ రంజిత్ సూరి ఎవరు? వాడి పేరు చెబుతూ ఉంటుంది రాణి,” అడిగాడు …

నేను జవాబు చెప్పేలోగా, “ఇదో నీకే ఫోన్, డాడీ సెల్ కి చేసింది రాణి,” అంటూ అతనికి ఫోన్ అందించి వెళ్ళింది అత్తయ్య.



అత్తయ్య నుండి ఫోన్ అందుకుని, లేచి బయటకి నడిచాడు జగదీష్. రాణితో మాట్లాడ్డానికి, అతనలా అవతలికి వెళ్ళడం, నాకు కోపంగా, అవమానంగా అనిపించింది.

విసురుగా అక్కడి నుండి కదిలి,వరండాలో అమ్మా వాళ్ళ వద్దకు వెళ్ళి కూర్చున్నాను.

ఢిల్లీషాపింగుల గురించి,అత్తయ్య,చెన్నై గోల్డ్ షాపుల గురించి,అమ్మ, అమ్మమ్మకి కబుర్లు చెబుతున్నారు....

దూరంగా కూర్చున్న నన్ను చూసి, "ఇలా వచ్చి కూర్చోమ్మా," అంది అమ్మమ్మ.. వెళ్లిపక్కనే కూర్చున్నాను.

“రేపేగా అమరావతి ప్రయాణం....అక్కడి నుంచి తిరిగొచ్చిన మూడో రోజున అందరూ వెళ్ళిపోతారు. ఇల్లంతా బోసి పోతుంది. ఇప్పట్నించే దిగులుగా ఉంది,” అంది నా భుజం మీద చేయి వేస్తూ.

“ఇకపై ప్రతి యేడూ వస్తాము లేమ్మా, అంత దిగులెందుకు.” అమ్మ జవాబుగా.

“అమరావాతంటే గుర్తొచ్చింది. మేము వెళ్ళి చాలా కాలమయింది. రోడ్లు ఊరు అలాగే ఉన్నాయా?” అడిగింది మణత్తయ్య.

“మేము మూడేళ్ళ క్రితం వెళ్ళాము. గుంటూరుతో సమానంగా అభివృద్ధి చెందిందిగా,”

మా అమరావతి ట్రిప్పు గుర్తు చేసుకుంటూ అమ్మ.

అమరావతి ఎంతలా డెవలప్ అయిందో డిస్కస్ చేయసాగారు.

**

మరి కాసేపటికి, లోనికొచ్చి, వాళ్ళమ్మకి సెల్ఫోన్ అందించి, మా ఎదురుగా కూర్చున్నాడు జగదీష్. ముభావంగా ఉన్నాడు.

‘రాణితో మాట్లాడినంత మాత్రాన అతని మూడ్ ఇంతలా మారాలా?’ అనుకున్నాను.

“మళ్ళీ ఏమిట్రా? ఆ అమ్మాయి ఏమంటుంది?” అంది జగదీష్ ని గమనించిన అత్తయ్య.

"ఏదో చెబుతూనే ఉంటుంది. నాకు బోర్ కొట్టిస్తుంది," అసహనంగా జగదీష్.

"సరదాగానే మాట్లాడుతావుగా, అంతలోనే 'బోర్' అంటావే?" నసిగింది అత్తయ్య...

"నువ్వేగా! రాణిని ఎంకరేజ్ చేస్తావు. శారదత్తయ్యకి స్టూడెంట్ కాబట్టి, ఫామిలి ఫ్రెండ్స్ కాబట్టి, వాళ్ళతో మంచిగా ఉండమంటావు. నీ వల్లే ఆ అమ్మాయి ఫోన్ చేసినప్పుడల్లాఫ్రెండ్లీగానే మాట్లాడుతాను. నా తల తినేస్తుంది.అసలు,సమస్యంతా నీ మూలంగానే మమ్మీ. అయినా ..నువ్వు అటు ఇటు కూడా మాట్లాడుతావు మమ్మీ," కోపంగా లేచి తన రూం కి వెళ్ళిపోయాడు జగదీష్.

'రాణి విషయంలో' నేనన్న మాటలకి, ఇలానాకు జవాబు చెపుతున్నాడా?... అనిపించింది.. కాసేపు ఎవ్వరు ఏమీ అనలేదు.

అత్తయ్యే మాట్లాడింది.

"ఏం లేదు శారదా. వీడంటే ఆ అమ్మాయికి ఏదో ఆకర్షణ. తన వెంట తిప్పుకోవాలని ఆరాటం. అతి గారాబమనుకుంటా. కాస్తమొండిదనిపించినా, పిల్లమంచిదే, మాతోఆప్యాయంగా ఉంటది," క్షణమాగింది అత్తయ్య.

అందరం వింటున్నాము...

"మొన్న వాళ్ళు ఢిల్లీ వచ్చినప్పుడు, వీడి బర్త్డేకి డైమెండ్ లాకెట్ ప్రెజెంట్ చేసింది. వీడు తీసుకోనన్నాడని, మూడు రోజులు పచ్చి మంచినీళ్ళు ముట్టలేదు,.

ఇక ఆఖరికి లాకెట్ తీసుకున్నాడు. కాకపోతే , తను వేసుకోననిదాన్ని నాకిచ్చేసాడనుకో. ఇదిగో నా మెడలోనే ఉంది," లాకెట్ చూపిస్తూ అత్తయ్య.

"ఇంతకీ, చెప్పేదేమంటే, ఆ అమ్మాయి వీడితో ఫ్రెండ్లీగా, ఉంటుంది. ఈ తరం వారు చాలా మటుకు అలాగే ఉంటారుగా

మరి," తేల్చేసింది అత్తయ్య.

అమ్మమ్మ నా వంక చూసి సన్నగా నవ్వింది.

కాసేపు మళ్ళీ ఎవరు ఏమీ అనలేదు.

"సరే మరి.  పదండి, భోజనం చేసి, పెందరాళే పడుకుందాం.  పొద్దున్నే  గుడికి బయలేదేరాలిగా," అని అమ్మ అంటుండగానే, వినోద్ ని తీసుకొని వచ్చాడు జగదీష్.

"ఇ యామ్ హంగ్రీ  నానమ్మా.  పదండి భోంచేద్దాం," అన్నాడు.

**

గుడికి వెళ్ళేప్పుడు తను కుట్టించిన గ్రీన్ కలర్ కి పింక్ బార్డర్ పట్టు పెరికిణీ  వేయించింది, నాచేత అమ్మమ్మ.  తన కెంపుల హారం కూడా పెట్టింది.

అమరావతిలో,దేవుడు దర్శనం బాగా జరిగింది.

మునుపటిలా,అదే పెద్ద మర్రిచెట్టునీడన కూర్చుని, ప్రసాదాలు తింటుండగా, వాళ్ళ పెళ్ళి నాటి ముచ్చట మరోసారి గుర్తుచేశారు నాన్న.

అందరూ నవ్వుతూ విన్నారు.

**

“పిల్లలంతా ఇలా సంప్రదాయమైన దుస్తులు వేసుకొని, చక్కగా చూడముచ్చటగా ఉన్నారర్రా. పరికిణీ వోణీ వేసుకుని కళ, పట్టు జుబ్బాల్లోయువరాజుల్లామగపిల్లలు .. కన్నుల పండువగా ఉంది మాకు,” అంది అమ్మమ్మ.

తన కెమెరాతో, అందరినీ చాలా ఫోటోలు తీసాడు, జగదీష్... తిరుగు ప్రయాణం కూడా, కబుర్లు పాటలతో సరదాగా గడిచింది.

**

వెకేషన్ లో మిగిలింది మూడు రోజులేనంటూ, ప్రతిపూట యేదో ఒక యాక్టివిటీ పెట్టుకుని,అమ్మమ్మ వాళ్ళతో సరదాగా గడిపేస్తున్నాము... వెళ్ళే ముందు రోజు ‘విందు భోజనం’ అంటూ పొద్దుటి నుంచి వంటలు చేయించింది అమ్మమ్మ. ఒకేసారి తినడం అవ్వదు కాబట్టి, ‘రోజంతా భోజన హాలు వోపెన్’ అంటూ అనౌన్స్ చేసింది కూడా.

నిజంగానే, బ్రేక్ ఫాస్ట్ కి - ఇడ్లీ దోసె, కిచిడి తో మొదలయి, లంచ్ కి చికెన్ ఫ్రై, ఫిష్, ప్రాన్స్ తో అమ్మమ్మ వంటలు అందర్నీ అలరించాయి.

ఇక రాత్రి భోజనానికి దోసకయి పప్పు, ఆలు ఫ్రై, పచ్చి పులుసు చేసామంటూ, భోజనానికి పిలిచింది..

జగదీష్ కి, వినోద్ కి కబుర్లు చెబుతూ స్వయంగా వడ్డించ సాగిందామె.

“నానమ్మ, నేను వచ్చే యేడు మెడిసిన్ లో చేరాలి కాబట్టి,సమ్మర్లో రావడం కష్టం. ఇక నుండీ క్రిస్టమస్ టైం లో మాత్రమే, నాకు ఫ్రీ టైం ఉంటుంది. ఆ సమయంలో, మేము తప్పక గుంటూరు రావడానికి హ్యాపీ. అలాగే అత్తయ్య వాళ్ళు కూడా అనుకుంటే, చాలా బాగుంటుంది,” అన్నాడు జగదీష్ అమ్మావాళ్ళ వంక చూస్తూ.

“అలాగే ప్లాన్ చేద్దాము. ఫామిలీ రీ-యునియన్లా ఉంటుంది. మీ పెద్దమ్మాయి సుశీల గారికి కూడా చెప్పండి

మామయ్య," నాన్న తాతయ్యతో.

**

బ్రేక్ ఫాస్ట్ తరువాత , జగదీష్ వాళ్ళు ఎయిర్ పోర్టుకి వెళ్ళిపోయారు. లంచ్ కూడా అయ్యాక, వినోద్ ని తీసుకొని, తాతయ్య, నాన్న షాపింగ్ కి బయలుదేరారు..

మా ట్రైన్ రాత్రి ఎనిమిదికవడంతో, ప్యాకింగ్ఫినిష్ చేసి,తిరిగ్గా ల్యాప్ టాప్ తో సోఫాలో చేరాను.

వంటింట్లోనుండి వచ్చినఅమ్మా, అమ్మమ్మా కూడానా పక్కనే చేరారు. ట్రేలో కాఫీ కప్పులు తెచ్చి సెంటర్ టేబిల్ మీద ఉంచి వెళ్ళింది, రేవతి. నా చేతికి కాఫీ కప్పందించింది అమ్మమ్మ.

"చంద్రకళా, ఇప్పుడు నేను చెప్పేది మీ అమ్మతో పాటు నువ్వూ విను," అంది నాతో... అలాగేనన్నట్టు తలాడించాను.

ముఖాన చిరునవ్వుతో..అమ్మ వంక చూసింది...

"ఎంతటి గొప్ప కళాకారిణి అయినా, ఆడపిల్లకి మంచి జీవితం ముఖ్యం. నా దృష్టిలో, చంద్రకి మన జగదీష్ సంబంధం చాలా మంచిదనిపిస్తుంది.

వాడు ఎంత ప్రేమ కలవాడో, ఎంత బాధ్యత కలవాడో మనకి తెలుసు. రేపు సర్జన్ అవబోతున్నాడు. ఆస్తిపాస్తులు విషయం అటు పెట్టు. మనిషే బంగారం. అందగాడు. పైగా వాడికి చంద్రకళ పై ఎనలేని అభిమానం. దాని డాన్స్ అంటే మహా ఇష్టం.

ఇంకేం కావాలి?" అందామె అమ్మతో...

పక్కకి తిరిగి, నా భుజంపై తట్టింది....“ఇదిగో చంద్రమ్మా, జగదీష్ తో స్వేచ్ఛగా మాట్లాడు. పరాయి వాడేమీ కాదుగా! ప్రేమగా, ఆప్యాయంగా ఉండు,” అంది సూటిగా నాతోనే.

విని మౌనంగా తల దించుకున్నాను.

క్షణమాగిందామె....

“పోతే, శారదా, అసలు సంగతి విను.. మణి వైఖరి చూసారుగా. మనిషి మంచిదే, కాని అంతగా కుదురు లేదు. ఆ రాణి వాళ్ళ కుటుంబమంటే వొణుకుతుంది.

భూషణ్ గారికి కొత్తగా అధునాతన ఆసుపత్రి ఉందటగా! మెడికల్ కాలేజి కూడా కట్టించారటగా. తన కొడుక్కి బోలెడంత ఆలంబన అవుతారని దాని ఆశ,” వివరించింది అమ్మకి....

నేను, అమ్మ ముఖాలు చూసుకున్నాము.

“ఇక ఆ రాణికైతే అడ్డు దాపు లేనట్టుంది. విపరీతపు పెంపకంలా ఉంది. దానికి మనమేమీ చేయలేమనుకో...అయితే, మీరు చేయగలిగింది ఒకటైతే ఉంది.అన్నీ గమనించుకుని జగదీషుని మీవాణ్ణి చేసుకోండి. అవకాశం పోనీయవద్దు,” అంటూ ముగించి, నా వంక చూసింది, అమ్మమ్మ,

ఏదో మంత్రం వేసినట్టు వింటున్న నేను, గబుక్కున సర్దుకునిచూపు అమ్మ వైపు సారించాను.

“నువ్వు చెప్పేది కరెక్టేనమ్మా. నా మనస్సులోనూ అదే ఉంది. కానీ, పిల్లలు చిన్నవాళ్ళుగా. చూద్దాములే. ఏది ఎలా జరుగుతుందో...” అంది అమ్మ.

“నాకు మాత్రం తెలియదా, ఇంకాటైముందని. కాకపోతే, మీ ఇద్దరి చెవిన ఈ మాట వేస్తే  మీకు నా ఆలోచన తెలుస్తుందనే.  పైగా ఆ రాణి పోటీ కొచ్చిందిగా!  అందుకే హెచ్చరించవలసిన అవసరం వచ్చింది..

అదీకాక,  మేము పెద్దవాళ్ళం కదా తల్లీ,  మనసులో మాట ఎప్పుడికప్పుడు చెప్పాలి మరి.  ఇక ఆ పైవాడి దయ,” అంటూ వాకిలవతలతాతయ్య గొంతు వినబడ్డంతో,  లేచి అటుగా వెళ్ళింది.

“ఏమ్మా, ట్రైన్టైం అవుతుందిగా!భోజనంవడ్డిస్తే  తినేసి,కాస్తతిరిగ్గా బయలుదేరవచ్చు,” అంటూతాతయ్య లోనికొచ్చారు.....

**

అమ్మమ్మా వాళ్లకి వీడ్కోలు చెప్పేసి, రెండుగంటలకి పైగా,ట్రైన్లోసాగిపోతున్నా మనసంతా దిగులుగా ఉంది....అమ్మమ్మకి నా మీద ఎనలేని ప్రేమే కాదు, నా భావిష్యత్తుగురించి ఆమెకున్న శ్రద్ధ గుర్తించగలిగాను.  నాకెంతోగర్వంగా, సంతోషంగాకూడా అనిపించింది...

చుట్టూచూస్తే, కాబిన్ లో అందరూ మౌనంగా, విశ్రాంతిగాఉన్నారు. చదువుదామని,నవల చేతిలోకి తీసుకున్నానే గాని,మనసు నిండా జగదీష్  గురించిన ఆలోచనలుకమ్ముకున్నాయి.  నాకెప్పుడూ  అతనంటే  ఇష్టమే.

. అతనికి కూడా నేనంటే ఇష్టం, ప్రేమ ఉన్నాయని అమ్మమ్మ అంటుందిగా!

జీవితంలో జగదీష్  తోడుంటే, నా నాట్య సాధనకి అడ్డు ఉండదు కాబట్టి, ఆశయాలు పాడయ్యేది ఏముంటుంది? అమ్మకి నాన్నకి కూడా జగదీష్ ఇష్టమేగా!...

నా  ఆలోచన సాగుతున్న  తీరు కాస్త ఇబ్బందిగానే అనిపించింది.

‘ఏదేమైనా ఇక ఈ గజిబిజి ఆలోచనలు నా మనస్సునుండి తీసేయాలి. ఏదెలా జరగాలో అలా జరుగుతుంది కదా’.

‘సమయం వృధా చేయవద్దని, లేని సమస్యలు సృష్టించుకోవద్దని అమ్మ ఎప్పుడూ చెబుతుంది….’ అనుకుంటూ, నిద్ర పోదామని గట్టిగా కళ్ళు మూసుకొన్నాను.



మా కన్నా ఓ రోజు ముందే చెన్నై చేరిన కోటమ్మత్త ఇల్లంతా సర్ది మా కోసం టిఫిన్లు చేసుంచింది. బ్రేక్ ఫాస్ట్

చేసి,అలసటగా ఉందంటూ, నాన్న వెళ్లిపడుకుండి పోయారు.

నేనూ పనులు ముగించి,  కాలేజి క్లాస్ షెడ్యూల్ చూసుకొన్నాను.

మేము చెన్నై చేరిన సంగతి,భూషణ్ అంకుల్ కి తెలియజేసే లోగా ఆయనే ఫోన్ చేసారు….

'న్యూ ఇయర్స్ ఈవ్' కి, సిటీ అవుట్-స్కర్ట్స్ లోని తమ గెస్ట్-హౌజ్ కి డిన్నర్ కి ఆహ్వానించారు.  కోటమ్మత్తతో సహా తప్పక రమ్మని చెబుతూ, మాతో సంప్రదించవలసిన కొత్తవిషయాలు కూడా ఉన్నాయన్నారు.

**

లంచ్ కి మా ఇరువురి కుటుంబాలు కాక,  మానేజర్ మూర్తిగారు మాత్రమే ఉన్నారు… రాణి ని చాలా రోజుల తర్వాత కలిసాను.  ఫ్రెండ్లీగానే మాట్లాడుకున్నాము.

వినోద్ స్పోర్ట్స్ యాక్టివిటీస్ గురించి అడిగి తెలుసుకున్నారు అంకుల్…. 'మూవీ ఆర్టిస్ట్స్ అసోషియేషన్' వారు జరపబోయే స్పోర్ట్స్ ఫెస్టివల్లో పాల్గొనమని వాడికి సూచించారు.

సరదాగా కబుర్లుచెప్పుకుంటూ మంచి భోజనం చేసాము.  డెజర్ట్ కూడా అయ్యాక, అందరం లివింగ్ రూములో చేరాము.

"సత్యం, మీకు చాలా విషయాలు చెప్పాలి, ఫైనలైజ్ చేయాలి," అంటూ మూర్తిగారి వద్దనుండి  ఓ ఫైల్ అందుకున్నారు అంకుల్… ఆయన చెప్పేది, శ్రద్ధగా వినసాగాము.

'న్యూ-జెన్ టి.వి' వారు - క్లాసికల్ ఆర్ట్స్ విభాగంలో – నన్ను, అలాగే లైట్-మ్యూజిక్ విభాగంలో- రాణిని, అవార్డు గ్రహీతలుగా ఎంపిక చేశారట.

రెండవ సంగతిగా - తమిళ ఫిలిం డైరక్టర్ – ముత్తురామన్ సార్ నిర్మించబోయే, 'డాక్టర్ శ్రీలత అయ్యర్' అనే ఫిలింలో హీరోయిన్ పాత్రకి నన్ను ఎంపిక చేయాలని, అంకుల్ ని కలిసారట.

ఇకపోతే, మా మొదటి విదేశీ కల్చరల్ టూర్ కూడా డేట్స్ తో సహా కంఫర్మ్ అయ్యిందన్నారాయన. మలేషియాలోని 'రామసుబ్బయ స్కాలర్షిప్ ఫౌండేషన్' వారి సహకారంతో, చెన్నై కల్చరల్ సంఘం వారు, టూర్ కి ఏర్పాట్లు చేస్తున్నారని... ఈ ప్రదర్శనల మొదటి విడత, మలేషియా – సింగపూర్ లోనూ, రెండవది లండన్ లోనూ జరుగుతాయట. చెప్పడం ముగించి, గట్టిగా ఊపిరి తీసుకున్నారు అంకుల్. చాలా సంతోషంగా ఉందన్నారు.

ఫైల్ నాన్న చేతికిచ్చారు. ఊహించనంత ఉత్సాహం కలిగించే ఆ సంగతులకి, అంకుల్ కి కృతజ్ఞతలు తెలియజేశాము... తన సోఫానుండి,లేచి వచ్చి, రాణి నాకు 'కంగ్రాట్స్' చెప్పింది. వాళ్ళ డాడీని హగ్ చేసి, "మీ ప్లాన్ బాగుంది డాడీ," అంటూ అభినందించింది.

"ఇక్కడ రెస్టారెంట్ లో 'బాదం కీర్' చాలా బాగుంటుంది. అందరికీ ఇందాకనే ఆర్డర్ చేసాను. డాడీ ప్లాన్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ సక్సస్ కోసం 'బాదం కీర్' తో టోస్ట్ చేద్దాం," అంటూ అక్కడినుండి కదిలింది రాణి...

'నేనంటే ఇష్టం లేకున్నా, హుందాగానే ప్రవర్తిస్తుంది' అనిపించింది.

**

అంకుల్ ఇచ్చిన ఫైల్లోని పేపర్స్ ని ఓసారి తిరగేసారు నాన్న.

"ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యేప్పటికి, యేడాది పైనే టైం పడుతుందని నాఅంచనా. కాబట్టి అన్నీ పకడ్బందీగా ప్లాన్ చేయాలి," అన్నారు.

“అంతే కదా! మరి,  ఇన్షియల్ గా  నాకు ఓ ప్లాన్ అయితే ఉంది.డిస్కస్ చేసి నీకు ఒకే అయ్యాకే ముందుకు వెళదాం,” అన్నారు అంకుల్.  ముత్తురామన్ ఫిలిం గురించయితే,తనకి నమ్మకముందని,సైన్ చేసిన వెంటనే, కొత్తగా నిర్మాణంలో ఉన్న ఫ్లాట్ ఒకటి నా పేరున తీసుకుందామని కూడా ప్రస్తావించారాయన....

“చాలా సంతోషం భూషణ్ గారు... సొంత బిడ్డలా చంద్రకళని వృద్ధిలోకి తెస్తున్నారు. మీరు వేసిన బాటలోనే చంద్రకళ ఎప్పటికీ నడుస్తుంది.  మా హృదయపూర్వక ధన్యవాదాలు మీకు,” అంది అమ్మ...

“అలా అనకండి శారద గారు....నేను నిమిత్తమాత్రుణ్ణి... ఇలా జరగాలని ఉంది. అంతే,” అన్నారాయన.

“ఈ టూర్ విషయంలో రాణి కూడా ఉత్సాహంగా ఉంది,” అంది నీరు ఆంటీ... లేచి వెళ్లివాళ్ళిద్దరికీ నమస్కరించి, ధన్యవాదాలు తెలిపాను.

“విష్ యు మోర్ సక్సస్ కళా.  ముత్తురామన్ సార్ మూవీ నీకు ఓ మంచి అవకాశమే అవుతుంది,” అంటూ దీవించారు అంకుల్.

“నిజానికి రెండేళ్ళగా  నీకు ఓ అరడజను పక్కా మూవీ ఆఫర్స్ వచ్చాయి.  అవి మన సిద్ధాంతాలకి సరిపోని పాత్రలవడంతో,  నేను ముందుకు సాగనివ్వలేదు.

ఇప్పుడు ఈ ఆఫర్ నాకు సరయినదని తోచింది. వివరాలు త్వరలో  మీరూ వింటారుగా....అంతా కుదిరితే, బేషుగ్గా ఉంటుంది కళా,” మళ్ళీ అంకుల్. నాన్న కలగజేసుకున్నారు.

“కానైతే,  ఎన్నాళ్ళగానో  ఎదురుచూస్తున్న వరల్డ్కల్చరల్  టూర్ కి - ఈ సినిమా గాని, లోకల్  ప్రోగ్రామ్స్ కాని అడ్డు రాకుండా చూడాలి భూషణ్,” అన్నారు.

“అదంతా నేను ఆలోచించానులే సత్యం.  పోతే,నీవు కల్చరల్ డెలిగేషన్ కి లీడర్, నేను మన గ్రూప్ కోఆర్డినేటర్. ఆర్కెస్ట్రాతో కలిపి పదిమందికి పర్మిషన్ ఉంది మనకి.,” అన్న అంకుల్ మాటలకి నాన్న హ్యాపీ.

ఇంతలో, సర్వెంట్ చేత అందరికీ 'కీర్' సర్వ్ చేయించి, వాళ్ళ డాడీ పక్కనే కూర్చుంది రాణి.

**

నాన్న తిరిగి అందించిన ప్రాజెక్ట్ ఫైల్ ని, తీసున్నారు అంకుల్...

"ఇకపోతే, నీ విషయంగా, ఎల్లుండి పొద్దున్నే మా న్యూరాలజిస్ట్ వద్ద అపాయింట్మెంట్ తీసుకున్నాను... ఏడింటికి రెడీగా ఉండు. నేనే వచ్చి, నిన్ను పికప్ చేసుకుంటాను," నాన్నకి గుర్తుచేసారాయన.

అన్నీ వింటూ, గమనిస్తున్న కోటమ్మత్త కలగజేసుకుంది.

"మీ లాంటి స్నేహితుడు, ఉండడం మా తమ్ముడి అదృష్టం భూషణ్ గారు. అయితే ఈ శుభసమయంలో నాదో మనవి," అంది ఉన్నట్టుండామె...

అందరం ఆశ్చర్య పోయాము. బయట వాళ్ళతో పెద్దగా మాట్లాడని అత్త, ఏమంటుందో అని, నేను, అమ్మ ముఖాలు చూసుకున్నాము.

"చూడండమ్మా ... మీకు సత్యం ఎంతో, నేనూ అంతే అనుకోండి. మీ మనస్సులో మాట చెప్పండి," అన్నారు అంకుల్ ఆమెతో.. కొద్ది మౌనం తరువాత, "మీరు అంటున్న ఈ ప్రోగ్రాములన్నీ అయ్యేప్పటికి, మా చంద్రకళకి పెళ్ళి చేయడానికి, సరయిన సమయమవుతుంది. ఇలా కళావేదికలే కాదు, కళ్యాణ వేదిక పైన కూడా ముందుండి బాధ్యతగా మా అమ్మాయి పెళ్ళి జరిపించాలి మీ దంపతులు మరి. అదే నా కోరిక,... " అంది కోటమత్త

"ఎంత మాట, అసలది మీరు అడగాలా?" చంద్రకళ వివాహ సమయంలో, అన్నీ మేమే అయ్యి చేస్తాము...ఇప్పట్నించే వరుణ్ణి వెతకండి మరి," అంది నీరూ ఆంటీ.

“సంబంధాలకి కొరతేముందమ్మా? చంద్రకళకి.  అదీకాక, వరస్సైన వాడు మా జగదీష్ ఉండనే ఉన్నాడు. .... ఏమైనా, మంచి యోగ్యుడైన వాడితోనే అమ్మాయి జీవితం,ముడి పడుతుంది లెండి,” అంది కోటమ్మత్త సంతోషంగా...

నేను, నా పక్కనే ఉన్న అమ్మ కూడా ఒక్కసారి ఉలిక్కిపడ్డాము.

ఆమె మాటలకి, అందరం నిర్ఘాంతపోయాము.

అంకుల్ అందుకున్నారు... ”అరె, అంత మార్పు ఎలా సాధ్యం? నమ్మ లేకుండా ఉందే? కాలేజీలో ఉండగా, మేనరికాలు చేసుకోవద్దని, చాటేవాడు మన సత్యం. బల్లగుద్ది మరీవాదించేవాడు.  అసలందుకేగా నేను నా మరదల్ని కాదని నీరూని చేసుకుంది,” నవ్వుతూనే అంకుల్.....

నాన్న ఉలిక్కిపడి ఒక్కసారిగా కుర్చీలో అటు నుండి ఇటు కదిలారు.

“భలేవాడివే భూషణ్, ఎప్పటివో విషయాలు ఇప్పుడిలా,”ఆగారు నాన్న.

ఈ సంభాషణ ఎలాతెల్తుందో అని ఆదుర్దాగా ఉంది...నాన్న వంక చూసాను.

“అదీ గాక, కాలేజి రోజుల్లో మేనరికాల విషయంగా వాదించే వాడిని.  నిజమే.  అయినా, మా అక్కకి అన్ని విషయాలు తెలియదులే,”  అంటూ ఏదోలా మాట మార్చారు....

**

జగదీష్ గురించిన విషయాలు, అమ్మే, కోటమ్మత్తకి చెప్పిందని తెలుసు. గుంటూరు వెళ్ళినప్పుడు,అమ్మమ్మ  మాతో

అన్న మాటలు, జగదీష్ గురించి ఆమె అభిప్రాయాలు, అమ్మ, అత్తకి చెప్పడం నేనూ విన్నాను. ఏమైనా, ఇకిప్పుడు రాణి వంక చూడాలంటే కూడా భయంగా ఉంది…కోటమ్మత్త మాటలు విన్న ఆమె ఏమి చేస్తుందో? ఎలా రియాక్ట్ అవుతుందోనని కంగారుగా ఉంది…

అందరి మౌనాన్ని ఛేదిస్తూ నీరూ ఆంటీ, "ఇప్పుడీ పెళ్లి ప్రస్తావన బాగుంది. మా రాణి పెళ్ళి సంగతి గురించి కూడా ఆలోచన చేయాలని,సమయానికి గుర్తుచేసినట్టయింది.." అంది నవ్వుతూ….

"మీకేం తక్కువండీ. మీ అల్లుడుగా అవ్వాలంటే పెట్టిపుట్టాలి…. రాణి నిజంగా యువరాణియే. అందం, ఐశ్వర్యం అన్నీ ఉన్న గారాల బిడ్డ కదా… మీకు అంతా శుభం జరుగుతుంది," అంది కోటమ్మత్త

**

"అందరం కాసేపు అలా బయట గార్డెన్స్ లో తిరిగి వద్దాము, ఇక్కడ మంచి గ్రీనరి వేయికి పైగా రకరకాల చెట్లు, డక్ పాండ్, అన్నీ చూడవలసినవే," అంటూ భూషణ్ అంకుల్ అందర్నీ అక్కడి నుండి బయటికి నడిపించారు.

"అక్కడి నుండి వచ్చాక, ఓ మూవీ చూసి, భోజనం చేసేప్పటికి మిడ్ నైట్ అవుతుంది కూడా,"అంది ఆంటీ ముందు నడుస్తూ..

**

అర్ధరాత్రి పన్నెండుకి కేక్ కట్ చేసి, 'హ్యాపీ న్యూ ఇయర్' అని ఒకరికొకరం శుభాకాంక్షలు చెప్పుకున్నాము. అంకుల్, ఆంటీ అందరికీ 'ఓం' చెక్కున్న గోల్డ్ పెండెంట్లు గిఫ్ట్ గా ఇచ్చారు.

మరికాసేపు కబుర్లయ్యాక, అలిసిపోయి గెస్ట్-హౌజ్ లోని బెడ్ రూమ్స్ లోకి నిష్క్రమించాము.

**

పొద్దున్నే, స్వయంగా తానే వచ్చి, తలుపులు తట్టి, అందరినీ బ్రేక్ ఫాస్ట్ కి పిలిచింది, ఆంటీ. అందరం డైనింగ్ హాల్లో చేరాక, ఫ్రెష్ పైనాపిల్ జ్యూస్ సర్వ్ చేయించింది. అక్కడి రిజార్ట్ లోని బ్రేక్ ఫాస్ట్ ఐటమ్స్ చాలా బావుంటాయంటూ, అందరికీ దగ్గరుండి వడ్డన చేయసాగిందామె.

"ఇంతకీ, రాణి ఏదమ్మా?"....కోటమ్మత్త అడిగిన దానికి, ఇంకా నిద్ర లేవలేదన్నారు ఆంటీ. పైనాపిల్ కేక్ తో సహా, రెండో సారి కాఫీలు కూడా అయ్యాక, వారి వద్ద శలవు తీసుకొని ఇంటికి బయలుదేరి పోయాము.

**

కారులో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నారు నాన్న.

మరునాడు న్యూరాలజిస్ట్ వద్దకు వెళ్ళడం దేనికని అడిగానాయన్ని..

"చాలా అలసటగా ఉంటుందమ్మా. కుడి కాలు నొప్పి, టింగ్లింగ్ సెన్సేషన్ ...కళ్ళు కూడా పూర్తిగా మూతలు పడకుండా ఇబ్బందిగా ఉంటుంది. ఇక ఒక్కోసారి మాట్లాడ్డానికి గొంతు పెగలనట్టవుతుంది. అందుకే,చెకప్ కి వెళుతున్నాను," అన్నారు నాన్న.

ఆయనకున్న వ్యాధి - 'మయస్తీన గ్రేవిస్' లక్షణాలే ఇవన్నీ. రేపు చెకప్ అయ్యాక, మందు డోసేజ్ సరిచేసి, విశ్రాంతి తీసుకోమంటాడేమో డాక్టర్' ...అనుకున్నాను...

ఎంతటి సంతోషాలు ఉన్నా, జీవితంలో ఎంతటి విశేషాలు జరుగుతున్నా, నాన్న ఆరోగ్య విషయం నా ఉత్సాహాన్ని నీరు గారుస్తుంది....గుండెల్లో ఓ మూల నాన్న గురించి బాధ, భయం...ఉంటున్నాయి.

“డాక్టర్ దగ్గరికి నేను కూడా వస్తాను నాన్న,” అన్నాను.

**

ఇల్లు చేరేప్పటికి, లంచ్ టైం దాటిపోయింది. వినోద్ ఒక్కడే లంచ్ చేస్తానన్నాడు. అమ్మ వాడికి ఫ్రెంచ్-టోస్ట్ చేసిచ్చి, మాకు టీ చేసి అందించింది.

“జగదీష్ విషయం, రాణివాళ్ళ వద్ద ప్రస్తావించకుండానే ఉండవలసింది,” అన్నారు నాన్న, పక్కనే కూర్చుని‘టీ తాగుతున్న అత్తతో.

“పైగా ‘మేనరికాన్ని ఎలా ప్రోత్సహిస్తానని’ ప్రశ్నించాడు భూషణ్... నా సిద్ధాంతాన్ని మార్చుకున్నానా? అని అడిగినట్టేగా...,” ఆగారు నాన్న. మౌనంగా ఆయన మాటలు వింటున్నాము, నేను, అమ్మ.

“జగదీష్ తండ్రి రాంబాబు, మన శారదకి సొంత అన్న కాదని, రక్తసంబంధీకుడు కాదని భూషణ్ కి తెలియదుగా. అసలీ సంగతులు వాళ్ళ వద్ద రాకుండానే ఉండవలసింది,” మళ్ళీ నాన్న..

జవాబుగా కోటమ్మత్త నవ్వేసింది.

“తమ్ముడూ, నేను కావాలనే అన్నానయ్యా, మన అబ్బాయి మీద ఆశలు పెట్టుకోవద్దని వాళ్ళకి చెప్పకపోతే, మనమే ఇబ్బంది పడతాము,” అన్నదామె తాపీగా...

**

రాత్రి పడుకోబోయే ముందు అమ్మ నా గదిలోకి వచ్చి, బెడ్ మీద కూర్చుంది.

ఏదో విషయం ఆమెని బాధిస్తుందని తెలుస్తూనే ఉంది….

“ఏమైందమ్మా? నాన్న డాక్టర్ అపాయింట్ మెన్ట్ విషయమా?” అడిగాను…

“కాదమ్మా. నిజానికి, అంకుల్ వాళ్ళ వద్ద జగదీష్ ప్రస్తావన తప్పేమీ కాదు చంద్రా. కానైతే, ఆ మాటలు విన్న రాణి ఎలా రియాక్ట్ అవుతుందో, ఏం చేస్తుందోనని నాకు బెంగగా ఉంది,” అంది ఆలోచిస్తూ.

“ఏమీ బెంగపెట్టుకోకమ్మా. అసలెందుకు ఈ విషయాలిప్పుడు… చూద్దాంలే. నువ్వు పడుకో. మళ్ళీ పొద్దున్నే లేవాలిగా,” అని అమ్మని తన బెడ్రూం వరకు తీసుకెళ్ళాను.

**

రాత్రి ఒంటిగంట దాటాక , అంకుల్ వాళ్ళ హాస్పిటల్ నుండి నాన్నకి ఫోన్ కాల్ రావడం, అమ్మా నాన్నా గాబరా పడుతూ వెళ్ళడం క్షణాల మీద జరిగిపోయింది. వెళ్లిఎన్ని గంటలైనా, వాళ్ళ నుండి ఎటువంటి కబురు లేకపోగా, ఫోన్ కూడా కలవడం లేదు.

అక్కడ ఏమి జరుగుతుందో తెలియక, ఆదుర్దాగా ఎదురు చూడడం మినహా ఏం చేయలేక పోతున్నాము, నేను, అత్త..

**

మళ్ళీ అర్ధరాత్రవుతుండగా ఇంటికి తిరిగొచ్చిన అమ్మా వాళ్ళు, అలసటగా సోఫాల్లో కూర్చుండి పోయారు.

పొద్దుటి నుండీ ఏమీ తినలేదని తెలుసుకొని, హార్లిక్స్ కలిపి, ఇద్దరికీ అందించింది అత్త.

కాస్త తేరుకున్నాక, అంకుల్ వాళ్ళ విషయాలు చెప్పసాగింది అమ్మ.

"న్యూ ఇయర్స్ నాడు, బ్రేక్ ఫాస్ట్ కి కూడా రాకుండా నిద్రపోతుందనుకున్న రాణి, నిజానికి, ఫ్రూట్ నైఫ్ తో తనచేతి మణికట్టు కోసుకుని, బ్లీడింగయ్యి, అపస్మారక స్థితిలో, తన గదిలో పడి ఉందట," అని అమ్మ చెప్పగా విని, నిర్ఘాంత పోయాము.

"అదేంటమ్మా,.. అసలు రాణి అలా…" మాట దొరక్క ఆగిపోయాను…

"అయ్యో, అదేం పని? మరి ఎలా ఉందామ్మాయి?" ఆతృత్రగా అత్త..

"నిన్న పొద్దున్న బ్రేక్ ఫాస్ట్ అయ్యాక, మనం గెస్ట్-హౌజ్ నుండి బయలుదేరిపోయాం కదా! తరువాత కాసేపటికి గాని, రాణి గది లోనికి వెళ్లి జరిగిన ఉప ద్రవం తెలుసుకోలేదట వాళ్ళు.

క్షణాల మీద కూతుర్ని హాస్పిటల్ ఎమెర్జెన్సీ కి చేర్చిన భూషణ్ గారు, రాణి పరిస్థితి విషమంగా ఉందని తెలియగానే, కుప్పకూలారట. ఆయనప్పుడు 'మైల్డ్ స్ట్రోక్' కి గురయ్యారని తేల్చి, ట్రీట్ మెన్ట్ మొదలుపెట్టారట డాక్టర్లు. ఇక రాణికి మాత్రం బ్లడ్ ఎక్కించి, చికిత్స చేయడంతో, ఇప్పుడు ఆమె పరిస్థితి కాస్త మెరుగయింది. కోలుకుంటుందనే చెపుతున్నారు డాక్టర్లు," వివరిస్తూ కన్నీళ్లు పెట్టుకుంది అమ్మ.

అంతా విన్నాక, నాతో పాటు వినోద్, కోటమ్మత్త కూడా చాలా సేపటి వరకు కోలుకోలేకపోయాము….

నీరూ ఆంటీ వాళ్ళ అమ్మ, అన్న ఊరి నుండి రావడంతో, తాము బయలుదేరి ఇంటికి వచ్చామన్నారు నాన్న.

ఆదుర్దాలో, ఏమనాలో తోచక, మౌనంగా ఉండిపోయాము.

తన డాక్టర్ అపాయింట్ మెన్ట్ ని నాలుగు రోజుల తరువాతకి మార్చమని, నాకు  గుర్తుచేసారు నాన్న.

**

మూడు రోజులు గడిచాయి...  నేను టి.వి షూటింగ్ తో బిజీగా ఉండడం వల్లహాస్పిటల్ కి వెళ్ళలేక పోయాను.  అంకుల్ వాళ్ళ విషయాలు, అమ్మ నుండే తెలుసున్నాయి.

“రాణి కోలుకుని.. లేచి తిరుగుతుంది. బాగానే ఉంది..

రేపు పొద్దున్నే రాణిని హాస్పిటల్ నుండి డిశ్ చార్జ్ చేస్తారట,” అంది అమ్మ రాత్రి భోజనాలప్పుడు..

అంకుల్ గురించి వాకబు చేసాను....

అంకుల్ కి వచ్చిన స్ట్రోక్  స్వల్పమైనదే అయినా, కొంత మాట స్పష్టత కోల్పోవడంతో , స్పీచ్ తెరపీ మొదలుపెట్టారట. నడక కూడావేగం తగ్గడంతో, చేతికర్ర ఆసరాతో నడుస్తున్నారు.  అందుకుని, ఇంకొన్ని రోజులు కేర్ యూనిట్ లో ఉండాలన్నారట డాక్టర్లు.

“రేపు నాకు టైం ఉంటుంది. అంకుల్ ని విజిట్ చేస్తాను,” అన్నాను..

**

న్యురాలజిస్ట్ తో అపాయింట్ మెన్ట్ కి,  నాన్న వెంట నేను, అమ్మా కూడా వెళ్లాము.   బేసిక్ టెస్ట్స్ జరిపారు.

మందులు మార్చి, నాన్నని విశ్రాంతిగా ఉండమన్నారు. కాళ్ళల్లోని రక్తనాళాల్లో బ్లాకేజ్ ఉండవచ్చన్నారు. కొలెస్ట్రాల్, డయబిటీస్ వల్ల ఏర్పడే మరో ఆరోగ్య సమస్య –'పెరిఫెరల్ ఆర్టరీ డిజీజ్' లక్షణాలని వివరించారు మాకు..

అయినా, ముందైతే మందులతో మానేజ్ చేయవచ్చేమో చూద్దామన్నారు డాక్టర్లు.

ఇంటికి తిరిగి వచ్చాక, కోటమ్మత్తకి విషయం వివరించింది అమ్మ.

"సత్యంకి  ఇంకా పదిరోజుల లీవ్ ఉందిగా! కాస్త ఇంటి పట్టున విశ్రాంతిగా ఉంటాడు.  ఎంతో ఆరోగ్యంగా ఉండేవాడు.  ఈ మధ్య ఈ సమస్యలేమిటో," వాపోయింది అత్త.

**

"భూషణ్ గారిని కేర్ యూనిట్ నుండి, హాస్పిటల్లోని ఆయన ప్రైవేట్ రూము లోకి మూవ్ చేసారంట.  ఈ రెండు వారాల్లో బాగానే కోలుకున్నారన్నమాట," అంది అమ్మ పొద్దుట బ్రేక్ ఫాస్ట్  దగ్గర..

క్లాసెస్ అయ్యాక,దారిలో,అంకుల్ని విజిట్ చేస్తాను కాబట్టి, ఇంటికి రావడానికి ఆలస్యమవుతుందని  చెప్పానామెకి.



హాస్పిటల్లోని ఫోర్త్ ఫ్లోర్ మీద, అంకుల్  రూములోకి వెళ్ళేప్పటికి,  ఆయన కళ్ళు మూసుకుని ప్రశాంతంగా నిద్ర పోతున్నట్టున్నారు.  దగ్గరగావెళ్ళి బెడ్ పక్కనే కూర్చునున్న ఆంటీని పలకరించాను.

“రామ్మా రా,  మీ అంకుల్ లేచే ఉన్నారు.  అలా వెళ్ళిపక్కనే కూర్చో,” అంది..|

“పనులున్నాయంటూ గొడవ చేసి, మీ అంకుల్, తన డిశ్చార్జ్ కి డేట్, తనే సెట్ చేసుకున్నారు.  రెండు రోజుల్లో ఇంట్లో ఉంటారు,” నవ్వుతూ ఆంటీ..

నే వెళ్ళిదగ్గర కూర్చోగానే, కళ్ళు తెరిచి చూసి, పైకి జరిగి కూచున్నారు  అంకుల్.

"కళా, మీ అమ్మా వాళ్ళు పొద్దుటే వచ్చి వెళ్ళారు.మీ నాన్న మళ్ళీ డ్యూటిలో జాయినయ్యే లోగా,  డైరెక్టర్ ముత్తురామన్ సార్ తో,  మా ఇంట్లోనే  మీటింగ్ ఏర్పాటు చేసానమ్మా," అన్నారు...

"మీరు ముందు కోలుకోండి అంకుల్," అన్నాను.

"చూస్తున్నావుగా, నేను బాగయిపోయినట్టే అనుకో. అయినా, మన కల్చరల్ టూర్స్,  మీ పెళ్ళిళ్ళు అవ్వాలిగా. అందుకే, నన్ను ఆరోగ్యం గానే ఉంచుతాడు ఆ పైవాడు," నెమ్మదిగా ఆగాగి మాట్లాడుతున్నారు...

స్వచ్ఛంగా అర్ధమవుతున్నా, నీరసంగా ఉంది మాట.

"చూడమ్మా కళా," నా వంక సూటిగా చూశారాయన.  "మొదటి నుండీ నీవంటే మాకు వాత్సల్యం, మా అమ్మాయికి అయిష్టత..  నీ పెళ్లిమాట విని, రాణి అసూయ చెందడం వల్లనే ఈ రోజున ఈ పరిస్థితి వచ్చిందని మా భావన..

ఏమైనా,  దాని ఓర్వలేనితనం, నీ భవిష్యత్తుకి ఆటంకమవ్వదు.. నేను హామీ ఇస్తాను. నీవు మాత్రం దాన్ని తోబుట్టువులా భావించి, తప్పుల్ని క్షమించి, దాని పట్లఎప్పటికీ ఆదరాభిమానాలతో ఉండమని మా రిక్వెస్ట్," అని చెబుతూ, కళ్ళు తుడుచుకున్నారు...

"దాని మానసిక పరిస్థితి కూడా అంతగా బాగోలేదు," అంది దిగులుగా ఆంటీ. ఆమెని బాధపడ వద్దని వారించారు అంకుల్.

"మనతో సఖ్యత లేదు సరికదా, కనీసం అన్నిటికీ వ్యతిరేకించకుండా ఉంటేన్నా బాగుండు.  చాలా మొండిది మన రాణి.

దానికి అడ్డు చెప్పకుండా ఉంటేనే మంచిదేమో," ఆమెతో అంటూ వాపోయారాయన.

నేనేమనలేక మౌనంగా ఉండిపోయాను.

కాసేపటికి తలెత్తి నా వంక చూసారు అంకుల్..

"రాణి ఇప్పుడు బాగా క్రుంగిపోయింది. బ్రెయిన్ లో కెమికల్ ఇంబాలెన్స్, కాక, దానికి డిప్రెషన్ కూడా ఉందని తేల్చారు... దాని వల్లే బాధ కలిగిందనిపిస్తే తనని తాను గాయపరుచుకుంటుందన్నారు....

మానసికంగా, తిరిగి మామూలు స్థితికి రావాడానికి, కొద్దిరోజులు మందులు వాడాలట. ప్రమాదకరమైన జబ్బేమి కాదు... నార్మల్ లైఫ్ లీడ్ చేయవచ్చట...

కాకపోతే దాన్ని సున్నితంగా ప్రేమగా చూసుకోవాలి...

అందుకే, అర్థం చేసుకోమని అడుగుతున్నాను.కోపం పెట్టుకోకుండా దానితో స్నేహంగా మెలుగుతావని, అండగా ఉంటావని మా ఆశ," అంటున్న అంకుల్ మాటలకి నాకు కన్నీళ్ళాగలేదు.

"అలాగే అంకుల్, రాణిని నేను ఎప్పుడూ తోబుట్టువుగానే అనుకుంటాను. మీరు బెంగ పెట్టుకోకండి," అని అంకుల్ చేతి మీద చేయి వేసి,హామీ పలికాను....

మరి కాసేపటికి, వారి వద్ద సెలవు తీసుకుని, ఇంటి దారి పట్టాను.

**

అంకుల్ వాళ్ళ పరిస్థితికి బాధగా ఉంది.

మా మధ్య జరిగిన సంభాషణతో,నామీద వాళ్ళకున్న విశ్వాసం, నమ్మకం ఎంతటిదో తెలిసింది....

ఈ విషయమంతా అమ్మకి మాత్రమే చెప్పాను. జగదీష్ వద్ద ఈ ప్రస్తావన అనవసరం అనుకున్నాము.

**

ముత్తురామన్ గారి ఫిలిం ప్రాజెక్ట్ వివరాలు, కథ విని, నాన్న అమ్మ కూడా బాగుందన్నారు. నాకు మంచి అవకాశంగా భావించి, ఫిలిం చేయాలనే అందరం అనుకున్నాము.

రెండు నెల్లల్లో సెట్స్ మీదకి వెళ్ళే సినిమా మరో రెండు నెలలకి విడుదలకి సిద్దమవుతుందన్నారు, డైరెక్టర్ గారు.

నృత్యానికి ప్రాముఖ్యత ఇవ్వడమే కాక, ఓ సున్నితమైన కథా వస్తువుని ఎన్నుకున్నందుకు అమ్మావాళ్ళు, అంకుల్ కూడా ఆయన్ని అభినందించారు.

నా నుండి పూర్తి ఏకాగ్రత, అంకితభావం ఉంటుందన్న ఉద్దేశంతోనే, తమ కథకి నన్ను ఎన్నుకున్నట్టు చెప్పారు ముత్తురామన్ గారు...

ఆలస్యం లేకుండా కాంట్రాక్ట్ సైన్ చేసాను...

ఆ సినిమాలో,నేను వేయబోయే పాత్రకి సంబంధించిన నృత్యాలు, డైలాగ్ అన్నిటా ప్రాక్టీస్ వెంటనే మొదలవుతాయన్నారు.

**

నా కళా జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది.  ఓ యజ్ఞంలా రాత్రింబవళ్ళు నన్ను తన సినిమాలోని 'శ్రీలత' గా తీర్చిదిద్దే కార్యక్రమం మొదలుపెట్టారు ముత్తురామన్ సార్.

అభ్యాసన, ఏకాగ్రతలల్లో ఓ కొత్త అనుభవమే అయింది...

సెట్స్ మీదకి వెళ్ళేప్పటికి, నా ఆలోచన, ప్రవర్తనలో గూడా తన'శ్రీలత' కనబడాలన్నారు డైరెక్టర్ గారు...

రెండునెలల పాటు ముత్తురామన్ సార్ జరిపే ఈ ట్రైనింగ్ సెషన్స్ లో, 'శ్రీలత' పాత్రలో నేను నటించడం కాదు, ఆ పాత్రలో జీవిస్తానన్నారు అంతా.

**

రెండు నెలలు అవిరామంగా జరిగిన సినిమా షూటింగ్, ఆఖరి విడతలో ఉండగా, కాళ్ళ నొప్పులు-వాపులతో బాధపడుతూ నాన్న ఇల్లు చేరారు.

రక్తప్రసారం  సరవడానికి కుడికాలుకి వెంటనే,'వాస్కులర్ బైపాస్ సర్జరీ ' చేయాలన్నారు డాక్టర్లు...

సర్జరీ మాట విని భయపడి పోయిందికోటమ్మత్త.

“కాళ్ళల్లోని రక్తనాళాల్లో రక్తప్రసారం మెరుగవ్వడానికి జరుగబోతున్న అత్యవసర ఆపరేషన్” అని అమ్మ ఆమెకి వివరించాక, కుదుటపడింది.

ఎప్పటిలా, నాన్న సర్జరీ బాధ్యత కూడా భూషణ్ అంకుల్ తీసుకొని వాళ్ళ హాస్పిటల్లోనే, దానికి ఏర్పాట్లు చేసారు.

**

ఆపరేషన్ సవ్యంగా జరిగి, నాలుగు రోజులుగా హాస్పిటల్లో కోలుకుంటున్న నాన్న దగ్గర కూర్చుని, కాసేపు షూటింగ్ కబుర్లు చెప్పాను.ఆయనతో పాటు బ్రేక్ఫాస్ట్ అయ్యాక, ఆఖరి రోజు ఫిలిం -షూటింగ్ కి బయలుదేరాను.

ముత్తురామన్ గారు కూడా అన్న టైంకే  మూవీ కంప్లీట్ చేసారు.   రెండు నెలల్లో రిలీజుకి సన్నాహాలు చేస్తున్నారు.  నా పర్ఫార్మెన్స్  గురించి,  కాస్తనర్వాస్ గానే ఉంది.

ఏమైనా,  ఇక పైన, విదేశీ టూర్ కి ప్రోగ్రాముల ప్రిపరేషన్ గురించి ఆలోచించాలి..

ట్రాఫిక్ రద్దీ దాటుకుంటూ, కారు వేగంగా సాగిపోతుంది.

హాస్పిటల్ బెడ్డు మీద నీరసంగా ఉన్న నాన్న రూపమే మనస్సులో మెదులుతుంది....

కొత్తసంవత్సరం ఆరంభం ఎన్నో కొత్తఉత్సాహాలని, పురోగతిని తెచ్చినా, నాన్న ఆరోగ్యం ఆందోళన కలిగిస్తూనే ఉంది.... ఇక ఇప్పుడు సర్జరీ సవ్యంగానే జరిగినా, కొద్దికాలం విశ్రాంతిగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు డాక్టర్లు, పూర్తిగా కోలుకోవడానికి, టైం పడుతుందట..

ఎప్పుడూ ఏదో ఒక విషయంగా మనస్సుకి శాంతి లేకుండా ఉందనిపించి, ఒక్కసారిగా నిస్సత్తువుగా అయిపోయాను...

సీటులో జారిగిల పడి, కళ్ళు మూసుకున్నాను.

మరో వైపు, రాణి మూలంగా అంకుల్ మానసికంగా క్రుంగిపోతున్న పరిస్థితి కూడా బాధగా ఉంది.

**

పక్కనే ఉన్న సెల్ఫోన్ రింగవ్వడంతో, అలోచనల నుండి బయటపడ్డాను.

భూషణ్ అంకుల్ కాల్ చేస్తున్నారు. లిఫ్ట్ చేసి, “హలో అంకుల్,” అన్నాను.

“ఏమ్మా కళా, అమెరికా నుండి విక్రమ్, తేజశ్విని గారు వచ్చేది,యెల్లుండే...... వాళ్ళుమా ఇంట్లోనేఉండబోతున్నారు. రేపటినుండి ఒక వారం పాటు నీకు వెకేషన్ కదా! వాళ్ళున్న ఆనాలుగు రోజులూ, నీవు కనబడుతూనే ఉంటావని, వాళ్లకి చెప్పానమ్మా కళా,” అన్నారు..

“తప్పకుండా అంకుల్… వాళ్ళు నాకు కూడా ఆత్మీయులు కదా!  వాళ్ళకోసం శలవు పెట్టకపోతే ఊర్కోనని, విక్రమ్ నాకెప్పుడో వార్నింగ్ ఇచ్చాడు.  వాళ్ళ విషయంలో మీకు సాయంగా ఉంటాను.  మీరు బెంగ పెట్టుకోవద్దు,” అన్నాను.

“ఇకపోతే, ఆదివారం జరగబోయే ఆవిడ అవార్డ్ ఫంక్షన్ ఇన్విటేషన్ మీకూ అందే ఉంటుందిగా,” అడిగారాయన.

“అందింది అంకుల్, అందరం అటెండ్ అవుతాము,” చెప్పాను… ..

“ఉంటానమ్మా,”  ఫోన్ పెట్టేసారాయన.

మానసికంగా అయన ఇంకా పుంజుకోలేదు అనిపిస్తుంది. ఎందరికో ఆత్మస్థైర్యాన్నిచ్చి, వారి జీవితాలకి అండదండగా నిలిచే ఆయన, రాణి విషయంగా డీలాపడిపోవడం, నేనింకా జీర్ణించుకోలేకపోతున్నాను..

**

అమెరికాలో తెలుగు జాతి కీర్తిని చాటుతున్న కళాకారిణిగా, తేజశ్విని గారిని కొనియాడి, సన్మానించి,  పాండుచేరి గవర్నర్ గారి చేతులమీదుగా ‘హంస అవార్డు’ ఇప్పించారు ‘చెన్నై సంస్కృతి సంఘం’ వారు.

ఎంతో గొప్పగా జరిగింది ఆ సన్మాన సభ.

సభకి ముందు జరిగిన 'బ్యాంక్వెట్' కూడా అటెండ్ అయ్యాము.

రాణి తన ఫ్రెండ్ రంజిత్ సూరితో వచ్చింది. అందరితో సరదాగా మాట్లాడింది.

**

విక్రమ్, తేజస్విని గార్లతోసమయం క్షణాల్లా గడిచిపోతుంది...

హాస్పిటల్ నుండి ఇంటికొచ్చేసిన నాన్నని, రోజూ కాసేపు విజిట్ చేసి,లోకాభిరామాయణం మాట్లాడుతాడు.. విక్రమ్.

వినోద్ తో ఎంత అల్లరి చేస్తాడో, అమ్మవాళ్ళతో, కోటమ్మత్తతో అంతే హుందాగా మసులుకుంటాడు. నాతో ఫ్రెండ్లీగా ఎడతెగని కబుర్లు చెబుతాడు.

"సున్నితమైన మనస్తత్వం ఉన్నవాడు విక్రమ్. అందరి భావాలకి విలువినిస్తూ,గౌరవంగా ఉంటాడు. మంచివాడు,"

అన్నారు అతని గురించి నాన్న.

**

జగదీష్ కి ఎప్పటిలా ప్రతిరోజూ ఇక్కడ విషయాలు, విశేషాలు చెబుతూనే ఉన్నాను.

విక్రమ్ గురించిన కబుర్లు చెప్పినప్పుడు,

"విక్రమ్ అన్ని విధాల నన్నే గుర్తుచేస్తున్నాడంటే, అతను నా ట్విన్ బ్రదరా? అయితే, ఆ విక్రమ్ కారెక్టర్ ని మీట్ అవ్వాలనే ఉంది," అన్నాడు నవ్వుతూ జగదీష్....

**

తేజేశ్విని గారు'గవర్నర్ అవార్డ్' అందుకున్న సందర్భంగా, అమ్మ మా ఇంట విందు ఏర్పాటు చేసింది. దానికి,రాణి కూడా రావడం విశేషం. సౌమ్యంగా సంతోషంగా నాతోనూ మాట్లాడింది.

విక్రమ్ కబుర్లు వింటూ, అతను చెప్పే జోక్స్ కి నవ్వుతూ సరదాగా డిన్నర్ చేసాము..

"మీరు కొత్తఫ్లాట్ లోకి మారబోతున్నందుకు నా శుభాకాంక్షలు, సత్యం గారు," పాయసం కప్ చేతిలోకి తీసుకుంటూ, తేజశ్విని గారు.

మలేషియా, లండన్ టూర్స్ అయ్యాక, నన్ను, అమెరికాకి వచ్చే సన్నాహాల్లోఉండమన్నారామె. విజిటింగ్ ఆర్టిస్ట్ గా స్పాన్సర్ చేసి, డాన్స్ క్యాంప్స్, ప్రోగ్రాములు ఏర్పాటు చేస్తాన్నారు.

మంచి బ్యాక్-గ్రౌండ్ ఉన్న యువ నర్తకిని, అమెరికాలో ప్రమోట్ చేయడం ఓ అవకాశంగా భావిస్తాన్నారు ఆమె.

"ఆ ఐడియా బాగుంది.. తేజశ్విని గారు. చాలా సంతోషం," అన్నారు నాన్న.

"రియల్లీ చంద్రకళ, నువ్వు అమెరికా వస్తే, మా అమ్మ నిన్ను సొంత డాటర్ లా చూసుకుంటుంది. ఇకప్పుడు, న్యూయార్క్ లో చదువుకుంటున్న మా సిస్టర్ ని,డల్లాస్ కివెళ్ళిపోబోతున్న నన్ను, మా అమ్మ మిస్ అయ్యే ప్రశక్తే ఉండదు," అన్నాడు విక్రమ్ సంతోషంగా....

"ఆ పనేదో త్వరగా చేయండి ఆంటీ. చంద్రకళ సింగిల్ గా ఉన్నప్పుడే పిలిపించండి. అక్కడ తన పర్ఫార్మెన్స్ అయ్యాక, అలాగే మంచి సంబంధం దొరికితే, పెళ్లికూడా చేసేయండి," అంది నవ్వుతూ రాణి..

నా పక్కనే ఉన్న అమ్మ, నేను ముఖాలు చూసుకున్నాము...

భూషణ్ అంకుల్ కూడా నా వంక చూసి నవ్వారు...

“నిజంగా అక్కడే సంబంధం చూడమంటే, అంతకన్నానా? చంద్రకళ లాంటి అమ్మాయి కోడలుగా రావడం అంటే, కళలంటే ఆసక్తిఉన్న నా బోటి వాళ్ళతో సహా, లైన్ లో నిలబడతారేమో!” అంటూ నవ్వేసింది తేజశ్విని గారు…

“ఎంత మాట. మీ అభిమానం వెలకట్టలేనిది.. కాకపోతే, మా చంద్రకళ మనసు, దాని కుటుంబం అంతా ఇక్కడే ఉన్నాముగా,” అనేసింది అమ్మ జవాబుగా….

దానికి, వెంటనే అందుకున్నారు, నాన్న…

“పెళ్లి సంగతంటారా..ఆ నిర్ణయం పూర్తిగా చంద్రకళ, వాళ్ళమ్మ, అమ్మమ్మలదే…

నాట్య రంగంలో మాత్రం, మీలా అంతర్జాతీయంగా గుర్తింపు పొంది, నాట్య గురువుగా, స్థిరపడితే చూడాలని మాత్రం నా అభీష్టం. అందుకు అమెరికాలో స్థిరపడవలసి వస్తే అభ్యంతరం ఏముంటుంది… ఆపై ఆ దేవుని దయ,” అన్నారాయన.

“మీరు మరీ నన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నారు. చంద్రకళ వంటి వారికి ఇదంతా సులభ సాధ్యం సత్యం గారు. చంద్రకళ ఎక్కడైనా స్థిరపడవచ్చులెండి,” జవాబుగా తేజశ్విని మేడమ్..

“మీకు చెప్పాలనుకున్న మరో విషయం కూడా ఉంది, తేజశ్విని గారు. టూర్స్ కి ముందే, చంద్రకళతో ఓ కూచిపూడి డాన్స్ డాక్యుమెంటరీ తీసే ప్రయత్నంలో కూడా ఉన్నాము,” తన ప్లాన్ వెల్లడించారు నాన్న.

ఇంతలో,  తను కూర్చున్న స్థలం నుండి పైకి లేచాడు, విక్రమ్... అందరి వంక చూసి, చేతులు జోడించి నమస్కరించాడు...

“మీరంతా మమ్మల్ని ఇంత ప్రేమగా చూసుకుంటున్నారు.  థాంక్యూ వేరి మచ్... మీరు కూడా అమెరికా తప్పక రావాలి. చంద్రకళ, రాణి  ప్రోగ్రామ్స్ తో ట్రిప్ వేయడం అంత కష్టమైన పని కాదు.   మిమ్మల్ని హోస్ట్  చేసే అవకాశం మాకూ ఇవ్వండి,” అంటూ హుందాగా పేరు పేరునా అందరికీ ధన్యవాదాలు పలికాడు విక్రమ్.


**

తమ తిరుగు ప్రయాణంకి ముందు రోజు, నా బయోడేటా ప్రిపేర్ చేసి ఫైల్ ఇమ్మని అడిగారు తేజశ్విని  గారు...

అర్ధరాత్రివరకు నాన్న పక్కనే కూర్చుని, ఆఫైల్ ని, స్వయంగా ప్రిపేర్ చేసాడు విక్రమ్.

నేను యాక్ట్ చేసిన మూవి ‘డాక్టర్ శ్రీలత అయ్యర్’  డివిడి కూడా కావాలన్నారు ఆవిడ.

ఆ మరునాడు, వారికి సెండాఫ్ ఇవ్వడానికి, అంకుల్ తో పాటు నాన్న, నేను కూడా ఎయిర్పోర్ట్ కి వెళ్ళాము..  నేను త్వరలోనే, అమెరికాకి రావాలని ఆశిస్తామంటూ, మా వద్ద సెలవు తీసుకున్నారు తేజశ్విని గారు, విక్రమ్...



సినీ జగత్' వారి ఆఫీసు నుండి బయటపడి,  నేను, భూషణ్ అంకుల్, స్టూడియో దారి పట్టాము.  వీలైనంత త్వరగా స్టూడియో చేర్చమని డ్రైవర్ని ఆదేశించారాయన.  చేతినున్న  వాచ్ వంక చూసుకుంటూ,“ అరగంటలో నువ్వు స్టూడియోలో ఉంటావు, సరేనా,” అన్నారు నాతో.

ఔనన్నట్టు చిరునవ్వుతో సమాధానమిచ్చాను.

“చెప్పమ్మా, ఈ నాటి మీటింగులో, నువ్వూ సంతోషంగా ఉన్నావు కదూ,” అడిగారు.

“మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది అంకుల్,” అన్నాను...

“నీ ఫస్ట్ ఫిలిం ‘శ్రీలత అయ్యర్’ పెద్ద కమర్షియల్ హిట్ కాకపోయినా, అందరి దృష్టి ఆకర్షించిందన్న మాట. ఇటీవలే రిలీజు చేసినా, మొత్తానికి తన సినిమాని అవార్డుల రేసులో, నిలబెట్టగలిగాడు ముత్తురామన్.

ఏమైనా, ఈ యేడాది ‘బెస్ట్ న్యూ ఫైండ్ అవార్డు’ నీకివ్వాలని, ‘సినీ జగత్’ కమిటీ చేత ఏకగ్రీవంగా నిర్ణయించబడడం, నాకెంతో గర్వంగా ఉంది కళా. మనల్ని ప్రత్యేకంగా ఈ మీటింగుకి ఆహ్వానించి, విషయం అనౌన్స్ చేయడం, ఒకెత్తయితే, వారి ‘విజన్ సోర్స్ డివిజన్’ తరఫున నీ ‘కూచిపూడి డాక్యుమెంటరి’కి ‘సబ్సిడీ గ్రాంట్’ అందిచడం, మరో ఎత్తు. నీకు, అన్నీ నేనాశించిన దానికంటే వేగంగా అందుతున్నాయి, కళా. అంతా నీ అదృష్టం,” మెచ్చుకుంటూ అంకుల్.

రాణి గురించి వాకబు చేయడానికి సరయిన సమయమనిపించిది….

“రాణి ఇప్పుడు బాగుంది కదా, అంకుల్?” అడిగాను..

కొద్దిసేపటికి గాని జవాబు చెప్పలేదు ఆయన.

“జనరల్ గా అంతా ఒకే. రాణి, తన సైకియాట్రిస్ట్ ని కలుస్తూనే ఉంది. మందులు కంటిన్యూ చేస్తుంది. పర్వాలేదనుకో. ప్రస్తుతం మన మలేషియా-సింగపూర్ ట్రిప్ కి ప్రిపేర్ అవుతుంది,” అన్నారు…

“ఏవో ఇంసెక్యూరిటీస్…దానికి. ఎప్పుడూ అబధ్రతాభావంతో సతమతమవుతూ ఉంటుంది. పైగా మొండిది. తను ఇష్టపడే వ్యక్తులు, వస్తువులు తనకి దూరమౌతాయని భయమట ఆ పిల్లకి. అలాగని తన డాక్టర్ కి చెప్పినట్టు గ్రహించాను.

అయినా తల్లీ, మన రాణి, ఆ రంజిత్ సూరితో స్నేహాన్ని వదులుకుంటే, అసలు ఏ సమస్యా ఉండదని నా అభిప్రాయం…,” నిట్టూర్చారు అంకుల్.

“బాధపడకండి అంకుల్...  ఈ తరం వారి జీవితాల్లో ఇటువంటి అధ్యాయాలు చోటుచేసుకోడం  నేను చూస్తూనే ఉన్నాను.  మన రాణి ఏమీ విడ్డూరం కాదు.  ఈ పరిస్థితి నుండి తప్పక బయట పడుతుంది. పూర్తిగా బాగుంటుంది. మంచి మార్గంలో సెటిల్ అవుతుంది,” ఓదార్చాను.

“నువ్వనేది కరక్టేనమ్మా, కళా,  రాణి విషయం కుదుట పడాలనే ఆశిద్దాం” అన్నారు.

“అదలా ఉంచితే,  మన విదేశీ పర్యటన సందర్భంగా, ఎల్లుండి, గవర్నర్ గారితో లంచన్ కి ఆహ్వానాలు వచ్చాయిగా. ఆఖరి నిముషంలోనైనా, మన పర్యటనకి, ప్రభుత్వం వారు మెయిన్ స్పాన్సర్ గా ముందుకు రావడం మేలయింది.  ఇక వాళ్ళు  తలుచుకుంటే రాజమార్గమే మనకి,” అన్నారు అంకుల్...

“అంతా మీ ప్రయత్నమే కదా, అంకుల్... లేదంటే ఇవన్నీ ఇంత దూరం వచ్చేవా?” అన్నాను నవ్వుతూ.

“ఎవరి కోసమమ్మా? రాణికోసం, నీ కోసమే కదా! మీరు వృద్ధిలోకి వస్తే వెనుక నాపేరేగా మారుమ్రోగేది...,” నవ్వుతూ అంకుల్.

“ఔనూ మరిచేపోయాను.... ఇవాళో, రేపో మన జగదీష్ వస్తున్నాడని చెప్పింది రాణి.  వారం రోజులు ఉండి, మనకి వీడ్కోలిచ్చి వెళతాడట కదా.   ఆ సమయంలో మిమ్మల్నీ  డిన్నర్ కి పిలవాలని,  ఇంకా వాలెంటైన్స్ డే పార్టీ కూడా అంటూ రాణి ఏవేవో ప్లాన్స్ వేస్తుంది,” మళ్ళీ  అంకుల్.

“అవును అంకుల్. జగదీష్  రేపు సాయంత్రం వస్తున్నాడు.  మెడిసిన్ లో జాయిన్ అయ్యే ముందు ఫ్రీ టైం కదా.  ఒక వారముంటాడు.  అందుకే, గవర్నర్ గారి లంచన్ కి, జగదీష్ పేరు కూడా చేర్చి – మా నలుగురి పేర్లు పంపేసాను అంకుల్,”  అన్నాను.

“ఔనాను,  ఆ టైంలోనే మా మెడికల్ కాలేజ్ టూర్ కూడా ఎరేంజ్ చేసుకున్నాడన్న మాట.  మా హాస్పిటల్ కూడా విజిట్ చేస్తానని అన్నాడు మరి,” అంకుల్ అంటుండగానే,

స్టూడియో  ముందు కారాగడంతో,  కారు దిగి, అంకుల్ వద్ద శలవు తీసుకున్నాను.

రెండురోజుల పాటు, అవిరామంగా జరగబోయే డాన్స్ షూట్ గురించి ఆలోచిస్తూ నడిచి  సెట్స్ మీదకి వచ్చేసాను.

**

'డాక్యుమెంటరీ' షూట్ కోసం వచ్చున్న ఇద్దరు గురువులతో సహా, మూర్తిగారు, మేకప్ అసిస్టెంట్, నాకోసమే వెయిట్ చేస్తున్నారు..  నన్ను కలవగానే, తమ వంటి పాత తరం గురువులకి, సదవకాశాన్ని కల్పించామంటూ కృతజ్ఞతలు తెలిపారు.

**

నిర్విరామంగా  సాగి, రెండో రోజు నైట్ షూట్ కూడా ముగిసేప్పటికి తెల్లారుజామున ఐదయింది.  ఆశించినట్టుగానే, గడిచిన  రెండు రోజుల్లో,  'పాచ్-వర్క్' తో సహా పని ముగించాము.

జగదీష్ నిన్న సాయంత్రమే ఇంటికి వచ్చేసాడని తెలిసింది.. అతన్ని చూడాలని ఆదుర్దాగా ఉంది. అందరి వద్ద సెలవు తీసుకుని ఇంటిదారి పట్టాను.

తెలతెలవారుతుండగా, నిశ్శబ్దంగా ఉన్న రోడ్ల మీద, కారు వేగంగా సాగిపోతుంది...

కళ్ళు మూతలు పడుతుంటే, కాసేపు వెనక్కి వాలాను..

**

మామూలు కన్నా త్వరగానే ఇల్లుచేరాను.  ఇంత పొద్దున్నే డోర్-బెల్  మోగించి అందర్నీ డిస్టర్బ్ చేస్తానేమో అనుకుంటూ కారు దిగాను.  కాని ఇంటి మెయిన్ డోర్స్ తెరిచే ఉన్నాయి..

హాల్లో అడుగు పెట్టేప్పటికి, కోటమ్మత్త వినోద్, జగదీష్ తో సహా అందరూ కాఫీలు తాగుతూ,  హాల్లోనే కూర్చునున్నారు.

పరుగున వెళ్లివాళ్ళ ఎదురుగా కూర్చున్నాను.  "హలో, హౌ ఆర్ యు? జగదీష్.   ఎవ్వరూ నన్ను మిస్ చేసినట్టు లేరే?" అడిగాను నవ్వుతూ.

"నువ్వు లేకపోయినా నిత్యం నీగురించేగామ్మా మాటలు," అంటూ కప్పులోకి  కాఫీ  వొంపి అందించింది, కోటమ్మత్త.

"నీ ధ్యాస పని మీద ఉంచావా, లేక ఇక్కడ మా మీదకి మళ్ళించావా? ఎలా జరిగింది మీ నాన్-స్టాప్ షూట్?" నవ్వుతూ అడిగాడు జగదీష్.

"హాఫ్ ఎండ్ హాఫ్," నేనూ నవ్వాను.

"నువ్విప్పుడు డాన్సింగ్ స్టార్ మాత్రమే కాదు, మీ డాక్యుమెంటరీకి ప్రొడ్యూసర్, డైరెక్టర్ వి కూడా..... బాధ్యతగా పని చేసుకోవాలి

రి.....ఎనీవేస్,  కంగ్రాట్స్,"  అభినందించాడు.

"అయినా,  నీవిక్కడ లేని సమయంలో, అత్తయ్య మామయ్యలతో ఎన్నో విషయాలు మాట్లాడుకునే అవకాశం దొరికింది. సో, మంచిది కదా," మళ్ళీ జగదీష్.

"సరే మంచిది," కాఫీ ఫినిష్ చేసాను.

“ఏమ్మా కళా, ఫ్రెష్ అయ్యి కాసేపు రెస్ట్ తీసుకో. గవర్నర్ గారి లంచన్ ఉందిగా! పదకొండుకి బయలుదేరుదాము,” అన్నారు నాన్న నాతో...

“సరే, అలాగే,” లేచి నా రూమ్ వైపు నడిచాను...

“ఎప్పటిలా, మీ నాన్నే నీవు కట్టవలసిన చీర, నగలు పిక్ చేసారు. నీ బెడ్ మీద ఉంచాను, చూడు,” వెనుకనుంచి అమ్మ.

**

మేము తాజ్-కృష్ణ లోని ఫంక్షన్ హాల్లోకి వెళ్ళి, మాకు కేటాయించిన టేబిల్ వద్ద కూర్చున్నాము. సన్నగా వినబడుతున్న మృదంగ వాద్యం శ్రావ్యంగా ఉంది.

కాసేపటికి, భూషణ్ అంకుల్, ఆంటీ, రాణి కూడా వచ్చి, మా టేబిల్ వద్దే కూర్చున్నారు.

గ్రీట్ చేసి, జగదీష్ పక్కనే కూర్చుంది రాణి. చుట్టూ అందరూ పలకరింపులు, మాటల్లో ఉండిపోయారు..

అమ్మ, నీరూ ఆంటీతో కబుర్లు, రాణి - జగదీష్ తో కబుర్లు, అంకుల్ తో నాన్న కబుర్లు సాగిస్తున్నారు....

నేను మ్యూజిక్ వింటూ లోనికి వస్తున్న గెస్ట్స్ ని చూస్తూ కూర్చున్నాను.

రాణి ఫ్రెండ్, రంజిత్ సూరి కూడా లోనికి రావడం కనిపించింది..

ఇంతలో వేదిక పై మొదలయిన సందడి దిశగా నా దృష్టి మళ్ళింది.  సభారంభానికి సన్నాహమవుతున్నారు కార్యవర్గం. తిరిగి చూసేప్పటికి, మా టేబిల్ వద్దకు వచ్చేసిన  రంజిత్, అందరినీ పలకరించాడు.

రాణి కి 'హలో' చెప్పి,  "ఈ లంచన్ గురించి అడిగితే, వెళతానో, లేదో అన్నావుగా! " అడిగాడు.  అప్పటివరకు నవ్వుతూ ఉన్న రాణి మౌనంగా ఉండిపోయింది.

వేదిక పైనుండి కార్యదర్శి ఆహుతులకి ఆహ్వానం పలకడంతో,  తిరిగి తన టేబిల్ వద్దకి వెళ్ళక తప్పలేదు, రంజిత్ కి.

అంకుల్ ముఖంలో, అతని పట్ల ఉన్న అయిష్టత, కంగారు కనబడ్డాయి.

రంజిత్  వెళ్ళిపోగానే, తిరిగి జగదీష్ తో మాట్లాడుతూన్న రాణి ముఖం మాత్రం వెలిగిపోతుంది.

'ఆమెకి జగదీష్ పట్ల ఉన్న ఇష్టం, ఆకర్షణ  అలాగే ఉన్నాయి' అనుకున్నాను.

**

కార్యక్రమం మొదలైంది.

గవర్నర్ గారి  ప్రసంగం,  ఆయన  చేతులమీదుగా, గురువుగారికి  సత్కారం, ఆర్కెస్ట్రా వాళ్ళని గుర్తించి అభినందించడం, జరిగాయి.

తరువాతి అంశంగా, నన్ను వేదిక పైకి ఆహ్వానించారు.

'వేదిక' పైకి వస్తూ, ఆనందంతో వెలిగిపోతున్న అమ్మా నాన్నల ముఖాలని చూసాను.  వారి పక్కనే ఉన్న అంకుల్

ముఖంలో తృప్తి  గర్వం కనబడ్డాయి.

జగదీష్ వంక చూసాను.  కళ్ళల్లోమునుపెన్నడూ చూడని ప్రేమ మెరిసింది.  వీరి సంతోషాలు నా గుండెల్లోఎన్నో అనుభూతుల్ని నింపాయి... చాలా సంతృప్తిగా అనిపించింది.

నా గురించి కార్యదర్శి ప్రసంగించారు....

“కూచిపుడు నృత్య రంగంలో దూసుకుపోతున్న ధ్రువతార కుమారి చంద్రకళ.. ఆమెని ఈ పిన్న వయసులోనే, సాంస్కృతిక రాయబారిగా గుర్తిస్తున్నాము.  ముమ్మందు ఆమె ఈ రంగంలో మరింత కృషి చేయాలని ప్రోత్సహిస్తూ ‘నృత్యకోవిద’ అనే బిరుదుని, గుర్తింపుని బహుకరిస్తున్నాము .....

అని ప్రకటించి గవర్నర్ గారి చేతుల మీదుగా నాకు సన్మానాలు, బహుమతులు ఇప్పించారు...

అనతికాలంలోనే  గాయనిగా  పేరుప్రతిష్టలు పొందినందుకు,  రాణి కూడా సత్కారాలు పొంది, ‘మొమెంటో’ స్వీకరించింది. జాతీయ, అంతర్జాతీయ  గుర్తింపు పొందాలని, మా ఇద్దరినీ, సభలో పెద్దవాళ్ళు ఆశీర్వదించారు.

చివరి అంశం – అంకుల్ ని ‘గ్రాండ్ పాట్రన్’ గా  సత్కరించి, ఆ నాటి లంచన్  ఈవెంట్  స్పాన్సర్  చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు, ప్రభుత్వ కార్యదర్శి.

కార్యక్రమం ముగిసాక, నన్ను ప్రత్యేకంగా గవర్నర్  గారికి పరిచయం చేసి, నా గురించి గొప్పగా చెప్పారు భూషణ్ అంకుల్...లంచ్ అయ్యాక,  కార్యవర్గం వారికి కృతజ్ఞతలు తెలియజేసి,  ఆనందంగా ఇంటిముఖం పట్టాము.

**

కారు దిగుతూనే, ఎప్పటిలా గేట్ ముందు దిష్టి తిప్పేసింది అమ్మ.

ఎలివేటర్ దిశగా వెళ్ళబోతున్న నన్ను, ఆపి, నా చేయందుకున్నాడు జగదీష్. తనతో రమ్మనమంటూ, తిరిగి కార్లో కూర్చోబెట్టాడు. ఎక్కడికి? ఏమిటి? అని అడగబోయిన నన్ను, 'అత్తయ్య మామయ్యల పర్మిషన్ తీసుకున్నా'నంటూ, కార్ స్టార్ట్ చేసాడు.

పక్కకి తిరిగి అమ్మావాళ్ళ వంక చూసాను. వెళ్ళిరమన్నట్టు, చిరునవ్వుతో చేయూపి ఎలివేటర్ లోకి నడిచారు వాళ్ళు.

**

అసలేమిటీ కారులో షికార్? ఎక్కడికి? అమ్మావాళ్ళ పర్మిషన్ ఉండడం ఏమిటి? ఎన్నెన్నో ప్రశ్నలు నాలో మెదులుతున్నాయి... డ్రైవ్ చేస్తున్న జగదీష్ వంక చూసాను. ఆట పట్టిద్దామనుకున్నా..

"బావ, రాంగ్ రూట్. దారి తప్పావు," అన్నాను కావాలని నవ్వుతూ. ఈ మధ్య అతన్ని అప్పుడప్పుడు 'బావా' అని కూడా పిలుస్తున్నాను....

"ఐ నెవెర్ గో రాంగ్, చాంద్, జస్ట్ వెయిట్ ఎండ్ సీ," అంటూ మరి కాసేపటికి 'నటేషన్ పార్క్' లో కార్ పార్క్ చేసాడు... దిగవద్దు ఆగమన్నాడు. చుట్టూ తిరిగొచ్చి, డోర్ తెరిచి పట్టుకున్నాడు.

"యువరానర్, చంద్రకళా మేడమ్, ప్లీజ్," అంటూ దిగమని బౌ-డౌన్ చేసాడు జగదీష్. "వాట్ ఇజ్ స్పెషల్? నీకివాళ ఏమయింది? ఆర్ యు డ్రంక్!" అంటూ కారు దిగాను.

"యూ ఆర్ ఇన్సల్టింగ్ మి చాంద్...ఐ యామ్ ఇన్ టోటల్ కంట్రోల్ ఆఫ్ మైండ్ ఎండ్ బాడీ," అంటూ, "మే ఐ," మళ్ళీ బౌ-డౌన్ చేసి నా చేయి అందించమని అడిగాడు...

జగదీష్ కి, చేయందించి వెంట నడిచాను. చుట్టూ చూసాను. బయట వాతావరణం ఎలా ఉన్నా ఈ గార్డెన్స్ మాత్రం చాలా చల్లగా – ఫాంటాస్టిక్ గా ఉంటాయి. వర్షానికి కూడా తడవనంత దట్టంగా గ్రీనరీ ఉంది....

జగదీష్ చేతి స్పర్శ వెచ్చగా ఉంది. చల్లని చిరుగాలి వీస్తుంది. రకరకాల పువ్వులు సువాసనలు వెదజల్లుతున్నాయి...

ఏదో తెలియని కొత్త అనుభూతి. వొళ్ళంతా తేలిగ్గా అనిపించింది.

గార్డెన్స్ లో అటు ఇటూ వెళుతున్న కొందరు, మావంక అదోలా చూస్తున్నారు.

ఫార్మల్ గా తయారయి, కాజ్యువల్ గా పార్క్ లో తిరగడం మరి కాస్త చిత్రమే కదా! అనుకున్నాను.

మాకెదురుగా వస్తున్న ఇద్దరు ఆడవాళ్ళు, నన్ను గుర్తుపట్టారేమో! పిల్లలతో సహా నా వద్దకు వచ్చారు.

"నీవు, డాన్సర్ చంద్రకళ కదా!...మా పిల్లలు కూడా డాన్స్ నేర్చుకుంటున్నారు. మేము మీ ఫాన్స్ మేడమ్. మీ టివి షో' 'సంస్కృతి' అసలు మిస్ అవ్వము," అంటూ, హ్యాపీగా నా చేయి పట్టుకుంది వాళ్ళల్లోఓ పెద్దావిడ.

"ఇక్కడ ఏదన్నా షూటింగ్ జరుగుతుందా మేడమ్? మీరింత అందంగా తయారయ్యారు!" అడిగింది రెండో ఆమె....

లేదన్నాను...

నేను, జగదీష్ చేతులు పట్టుకుని నడుస్తున్నామని గమనించినామె, "అయితే, ఈయన ఎవరు? మీ ఫియాన్సీనా?" అడిగి క్షణమాగింది.

నేను నోరు మెదపలేదు.

“గార్డెన్ లో షికారు చేస్తున్నారని, అలా అడిగాను.  ఏమనుకోవద్దు.  మీ ఇద్దరూ పక్కపక్కన బాగున్నారు,”  మళ్ళీ ఆమే నవ్వుతూ.

“ఈయన మా కజిన్,  ఇక్కడ ఒక ఫంక్షన్ అటెండ్ చేసి, ఇలా వచ్చాము,” , “థాంక్స్, ఇక ఉంటానండీ,” అంటూ అక్కడి నుండి కదిలాను.



అంతా గమనిస్తున్న జగదీష్, నవ్వడం మొదలు పెట్టాడు.  “నీతో బయటకి పోడానికి కూడా లేదే? ఇలా అభిమానులు ఉంటారుగా నీకు...” అంటూ ఎదురుగా ఉన్న ఓ గజేబో లోకి నడిచాడు.. వెనుకే ఫాలో అయ్యాను,,,,

“మోస్ట్ బ్యూటి ఫుల్ స్పాట్ జగదీష్,” అన్నాను క్రేడిల్  ల్లా ఉన్న బెంచ్ మీద కూర్చుంటూ.....

నన్ను ఇక్కడికి తీసుకొచ్చిన కారణం అర్ధం కాక, కుతూహలంగా ఉన్నా, అతనితో, ఇలా ఈ గార్డెన్స్ కి రావడం బాగుంది. మాజికల్  గా అనిపిస్తుంది..

జగదీష్ ప్రవర్తన గమ్మత్తుగా ఉన్నా, ఇంటరెస్టింగుగా ఉంది...’ అనుకుంటూ తల తిప్పి, నాపక్కన,కాస్త ఎడంగా కూర్చున్న అతని వంక చూశాను.

గాలికి చెదిరిన వత్తైన క్రాఫు అతని నుదుటిని కప్పేసింది.  సీ గ్రీన్ షర్ట్ పై గోల్డ్ నెక్-టై, బ్లాక్ స్వేడ్ పాంట్స్ తో మాచ్ చేసాడు...మంచి డ్రెసింగ్ సెన్స్ ఉన్న వాడే ‘జగదీష్’ అనుకున్నాను.

ఆ ఫార్మల్ అటైర్ లో చాలా అందంగా  ఉన్నాడు.  అతని నవ్వు, హెయిర్ స్టైల్, నడక, చాలా స్మార్ట్ గా ఉంటాడు.  నా కంటే పొడవుగా ఉంటాడు.

చూపు తిప్పుకుని, దూరంగా ఆడుతున్న పిల్లల వైపు దృష్టిసారించాను...

ఏ ఆడపిల్లకైనా జగదీష్ తప్పక నచ్చుతాడు.  మంచి పర్సనాలిటీయే కాక, సరదాగా మెలిగే నైజం, ఉన్నత విద్యలు, మంచి మనస్సున్న వాడు కూడా..

అందుకే రాణికి అతనంటే అంత ఇష్టం.  అతని బంధువైనందుకు, నేనంటే అయిష్టం.   జగదీష్ విషయంలో, నన్ను తనకి పోటీగా భావిస్తుంది. జగదీష్ నా పట్ల చూపించే శ్రద్ధ, అభిమానం, రాణికి భరించలేని విషయాలే....

నా ఆలోచనలకి నాలో నేను నవ్వుకున్నాను.

“లాస్ట్ ఇన్ యువర్ వోన్ థాట్స్?  అదీ నేను నీ పక్కనే ఉండగా!” అన్న జగదీష్ మాటలకి.... ఆలోచన నుండి

బయటపడ్డాను.

“నో,నో… ఇక్కడే, నీ ఎదురుగానే ఉన్నాను….ఇప్పుడు చెప్పు. ఏమిటి ఈ పార్క్ ట్రిప్? ఏమిటి విశేషం?” అడిగాను.

“అయితే విను… విషయం చెబుతాను,” దగ్గరగా జరిగి, నా చేయందుకుని, గొంతు సవరించుకున్నాడు.

నా గుండె వేగంగా పరిగెడుతుంది…

“ఇన్నాళ్ళు నీ పట్ల ప్రొటెక్టివ్ గా ఫీల్ అయ్యాను.  నీవంటే స్నేహభావం మాత్రమే ఉండేది.రానురాను నా ఫీలింగ్స్ మారాయి.  నాకు నువ్వంటే ఇష్టం.  ఐ కేర్ ఫర్ యూ.  నా జీవితంలో నిన్ను తప్ప మరో అమ్మాయిని ఊహించలేక పోతున్నాను.

ఐ లవ్ యూ చాంద్,” అన్నాడు జగదీష్ ఉద్వేగంగా…

జగదీష్ మాటలకి నా కళ్ళల్లోనీళ్ళు తిరిగాయి… కనబడకుండా తల వంచుకున్నాను.

నాకు నీ పట్లఉన్న భావంప్రేమగా మారిందనియేడాది క్రితమే అర్ధం చేసుకున్నాను.  నాకు నువ్వన్నా, నీ వ్యక్తిత్వంఅన్నా చాలా ఇష్టం. నీ నృత్యం అంటే అంతకన్నా ఇష్టం.యూ ఆర్ మై లైఫ్, చాంద్.

నీకు కూడా,అలోచించి నిర్ణయం  తీసుకునే మెచ్యూరిటీ వచ్చాకే, ఈ విషయం చెప్పాలని, ఇన్నాళ్ళు ఆగాను,”  అంటూ లేచి నిలబడి, చేత్తోతన  బ్లేజర్  పాకెట్ లోకి రీచ్ అయ్యాడు.

నిజమా? కలా? నా ఎదురగా, ఇంత సూటిగా తన ప్రేమని తెలియజేస్తున్న జగదీష్…..

నా జవాబు కోసం అడుగుతూన్న జగదీష్...

నమ్మలేక పోతున్నాను.

అతని మాటలు వింటున్నంతసేపు, అతనంటేనాకున్న నమ్మకం, ప్రేమ, ఆకర్షణ, అన్నీ ఒక్కసారిగా నన్ను కమ్మేసి, ఉక్కిరిబిక్కిరి చేసాయి.

ఉబికి వస్తున్న కన్నీళ్ళని గబగబా తుడుచుకుని, తల పైకెత్తాను. చేతిలో గోల్డ్ కలర్ జ్యువలరీ బాక్స్ తో, నావంకే చూస్తున్నాడు జగదీష్.

“ఏమిటిది,” అడిగాను...

నా కళ్ళల్లోనీళ్ళు గమనించి, “వై టియర్స్ చాంద్? ముందా టియర్స్ తుడిచెయ్,” పక్కనే కూర్చుంటూ, తన కర్చీఫ్ అందించాడు జగదీష్..

“నా పట్లనీకింతటి ప్రేమ ఉందని తెలుసుకున్న సంతోషమేమో,” నవ్వుతూ కర్చీఫ్ తో కళ్ళు తుడుచుకున్నాను.

“అమ్మా వాళ్ళకి, నానమ్మ వాళ్ళకి, మీ అమ్మావాళ్ళకి అందరికీ నా ఆలోచన చెప్పాను. అందరూ హ్యాపీ,” అన్నాడు...

ఒక్కసారిగా వాళ్ళంతా నా కళ్ళముందు కదిలారు....

మౌనంగా ఉండిపోయిననా భుజం పైన మృదువుగా తట్టాడు.

“నీకు నా మనసులోని మాట ఇంత వివరంగా చెప్పిన సందర్భంగా,” అంటూ తన చేతిలోని గోల్డ్ బాక్స్ నుండి ఓ అందమైన ఉంగరం తీసాడు జగదీష్…

“ఇది నీకు నా గిఫ్ట్.హోప్ యూ లైక్ థిస్. నా పట్ల నీకు కూడా అంతటి ప్రేమ, ఆకర్షణ ఉందనే అనుకుంటాను. నువ్వు స్పష్టంగా ఆ మాటలు నాకు చెప్పేస్తే మనం పెద్దవాళ్ళకి తెలియజేద్దాం,” అంటూ నా వేలికి ఉంగరం తొడిగి, దగ్గరగా వంగి, బుగ్గ మీద ముద్దు పెట్టాడు.

అనుకోని ఆ సంఘటనకి ఒక్క క్షణం తడబడ్డాను.

తేరుకుని,నా వేలి మీది ఉంగరం వంక చూసాను.కెంపులు, ముత్యాలు పొదిగిన ఉంగరం, వెలుతురికి మరింత అందంగా ఉంది. నాకు తెలియకుండానే జగదీష్ కి దగ్గరగా జరిగి అతని చేతుల్లో వొదిగిపోయాను.

నా ముఖాన్ని తన రెండు చేతుల్లోకి తీసుకొని, “నేనంటే, మరి నీకూ ఇష్టమనే కదా!” నా పెదవుల మీద గాఢంగా ముద్దు పెట్టాడు జగదీష్.

మునుపెన్నడూ తెలియని అనుభూతితో, నిలువునా కరిగిపోయాను. అలా ఎంత సేపు గడిచిందో………..తెలీలేదు.

జగదీష్ నా చేయి పుచ్చుకుని కారు వద్దకు నడిపించాడు. కారులో కూర్చున్నాక కూడా, నేను అతను చెబుతున్న మాటలు వింటూ మౌనంగా ఉండిపోయాను.

**

“మరో పది నిముషాల్లో ఇంట్లో ఉంటాము. నాకేమైనా చెప్పాలా,” డ్రైవ్ చేస్తున్న జగదీష్ నవ్వుతూ అడిగేంతమటుకు, నా అందమైన ఆలోచనల్లో ఉండిపోయాను.

అలా అతను అడగడంతో, నన్ను తొలిచేస్తున్న కొన్ని విషయాల్లో నాకు ఓ స్పష్టత కావాలనిపించింది.

. “ఒక విషయం ఉంది జగదీష్, మరి రాణి సంగతి ఏమిటి?” అడిగాను అతని వంక చూస్తూ.

నా చేతిని మృదువుగా తట్టాడు.

“చూడు చాంద్, రాణి ఇజ్ క్రేజీ అబౌట్ మి… తనకి నేనంటే చాలా ఇష్టం. నిజానికి, రాణి స్వతహాగా మంచిదే కూడా. ఒక్క నీవంటే ఈర్ష్య తప్పించి, షి ఇజ్ ఆల్రైట్…

కాకపోతే, రంజిత్ సూరి స్నేహం మానుకుంటే, తన ఆలోచన బాగుపడుతుంది,” నవ్వాడు.

‘నా ప్రశ్నకి ఇది జవాబు కాదు’ అన్నట్టుగా చూసాను అతన్ని…..

నవ్వుతూ, “సరైన జవాబు కాదా?” అడిగాడు..

“అంతేగా” అన్నాను…

“అయితే సరే, విను. అసలు మీ కోసమే నేను తనతో ఫ్రెండ్లీగా ఉంటానని నీకు చెప్పాను కదా? లేదంటే, తను మీకు ఇబ్బంది కలుగించగలదు…” అన్నాడు తాపీగా.

“నాకు తెలిసిన విషయమేగా,” గునిగాను..

“కదా! అయితే, అసలు సంగతేమంటే, నాకెంతో ఇష్టమైన నువ్వు, నన్ను రిజెక్ట్ చేసావనుకో. అప్పుడు, నేనంటే ఎంతో ఇష్టమున్న రాణి గురించి ఆలోచిస్తాను.. అదీ నా జీవితంలో రాణి స్థానం,” అన్నాడు…

ఆ వివరణకి  ఉలిక్కిపడ్డాను...

సడన్  బ్రేకులతో, ఇంటి ముందు కార్ పార్క్ చేసి, కారు దిగాడు జగదీష్..."పద, పద, ఇవాళ మీ రాణి ఇంట్లోమనకి డిన్నర్ కదా!" చుట్టూతిరిగొచ్చి, నవ్వుతూ డోర్ తెరిచి పట్టుకున్నాడు, ...

**

నేను, జగదీష్ మనసు విప్పి మాట్లాడుకున్నామని తెలిసి అమ్మావాళ్ళు, కోటమ్మత్త చాలా సంతోషించారు.  విదేశీ టూర్స్ నుండి తిరిగొచ్చాక, సరయిన సమయం చూసి,  ఈ విషయమై, సాంప్రదాయంగా పెద్దవాళ్ళంతా కలవాలని, అప్పటివరకు ఈ విషయం బయటికి పొక్కవలసిన అవసరం లేదని, నిర్ణయించుకున్నాము.

వినోద్ కి కూడా ఓవెంకటేశ్వర స్వామి ఉంగరాన్ని గిఫ్ట్ గా ఇచ్చాడు, జగదీష్.

**

డిన్నర్ కి వెళ్ళినప్పటి నుండి,జగదీష్ ని  అంటిపెట్టుకునే ఉంది, రాణి.  అతనికి ఇష్టమైన వంటకాలు చేయించానంటూ, దగ్గరుండి కొసరి కొసరి వడ్డించింది.

నేను, అమ్మ ముఖాలు చూసుకున్నాము.

తినేది రుచించడం లేదు... అయినా ఎలాగో తిన్నాననిపించి అక్కడి నుండి కదిలాను.

డిన్నర్ తరువాత,  బయట లాన్ లో కూర్చున్నాము.

ఎప్పటిలా ఫ్రూట్ సర్వ్ చేయించింది ఆంటీ. తింటూ ఎవరి కబుర్లల్లో వాళ్ళున్నారు.

ఇక్కడ కూడా, గార్డెన్-స్వింగ్ లో జగదీష్ పక్కనే కూర్చుంది రాణి. అలా వాళ్ళని చూస్తుంటే, చాలా అసహనంగా ఉంది నాకు.

అది చాలదన్నట్టు, మరునాటి హాస్పిటల్ టూర్ కి, జగదీష్ ని రాణి తీసుకు వెళుతుందన్నారు అంకుల్.


రాణి, జగదీష్ లు కూర్చున్న దిశగా చూస్తూ, "చూడు జగదీష్, నీ అప్లికేషన్ ఫైల్ మన మెడికల్ డైరెక్టర్ వద్ద ఉంది. ఏదన్నా లేటెస్ట్ ఇన్ఫర్మేషన్ ఉంటే, రేపు మీటింగ్ కి లోగా, ఇ-మెయిల్ చేసేయవచ్చు," అన్నారు జగదీష్ తో ఆయన.

ఇంతలో రాణి కల్పించుకుంది. "డాడీ, మీరు చెప్పడం ముగించి, మాట్లాడ్డానికి నాకు ఛాన్స్ ఇస్తారా?" అడిగింది.

"ఒకే బంగారం, గో అ హెడ్," అన్నారు అంకుల్. "ఈ వీకెండ్ సిగ్నిఫికెన్స్ గుర్తుందా?" పక్కనే ఉన్న జగదీష్ ని అడిగింది రాణి...విని, క్షణమాలోచించి, లేదన్నట్టు –పెదవి విరిచాడు జగదీష్.

"యు సిల్లీ – ఇట్ ఇజ్ క్యూపిడ్స్ డే - వాలెంటైన్స్ డే. రేపు రాత్రి మా 'స్టార్ క్లబ్' లో ఫెస్టివల్ ఉంది. ఎల్లుండేమో చెన్నై జిమ్ఖానా క్లబ్బులో గ్రాండ్ నైట్. విల్ యు ప్లీజ్ బి మై డేట్ టు దీజ్ ఈవెంట్స్," మా అందరి ముందే అడిగేసింది రాణి.

నేను షాక్ అయ్యాను.అమ్మ నాన్న కూడా ఆశ్చర్యపోయారని వాళ్ళని చూస్తే చెప్పొచ్చు.



“నువ్వెళ్ళి త్వరగా ఇల్లు ఊడ్చేయి కామాక్షి. మేమంతా భూషణ్ గారి ఇంటికి వెళ్ళాలి,” అంది అమ్మ కామాక్షితో.

“మీరు తయారయ్యే లోగా నేను ఉప్మా తిప్పేస్తాను.  కాస్త తినేసి వెళ్ళండి.  పాపం ఎంత అల్లాడి పోతున్నారో ఆ తల్లితండ్రులు.   ఆ ‘రాణి’ అసలు పిల్లా పిడుగా?  అమ్మాయి ప్రవర్తన అస్సలు నచ్చదు నాకు. జగదీష్ పక్కన లేకపోతే బతకలేను అన్నట్టు ఆ మాటలు, చేష్టలు,”  అందరికీ వినబడేలా తిట్టుకుంటూ లోనికెళ్ళింది కోటమ్మత్త...

**

“ఇదంతా నమ్మశక్యంగా లేదు,” సోఫాలో కూర్చుంటూ నాన్న.

“అయినా జగదీష్ ఏడి? ఇంత గొడవగా ఉన్నా లేవలేదు...ఏమ్మా కళా, వెళ్లి తలుపు తట్టి చూడు,” అని నాన్న అంటుండగానే, తల వాకిటి నుండి ఎవరో లోనికొస్తున్న చప్పుడయింది.

గెస్ట్ రూము వైపు వెళ్ళబోతున్న నేను, హాల్లోకి నడిచిన జగదీష్ ని చూసి ఉలిక్కిపడ్డాను.. షర్ట్ మీద రక్తపు మరకలతో, చెదిరిపోయిన జుత్తుతో, నీరస పడిపోయిన అతన్ని చూసి అందరం నిర్ఘాంత పోయాము.

గది మధ్యలోకి వచ్చిన జగదీష్, “అత్తయ్య, మామయ్యా, ఈ రక్తం మరకలు చూసి

భయపడకండి. నాకే దెబ్బలు తగల్లేదు. పది నిముషాల్లో షవర్ చేసొచ్చి, మీకు అంతా వివరిస్తాను,” అంటూ గెస్ట్ రూము వైపు నడిచాడు.

రాణి గురించి విన్న న్యూస్ కి, జగదీష్ ఈ రకంగా ఇంటికి రావడానికి ఏదో సంబంధం ఉందనిపిస్తోంది నాకు. నాన్న ఆ మాటే బయటికి అన్నారు కూడా.

పట్టణాల్లో జరిగే యూత్ పార్టీలు, ఒక్కోసారి ఇలాగే వికటిస్తాయని, అత్తకి వివరించింది, అమ్మ.

**

మరి కాసేపటికి, ఆదుర్దాగా వెయిట్ చేస్తున్న మా మధ్యకు వచ్చి కూర్చున్నాడు జగదీష్. అతనికి కాఫీ కప్పు అందించి, ఎదురుగా కూర్చుంది కోటమ్మత్త.

కొంచెంగా కాఫీ సిప్ చేసి,  కప్పు పక్కకి పెట్టేసాడు…

మా అందరి వంక చూసాడు.  క్షణం సేపు  ఊపిరి తీసుకుని,  చెప్పడం మొదలు పెట్టాడు.

రాత్రి ఒకటిన్నరకి, భూషణ్ అంకుల్ ఫోన్ చేసారని,  జిమ్ఖానా  క్లబ్బులో గొడవ జరిగి, రాణి  పోలీస్ స్టేషన్ కి తరిలించబడిందని చెప్పి,తనకి సాయంగా రమ్మని కోరడంతో, అంకుల్ తో వెళ్లానన్నాడు.

ఎవ్వర్నీ డిస్టర్బ్ చేయవద్దన్న ఉద్దేశంతో, తనకిచ్చిన స్పేర్ 'కీ' తో డోర్ లాక్ చేసుకుని వెళ్ళానన్నాడు.

"మరి ఆ గొడవ సంగతి ఏమిటి,  రాణి ఎలా ఉంది?" అడిగారు నాన్న.

"మేము పోలీస్ స్టేషన్ కెళ్ళేప్పటికే, అరెస్ట్ అయిన ఆరుగురిని, హోం మినిస్టర్ – దొర్రాజన్ స్వయంగా తన పూచి మీద బయటకి తెచ్చారట…  రెండున్నర కంతా వాళ్ళు, అక్కడ నుండి కార్లలో వెళ్లిపోయారట….వాళ్ళల్లో రాణి, రంజిత్ ఉన్నారని మాత్రం చెప్పారు.

అంకుల్ స్వయంగా కొన్ని ఫోన్లు చేసాక, రంజిత్ సూరి, తన పార్టీని ఫార్మ్ హౌజ్ కి మూవ్ చేసాడని, తెలిసింది..

దాంతో అంకుల్ చాలా నిస్సహాయంగా అయ్యారు.

డ్రైవర్ కి ఆ ఫార్మ్-హౌజ్ వివరాలు తెలిసినవే  అవడంతో, అర గంటలో అక్కడికి చేరుకున్నాము.  మేము లోపలికి వెళ్ళేప్పటికి, పార్టీ ఫుల్-స్వింగ్ లో ఉంది," చెప్పడం ఆపాడు జగదీష్…

"మరి ఈ రక్తం ఏమిటి నీ షర్ట్ మీద… ఎవరు గాయపడ్డారు?" ఆదుర్దాగా అమ్మ.

“అక్కడ పార్టీ జరుగుతున్న హాల్లో తాగుతూ  పిచ్చిగా డాన్స్ చేస్తున్న పది మంది తప్ప, రాణి కనబడలేదు. వెనుక స్విమ్మింగ్ పూల్ వద్ద కూడా జనం ఉండడంతో, అటుగా వెళ్ళాము.

కాస్త దూరంగా,  రంజిత్ తో పాటు, రాణి, లిన, రీనా కూడా కూర్చునున్నారు. వాళ్ళందరూ డ్రింక్ చేస్తున్నట్టు గమనించాము.మేము వెనుక నుండి, వాళ్ళ దిశగా రావడం వాళ్ళు గమనించలేదు.

దగ్గరిగా వెళ్ళేప్పటికి రంజిత్, రాణి గొడవ పడుతున్నారని అర్థమయింది.  మాటా మాటా అనుకోడం వినబడుతుంది.

‘డామిట్, రాణి, నువ్వు నా పార్టీలకి వస్తావు, నాతో తిరుగుతావు, కాని ఎంత నచ్చజెప్పినా నాతో ఒక్క డ్రింక్ అయినా తీసుకోవు’  అని కేకలేస్తూ లేచి, ఎదురుగా టేబిల్ మీదున్న లిక్కర్ బాటిల్ ని, రంజిత్, నేలకేసి కొట్టడం,  రాణి భయంగా కుర్చీ నుండి లేచి, ఏడుస్తూ పక్కకి తొలగడం ఒక్కసారిగా జరిగింది,” చెప్పడం ఆపి, ఊపిరి తీసుకున్నాడు జగదీష్.

మేమంతా ఊపిరి కూడా తీయకుండా, అతను చెప్పేది వింటున్నాము....

మా వంక చూసి, మళ్ళీ  చెప్పడం మొదలుపెట్టాడు....

“రాణిని ఆ పరిస్థితిలో చూసి, తట్టుకోలేని అంకుల్, ఒక్క ఉదుటున వెళ్లి రంజిత్ కాలర్ పట్టుకున్నారు.  “యూ క్రిమినల్, యూ బ్లడీ ..బాస్టా...ర్డ్,  నువ్వొక చీడ పురుగువిరా,” అని వాడిని గట్టిగా తోసారు.. ఇదంతా ఊహించని రంజిత్, ఆ తోపుకి ఒక్కసారిగా స్విమ్మింగ్ పూల్లో పడ్డాడు.

క్షణాల్లో జరిగిన ఆ సంఘటన... ఆపలేక పోయాను,”, “ఏం చేయాలో తోచక, అంకుల్ వద్దకి పరిగెత్తబోతుంటే,  రాణి దగ్గరగా వచ్చి, నా చేయి పట్టుకుని ఒకటే ఏడుపు,” చెప్పడం ఆపి,నుదుటిపై పట్టిన చెమటని తుడుచుకున్నాడు జగదీష్.

అతన్ని చూస్తూ జరిగిన సంఘటన ఎంత బాధాకరంగా ఉండుంటుందో ఊహించగలిగాను.

అతని మీద జాలిగా అనిపించింది.

క్షణమాగి, మిగతా సంఘటన వివరించ సాగాడు, జగదీష్.

"తన కోసం వచ్చినందుకు నాకు థ్యాంక్స్ చెబుతూ, హిస్టెరికల్ గా అయిపోయింది రాణి.

ఆమెని పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చోబెట్టి, సముదాయించే లోగా,

పూల్ నుండి బయటపడి, చేతిలో పగిలిన బాటిల్ తో, అంకుల్ ని అటాక్ చేసాడు రంజిత్. ఆయన్ని కాలర్ పట్టుకుని దూరంగా ఈడ్చుకుపోయి, బెదిరించడం మొదలుపెట్టాడు వాడు.

రాణి నుండి నా చేయి విడిపించుకొని, అంకుల్ వద్దకి వెళ్ళే లోగానే, రంజిత్ తో పెనుగులాటలో ఆయన అరచేయి, మోచేయి కూడా బాగా గాయ పడింది.

అతి కష్టం మీద అంకుల్ని పక్కకి తీసుకొచ్చేప్పటికి, రంజిత్ ఫ్రెండ్స్ మా చుట్టూ గుమిగూడారు.

వారి నుండి బయటపడి, ఆయన్ని, నేరుగా వాళ్ళ హాస్పిటల్ కి వెళ్ళాము," చెప్పడం ఆపి, మా వంక చూసాడు.

"మరి ఇప్పుడేమిటి భూషణ్ పరిస్థితి? ఎలా ఉన్నాడు? మూడు రోజుల్లో మలేషియా ప్రయాణం కదా," అని నాన్న అడిగితే,

"డ్రగ్స్, ఆల్కహాల్ తీసుకున్నందుకు రాణిని అరస్ట్ చేయడం నిజమా? అని నేను అడిగాను...

"అంకుల్ చేతికి ఎనిమిది కుట్లు పడ్డాయి... మందులు ఇచ్చారు.  చేతి గాయం ఎల్లుండికి బెటర్ అవుతుంది. తరువాత మానేజ్ చేయాలి.  కాని, అసలా టెన్షన్ కి ఆయన ఏమవుతారో అనుకున్నాను," జగదీష్ వాపోయాడు....

అంకుల్ విషయం వినడానికే ఎంతో బాధగా ఉంది... పోతే, ఇక రాణి సంగతి ఎలా ఉందో .... వినాలని జగదీష్ వంక చూసాను...

అది గ్రహించినట్టుగా తలెత్తి నా వంక సూటిగా చూసాడు.

"అదృష్టం ఏమిటంటే,... రాణి బ్లడ్ టెస్ట్ ని బట్టి... షి ఇజ్ క్లీన్... నొ డ్రగ్స్, నొ ఆల్కహాల్ ఇన్ హర్ సిస్టం. షి ఇజ్ ఇన్నోసెంట్.. తన పంతం నెగ్గలేదని అలా పిచ్చిగా ప్రవర్తిస్తుందని మనకి తెలిసిందే కదా!......  పనిలో పనిగా తన సైకాలజిస్ట్ ని కూడా కన్సల్ట్ చేసాము.  ....... ఏమైనా, షి ఇజ్ ఫైన్ నౌ. మీరు సాయంత్రం వెళ్లి ఇద్దర్నీ చూడచ్చు," అంటూ ముగించాడు జగదీష్..

**

సాయంత్రమయ్యాక, ఫోన్ చేసి, అంకుల్ వాళ్ళింటికి వెళ్ళాము.  ఆయన్ని చూసి, ఆయనతో మాట్లాడాక, అందరికీ కాస్త బెంగతీరింది.

నీరసంగా ఉన్నా, అంకుల్ ఓపిగ్గామాతో మాట్లాడుతున్నారు. అరచేతి నుండి రిస్ట్ వరకు లోతైన గాయమేనట. జగదీష్ అండతో బయటపడ్డారే తప్ప, లేకుంటే, పెద్ద ప్రమాదమే జరిగుండేదన్నారు.

అంకుల్ తో మాట్లాడుతుండగా, కిందకి వచ్చింది రాణి.  జగదీష్ ని చూడగానే, అమాంతంగా వాటేసుకుని, పదే పదే థాంక్స్ చెప్పింది.

క్లిష్ట పరిస్థితి నుండి సాయం చేసినందుకు కృతజ్ఞతలు చెబుతూనే, "నువ్వు నాతో పార్టీకి వచ్చుంటే, అసలు ఇదంతా అయ్యేది కాదు… కాబట్టి, మాకు అలా సాయం చేయడం కూడా నీ బాధ్యతే," నవ్వుతూ జగదీష్ చేయిపట్టి లాగి, అతన్ని తన పక్కన కూర్చోబెట్టింది.

"రాణీ, తప్పమ్మా, అలా మాట్లాడతావేంటి? ఊరుకో," అన్నారు అంకుల్……

పరిణతి లేని రాణి మాటలు, చేష్టలు నాకసలు రుచించలేదు… అంకుల్ మీద కూడా,

ఒక్క క్షణం అసహనంగా అనిపించింది… కానీ, రాణి మీద ఆయనకి ఎటువంటి కంట్రోల్ లేదని గుర్తొచ్చి, వెంటనే ఆయన పట్ల జాలిగా అనిపించింది.

మరి కాసేపటికి, అక్కడి నుండి బయలుదేరుతుండగా, "జగదీష్, ప్లీజ్, రేపు నీవు బ్రేక్ ఫాస్ట్ కి రావాలి. తప్పదు," నవ్వుతూ ఇన్వైట్ చేసింది…రాణి..

నాన్నని కూడా వచ్చి కలవమన్నారు అంకుల్. "బ్రేక్ ఫాస్ట్ అయ్యాక, టూర్ కి సంబంధించి, ట్రావెల్ డాక్యుమెంట్స్ ఫైల్ చేసి కొన్ని ఫోన్ కాల్స్ చేయాలి, సత్యం. నేను, నా చేయి అవుట్ ఆఫ్ ఆర్డర్ కదా!" నవ్వారాయన…….

**

టూర్ కి కుట్టించిన కొత్త కాస్ట్యూమ్స్, ఆర్డర్ చేసి తెప్పించిన మేకప్ సామానులతో నా గదంతా చిందర వందరగా ఉంది..

పొద్దున్నే, మాతో పాటు కాఫీ మాత్రం తీసుకుని, నాన్న వాళ్ళు బ్రేక్ ఫాస్ట్ కి వెళ్ళాక, ప్యాకింగ్ మొదలుపెట్టాను. ముందుగా డాన్స్ కాస్ట్యూమ్స్, మేకప్ మెటీరియల్ అంతా ఓ సూట్-కేస్ లో, మిగతా బట్టలు మరో సూట్-కేస్ లో ప్యాక్ చేసేప్పటికి గంటలు పట్టింది.

ఆకలిగా అనిపించి నా రూమ్ నుండి హాల్లోకి  వచ్చాను.....

“బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అంటూ  వెళ్ళిన నాన్న, జగదీష్ లంచ్ టైం అవుతున్నా, ఇంకా రాలేదు,”  అన్నాను, సోఫాలో అమ్మ పక్కనే కూర్చుంటూ.

రాణి వాళ్ళింట ఏమి జరుగుతుందోనని, ఎన్నడూ లేనంత ఆదుర్దాగా ఉండడంతో, నాన్నకి ఫోన్ చేసాను.

నిముషంలో వస్తున్నామన్నారు, నాన్న.

ఫోన్ పెట్టి వెను తిరిగేప్పటికి, నిజంగానే హాల్లోకి నడిచారు నాన్న, జగదీష్. లంచ్ కి తొందర లేదంటూ న్యూస్ పేపర్ అందుకుని సోఫాలో  కూర్చున్నారు నాన్న...

“మా ప్యాకింగ్ పనులు అవుతున్నాయి.  మాస్టారు గారితో మాట్లాడాను.  ప్రయాణానికి ఇంచుమించు రెడీ,” అంది పలకరింపుగా అమ్మ....

“ఇప్పుడు చెప్పండి.  బ్రేక్ ఫాస్ట్ కి వెళ్ళిన వాళ్ళు, భూషణ్ వాళ్ళింట, ఇన్ని గంటలు ఎందుకని  ఉండిపోయారు? అడిగింది.

చేతిలోని పేపర్ మడిచి పక్కన పెట్టి, సోఫాలో వెనక్కి జరిగి కూచున్నారు నాన్న. నింపాదిగా మా ఇద్దర్ని వంక చూసారు.

“ఏముంది శారదా... చేతి నొప్పి వల్ల భూషణ్ ప్రస్తుతం ఏమీ చేయలేడుగా!  అందుకని ముందుగా,  ట్రావెల్ డాక్యుమెంట్స్,  ఆంధ్రసభ వారి లెటర్స్, అన్నీ ఫైల్ చేసాము.  బ్రేక్ ఫాస్ట్ కి వెళ్ళే ముందు, జగదీష్ ని, ఒక విజ్ఞప్తి చేసాడు భూషణ్,” క్షణమాగారు నాన్న.

“ఏమిటట?” అడిగింది అమ్మ.

“అదే,రంజిత్ సూరి అని రాణి ఫ్రెండ్ ఉన్నాడుగా.  వాడి స్నేహాన్ని వదులుకోమని, ఎలాగైనా రాణికి నచ్చజెప్పమని, జగదీష్ చేతులు పట్టుకున్నాడు,”  అంటూ మౌనంగా పక్కనే ఉన్న జగదీష్ చేతిపై తట్టారు.

నేను, అమ్మ వంక చూసాను… ఆమె కుతూహలంగా వింటుంది.

“ఇక ఆ వెంటనే, మేడ మీదున్న రాణిని, కిందకి పిలిపించారు.  ఆ అమ్మాయి వచ్చాక, మరో సర్ప్రైజ్ ఇచ్చారు మన జగదీష్ కి… తమ మెడికల్ స్కూల్ యాడ్-హాక్ కమిటీలో– యూత్ అడ్వైజర్ పొజిషన్ ఆక్సెప్ట్ చెయ్యమని, జగదీష్ ని రిక్వెస్ట్ చేసారా తండ్రీకూతుళ్ళు.

కృతజ్ఞతలో,  గౌరవపూరితంగా, జగదీష్ కి, వారందిస్తున్న హానరరీ  పొజిషన్ అట, అసలా ఆలోచన రాణిదేనట,” క్షణమాగారు నాన్న.

“ఇక ఆ తరువాత, పది రకాల ఐటం సో బ్రహ్మాండంగా బ్రేక్ ఫాస్ట్ చేసాము…. దగ్గరుండి కొసరి, కొసరి వడ్డించారు కూడా…

అది కూడా అయ్యాక, హాల్లోమేము టూర్ విషయాలు డిస్కస్ చేస్తుంటే,  మా ఎదురుగా సిటవుట్ లో, రాణితో మాట్లాడాడు జగదీష్….

అరగంట తరువాత కూడా, వెళతానని అతను బయలుదేరిన ప్రతిసారి, చేయి పట్టి కూర్చోబెట్టేసింది  ఆ అమ్మాయి.

మరో పావు గంట చూసి, పనుందంటూ నేనే మన వాడిని తీసుకొని, బయట పడ్డాను,”  ముగించారు నాన్న.

అందరినీ ఓ సారి పరికించి చూసి, సోఫా నుండి పైకి లేచారు…..

“ఇప్పుడాకలిగా ఉంది కదూ, జగదీష్.  పద.  భోంచేస్తూ మాట్లాడుదాములే,” అంటూ డైనింగ్ వైపు నడిచారు.

**

లంచ్ చేస్తున్నంత సేపు అందరం మౌనంగా ఉన్నాము...

నాన్న చెప్పిన విషయాలు, మనసులో మరింత గుబులు పుట్టించాయి..

జగదీష్ నా వాడేనని ఆనందంగా మనసు గంతులు వేస్తున్న సమయంలో, ఇలా రాణి మా జీవితాల్లోకి చొచ్చుకు రావాలని ప్రయత్నిస్తున్నట్టుగా అనిపిస్తుంది......


“ఏమర్రా?  ఉలుకు పలుకు లేకుండా, అలా తినడం మీదే దృష్టి పెట్టారు?” అంటూ అందరికీ పాయసం కప్పుల్లో వేసి అందించింది కోటమ్మత్త.

నాన్నే సంభాషణ మొదలు పెట్టారు...”జగదీష్, ఇలా అంటున్నానని ఏమనుకోకు బాబు... నీవు రాణి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.. ఆమె శ్రేయస్సు, బాధ్యత నీకు మోయలేని బరువు కావచ్చునేమో.  నీకది మంచిది కాదు,” ఆగారు....

జగదీష్ మౌనంగా వింటున్నాడు.

“భూషణ్ పైన జాలిపడాలో, కోపగించుకోవాలో తెలిడం లేదు నాకు... కూతిర్ని కట్టుబాటులో ఉంచలేక సతమవుతున్నాడు,” మళ్ళీ నాన్న.

**



“నువ్వెళ్ళి త్వరగా ఇల్లు ఊడ్చేయి కామాక్షి. మేమంతా భూషణ్ గారి ఇంటికి వెళ్ళాలి,” అంది అమ్మ కామాక్షితో.

“మీరు తయారయ్యే లోగా నేను ఉప్మా తిప్పేస్తాను. కాస్త తినేసి వెళ్ళండి. పాపం ఎంత అల్లాడి పోతున్నారో ఆ తల్లితండ్రులు. ఆ ‘రాణి’ అసలు పిల్లా పిడుగా? అమ్మాయి ప్రవర్తన అస్సలు నచ్చదు నాకు. జగదీష్ పక్కన లేకపోతే బతకలేను అన్నట్టు ఆ మాటలు, చేష్టలు,” అందరికీ వినబడేలా తిట్టుకుంటూ లోనికెళ్ళింది కోటమ్మత్త..

**

“ఇదంతా నమ్మశక్యంగా లేదు,” సోఫాలో కూర్చుంటూ నాన్న.

“అయినా జగదీష్ ఏడి?  ఇంత గొడవగా ఉన్నా లేవలేదు…ఏమ్మా కళా, వెళ్లి తలుపు తట్టి చూడు,” అని నాన్న అంటుండగానే, తల వాకిటి నుండి ఎవరో లోనికోస్తున్న  చప్పుడయింది.

గెస్ట్ రూము వైపు వెళ్ళబోతున్న నేను, హాల్లోకి నడిచిన జగదీష్ ని చూసి ఉలిక్కిపడ్డాను.. షర్ట్ మీద రక్తపు మరకలతో, చెదిరిపోయిన జుత్తుతో, నీరస పడిపోయిన అతన్ని చూసి అందరం నిర్ఘాంత పోయాము.

గది మధ్యలోకి వచ్చిన జగదీష్, “అత్తయ్య, మామయ్యా, ఈ రక్తం మరకలు చూసి

భయపడకండి.  నాకే దెబ్బలు తగల్లేదు. పది నిముషాల్లో షవర్ చేసొచ్చి, మీకు అంతా వివరిస్తాను,” అంటూ గెస్ట్ రూము వైపు నడిచాడు.

రాణి గురించి విన్న న్యూస్ కి, జగదీష్ ఈ రకంగా ఇంటికి రావడానికి ఏదో సంబంధం ఉందనిపిస్తోంది నాకు.  నాన్న ఆ మాటే బయటికి అన్నారు కూడా.

పట్టణాల్లో జరిగే యూత్ పార్టీలు, ఒక్కోసారి ఇలాగే వికటిస్తాయని, అత్తకి వివరించింది, అమ్మ.

**

మరి కాసేపటికి, ఆదుర్దాగా వెయిట్ చేస్తున్న మా మధ్యకు వచ్చి కూర్చున్నాడు జగదీష్. అతనికి కాఫీ కప్పు అందించి, ఎదురుగా కూర్చుంది కోటమ్మత్త.

కొంచెంగా కాఫీ సిప్ చేసి,  కప్పు పక్కకి పెట్టేసాడు...

మా అందరి వంక చూసాడు.  క్షణం సేపు  ఊపిరి తీసుకుని,  చెప్పడం మొదలు పెట్టాడు.

రాత్రి ఒకిటిన్నరకి, భూషణ్ అంకుల్ ఫోన్ చేసారని,  జిమ్ఖానా  క్లబ్బులో గొడవ జరిగి, రాణి  పోలీస్ స్టేషన్ కి తరిలించబడిందని చెప్పి,తనకి సాయంగా రమ్మని కోరడంతో, అంకుల్ తో వెళ్లానన్నాడు.

ఎవ్వర్నీ డిస్టర్బ్ చేయవద్దన్న ఉద్దేశంతో, తనకిచ్చిన స్పేర్ 'కీ' తో డోర్ లాక్ చేసుకుని వెళ్ళానన్నాడు.

"మరి ఆ గొడవ సంగతి ఏమిటి,  రాణి ఎలా ఉంది?" అడిగారు నాన్న.

"మేము పోలీస్ స్టేషన్ కెళ్ళేప్పటికే, అరెస్ట్ అయిన ఆరుగురిని, హోం మినిస్టర్ – దొర్రాజన్ స్వయంగా తన పూచి మీద బయటకి తెచ్చారట...  రెండున్నర కంతా వాళ్ళు, అక్కడ నుండి కార్లలో వెళ్ళిపోయారట....వాళ్ళల్లో రాణి, రంజిత్ ఉన్నారని మాత్రం చెప్పారు.

అంకుల్ స్వయంగా కొన్ని ఫోన్లు చేసాక, రంజిత్ సూరి, తన పార్టీని ఫార్మ్ హౌజ్ కి మూవ్ చేసాడని, తెలిసింది..

దాంతో అంకుల్ చాలా నిస్సహాయంగా అయ్యారు.

డ్రైవర్ కి ఆ ఫార్మ్-హౌజ్ వివరాలు తెలిసినవే  అవడంతో, అర గంటలో అక్కడికి చేరుకున్నాము.  మేము లోపలికి వెళ్ళేప్పటికి, పార్టీ ఫుల్-స్వింగ్ లో ఉంది," చెప్పడం ఆపాడు జగదీష్...

"మరి ఈ రక్తం ఏమిటి నీ షర్ట్ మీద... ఎవరు గాయపడ్డారు?" ఆదుర్దాగా అమ్మ.

“అక్కడ పార్టీ జరుగుతున్న హాల్లో తాగుతూ పిచ్చిగా డాన్స్ చేస్తున్న పది మంది తప్ప, రాణి కనబడలేదు. వెనుక స్విమ్మింగ్ పూల్ వద్ద కూడా జనం ఉండడంతో, అటుగా వెళ్ళాము.

కాస్త దూరంగా, రంజిత్ తో పాటు, రాణి, లీన, రీనా కూడా కూర్చునున్నారు. వాళ్ళందరూ డ్రింక్ చేస్తున్నట్టు గమనించాము.మేము వెనుక నుండి, వాళ్ళ దిశగా రావడం వాళ్ళు గమనించలేదు.

దగ్గరిగా వెళ్ళేప్పటికి రంజిత్, రాణి గొడవ పడుతున్నారని అర్థమయింది. మాటా మాటా అనుకోడం వినబడుతుంది.

‘డామిట్, రాణి, నువ్వు నా పార్టీలకి వస్తావు, నాతో తిరుగుతావు, కాని ఎంత నచ్చజెప్పినా నాతో ఒక్క డ్రింక్ అయినా తీసుకోవు’ అని కేకలేస్తూ లేచి, ఎదురుగా టేబిల్ మీదున్న లిక్కర్ బాటిల్ ని, రంజిత్, నేలకేసి కొట్టడం, రాణి భయంగా కుర్చీ నుండి లేచి, ఏడుస్తూ పక్కకి తొలగడం ఒక్కసారిగా జరిగింది,” చెప్పడం ఆపి, ఊపిరి తీసుకున్నాడు జగదీష్.

మేమంతా ఊపిరి కూడా తీయకుండా, అతను చెప్పేది వింటున్నాము....

మా వంక చూసి, మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు....

“రాణిని ఆ పరిస్థితిలో చూసి, తట్టుకోలేని అంకుల్, ఒక్క ఉదుటున వెళ్ళి రంజిత్ కాలర్ పట్టుకున్నారు. “యూ క్రిమినల్, యూ బ్లడీ ..బాస్టా...ర్డ్, నువ్వొక చీడ పురుగివిరా,” అని వాడిని గట్టిగా తోసారు.. ఇదంతా ఊహించని రంజిత్, ఆ తోపుకి ఒక్కసారిగా స్విమ్మింగ్ పూల్లో పడ్డాడు.

క్షణాల్లో జరిగిన ఆ సంఘటన... ఆపలేక పోయాను,”, “ఏం చేయాలో తోచక, అంకుల్ వద్దకి పరిగెత్తబోతుంటే, రాణి దగ్గరగా వచ్చి, నా చేయి పట్టుకుని ఒకటే ఏడుపు,” చెప్పడం ఆపి,నుదుటిపై పట్టిన చెమటని తుడుచుకున్నాడు జగదీష్.

అతన్ని చూస్తూ జరిగిన సంఘటన ఎంత బాధాకరంగా ఉండుంటుందో ఊహించగలిగాను.

అతని మీద జాలిగా అనిపించింది.

క్షణమాగి, మిగతా సంఘటన వివరించ సాగాడు, జగదీష్.

“తన కోసం వచ్చినందుకు నాకు థ్యాంక్స్ చెబుతూ, హిస్టెరికల్ గా అయిపోయింది రాణి.

ఆమెని పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చోబెట్టి, సముదాయించే లోగా,

పూల్ నుండి బయటపడి, చేతిలో పగిలిన బాటిల్ తో, అంకుల్ ని అటాక్ చేసాడు రంజిత్. ఆయన్ని కాలర్ పట్టుకుని దూరంగా ఈడ్చుకుపోయి, బెదిరించడం మొదలుపెట్టాడు వాడు.

రాణి నుండి నా చేయి విడిపించుకొని, అంకుల్ వద్దకి వెళ్ళే లోగానే, రంజిత్ తో పెనుగులాటలో ఆయన అరచేయి, మోచేయి కూడా బాగా గాయ పడింది.

అతి కష్టం మీద అంకుల్ని పక్కకి తీసుకొచ్చేప్పటికి, రంజిత్ ఫ్రెండ్స్ మా చుట్టూ గుమిగూడారు.

వారి నుండి బయటపడి, ఆయన్ని, నేరుగా వాళ్ళ హాస్పిటల్ కి వెళ్లాము,” చెప్పడం ఆపి, మా వంక చూసాడు.

“మరి ఇప్పుడేమిటి భూషణ్ పరిస్థితి? ఎలా ఉన్నాడు? మూడు రోజుల్లో మలేషియా ప్రయాణం కదా,” అని నాన్న అడిగితే,

“డ్రగ్స్, ఆల్కహాల్ తీసుకున్నందుకు రాణిని అరస్ట్ చేయడం నిజమా? అని నేను అడిగాను…

“అంకుల్ చేతికి ఎనిమిది కుట్లు పడ్డాయి… మందులు ఇచ్చారు.  చేతి గాయం ఎల్లుండికి బెటర్ అవుతుంది. తరువాత మానేజ్ చేయాలి.  కాని, అసలా టెన్షన్ కి ఆయన ఏమవుతారో అనుకున్నాను,” జగదీష్ వాపోయాడు….

అంకుల్ విషయం వినడానికే ఎంతో బాధగా ఉంది… పోతే, ఇక రాణి సంగతి ఎలా ఉందో …. వినాలని జగదీష్ వంక చూసాను…

అది గ్రహించినట్టుగా తలెత్తి నా వంక సూటిగా చూసాడు.

“అదృష్టం ఏమిటంటే,… రాణి బ్లడ్ టెస్ట్ ని బట్టి… షి ఇజ్ క్లీన్… నొ డ్రగ్స్, నొ ఆల్కహాల్ ఇన్ హర్ సిస్టం. షి ఇజ్ ఇన్నోసెంట్.. తన పంతం నెగ్గలేదని అలా పిచ్చిగా ప్రవర్తిస్తుందని మనకి తెలిసిందే కదా!……  పనిలో పనిగా తన సైకాలజిస్ట్ ని కూడా కన్సల్ట్ చేసాము.  ……. ఏమైనా, షి ఇజ్ ఫైన్ నౌ. మీరు సాయంత్రం వెళ్లి ఇద్దర్నీ చూడచ్చు,” అంటూ ముగించాడు జగదీష్..

**

సాయంత్రమయ్యాక, ఫోన్ చేసి, అంకుల్ వాళ్ళింటికి వెళ్ళాము.  ఆయన్ని చూసి, ఆయనతో మాట్లాడాక, అందరికీ కాస్త బెంగతీరింది.

నీరసంగా ఉన్నా, అంకుల్ ఓపిగ్గామాతో మాట్లాడుతున్నారు. అరచేతి నుండి రిస్ట్ వరకు లోతైన గాయమేనట. జగదీష్ అండతో బయటపడ్డారే తప్ప, లేకుంటే, పెద్ద ప్రమాదమే జరిగుండేదన్నారు.

అంకుల్ తో మాట్లాడుతుండగా, కిందకి వచ్చింది రాణి.  జగదీష్ ని చూడగానే, అమాంతంగా వాటేసుకుని, పదే పదే థాంక్స్ చెప్పింది.

క్లిష్ట పరిస్థితి నుండి సాయం చేసినందుకు కృతజ్ఞతలు చెబుతూనే, “నువ్వు నాతో పార్టీకి వచ్చుంటే, అసలు ఇదంతా అయ్యేది కాదు… కాబట్టి, మాకు అలా సాయం చేయడం కూడా నీ బాధ్యతే,” నవ్వుతూ జగదీష్ చేయిపట్టిలాగి, అతన్ని తన పక్కన కూర్చోబెట్టింది.

“రాణీ, తప్పమ్మా, అలా మాట్లాడతావేంటి? ఊరుకో,” అన్నారు అంకుల్……

పరిణతి లేని రాణి మాటలు, చేష్టలు నాకసలు రుచించలేదు… అంకుల్ మీద కూడా,

ఒక్క క్షణం అసహనంగా అనిపించింది… కానీ, రాణి మీద ఆయనకి ఎటువంటి కంట్రోల్ లేదని గుర్తొచ్చి, వెంటనే అయన పట్ల జాలిగా అనిపించింది.

మరి కాసేపటికి, అక్కడి నుండి బయలుదేరుతుండగా, “జగదీష్, ప్లీజ్, రేపు నీవు బ్రేక్ ఫాస్ట్ కి రావాలి. తప్పదు,” నవ్వుతూ ఇన్వైట్ చేసింది…రాణి..

నాన్నని కూడా వచ్చి కలవమన్నారు అంకుల్. “బ్రేక్ ఫాస్ట్ అయ్యాక, టూర్ కి సంబంధించి, ట్రావెల్ డాక్యుమెంట్స్ ఫైల్ చేసి కొన్ని ఫోన్ కాల్స్ చేయాలి, సత్యం. నేను, నా చేయి అవుట్ ఆఫ్ ఆర్డర్ కదా!” నవ్వారాయన…….

**

టూర్ కి కుట్టించిన కొత్త కాస్ట్యూమ్స్, ఆర్డర్ చేసి తెప్పించిన మేకప్ సామానులతో నా గదంతా చిందర వందరగా ఉంది..

పొద్దున్నే, మాతో పాటు కాఫీ మాత్రం తీసుకుని, నాన్న వాళ్ళు బ్రేక్ ఫాస్ట్ కి వెళ్ళాక, ప్యాకింగ్ మొదలుపెట్టాను. ముందుగా డాన్స్ కాస్ట్యూమ్స్, మేకప్ మెటీరియల్ అంతా ఓ సూట్-కేస్ లో, మిగతా బట్టలు మరో సూట్-కేస్ లో ప్యాక్ చేసేప్పటికి గంటలు పట్టింది.

ఆకలిగా అనిపించి నా రూమ్ నుండి హాల్లోకి  వచ్చాను.....

“బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అంటూ  వెళ్ళిన నాన్న, జగదీష్ లంచ్ టైం అవుతున్నా, ఇంకా రాలేదు,”  అన్నాను, సోఫాలో అమ్మ పక్కనే కూర్చుంటూ.

రాణి వాళ్ళింట ఏమి జరుగుతుందోనని, ఎన్నడూ లేనంత ఆదుర్దాగా ఉండడంతో, నాన్నకి ఫోన్ చేసాను.

నిముషంలో వస్తున్నామన్నారు, నాన్న.

ఫోన్ పెట్టివెను తిరిగేప్పటికి, నిజంగానే హాల్లోకి నడిచారు నాన్న, జగదీష్. లంచ్ కి తొందర లేదంటూ న్యూస్ పేపర్ అందుకుని సోఫాలో  కూర్చున్నారు నాన్న...

“మా ప్యాకింగ్ పనులు అవుతున్నాయి.  మాస్టారు గారితో మాట్లాడాను.  ప్రయాణానికి ఇంచుమించు రెడీ,” అంది పలకరింపుగా అమ్మ....

“ఇప్పుడు చెప్పండి.  బ్రేక్ ఫాస్ట్ కి వెళ్ళిన వాళ్ళు, భూషణ్ వాళ్ళింట, ఇన్ని గంటలు ఎందుకని  ఉండిపోయారు? అడిగింది.

చేతిలోని పేపర్ మడిచి పక్కన పెట్టి, సోఫాలో వెనక్కి జరిగి కూచున్నారు నాన్న. నింపాదిగా మా ఇద్దర్ని వంక చూసారు.

“ఏముంది శారదా... చేతి నొప్పి వల్ల భూషణ్ ప్రస్తుతం ఏమీ చేయలేడుగా!  అందుకని ముందుగా,  ట్రావెల్ డాక్యుమెంట్స్,  ఆంధ్రసభ వారి లెటర్స్, అన్నీ ఫైల్ చేసాము.  బ్రేక్ ఫాస్ట్ కి వెళ్ళే ముందు, జగదీష్ ని, ఒక విజ్ఞప్తి చేసాడు భూషణ్,” క్షణమాగారు నాన్న.

“ఏమిటట?” అడిగింది అమ్మ.

"అదే,రంజిత్ సూరి అని రాణి ఫ్రెండ్ ఉన్నాడుగా.  వాడి స్నేహాన్ని వదులుకోమని, ఎలాగైనా రాణికి నచ్చజెప్పమని, జగదీష్ చేతులు పట్టుకున్నాడు," అంటూ మౌనంగా పక్కనే ఉన్న జగదీష్ చేతిపై తట్టారు.

నేను, అమ్మ వంక చూసాను... ఆమె కుతూహలంగా వింటుంది.

"ఇక ఆ వెంటనే, మేడ మీదున్న రాణిని, కిందకి పిలిపించారు.  ఆ అమ్మాయి వచ్చాక, మరో సర్ప్రైజ్ ఇచ్చారు మన జగదీష్ కి... తమ మెడికల్ స్కూల్ యాడ్-హాక్ కమిటీలో– యూత్ అడ్వైజర్ పొజిషన్ ఆక్సెప్ట్ చెయ్యమని, జగదీష్ ని రిక్వెస్ట్ చేసారా తండ్రీకూతుళ్ళు.

కృతజ్ఞతతో,  గౌరవపూరితంగా, జగదీష్ కి, వారందిస్తున్న హానరరీ  పొజిషన్ అట, అసలా ఆలోచన రాణిదేనట," క్షణమాగారు నాన్న.

"ఇక ఆ తరువాత, పది రకాల ఐటం సో బ్రహ్మాండంగా బ్రేక్ ఫాస్ట్ చేసాము.... దగ్గరుండి కొసరి, కొసరి వడ్డించారు కూడా...

అది కూడా అయ్యాక, హాల్లోమేము టూర్ విషయాలు డిస్కస్ చేస్తుంటే,  మా ఎదురుగా సిటవుట్ లో, రాణితో మాట్లాడాడు జగదీష్....

అరగంట తరువాత కూడా, వెళతానని అతను బయలుదేరిన ప్రతిసారి, చేయి పట్టి కూర్చోబెట్టేసింది  ఆ అమ్మాయి.

మరో పావు గంట చూసి, పనుందంటూ నేనే మన వాడిని తీసుకొని, బయట పడ్డాను," ముగించారు నాన్న.

అందరినీ ఓ సారి పరికించి చూసి, సోఫా నుండి పైకి లేచారు.....

“ఇప్పుడాకలిగా ఉంది కదూ, జగదీష్.  పద.  భోంచేస్తూ మాట్లాడుదాములే,” అంటూ డైనింగ్ వైపు నడిచారు.

**

లంచ్ చేస్తున్నంత సేపు అందరం మౌనంగా ఉన్నాము…

నాన్న చెప్పిన విషయాలు, మనసులో మరింత గుబులు పుట్టించాయి..


జగదీష్ నా వాడేనని ఆనందంగా మనసు గంతులు వేస్తున్న సమయంలో, ఇలా రాణి మా జీవితాల్లోకి చొచ్చుకు రావాలని ప్రయత్నిస్తున్నట్టుగా అనిపిస్తుంది……

“ఏమర్రా?  ఉలుకు పలుకు లేకుండా, అలా తినడం మీదే దృష్టి పెట్టారు?” అంటూ అందరికీ పాయసం కప్పుల్లో వేసి అందించింది కోటమ్మత్త.

నాన్నే సంభాషణ మొదలు పెట్టారు…”జగదీష్, ఇలా అంటున్నానని ఏమనుకోకు బాబు… నీవు రాణి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.. ఆమె శ్రేయస్సు, బాధ్యత నీకు మోయలేని బరువు కావచ్చునేమో.  నీకది మంచిది కాదు,” ఆగారు….

జగదీష్ మౌనంగా వింటున్నాడు.

“భూషణ్ పైన జాలిపడాలో, కోపగించుకోవాలో తెలిడం లేదు నాకు… కూతిర్ని కట్టుబాటులో ఉంచలేక సతమవుతున్నాడు,” మళ్ళీ నాన్న.



ఒక్క క్షణం మౌనం తరువాత, విషయం చెప్పసాగారు మూర్తి.

“మీరు లండన్ వెళ్ళిన నాలుగో రోజున, రాణి మేడమ్ చాలా బోల్డ్ - స్టెప్ తీసుకుని, ఇంటి నుండి బయటకి వెళ్ళిపోయారు. వాళ్ళ ఫాథర్ పై పోలీస్ కంప్లైంట్ చేసి, సివిల్, క్రిమినల్ కేసులు పెట్టారు మేడమ్. భూషణ్ సార్ ఓ రోజంతా పోలీస్ ఇంటారిగేషన్ లో గడిపి, చాలా ఇబ్బంది పడ్డారు.

రెండు రోజులు హాస్పిటల్లో కూడా ఎడ్మిటయ్యారు. మన జగదీష్ బాబు ఢిల్లీనుండి వచ్చి, భూషణ్ సార్ కి, రాణి మేడమ్ కి రాజీ కుదిర్చి వెళ్ళారు. పరిస్థితి ఇప్పుడు సద్దుమణిగినట్టే మేడమ్. సార్ మాత్రం కోలుకోలేనంత కుంగిపోయారు..,”

ఆగాడు మూర్తిగారు.

వింటూ ... అమ్మ, నేను కూడా అవాక్కయిపోయాము. నాన్న వంక చూసాము.

“అవునమ్మా, ఇదంతా చాలా దురదృష్టకరం...నాకు అప్పుడే ఈ వార్త తెలిసి, భూషణ్ తో మాట్లాడాను. టూర్ లో ఉన్న మీకు, చెప్పి డిస్టర్బ్ చేయవద్దన్నాడు. ఆ టైంలో ఎప్పటికప్పుడు భూషణ్ తోనే కాక, ఇదో మా అక్కతో మాట్లాడుతూనే ఉన్నాను,” అని వివరించారు నాన్న...

“అసలు కారణం ఏమిటి? తండ్రితో ఇటువంటి విరోధం దేనికి? పోలీసులు, కోర్ట్ కేసులు ఎందుకు? పాపం నీరూ ఏమయిపోయింది ఈ గొడవలకి,” బాధపడుతూ అమ్మ.

“ఎంతో కష్టపడి, హుందాగా కెరియర్ప్లాన్ చేసుకుని, వృద్ధిలోకి వచ్చాడు భూషణ్. అతని పేరు, పరపతిని పతనం చేసేసింది ఆ అమ్మాయి. కన్నతండ్రిని అలా అప్రతిష్టపాలు చేసేటంత ద్వేషానికి కారణం తెలియడంలేదు. అంటూ వాపోయారు నాన్న.

అంకుల్ పట్ల సానుభూతితో, ఆపుకోలేని దుఃఖం వచ్చింది. వినోద్ వచ్చి నా పక్కన కూర్చుని, భుజంపై చేయి వేసాడు. “నీవిక్కడ లేకపోవడం నయమయింది అక్కా. ప్రతిపూట అంకుల్, రాణి ల గురించే న్యూస్... నువ్వు ఉండుంటే, బాగా అప్సెట్ అయ్యేదానివి... ఇప్పుడిక వాళ్ళ న్యూస్ తగ్గిందిలే... అంకుల్ ఇప్పుడు ‘ఓకే’ అంట,” అన్నాడు, నన్ను సముదాయిస్తూ.

ఏమనలేక, మౌనంగా ఉండిపోయాను.

“మరి నేను రేపు వచ్చి కలుస్తాను, సార్,” అని మూర్తిగారు సెలవు తీసుకున్నారు. అత్త లేచొచ్చి అమ్మ పక్కన కూర్చుంది.

“జరిగిన విషయం చెప్పనలవి కానిదంటే నమ్ము తల్లీ, ప్రతి పూట టి.వి లో ఆ పిల్ల వీరంగం చూసి నేనే విలవిల్లాడి

పోయాను.  భూషణ్ గారు, నీరూ ఎలా భరించారో, ఎంత బాధ పడ్డారో  పాపం," అని వాపోయింది కోటమ్మత్త.

"అసలు కారణమేంటి అత్తా," అడిగాను...

"ఆ సంగతికే వస్తున్నా. వాళ్ళ నాన్న తనకి బలవంతపు పెళ్ళిచేయడానికి, ఇంట్లోనిర్భందించాడని, తన స్వేచ్ఛని హరించి, చంపుతానని బెదిరించి, మానసికంగా, శారీరకంగా హింసకి గురి చేస్తున్నాడని పోలిసుకి ఫిర్యాదు చేసింది, రాణి.

ఇక తండ్రి నుండి, తనకి రక్షణ కావాలని పోలీసు కమీషనర్ కి అర్జీ పెట్టుకుంది.....

ఇంకా ముందుకి సాగి, భూషణ్ గారినుండి ఆస్థి పాస్తులు కోరుతూ ఒక కోర్టులో కేసు వేసి, తండ్రికి  శిక్ష  పడవలసిందేనని మరో కోర్ట్ కేసు వేసింది," క్షణం ఆగింది అత్త.

"అసలు సంగతి మరోటి ఉందమ్మా.  ఈ గొడవకి ముందు, కన్నడ  హీరో ఉదయచంద్రతో నిశ్చితార్ధం  జరిపించడానికి, భూషణ్ గారు మాట ఇచ్చిపుచ్చుకున్నారని కూడా చెప్పారు," అందామె మా వంక చూస్తూ....

"ఇంత జరిగిందా?" ఆశ్చర్యంగా అమ్మ.

"ఇదంతా టి.వి లో విన్న న్యూస్ శారదా, టి.వి లో డైలీ సీరియల్ లాగా నడిపింది ఆ రాణి మహాతల్లి.  ఆమె దెబ్బకి పాపం హాస్పిటల్లోకూడా చేరారు భూషణ్ గారు.  అప్పుడు వచ్చాడమ్మా మన జగదీష్.   మొత్తానికి ఆ తండ్రికి, బిడ్డకి రాజీ కుదిర్చి, ఆ రాణమ్మని వాళ్ళింటికి చేర్చాడు.  జగదేష్ ఇక్కడున్నప్పుడు ఓ తడవ వాళ్ళని పలకరించి వచ్చాము నేను. వినోద్," ముగించింది ఆమె.

అసలు నమ్మలేకపోయాను.  ఏమనాలో తోచక అమ్మ వంక చూసాను.

"ఆ కన్నడ హీరో మంచి పేరున్న కుటుంబం వాడు.  ఏమైనా, సంబంధం ఎంత మంచిదైనా ఇష్టం లేకపోతే, వద్దంటే

పోయేదిగా......ఇదంతా చూస్తుంటే, దేనికోగాని ఆ అమ్మాయికి వాళ్ళ నాన్న మీద విపరీతమైన కోపం వచ్చి, ఇలా ఆయన్ని శిక్షించిందనిపిస్తుంది," అంది అమ్మ.

నాలోనూ అదే సందేహం కలిగింది.  కోపం వచ్చినప్పుడల్లా అంకుల్ వాళ్లకి  గుణపాఠం నేర్పించాలన్న ధోరణిలో, రాణి, వాళ్ళని బాధించడం తెలిసిన సంగతే... కాని, అసలు ఏమి జరిగుంటుందోనని ఊహించలేకపోతున్నాను.. నిస్పృహగా అనిపించింది...

విన్న విషయాలు కలిచివేస్తుంటే, ఎవరి ఆలోచనల్లో వాళ్ళం అచేతనంగా ఉండిపోయాము...

**

ఇంతలో, ఫోన్ రింగయితే, పక్కనే ఉన్న అమ్మ తీసింది...

"హలో,  ఆ, జగదీష్ బాబు, ఎలా ఉన్నావు, అమ్మ నాన్న ఎలా ఉన్నారు?" అంటూ సంభాషణ కొనసాగించింది అమ్మ. చాలా మటుకు భూషణ్ అంకుల్ కి వచ్చిన కష్టం గురించే సాగింది...

"అసలు రాణి సంగతి ఏమిటి? ఎందుకలా చేసిందో తెలిసిందా?" అన్ని అమ్మ అడిగిన దానికి, అటునుండి జగదీష్ ఏమి చెబుతున్నాడో కాని, ఇటునుండి అమ్మ 'ఊ' కొడుతూ వినడం మాత్రమే తెలుస్తుంది.

మరి కొద్ది సేపటికి,  "అలాగే, చంద్రకి చెబుతాను.  అమ్మ వాళ్లకి, నేను రేపు ఫోన్ చేస్తానని చెప్పు," అని ఫోన్ పెట్టేసింది.

"తన పనయ్యాక నీకు ఫోన్ చేస్తాడట," నాకు చెప్పి మౌనంగా ఉండిపోయింది....

"రాణి విషయంగా, ఏమంటున్నాడు?" అడిగారు నాన్న.

గట్టిగా ఊపిరి తీసుకుంది అమ్మ.

“తనకి విషయం పూర్తిగా తెలియదంట.  హాస్పిటల్లో అడ్మిట్ అయ్యాక, భూషణ్ గారే ఫోన్ చేసి, సమస్య  వివరించి సాయం అడిగితే, హుటాహుటిన బయలుదేరి వచ్చాడట.

రాణి విషయంగా కూడా సహాయం చేయమంటేనే, ఆ అమ్మాయితో మాట్లాడి ఇంటికి తిరిగి వచ్చేలా మాత్రం చేయగలిగాడట.  రాణి నుండి, వివరాలు కనుక్కునే ప్రయత్నం కూడా చేయలేదట.

ఇకపోతే, తనిక్కడ ఉన్నప్పుడు  భూషణ్ గారికి మైల్డ్-హార్ట్- ఎటాక్ వచ్చిందట కూడా.  అయన పరిస్థితి కుదుటపడ్డాక, మూడో రోజున తిరిగి వెళ్ళిపోయాడట.  భూషణ్ గారికి, ఆ సమయంలో, కాస్తైనా సహాయం చేయగలిగినందుకు  తృప్తిగా ఉందన్నాడు,”  ముగించింది అమ్మ.

**

మరునాడు పొద్దుటే వెళ్లి అంకుల్, ఆంటీ వాళ్ళని చూసాము.

ఇద్దరూ ఎంతో నీరసంగా, జబ్బు పడి లేచిన వాళ్ళల్లా అయ్యారు. బయటకి మామూలుగా మాట్లాడుతున్నా, కోలుకోలేని దెబ్బతిన్నట్టు కనబడుతుంది.

మా లండన్ టూర్ గురించి అడిగి, బాగా జరిగిందని తెలుసుకొని, సంతోష పడ్డారు.

వారితో కలిసి, భోజనం చేసాక గాని మమ్మల్ని తిరిగి వెళ్ళనివ్వలేదు.

**

టూర్ నుండి తిరిగి వచ్చిన రెండోరోజు నుండి , తలమునకలుగా పనిలో మునిగిపోయాను... ఎల్లోరాలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న డాన్స్ ఫెస్టివల్లో ఇనాగురల్ ప్రోగ్రాం ఒప్పుకున్నాను.

అక్కడ నృత్య ప్రదర్శన చేయాలని ఎప్పటినుంచో నా కోరిక.

'ఆలయనాదాలు' అనే ఓ కాన్సెప్ట్, నేనే రాసి, కోరియోగ్రఫీ చేసి ప్రెజెంట్ చేయబోతున్నాను...

ఎంత బిజీగా ఉన్నా, నిత్యం అంకుల్, ఆంటీ నా మనసులో మెదులుతూనే ఉన్నారు. వారు ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితి మనసు నుండి చెరగడం లేదు.

నా పట్ల స్వచ్ఛమైన ప్రేమ వాత్సల్యాలతో మెలిగిన మనిషి, నన్ను కళాకారిణిగా ఇంతటి స్థాయికి తెచ్చిన మనిషి, అమ్మానాన్నల్ని ఆదుకొని, మంచి జీవితాన్నిచ్చిన భూషణ్ అంకుల్, ఇలా దెబ్బతిన్న పులిలా అయిపోవడం నన్ను విపరీతంగా బాధిస్తుంది....

తీరిక దొరికినప్పుడల్లా అంకుల్, ఆంటీలతో కాసేపు గడిపి కబుర్లు చెప్పి వస్తున్నాను. అప్పుడప్పుడు వాళ్ళింట ఎదురుపడే రాణిని పలకరించి, మాట్లాడుతుంటాను.

**

దేవాలయాల ప్రాకారాల పైని అందమైన శిల్పాలు – ఒకానొక పర్వదినాన, అర్ధరాత్రి దాటిన పిదప, సజీవ మూర్తులుగా మారి, సూర్యోదయం వరకు దైవ సన్నిధిలో నృత్యం చేసి, తిరిగి వాటి స్థానాల్లో ప్రతిమలవుతాయన్న కథాంశాన్ని 'వేదిక' మీద ఓ కళాఖండంగా సమర్పించాలన్న ఆలోచనే - నా 'ఆలయనాదాలు' కాన్సెప్ట్.

అజంతా ఫెస్టివల్ ప్రోగ్రాముకి, ఈ ఇతివృత్తాన్నే నృత్య నాటికగా రూపొందించాలని, నిర్విరామంగా కృషి చేయసాగాను.

అవకాశం దొరికిన ప్రతి ఇంటర్వ్యూలో 'ఆలయనాదాలు' కాన్సెప్ట్ గురించి ప్రస్తావించాను. సంస్కృతి టి.వి వారికి ప్రత్యేక కార్యక్రమంగా 'ఆలయనాదాలు' ఇతివృత్తాన్ని ఓ నృత్యాంశంగా ప్రెజెంట్ చేసాను కూడా....

***

నెలలపాటు 'ఆలయనాదాలు' బృందంలోని మేమంతా, అమ్మ అజమాయిషీలో తర్ఫీదు, ప్రాక్టీసులు సాగించాము. ప్రదర్శన రోజు రానే వచ్చింది...

అమ్మా నాన్నలతో, మా నృత్య బృందంతో, ఎల్లోరా చేరాను....

మేమున్న స్థావారాల్లోనే, ఎందరెందరో నృత్య కళాకారులు, సంగీత విద్వాంసులు, కవులు విడిది చేస్తున్నారు... ఉన్న రెండు రోజుల్లోనే, చాలా మందితో పలకరింపులు, పరిచయాలు ఏర్పడ్డాయి.

వారి వారి స్థావరాల బయట, అందమైన పూలమొక్కలు, చెట్లనడుమ తివాచీలు పరుచుకుని, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ వాయిద్యకారులు అభ్యాసన చేయడం...మరింత బాగుంది..

ప్రదర్శనలకి ఏర్పాటయ్యే 'వేదిక' గురించిన కబుర్లు కూడా అందరిలో మరింత ఉత్సాహాన్ని నింపాయి..

ప్రదర్శన రోజున కాస్తముందుగానే, 'వేదిక' వద్ద చేరాము....

అతి సుందరమైన ఎల్లోరా గుహల పరిసరాలని బ్యాక్ డ్రాప్ గా ఏర్పాటయిన అక్కడి 'వేదిక' కళాకారులకి, కవులకి కూడా ఓ ధురానుభూతిని అందిస్తుందనడంలో సందేహమే లేదు....

ఇంత గొప్ప అవకాశానికి ... కళామతల్లికి శతకోటి వందనాలు చెప్పుకున్నాను.

మా నృత్యనాటిక లోని సునిశితమైన అంశాలని,  అక్కడి సాంకేతిక బృందం వారి సహకారంతో, నే కోరుకున్న స్థాయిలో ప్రదర్శించాము. ..

కళా రంగంలోని అన్ని వర్గాల నుండి, నేను రచించిన తొలి నృత్యనాటికకి మంచి ప్రశంసలు దక్కాయనే చెప్పొచ్చు.

***

ఎల్లోరా నుండి తిరిగి రాగానే, ఎగ్జామ్స్ దగ్గర పడడంతో, చదువుతో బిజీ అయిపోయాను...

"ఏమ్మా, చాలా కష్టపడి చదువుతున్నావుగా .... సంతోషం... ఎగ్జామ్స్ అయ్యాక ఓ వారం రోజులు అన్నిటికీ సెలవు పెట్టేయి," అన్నారు నాన్న, ఎగ్జామ్స్ మొదటి రోజున, నన్ను కాలేజీ వద్ద డ్రాప్ చేస్తూ..."

"ఎగ్జామ్స్ అయ్యాక, శుక్రవారం నుండి సోమవారం వరకు ఎలాగూ సెలవే నాన్నా... అది చాలు.  'సంస్కృతి' వర్క్ చాలా ఉంది," అంటూ కారు దిగాను...

**

ఆదివారం నాడు, భూషణ్ అంకుల్, ఆంటీల ఇరవైఐదవ  వెడ్డింగ్ యానివర్సరీ లంచన్ కి  బయలుదేరాము.  చేతుల్లో పూలదండలు,  స్వీట్స్ పుచ్చుకుని,  వాళ్ళింట అడుగుపెట్టాము.

హాల్లోమాకోసమే వెయిట్ చేస్తున్న వారిరువురికి  అభినందనలు తెలిపి, వాళ్ళచేత పూలమాలలు మార్పించి, స్వీట్స్

తినిపించారు అమ్మావాళ్ళు.

నేను శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వాదం తీసుకున్నాను.

“ఈ ఆదరణ, ఆప్యాయతలు చాలనే మరి, మా ఈ ప్రత్యేక పెళ్ళిరోజుకి మీరు మాత్రమే మా అతిధులు, సత్యం,” అన్నారు అంకుల్ నాన్నతో…

“అవును, మీ అందరికీ ఇష్టమైన వంటకాలు దగ్గరుండి చేయించాను. భోంచేద్దాము పదండి,” అంటూ నీరూఆంటీ డైనింగ్ వైపు నడిచింది.

**

వడ్డన మొదలు పెడుతుండగా మాత్రం మా అందరి మనస్సుల్లో ఉన్న ప్రశ్నని, కోటమత్త అడిగేసింది. “రాణి, కనబడదే? భూషణ్ గారు?” అని.

“వారం రోజుల కోసం, ఢిల్లీ వెళ్ళింది, రాణి,” అనేసి వడ్డన సాగించింది ఆంటి.

నా పక్కనే ఉన్న అమ్మ ఉలిక్కిపడింది. అత్త ఇక కిమ్మనలేదు.

రాణి ఢిల్లీకి వస్తుందని, జగదీష్ చెప్పంగా, నాకు మాత్రం, తెలిసిన విషయమే….

అందరి మౌనం నడుమ, అంకుల్ కల్పించుకున్నారు. “ఈ సమయంలో మానుండి దూరంగా ఉండడమే ధ్యేయంగా అలా ఢిల్లీ వెళ్ళిపోయింది. తన తోటివాడు, జగదీష్, ఊళ్ళో ఉండడని తెలిసినా, మణిగారితో సమయం గడుపుతుందట,” అంటూ పేలవంగా నవ్వారు అంకుల్.

నీరూ ఆంటీ ముఖం పక్కకి తిప్పుకుని కళ్ళు తుడుచుకుంది.

వాళ్ళెంత  బాధపడుతున్నారో అర్ధమయి నా గుండెలు పిండేసినట్టయ్యింది.  అందరూ భోంచేస్తున్నారే గాని, వాతావరణం గంభీరంగా ఉంది.

ఎలా తేలిక పరచాలా అని క్షణం ఆలోచించాను....

“అంకుల్, ఆంటీ, మీ కోసమే ఈ రోజంతా నేను ఫ్రీపెట్టుకున్నాను.  ఇవాళ ఏం చేయాలనుందో  చెప్పండి.  ఎక్కడికన్నా వెళ్ళాలంటే, నేనే మీ డ్రైవర్ని,” అన్నాను.  “పైగా నన్ను మీరు వెళ్ళమనేంత వరకు ఇక్కడే, మీతోనే నా రాత్రిభోజనం కూడా,” నవ్వుతూ ముగించాను.

“అవును మరి, నువ్వు నా కూతురులో సమానమేనని నీ చిన్నప్పుడే చెప్పానుగా కళా.  సుఖంగా, సంతోషంగా ఉండమ్మా,” అన్నారు అంకుల్...

“అది సరేగాని, ప్రోగ్రాం అయి నాలుగు నెల్లయినా,  ఎల్లోరాలో నీవు చేసిన ‘ఆలయనాదాలు’ గురించి ఇంకా వార్తలు వస్తూనే ఉన్నాయిగా! ఇందాకే ఇండియా టైమ్స్ మాగజిన్ లో  చదివాను... చాలా గర్వంగా ఉందమ్మా,” అన్నారు.

నాన్న కలగజేసుకున్నారు...

“సమయానికి గుర్తొచ్చిందోయ్ భూషణ్... సెల్వన్ గారి ఫిలిం చేసే ఆసక్తిలేదంట కళ కి.  వాళ్ళు పంపిన స్క్రిప్ట్ కూడా అలాగే ఉంది.  అదేమో, నీ ద్వారా వచ్చిన ఫిలిం ఆఫర్ కదా! నీతోనే మాట్లాడమన్నాను,” అన్నారు నాన్న విషయం గుర్తుచేస్తూ..

“తప్పక మాట్లాడుదాము,” అన్నారు అంకుల్.“అయినా, చంద్రకళ విషయంలో, ఎన్నెన్నో అవకాశాలు వాటంతటవే

నడచి వస్తున్నాయి.  మన కళని అతిత్వరలో అమెరికా పిలిపించాలని కూడా,  తేజశ్విని గారు ఆలోచిస్తున్నారట కదా! ఏమైనా, చంద్రకళ ఓ మేటి కళాకారిణి మాత్రమే కాదు, మంచి పరిణతి ఉన్న యువతి.  అన్ని నిర్ణయాలు స్వయంగా తీసుకోగలదు, సత్యం," గర్వంగా అంకుల్...

"అంతా గాడ్స్ గ్రేస్. అవును, అమెరికా విషయంగా తేజశ్విని గారు పంపిన సమాచారం, ఆ పేపర్స్ ఇవాళ పొద్దున్న చూసాను," అన్నారు నాన్న...

**

భోజనమయ్యాక, ఆంటీ చేయించిన స్వీట్స్ రుచి చూస్తూ సిటింగ్ లో కూర్చున్నాము.   నాన్నతో నవ్వుతూ మాట్లాడుతున్న అంకుల్ వంక చూసాను.  నాలుగునెల్లల్లో పదేళ్ళు పైబడ్డట్టుగా  అయ్యారాయన.  ఇదివరకులా హంగామాగా మాట్లాడ్డం, హడావిడిగా వ్యవహరించడం పూర్తిగా తగ్గిపోయింది.  ఇంటిపట్టునే ఉంటున్నారు.

వారి స్టూడియో వ్యవహారాలు, ఇప్పుడు,  మరింతగా నాన్నే చూస్తున్నారు.

రాణి విషయంగా కొంతైనా మనశ్శాంతి దొరికితేనే, వాళ్ళ పరిస్థితి మెరుగవుతుందని, జగదీష్ కూడా చెబుతుంటాడు.

**

కాసేపటికి, టీ కూడా తాగి, అమ్మావాళ్ళు వెళ్ళిపోయాక,  నేను వెళ్లి నీరూఆంటీ పక్కనే కూర్చున్నాను......

"అన్న ప్రకారం ఈ రోజంతా నేను మీతోనే ఆంటీ....చెప్పండి ఏం చేద్దాం?  శనివారం కదా! నన్నడిగితే, గుళ్ళో అర్చన చేయించాక, కాసేపు మీ కిష్టమైన గీతబోధ కూడా విందాము.  అటునుంచి కాసేపు పార్క్ లో వాకింగ్ చేసాక, మీ పార్లర్ కి వెళ్లి ఐస్క్రీం తిందాము. ఇంటికొచ్చి ఏదన్నా మూవీ చూద్దాము.  మీకు నిద్రవస్తున్నప్పుడు నేను మా ఇంటికి వెళ్ళిపోతాను," అన్నాను...

నవ్వుతూ నేను చెప్పిందంతా విన్నది ఆంటీ…

“చూడండి, ఎంత బాగా ప్లాన్ చేసిందో చంద్రకళ! మరి మీకు ఓకేనా?” పక్కకి తిరిగి అంకుల్ ని అడిగిందామె…

ఉలుకు పలుకు లేకుండా, ఆయనేమో, మౌనంగా తల వంచుకుని ఏదో ఆలోచనలో ఉన్నారు…

ఆయన మౌనం వీడాలని, నేనే కల్పించుకున్నాను. ”అంకుల్, పదండి మరి, మేము రెడీ,” అన్నాను.

తన కళ్ళజోడు తీసి, కళ్ళు తుడుచుకుంటున్న ఆయన్ని చూసి, ఇక భరించలేకపోయాను. లేచి వెళ్ళిఆయనకెదురుగా కింద నేల మీద కూచున్నాను.

“మిమ్మలింత నిస్సహాయంగా చూడలేను అంకుల్ .. అందరికీ కొండంత అండగా ఉండే మీరే ఇలా బలహీనపడిపోతే, ఎలా చెప్పండి,” నాకళ్ళల్లోనూ నీరు తిరిగింది.

“మీరు త్వరగా కోలుకోవాలని మేమంతా కోరుకుంటున్నాము… అందుగ్గాను నేనేమి చేయగలనో చెప్పండి,” అని వేడుకున్నాను.. ఆంటీ అందించిన టిష్యూతో కళ్ళు తుడుచుకుని ఫక్కున నవ్వారు….”ఏం లేదు కళా, నీకు మాపైనున్న అభిమానంలో ఒక్కవంతైన మా కన్నబిడ్డకి ఉంటే, నన్నింత దెబ్బ తీసేదా? నా పరువు ప్రతిష్టలని ఇలా పనిగట్టుకుని నాశనం చేసేదా? చెప్పు,” నవ్వుతూనే నా వంక సూటిగా చూసారు…

ఉబికివస్తున్న కన్నీళ్ళని ఆపుకుంటూ తల దించుకోడం మినహా నా వద్ద జవాబు లేదు…

“ఛ, అలా తలదించుకోకమ్మా. కన్నీళ్ళుతుడుచుకో. నీతో పార్క్ లో వాకింగ్ కి, ఐస్క్రీమ్ ట్రీట్ కి మేము సిద్ధమే… కాని ముందు కాసేపు మన గార్డెన్-హౌజ్ లో కూర్చుని, టీ తాగుతూ నీతో కొన్ని విషయాలు మాట్లాడి, నేను తేలిక పడ్డాక వెళదాము,” అంటూ పైకి లేచారు…



పని వాళ్ళని పంపేసి, తానే మాకు 'టీ' తీసుకుని వచ్చింది ఆంటీ.

'టీ' కప్పందుకుని తాపీగా నా వంక చూసారు అంకుల్. "మీరు లండన్ ట్రిప్పులో ఉండగా, మా ఇంట జరిగిన అనర్ధాల గురించి వినే వుంటావు. నీ అంచనాలు నీకుంటాయి. అసలు జరిగింది నీకు చెప్పితేనే, నా గుండెలోని బాధ తగ్గి, మాకు ఊరట కలగవచ్చునని నా ఆలోచన....," అన్నారు...

అంకుల్ జీవితాన్ని కుదిపేసిన సంఘటనల వెనుక అసలు నిజాలు, కారణాలు తెలుస్తాయని ఆతృతగా వింటున్నాను.

"మీరంతా లండన్ వెళ్ళాక, రాణి పెళ్లి విషయం పై దృష్టి పెట్టాను. తనకి అన్ని విధాలా సరి తూగే సంబంధం తెస్తానని బుజ్జగించి చెప్పినప్పుడు, సంతోషంగానే ఉంది రాణి. పకపకా నవ్వింది కూడా. పైగా ఏమందో తెలుసా?...

'హీరో ఉదయ చంద్రని చేసుకోవాలని ఉందంటే, .....కుదుర్తుందా డాడీ? నాకు వరుడుగా అతన్ని తేగలవా?' అంటూ అల్లరిగా అడిగిందమ్మా నా కూతురు," అంటూ సన్నగా నవ్వారు....

"...హీరో ఉదయ చంద్ర హైయెస్ట్ పెయిడ్ హీరోయే కాక, పేరు పరపతి ఉన్న కుటుంబంలోని వాడు.. అమెరికాలో ఇంజినీరింగ్ చదివాడు. వెరీ స్మార్ట్ ఫెల్లో. నీకోసం తప్పక ప్రయత్నిస్తాను" అంటూ రాణికి ఆ క్షణంలో ఇంచుమించు మాటిచ్చాను కూడా," కప్పు నుండి 'టీ సిప్ చేసారాయన..

నా వంక చూసి పేలవంగా నవ్వారు.

"రాణి విషయంలో ఏదీ సులభంగా సాగదు కదా తల్లి" అని తరువాత జరిగిన సంగతులు ఒకింత బాధ పడుతూ ఏకరవు పెట్టసాగారు.

"నేను మాటిచ్చినట్టే, గట్టి ప్రయత్నాలు చేస్తున్నానని తెలుసుకొని, ఓ రోజు పొద్దున్నే నా వద్దకు వచ్చింది రాణి. 'హీరో ఉదయ చంద్రని వరుడుగా తెమ్మనడం, ఒక జోక్ అని, తనకి జీవిత భాగస్వామి కావలసిన వాడు, తన మనసుకి

నచ్చినవాడు, 'జగదీష్' మాత్రమేనని, తన వివాహం అతనితో జరిపించే ప్రయత్నం చేయమని' కుండ బద్దలు కొట్టినట్టు చెప్పింది," మాట తడబడుతూ, అంకుల్.

విని, ఒక్కసారిగా నా గుండె జారినట్టయ్యింది. అది గ్రహించిందో ఏమో, పక్కనే కూర్చున్న ఆంటీ నా భుజం పైన చెయ్యి వేసింది.

....మరి ఆ తరువాత ఏమయింది? .... అని గుండె వేగంగా కొట్టుకుంది...

బెరుకుగా, సంశయంగా ఆయన వంక చూసాను.

"ఏం చేస్తాను చెప్పు...తప్పదుగా తల్లీ, అందుకే, సంబంధం తీసుకొని, మేము ఆశగానే ఢిల్లీ వెళ్ళాము. తీరా అక్కడికి వెళ్ళాక తెలిసింది. వచ్చే యేడు నీకు-జగదీష్ కి నిశ్చితార్ధం జరగనుందని. అయితే, ఇప్పుడప్పుడే రాణికి, ఆ విషయం, తెలియడం శ్రేయస్కరం కాదని జగదీష్ అన్నదానితో, మేము పూర్తిగా అంగీకరించాము.

నిరాశ నిస్పృహలతో ఇల్లు చేరాము," ఆగి ఆంటీ వంక చూశారాయన.

అంటీ నా చేయి తన చేతిలోకి తీసుకున్నారు. "రాణికి, నీపట్ల ఉన్న అసహనం, జగదీష్ పట్ల ఉన్న ప్రేమ, తెలుసును కాబట్టి, విషయం దాచాలనే అనుకున్నాము.

జగదీష్ కి ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని, రాణికి అబద్ధం చెప్పాము," అని చెబుతూ దుఃఖాన్ని ఆపుకోలేక కొంగులో ముఖం దాచుకుంది. సముదాయించడానికి ప్రయత్నించాను...

కొద్దిసేపటికి కోలుకుని, తలెత్తి నా వంక చూసిందామె.

"జగదీష్, పెళ్ళికి సుముఖంగా లేడని విని అవమానంగా భావించింది రాణి. అక్కడినుండి మొదలయ్యాయి, దానితో మా అగచాట్లు. మీ అంకుల్ ని అనరాని మాటలందది.. ఆయన్ని చేతకాని వాడని తిట్టింది. బిడ్డ కోరికలు తీర్చలేని తల్లితండ్రులు ఉన్నా లేకున్నా ఒకటేనంది.. ఒక మాట కాదు. దానికి మా మీద ఇంతటి ద్వేషం ఎందుకో కూడా అర్ధం కాదు. 'జగదీష్' ఏదో అంగట్లో వస్తువన్నట్లు అతన్ని తనకి భర్తగా తేలేక పోతే, వాళ్ళ నాన్న పరువు తీస్తానని, తను చస్తానని బెదిరించింది," మళ్ళీ కన్నీళ్లు పెట్టుకుందామె.

అంకుల్ కూడా ఆమెని సముదాయించారు... నేను గ్లాసు లోకి నీళ్ళు వొంపి ఆంటీ చేతికందించాను.

"బాధ పడకు నీరూ, కనీసం నీవన్నా ధైర్యంగా ఉండాలి," మందలించినట్టుగా అంకుల్.

"అవును ఆంటీ. అయినా రాణి కోప తాపాలు మనకి తెలిసినవే కదా. మీరు జగదీష్ విషయం అలా చెప్పినా, ఇంకోలా చెప్పినా, తను అప్ సెట్ అవడం సహజమే... .

ఏమైనా,  ఇంట్లోనే, మీ మధ్య ఉండ వలసిన ఈ గొడవని, పోలీస్ వరకు ఎందుకు తీసుకు వెళ్లినట్టు?  అంత తీవ్రమైన చర్య ఎందుకు తీసుకుంది రాణి?" నెమ్మదిగా తగ్గు స్వరంలో అడిగాను...

ఆయన మౌనంగా  కిందకి చూస్తూండి పోయారు... చెప్పడానికి ఆయన ఎంత సంశాయిస్తున్నారో అర్ధమయింది.  కొద్ది క్షణాలకి తలెత్తి నా వంక చూసారు...

"ఏం చెప్పనమ్మా? వారం రోజులు ఓపిక పట్టాక, రాణి మితి మీరిన చేష్టలు, గుణ పాఠం చెబుతానని బెదిరించడాలు, భరించలేక పోయాను.  భయ పడితే లాభం లేదని,  ఓ సగటు తండ్రిలా వ్యవహరించాను.  నా ఆధీనంలో ఉన్న దాని బ్యాంక్ అకౌంట్స్  ఫ్రీజ్ చేసి, కార్లని స్టూడియోకి తరిలించి, గట్టిగా మందలించాను.

నేననుకున్నట్టుగా,  ఏ గొడవా చేయలేదు సరికదా, ఆ తరువాత నాలుగు రోజులు, రాణి నెమ్మదిగానే ఉంది... వచ్చి మాతోనే భోంచేసి, టి.వి చూసేది.

తనలో మార్పు వచ్చిందని సంతోషించాను.

మరో వారం వరకు కూడా దాన్ని గమనించాను.   ఆ శని వారం పొద్దున్నే మాతో గుడికి వచ్చి, రోజంతా మాతోనే  ఉంది. ఎన్నడూ లేనిది, మీ ఆంటీతో పాటు కిచెన్ లోకి వెళ్లి, వంట కూడా చేసింది..

రాణిలో వచ్చిన మార్పుతో, అవధుల్లేని ఆనందాన్ని చవి చూసాము ఆ రోజున మేము.

మా జీవితాల్లో కొత్త సంతోషాలు వస్తాయని,  నమ్మకంగా అనిపించింది,"  నా వంక తదేకంగా చూసారు...

“ఆ మరునాడు,  రాణి పక్కన కూర్చుని, హీరో ఉదయ చంద్ర సంబంధం మాట్లాడతానని, అన్నీ సవ్యంగా జరిపిస్తానని, జగదీష్ విషయం మరిచి పొమ్మని, బుజ్జగించాను,”

చెప్పడం ఆపారు...

నా గుండె మరో సారి వేగంగా కొట్టుకుంది.

ఆయన ముఖంలో నిస్పృహ కనబడింది....

“ఆ రోజునే, అర్ధరాత్రి దాటాక, ఫ్రెండ్సుని పిలిపించుకుని వాళ్ళతో వెళ్ళిపోయింది.  తెల్లారాక, బాహాటంగా నా మీద యుద్ధమే ప్రకటించింది నా ఒక్కగానొక్క బిడ్డ,” అంటూ కళ్ళు తుడుచుకున్నారు...

విషయమంతా విని, అచేతనమయిపోయాను.

కొద్ది నిముషాలకి ఎవరో తట్టినట్టు కోలుకున్నాను.  ఇక విన్నది చాలంది నా మనస్సు.

మెల్లగా తలెత్తి అంకుల్, ఆంటీల వంక చూసాను...

నేలచూపులు చూస్తూ  దిగులుగా అయిపోయిన  వారివురినీ కూడా తేలిక పరచాలని గుర్తొచ్చింది.

కాసిన్ని నీళ్ళు తాగి, గొంతు సవరించుకున్నాను. "అంకుల్, ఆంటీ, మీ మనస్సులోని బరువు కాస్తైన తగ్గుంటుంది! ఇక ఇవాళన్నా  ఆ విషయాలు పక్కన పెట్టి, ఇక్కడి నుండి కదలండి.  అమ్మవారి గుడి తెరిచే ఉంటారు...  దారిలో మాట్లాడుకుంటూ వెళదాము,"  అంటూ పైకి లేచి ఆంటీకి చేయందించాను..

**

మీనాక్షి అమ్మవారికి, ప్రత్యేకంగా నేయించిన చీర-సారె సమర్పించి, అర్చన చేయించాము.  తీర్థ ప్రసాదాలు తీసుకుని, ఆలయ ప్రాంగణంలో ఓ పక్కకి, విశ్రాంతిగా కూర్చున్నాము.

కాసేపట్లో మొదలవబోయే 'గీత ప్రబోధకి' ఎదురుగా ఉన్న హాల్లోకి జనం వెళుతున్నారు.

నానుండి కొబ్బరులు అందుకున్న అంకుల్, నా రెండు చేతులని తన చేతుల్లోకి తీసుకున్నారు.  తడి కళ్ళతో నా వంక చూసారు.  ఆయన బేలతనం నన్ను కలవరపెట్టింది.

"అమ్మా కళా, నా కళ్ళకి నీవు అమ్మవారిలాగానే ఉన్నావు.  ఆ తల్లి అనుగ్రహం పొందిన దానివి నువ్వు.  ఈ రోజు నీతో గడిపే సదవకాశం కూడా ఆ దేవతే మాకు కల్పించిందేమో!"  క్షణం సేపు కళ్ళు మూసుకున్నారు.  ఉబికి వస్తున్న కంటి తడిని ఆపుకోడానికి ప్రయత్నిస్తున్నారు.

**

దుఃఖించ వద్దని అంటీ కూడా వారించాక,  కాసేపటికి తేరుకున్నారాయన.

నా రెండు చేతులని మరింత పొదవి పట్టుకున్నారు.

“నిన్నిలా అడుగుతున్నందుకు నన్ను క్షమించు తల్లీ,   మా గడ్డు సమస్యలని దూరం చేయగల శక్తిని ఒక్కదానికే ఉందమ్మా… పరిస్థితులని సరిదిద్ది, మా జీవితాల్లోకి సుఖశాంతులని  తేగలవు.  పెద్ద మనసు చేసుకొని ఆలోచించు.

జగదీష్ పై నీకున్న ప్రేమని త్యాగం చేసి, అతని మనస్సు మన రాణి వైపు మొగ్గేలా చేయగలవు,” నా చేతులు వదిలి నాకు నమస్కరించారు.

నివ్వెరపోయాను…. నాచేతుల్ని  గబుక్కున వెనక్కి తీసుకున్నాను.  తల గిర్రున తిరిగినట్టయ్యింది.

తెలియని ఉద్వేగంతో, కళ్ళనిండా నీళ్ళు నిండాయి.  గుండెల నిండా గుబులు కమ్ముకున్నట్టుగా అనిపించి, బాధతో, తల వంచుకున్నాను….

**

“పదమ్మా, ఇక వెళదాము,” అంటూ, నా భుజం మీద నిరూఆంటీ చేయి వేయడంతో, స్పృహలోకి వచ్చాను.

కళ్ళు తుడుచుకొని, దిగాలుపడి కూచునున్న అంకుల్ వంక చూసాను.  ఆయన 'త్యాగమంటూ' నన్నలా అడిగారంటే, ఆయన మానసిక స్థితి ఎంతగా బలహీన పడిందో అర్ధమయింది.  నీట మునిగే వాడు గడ్డిపరకనైనా ఆశ్రయిస్తాడన్నట్టు, ఆయన నాముందు చేతులు జోడించి తమ జీవితాలని చక్కదిద్దమనడం ఊహించలేని విషయం..

ఆయన్నీ పరిస్థితిలో చూడవలసి రావడం మా దురదృష్టం.

ఇక, నా పరిస్థితికి బాధ పడాలో, ఆయన స్థితికి జాలి పడాలో తెలీడం లేదు.  మొద్దుబారిన మనసుతో, పక్కనే నేల మీదనున్న వాకింగ్-స్టిక్ తీసి, ఆయన చేతికందించాను.

ఇంతలో, గీత బోధ మొదలవ బోతున్నట్టు కూడా, మైకులో అనౌన్స్ మెంట్ విని, లేచి అటుగా నడిచాము.

**

ఓ గంట సేపు సాగిన గీత బోధ గురించి మాట్లాడుకుంటూ,  గుడి నుండి బయలుదేరి, అరగంటలో 'నటేషన్  పార్క్' చేరాము...

ప్రశాంతంగా ఆహ్లాదంగా ఉన్న వాతావరణంకి, భిన్నంగా,  మనస్సులో మాత్రం అలజడిగా అశాంతిగా  ఉంది....

కారు దిగి పార్క్ లోనికి నడిచాము...దారికి ఇరు వైపులా పరిమళాలు వెదజల్లుతున్న పువ్వులని చూస్తూ, నీరూ ఆంటీ కబుర్లు చెబుతూనే ఉంది...

జగదీష్ తో, ఇదే పార్క్ కి వచ్చినప్పటి సంఘటన మనసులో మెదిలింది.

పార్క్ లోపలి వరకు వెళ్లి, అప్పటి ఆ గజేబో లోనే కూర్చున్నాము...

చేతిలోని వాటర్ బాటిల్ అంకుల్ కి అందించాను.

"మీరు  ఇదివరకు, రోజూ రెండు మైళ్ళన్నా నడిచే వారంట కదా.  కొద్ది రోజులుగా మానేసారంట.  ఇక అలా కుదరదు అంకుల్... ముందుగా ఇవాళ, ఈ వాకింగ్ ట్రైల్  మీద, మీరిద్దరూ నాతో  రెండు రౌండ్స్ నడవాలి.  అదీ, మీ వాకింగ్ స్టిక్ లేకుండానే.  రేపటి నుండి మళ్ళీ  మీ వాకింగ్ ఎక్సర్ సైజు మొదలు పెట్టాలి," ఆయన్ని ఛాలెంజ్ చేస్తూ నేను...

బాటిల్ నుండి వాటర్ సిప్ చేసి, నా వంక నిశితంగా చూసారు అంకుల్.  "నా మీద కోపంగా లేవంటే, ఇవాళ నీతో తప్పకుండా నడుస్తాను.  ఇక నుండీ రోజు నడుస్తాను కూడా. కాని నా ఆసరాకి వాకింగ్ స్టిక్ లేక పోతే కష్టం కళా," అన్నారు చిరు నవ్వుతో...

“…మీ పక్కనే ఆసరాగా నేనున్నాగా! నా ఆసరా తీసుకోండి.  నేనూ మీ కూతురినే అంటారుగా! పైగా మీ మీద నాకు కోపం ఎందుకు అంకుల్?”  అన్నాను నవ్వుతూ.

**

కబుర్లు చెబుతూ, ట్రాక్ మీద రెండు రౌండ్స్ కూడా చక్కగా నడిచారు అంకుల్, ఆంటీ.

అక్కడి నుండి పార్లర్ కి వెళ్లి ఐస్ క్రీం తిన్నాము….

చీకటి పడ్డాక ఇల్లు చేరాము…

కొత్తగా రిలీజ్ అయిన కామెడీ మూవీ స్టార్ట్ చేసి, ఏదైనా టిఫిన్ చేస్తానంటూ కిచెన్ లోకి వెళ్ళింది ఆంటీ.

మొదటి సీన్ నుండే మూవీని అంకుల్ తో పాటు, నేనూ ఎంజాయ్ చేయడం మొదలు పెట్టాను.

**

మూవీ కంప్లీట్ అవగానే, టిఫిన్ చేయడానికి డైనింగ్ వద్ద చేరాము.

“ఈ రోజంతా ఎంతో ఆహ్లాదంగా గడిచిందమ్మా కళా,” అంది నీరూ ఆంటీ, తను చేసిన అటుకుల ఉప్మా ప్లేటులో వడ్డిస్తూ.

“నాలుగు నెల్లగా అంధకారంగా  మారిన జీవితాల్లో వెలుగుని నింపావు ఇవాళ,” అన్నారు అంకుల్.

“మీరిక ఉదాసీనంగా ఉండడం మానేసి, చలాకీగా మారాలి.  మీరే మా అందరి జీవితాల్లో వెలుగుని నింపారు.  ఇక ముందు కూడా మీరే మాకు మార్గదర్శకంగా ఉంటారు,” అన్నాను ఆయనతో. .....

సన్నగా నవ్వుతూ తలాడించారు...  ఆంటీ అందించిన మెడిసిన్ వేసుకొన్నారు.

టిఫిన్ తినబోతూ క్షణమాగి నా వంక చూసారు.

“అవునూ, మరి సెల్వన్ గారి మూవీ సంగతేమిటి?  ఎందుకు ఆసక్తి లేదన్నావు?”  అడిగారాయన....

ఆయనడిగిన విషయం పై పెద్ద అభిప్రాయమంటూ లేదు నాకు...

కొద్ది క్షణాలు ఆలోచించాను...

“మీరన్నట్టు, కళా రంగంలో నాకు ఎనెన్నో అవకాశాలు... నిన్ననే నాకు తేజస్విని గారి నుండి కూడా మెసేజ్ అందింది.... వారున్న  ఊళ్ళో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి, అమెరికా అంతటా ఫండ్-రైజింగ్ ప్రోగ్రామ్స్ చేయబోతున్నారట.   ఆ టూర్ లో పాల్గొనమని అడుగుతూ,  వివరాలతో పేపర్స్ పంపారామె.  ఇవాళే వాటిని నాన్నకిచ్చాను.

ఇకపోతే, మీరు చేయమంటే, ఈ ఫిలిం చేసి, అమెరికా ప్రయాణ ప్రయత్నంలో ఉంటాను అంకుల్,” అని చెప్పి ఆయన

సలహా కోరాను....

ఆయన  చేయమనే నచ్చ చెప్పడంతో, అందుకు ఒప్పుకున్నాను.

భోంచేసాకా,  వారి వద్ద సెలవు తీసుకుని ఇంటిదారి పట్టాను....

***

అంకుల్ ఆంటీలతో గడిపిన ఆ ఒక్క రోజు నాలో ఎన్నెన్నో ఆలోచనలు, అలజడులు సృష్టించింది.   త్యాగం,నిస్వార్థం, బాధ్యతల గురించి గీత బోధ నుండి విన్నది పదేపదే నెమరు వేసుకున్నాను.

రేయింబవళ్ళు అలోచించాను.

రాణి సంబంధం తీసుకుని, అంకుల్ వాళ్ళు ఢిల్లీవచ్చిన విషయం, జగదీష్ నాకు ఎందుకు చెప్పలేదు?....  నేను కష్ట పెట్టుకుంటాననా? అంకుల్ కి మాకు మధ్య నున్న సంబంధ బాంధవ్యాలు మారకూడదనా? అని ఆలోచించాను.

'మరి నేను మాత్రం, ఏం చేస్తున్నాను?' అన్న ప్రశ్న ఉదయించింది...

జగదీష్ విషయంగా, అంకుల్ నా నుండి ఆశిస్తున్న త్యాగం గురించి  అమ్మా వాళ్లకి చెప్పడానికి సంశయిస్తున్నాను...

చెబితే, వారి వైఖరి మారి, అంకుల్ పట్లవాళ్ళు కోపాన్ని పెంచుకుంటారేమో అన్న భయం...

అంకుల్ పట్లద్వేషం భావ్యం కాదన్న ఆలోచన.

అందుకే, నేనూ జగదీష్ లాగానే, విషయాన్ని దాస్తున్నాను ...అని నన్ను, నేను సమాధాన పరుచుకున్నాను.

అయినా ఇందులో అంకుల్ తప్పుందా అని కూడా ఆలోచించాను..న్యూ ఇయర్స్ లంచ్ రోజున, కోటమ్మత్తనా పెళ్ళి ప్రస్తావన తెచ్చినా, జగదీష్ తోనే నా పెళ్ళవుతుందన్న స్పష్టత అయితే, ఆమె ఇవ్వలేదు మరి....

అందుకే, రాణి సంబంధం తీసుకుని, అంకుల్ ఢిల్లీ వెళ్ళగలిగారు. అయినా, తమ బిడ్డ కోరడంతో అంకుల్ అలా చేయడం కూడా సమర్థనీయమే. ఆయన్ని తప్పు పట్టే ప్రసక్తేలేదు.

'ఏమైనా అంకుల్ ఆరోగ్యం కుదుట పడాలి. వారింటి పరిస్థితులు చక్కబడాలి. అందుకు నా వంతు సాయం చేసి, అంకుల్ నీరూ ఆంటీల ఋణం తీర్చుకోవాలి'....అన్న నిశ్చయమే బలంగా నాలో మిగిలి పోయింది...

**

మూవీ డైరెక్టర్ సెల్వన్ సార్ తో 'స్టోరీ సెషన్' కి అంకుల్ కూడా కూర్చున్నారు.

ఇన్ స్పైరింగ్ స్టోరీ అనిపించింది. త్యాగం, ప్రేమ, బాధ్యతల నడుమ నలిగి పోయే ఓ నర్తకి కథ. అన్ని విషయాలు మాట్లాడి డేట్స్ కూడా నిర్ణయించారు. మొత్తం పనంతా డిసెంబర్ లోగా అవ్వాలని సూచించారు అంకుల్.

యు.ఎస్.యే ట్రిప్పుకి అడ్డం అవ్వకూడదని కండిషన్ పెట్టారు నాన్న.

మూవీ గురించి సంప్రదింపులు జరిపి, అంకుల్, నా చేత అగ్రీమెంట్ సైన్ చేయించారు. ఆశీస్సులందించి చేతి కర్ర సాయంతో నడిచి వెళుతున్న ఆయన్ని చూసి, నా కళ్ళు చెమర్చాయి.

ఇంత సేపూ మాతో పాటు మీటింగులో కూర్చున్న కోటమ్మత్తకి, ఈ సినిమా వ్యవహారమంతా నచ్చింది. భూషణ్ అంకుల్ ని మెచ్చుకుందామె.

అంకుల్ కి నా పట్ల ఉన్నది నిజమైన ఆప్యాయత అని వాఖ్యానించింది.

ఔనన్నారు నాన్న.

రాణి కాస్త కుదుట పడి, అంకుల్ బాగా కోలుకున్నాక, ఆయన ఆశీర్వాదంతోనే, ఇంట నిశ్చితార్ధ శుభ కార్యం జరుపుకోవాలన్నారు ఆయన.

విని, నాలో నేను నవ్వుకున్నాను..

రాణి కుదుట పడాలంటే, నా ఆశలని వదులుకోవాలేమో అన్న నిర్లిప్తత కలిగింది నాలో...

**


జరుగుతున్న విషయాల గురించి జగదీష్ కి చెప్పినప్పుడు, చాలా సంతోషించాడు... కొత్తసినిమా షూటింగ్ జరిగేప్పుడు రెండు రోజులైనా రావడానికి ప్రయత్నిస్తానన్నాడు.

ప్రతి సంభాషణలో అంకుల్ హెల్త్ గురించి, వాళ్ళ పరిస్థితి గురించి మాట్లాడుతాము...

ఆయన కోలుకుంటున్నారని, ఆయన ముఖాన తిరిగి సంతోషాలు చూడగలమనే చెబుతుంటాను, జగదీష్ కి.

'అంకుల్ వాళ్ళ పరిస్థితి ఎలాగైనా మెరుగయితే తప్ప, మనం సంతోషంగా ముందుకు సాగలేము' అని నేనన్న దానికి, జగదీష్ పూర్తిగా ఏకీభవించాడు.

...........................




విజిటింగ్ ఆర్టిస్ట్ గానే కాక, వాళ్ళ ఇన్స్ టిట్యూట్ కి గెస్ట్ - లెక్చరర్ గా, నాకు, తేజశ్విని గారు ఫార్మల్ ఆహ్వానం కూడా పంపడంతో, నాన్న సంతోషంగా ఉన్నారు...

అందుగ్గాను , స్పాన్సర్ షిప్ పేపర్స్ అందజేశారామె.

ఈ విషయంగా, జగదీష్ తో కూడా సుదీర్ఘంగా ప్రస్తావించారు.

నేను అమెరికాకి వచ్చే అవకాశం నిజమని తెలిసిన విక్రమ్, ఎంతగానో సంతోషించాడు. ఫోన్ చేసినప్పుడల్లా సరదా కబుర్లుమాత్రమే కాకుండా, నా రాక కోసం అమెరికాలో , తామంతా ఎదురు చూస్తున్నామంటూ అక్కడి విశేషాలు కూడా చెప్పసాగాడు.

**

ఓ సంక్లిష్టమైన కథని తెరకెక్కించడం మామూలు విషయం కాదు.  కుటుంబ సంరక్షణ బాధ్యతల్లో ఓ యువతి ఎదుర్కొన్న సమస్యలు, చేయవలసిన త్యాగాలు, ప్రేమించిన వాడిని సైతం వదులుకున్న వైనమే, సెల్వన్ సార్ రాసిన కథ ఇతి వృత్తం...

ఆకర్షణలకి లోబడకుండా విలువలని కాపాడుకుంటూ, కర్తవ్యాలని గుర్తుచేసుకుంటూ ఒక ఉత్తమురాలిగా నిలబడిన కళాకారిణి 'దేవకీ' కథని అద్భుతంగా మలుస్తున్నారాయన...

షూటింగ్ మొదలైంది.

'మౌన గీతం' అనే టైటిల్ ఖరారు చేసిన ఈ సినిమా షూట్ లో, నేను, అమ్మ కూడా పూర్తిగా నిమగ్నమయ్యాము.

పాటలు, దుస్తులు, నృత్యాలు ఆకట్టుకునేలా ఉన్నాయి.  మా శేషు మాస్టారు ఒక సంప్రదాయ నృత్యాన్ని కూర్చారు... నా చిన్నతనం డాన్స్ క్లాసుని గుర్తుచేసుకుంటూ, ఆయనతో డాన్స్ ప్రాక్టీసు – ఆ పాట షూటింగ్ సరదాగా గడిచాయి....

వంచకుడైన కన్నతండ్రి నుండి కుటుంబాన్ని కాపాడుకునే దేవకీ పాత్రలో, లీనమై నటించానని యూనిట్ అంతా మెచ్చుకున్నారు... దేవకీ పాత్ర పోషించడం, నాకు ఎన్నో విలువలని బోధించింది...

**

నా నిజ జీవితంలోని గడ్డు సమస్యని ఎలా ఎదుర్కోవాలో తెలీడం లేదు.  భూషణ్ అంకుల్ అభ్యర్ధనకి తల ఒగ్గి జగదీష్ జీవితం నుండి తప్పుకోవాలా?

అలా చేసి,  నా ఒక్కగానొక్క ప్రాణ స్నేహితుడుని,  ప్రాణంలా ప్రేమించే నా జగదీష్ ని వొదులుకోవాలా?

లేదంటే, నాకు, మా కుటుంబానికి జీవితానిచ్చి, నన్ను ఈ స్థాయికి చేర్చిన అంకుల్ ని వ్యక్తిగతంగా, మానసికంగా మరింతగా పతనమవ్వనివ్వాలా?

వారి కుటుంబ పరిస్థితి చక్కబడకపోయినా, సంబంధం లేనట్టే సాగిపోవాలా?

సమయం దొరికినప్పుడల్లా నా మనసుని తొలిచేస్తున్న ప్రశ్నలివే...

ఏమైనా,  'మౌన గీతం'  షూటింగ్  చూడాలన్న జగదీష్ రెండు రోజుల్లో చెన్నై వస్తున్నాడు.  అతని గుండెలపై ఒదిగి పోయి,  నా భయాలు, సందేహాలు చెప్పుకోవాలని ఆరాటంగా ఉంది..... జగదీష్ చెప్పే మాటలతో స్వాంతన పొందాలి.

జగదీష్ తో సమయం గడిపేందుకు ఓ రోజు శలవు అడిగితే, సెల్వన్ గారు 'ఓకే' చేసారు.,

**

జగదీష్ రాకతో నా మనసే కాదు, వాతావరణం కూడా ఆహ్లాదంగా మారింది..

పొద్దున్నే, జగదీష్ తో ఇంటి నుండి బయలుదేరాను. బ్రేక్ ఫాస్ట్ ఒక చోట, లంచ్ ఒక చోట చేసాము.  మధ్యలో హ్యాండ్లూం సారీ ఎగ్జిబిషన్ క్కూడా వెళ్ళాము.

నా చేయి పట్టుకుని మైళ్ళ దూరం నడిపించాడు జగదీష్.

చిన్న పిల్లల్లా కాసేపు 'జూ' లో కూడా తిరిగాము.

అక్కడక్కడ నన్ను జనం గుర్తుపడుతుంటే, నవ్వుతూ నన్ను కారు వరకు పరిగెస్తున్నాడు కూడా.

సన్నటి తుప్పర పడుతూనే ఉంది. మనసంతా హాయిగా ప్రశాంతంగా ఉంది. జగదీష్ నా చేయి పట్టినప్పటి నుండి గుండెల నిండా ధైర్యం నిండి పోయింది...

చీకటి పడుతుండగా నటేషన్ పార్క్ చేరాము.... దూరంగా అక్కడక్కడ మాత్రమే జనం తిరుగుతున్నారు...

క్రిందటి సారి మేము కూర్చున్న అదే గజేబో వద్దకు వెళ్ళి కొద్ది క్షణాలు మౌనంగా చుట్టూ పరికించి చూసాడు జగదీష్...

పోయిన సారి కంటే కూడా లాన్ వత్తుగా, నేల మీద పచ్చని తివాచీలా పరుచుకునుంది.

నా కాళ్ళకున్న సాండిల్స్ తీసేయడంతో, పాదాలకి చల్లగా, హాయిగా అనిపించింది ..

జగదీష్ కూడా షూజ్ విప్పేసి, గజేబో ఎదురుగా ఉన్న లాన్ మీద వెల్లకిలా పడుకున్నాడు...

"నువ్వూ ఇలా రా, కాసేపు ఆకాశం లోని తారల్ని లెక్క పెడదాం," అంటూ చేయి చాచాడు....

వెళ్ళి చాచి ఉన్న అతని చేతి పై, అతనికి దగ్గరగా ఒరిగాను.

తలెత్తి ఆకాశం వంక చూసాను. నక్షత్రాలు కుట్టిన నీలిరంగు చీరలా ఉంది. తారల్ని లెక్కెడుతూ, కాసేపు ఇద్దరం మౌనంగా ఉండిపోయాము.

జగదీష్  సెల్-ఫోన్ రింగయి ఆగిపోయింది.   కొద్ది క్షణాలకి మళ్ళీ కాల్ వచ్చింది...

ఆన్సర్ చేసాడు... “హలో,”  ఫోన్ స్పీకర్ మీద ఉంచాడు.  అవతలి నుండి రాణి...

“డిన్నర్ కి త్వరగా వస్తున్నావుగా,” అంది

“లేదు,  కాస్త లేటవుతుంది. బయటెక్కడో ఉన్నాను. ఇంటికి వెళ్లి ఫ్రెష్ అయి రావాలి కదా,” జవాబిచ్చాడు...

“రేపటి ప్లాన్ ఏంటి? బ్రేక్ ఫాస్ట్, లంచ్ మా ఇంట్లోనే...” ఆగింది...

“బ్రేక్ ఫాస్ట్ కి ఉంటాను... ఆ తరువాత, మీ డాడీ, మామయ్యా, నేను కలిసి చంద్ర షూటింగ్ చూడ్డానికి వెళతాము.  అది రేపటి నా ప్రోగ్రాం...

మళ్ళీ మాట్లాడుతా.  ఇక్కడ కాస్త బిజీగా ఉన్నాను,” అంటూ ఫోన్ పెట్టేసాడు జగదీష్...

అసహనంతో ఉడికిపోయింది మనసు.... జగదీష్ జీవితం నుండి, ఆసలెప్పటికైనా, తనని తను వేరు చేసుకుంటుందా రాణి?  అన్న ప్రశ్న మెదిలింది నాలో.

‘అయినా, త్వరలోనే జగదీష్ ని పెళ్లిచేసుకొని, రాణి అర్ధంలేని నడవడిని సునాయాసంగా కట్టడి చేయవచ్చు’  అన్న తలంపు కలిగింది..

.. వెంటనే, భూషణ్ అంకుల్ – ఆంటీల శ్రేయస్సు సంగతి ఏమిటన్న ప్రశ్నతో... తల వేడెక్కిపోయింది.

"చంద్రా, ఇలా మౌనంగా ఉన్నావే?" అంటూ జగదీష్ నా భుజం పై తట్టడంతో, ఆలోచనల నుండి బయటపడ్డాను...

"చెప్పు ఏమాలోచిస్తున్నావు?" అడిగాడు... "నీ మనసులో ఏమున్నా చెప్పు చాంద్," అన్నాడు...

ఇక నోరు మెదపకుండా ఉండడం నా వల్ల కాలేదు...

రాణి విషయంలో నాకున్న సంశయం, అంకుల్ విషయంలో ఉన్న ఆవేదన బయటపెట్టాను... అలజడితో నేనెంత అచేతనమవుతున్నానో ఏకరువు పెట్టాను...

నన్ను దగ్గరగా పొదివి పట్టుకుని, కళ్ళు తుడిచాడు జగదీష్.

కాసేపు మళ్ళీ మా మధ్య మౌనం....

నా వైపు వొరిగి, నుదిటిపై ముద్దు పెట్టాడు. లేచి కూర్చున్నాను. నా వెనుకే తనూ పైకి లేచి, నా చేయందుకున్నాడు.... "నాతో రా, అక్కడ కూర్చుని మాట్లాడుదాము," అంటూ గేజేబో దిశగా నడిచాడు...

బెంచి పై జగదీష్ కి దగ్గరిగా జరిగి, అతని భుజం పై తల ఉంచి, "చెప్పు," అన్నాను.

నా చేతులని తన గుప్పిట్లోకి తీసుకుని, "నీ చేతివేళ్ళ లాగానే, నీ మనస్సు కూడా అతి సున్నితం. ఇతరుల బాగోగుల పట్ల, వారి జీవితాల పట్ల నీవు కనబరిచే సానుభూతి నన్ను ఆశ్చర్యపరుస్తుంది. నీలోని ఈ నిస్స్వార్థతే నాకు నచ్చుతుంది. నీతో జీవితం పంచుకోగలగడం నిజంగా నా అదృష్టం చాంద్," అంటూ నా తలపై తట్టాడు.

"ఔనా?" నవ్వాను...

"అదట్లా ఉంచితే, మన విషయంలో, నీవన్నవి - అనుకుంటున్నవి కరక్టే.. నా ఆలోచన కూడా అదే... భూషణ్ అంకుల్ వాళ్ళ కుటుంబ పరిస్థితి మనకి ఓ గడ్డు సమస్యే అయింది... నీవిలా బాధపడతావనే నీ నుండి ఓ విషయం దాచాను. మీ అమ్మావాళ్ళ నుండి కూడా," అంటూ, రాణి పెళ్లిసంబంధం తీసుకొని, అంకుల్ వాళ్ళు ఢిల్లీవెళ్ళిన సంగతి చెప్పాడు....

అతని చెంపపై చేత్తో మృదువుగా తాకాను.

"నేనర్థం చేసుకోగలను. మా రెండు కుటుంబాల మధ్య సంబంధాలు చెడగూడదనే అనుకునుంటావు," అన్నాను...

"నీవు అర్థం చేసుకుంటావని నాకు తెలుసు," నా భుజాల చుట్టూ చేయివేస్తూ జగదీష్. "అంకుల్ మన విషయం తెలుసుకున్నప్పుడు, .. ఏమన్నారో తెలుసా?" అడిగాడు.

"ఏమన్నారేమిటి? నా గురించైతే మాత్రం మంచే చెబుతారాయన," అన్నాను నవ్వుతూ.

“కళారాధన తప్ప నీ మనసులో  ప్రేమ, పెళ్లి అలోచనలు  ఉంటాయని ఊహించలేక పోయారట.  మొత్తానికి నన్ను, అమ్మ వాళ్ళని కూడా అభినందిస్తూ, కొద్దికాలం రాణికి విషయం తెలియక పోవడమే అందరికీ శ్రేయస్కరం అని అంగీకరించారు,” అన్నాడు...

అమ్మవారి గుడిలో, అంకుల్ కి నాకు మధ్య జరిగిన సంభాషణ గుర్తొచ్చింది...

ఆ సంగతి  మాత్రం నా గుండెల్లోనే ఉండిపోవాలని నిశ్చయించుకున్నాను.....

ఇంతలో మళ్ళీ జగదీష్ సెల్ రింగయింది.  ఈ సారి కాల్, అమ్మ నుండి.

అంకుల్ వాళ్ళ డిన్నర్ కి కలిసే వెడదాము.. వచ్చేయండంటూ, ఫోన్ చేసింది....

“పద మరి,” పైకి లేచి చేయందించాడు జగదీష్....

**

ఇంటికి వెళ్లి, ఫ్రెష్ అయ్యి, డిన్నర్ కి కదిలేప్పటికి, కాస్త లేట్ అయింది.  అత్త, వినోద్ రాననడంతో, మేము నలుగురం మాత్రమే బయలుదేరాము.

ఇంటి గేటులో నుండి లోనికి వెళ్ళేప్పటికి,  సిటౌట్ లో కూర్చునున్న రాణి ఎదురొచ్చి, జగదీష్ చేయందుకుంది.

అతని పక్కన మేమంతా ఉన్నట్టు కూడా పట్టించుకోకుండా, "ఏమిటింత లేట్?

నేను స్టార్వింగ్," అంది గోముగా.

రాణి పట్టు నుండి తన చేయి విడిపించుకుని, "ముందు అంకుల్, ఆంటీని కలిసాక, ఆలస్యం  లేకుండా డిన్నర్ ఎంజాయ్ చేద్దాము,"  అంటూ హాల్లోకి దారి తీసాడు జగదీష్.

**

ఎప్పటిలా డైనింగ్ వద్ద కూడా, జగదీష్ పక్కన చేరి, మాటలు, వడ్డనలు సాగించింది రాణి.

కబుర్లు చెప్పుకుంటూ అందరూ భోం చేస్తున్నారు. నాకు మాత్రమే ముద్ద మింగుడు పడటంలేదు.

కాసేపటికి, అందరి సంభాషణ, నా సినిమా షూటింగ్ దిశగా సాగింది.

నా  పర్ఫార్మెన్స్  గురించి, సెల్వన్ సార్ చాలా ఇంప్రెస్  అయ్యారని చెబుతూ,  "చంద్రకళ  అమెరికాలో సెటిల్  అయి, అక్కడ కళారంగంలో కొనసాగుతుందని ఆయనతో అన్నావంటగా,  సత్యం," నాన్న వంక చూస్తూ అడిగారు అంకుల్...

"అవును మాటల్లో అన్నాను.  మా చంద్రకళ ప్రపంచ ఖ్యాతి గడించి, మేటి కళాకారిణి అవ్వాలన్న నా కోరిక...ఎప్పటిదో కదా!  నీ చేయూతతో, నా అంచనాలకి మించి,  ఈ దేశంలో ఆర్టిస్ట్ గా ఎదిగింది.  శంఖులో పోస్తేనే తీర్థం

అవుతుందన్నట్టు అంతర్జాతీయంగా కూడా, తను గుర్తింపు పొందాలని నా ఆకాంక్ష. అందుకు, తేజశ్విని గారిలా అమెరికాలో సెటిల్ అయినా, తప్పేముంది. అయినా, పిల్లలు మనకన్నా ప్రయోజకులయ్యారుగా! ఇక వారి నిర్ణయాలు వారిష్టం," నవ్వుతూ నాన్న.

నాన్న ఆలోచన సరయినదేనన్నారు అంకుల్....

"కాకపోతే, ఒకటి మాత్రం నిజం.... కళాకారుల సంగతేమో గాని, కుర్ర డాక్టర్ల కళ్ళు, కలలు మాత్రం అమెరికా వైపే ఉంటాయి. అవునా జగదీష్?" అడిగారు అంకుల్ జగదీష్ ని...

తినడం ఆపి నింపాదిగా అంకుల్ వంక చూసాడు జగదీష్...

"లేదు అంకుల్, నేను మాత్రం అందుకు భిన్నంగా, ఇక్కడే ఇండియాలోనే ఉండి మెడిసిన్ ప్రాక్టీస్ చెయ్యాలంటాను," అన్నాడు జవాబుగా..

అది విన్న భూషణ్ అంకుల్, గబుక్కున నా వంక చూసారు... 'జగదీష్ ఆశయాలు, మరి, మీ నాన్న ఆలోచనలకి భిన్నంగా ఉన్నాయే?" అన్నట్టుగా ఉన్నాయి ఆయన చూపులు...

నేను చూపు మరల్చుకున్నాను....

"ఏమైనా మన కళ చాలా అదృష్టవంతురాలు... చిన్నప్పటినుండి చూస్తున్నాగా! తను కోరుకున్నవన్నీ తన వద్దకి నడిచొస్తాయి. ఇష్టమైన వాటినే అనుసరిస్తూ జీవితాన్ని ఆస్వాదిస్తుంది చంద్రకళ," నవ్వుతూ అంకుల్...

“పోతే, ఇకపై, సామాజిక స్పృహతో తన వంతు సేవ, సహకారం, త్యాగం కూడా చేస్తూ ఓ మంచి జీవనాన్ని సాగించాలి మన కళ,” ముగించారు అంకుల్.

ఆయన ప్రతి మాటలో, నాకెన్నెన్నో అర్థాలు తోచాయి...

**

అక్కడి నుండి బయటపడి ఇల్లు చేరేప్పటికి పదకొండయ్యింది.

ఇంట్లోకి అడుగు పెట్టగానే, హాల్లో కోటమ్మత్త ఎదురయి, “చంద్రా, నీకు నాలుగైదు సార్లు అమెరికా నుండి ఫోన్ వచ్చింది. నిన్ను వెంటనే చేయమన్నారట తేజశ్విని గారు,” చెప్పింది.

“అవునక్కా, ఎంత లేటయినా నీతో తప్పక ఫోన్ చేయిస్తానని చెప్పాను ఆమెకి. అయినా, నీ సెల్-ఫోన్ నీ దగ్గరుండదే?” అప్పుడే హాల్లోకి వచ్చిన వినయ్ నాతో...

“సరేలేరా బాబు, సారీ.... నేను కాల్ చేస్తాలే...” అన్నాను అందరితో పాటు హాల్లో కూర్చుంటూ....

**

హాల్లో ఉన్న హౌజ్ - ఫోన్ నుండే తేజశ్విని గారికి కాల్ చేసాను..

ఆవిడ వెంటనే ఫోన్ ఆన్సర్ చేసారు...

నాకు మాట్లాడ్డానికి కూడా సందివ్వకుండా, ఆవిడ ఆనందంగా వెల్లడించిన  విషయాలు, నాకూ అంతే సంతోషాన్నిచ్చాయి.

అంతా విని, "మీకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు, మేడమ్.  మా పేరెంట్స్ తరఫున కూడా థాంక్యూ వెరీ మచ్," చెప్పి ఫోన్ పెట్టేసి, అందరి వంక చూసాను.

నన్నే తదేకంగా చూస్తున్నారు వారంతా.  ఓసారి గట్టిగా ఊపిరి తీసుకున్నాను.

"నాన్నా, అమ్మా,  మీ ఆశయాలు, నా కలలు పూర్తిగా నెరవేరినట్టే..  నాకోసం, తేజస్విని గారు పెట్టిన స్పాన్సర్షిప్ అప్లికేషన్, ఆక్సెప్ట్  చేసారంట, నాకు 'స్పెషల్ స్కిల్స్ కేటగిరీ' లో 'అమెరికా వీజా' వచ్చేసినట్టే.  ముందైతే, కనీసం ఏడాది పాటు అక్కడ ఉండవచ్చునట.  మనిష్టమట.  కావాలంటే, మూడేళ్ళ వరకు పొడిగించవచ్చట..  అంతేకాదు, టి.టి.డి దేవస్థానం వారి సహకారంతో మొత్తం పది ఫండ్-రైజింగ్  ప్రోగ్రాములు ఏర్పాటయ్యాయట కూడా,"  వివరించి, లేచి వెళ్లి అమ్మ, నాన్న, అత్త పాదాలంటి ఆశీర్వాదం తీసుకున్నాను..

"మరి మా ఇద్దరి కాళ్ళు మొక్కవా? నీవు ఇంత పైకి రావడానికి మా ప్రయత్నం మేము చేయలేదా?" అంటూ వినోద్ చేయందుకుని పక్కన కూర్చోబెట్టుకున్నాడు జగదీష్.

"ఆగండి పెడతాను," అంటూ వెళ్లి నాన్న రూములో నుండి అయన వాకింగ్ స్టిక్ తెచ్చాను....

అందరూ పెద్దగా నవ్వడం మొదలు పెట్టారు.

"ఏమైనా, హార్టీ కంగ్రాచ్యులేషన్స్, చాంద్.. వెరీ ప్రౌడ్ ఆఫ్ యు," వెళ్లి పక్కనే కూర్చున్న నా భుజం పై తట్టాడు, జగదీష్.

“ఇంక మేము గుర్తుండము, నీకు.... అసలయినా మమ్మల్ని వదిలి అలా వెళ్ళిపోతే మా సంగతి ఏమిటి? నీ నృత్యమే నీ ఫస్ట్ ప్రియారిటీనా?” ఉడుక్కున్నాడు..

జవాబిచ్చే ముందు క్షణం ఆలోచించాను.

“అంతేకదా! నేను అమితంగా నృత్యకళని ప్రేమిస్తాను కాబట్టి, ఆ కళామ్మతల్లినన్ను ఆదరిస్తూనే ఉంది. అలాగే మరి నిన్ను అమితంగా,,,, ప్రేమించే,,,,” ఇంకా అనబోయేలోగా జగదీష్ నా చెవి పట్టి ఆపేసాడు...

“అదేమీ కాదు జగదీష్ బాబు, నృత్యం దాని రక్తంలో ఉంది... దాని మనసులో మాత్రం నువ్వే ఉన్నావయ్యా,” అంది అమ్మ.

ఇదంతా వింటున్న కోటమ్మత్త నిశ్చితార్థం ఎప్పుడన్న ప్రస్తావన తెచ్చింది...

నేను, జగదీష్ ముఖాలు చూసుకున్నాము.

జగదీష్ మౌనంగా ఉండడాన్ని గమనించి, నాన్న కల్పించుకున్నారు.

“అదేముంది? మన చేతిలో పని... ఇప్పుడే కదా అమెరికా అవకాశం గురించి తెలిసింది. డాన్స్, వ్యక్తిగత జీవితం, రెండూ ముఖ్యమే. ఒకదానికొకటి ఎప్పుడూ అడ్డు కాకూడదు. కాబోదు. ఎలాగూ కాస్త సమయం ఉంది కాబట్టి, జగదీష్ తో మాట్లాడి, అమెరికా విషయం సహా, ప్లాన్ చెయ్యాలి. ఈలోగా భూషణ్ పరిస్థితి కూడా కుదుటపడుతుంది. అప్పుడు వాళ్ళని కూడా కలుపుకొని మరీ నిశ్చితార్థం వేడుకలు జరుపుకోవచ్చు. ఏమంటావ్ జగదీష్?” అడిగారు నాన్న...

“మీరనేది కరెక్టే మామయ్యా.. చంద్ర కెరియర్, నా చదువు చక్కగా సాగడంతో పాటు  భూషణ్ గారి విషయం కూడా ముఖ్యమే మనకి… కాబట్టి, అన్నీ ఆలోచించి చేద్దాము,” జవాబుగా జగదీష్.

అమ్మ కూడా ఔనంది.  “భూషణ్, నీరూ గార్లని, మన జీవితాల నుండి అసలెలా వేరు చేయగలం?  ఏదైనాగాని, సరయిన సమయం సందర్భం చూసి, ముందుకు సాగాలి మరి,” వివరించింది అమ్మ.




నా అమెరికా ప్రయాణంకి, మూడునెలల వ్యవధి ఉంది.

నా కోసం  ‘నట్టువాంగం’ శిక్షణ  ఏర్పాటు చేసింది అమ్మ.  జతులు చెప్పడం నాకు కష్టం కాదు.  అయినా, అమరేశ్వర్ మాస్టారి అజమాయిషీలో, తాళం తప్పకుండా జతులు చెప్పడంతో,  మరింత కాన్ఫిడెన్స్ వచ్చింది.....

అమెరికా వెళ్ళాక, నృత్యంలో శిక్షణ ఇవ్వడానికి నాకు కావలసిన మ్యూజిక్ సమకూర్చే పనిలో ఉంది అమ్మ. ఆ రికార్డింగ్...కూడా ఇంకా చేయ వలసి ఉంది.

మరో పక్క, విడుదలకి సిద్దమవుతున్న మా 'మౌనగీతం' మూవి ప్రొమోషన్ తో, కూడా బిజి అయిపోయాను.

ఎంత బిజీగా ఉన్నా - జగదీష్ తో నా అనుబంధం, జరగవలసిన మా నిశ్చితార్ధం, నా ప్రేమని త్యాగం చేయమంటూ భూషణ్ అంకుల్ చేసిన అభ్యర్ధన నా ఆలోచనల్లో నిత్యం మెదులుతూనే ఉంటాయి....

**

రాణి విషయంగా, మీడియాలో గొడవ జరిగాక, నలుగురిలోకి రావడమే మానేసిన భూషణ్ అంకుల్, ఇప్పుడిప్పుడే ఓ కొత్త ఉత్సాహంతో వ్యవహరిస్తున్నారు.

నా అమెరికా పర్యటన సందర్భంగా, టూర్ వివరాలు అనౌన్స్ చేయడానికి, ప్రెస్-మీట్ ఏర్పాటు చేసారు.

'చంద్రకళ అభినందన సభ' అన్న అందమైన ఆహ్వానాలు పంచారు... మీడియా కవరేజ్ భారీగా ఉండేలా సిటీ అంతా ఆహ్వానాలు వెళ్ళాయి...

**

ప్రెస్-మీట్ చాలా హంగామాగా మొదలయింది....

మేళ-తాళాలతో, ప్రత్యేకంగా ఏర్పాటయిన 'వేదిక' పై వరకు, ఎర్రని తివాచిపై, నన్ను నడిపించారు... వేద పఠనం నడుమ, సత్కరించి, ఆశీర్వదించారు. అభినందనలు తెలియజేసారు...

అంకుల్ ని అంత ఉత్సాహంగా, చూడ్డం నాకెంతో ఆనందాన్ని కలిగించింది.  ఆయన అలాగే కొనసాగాలని మనసులోనే దేవుణ్ణి ప్రార్థించాను.

నా గురించి నాలుగే నాలుగు వాఖ్యాలు మాట్లాడుతానంటూ, మైక్ ముందుకు వచ్చారు అంకుల్.

క్షణం సేపు నా వంక తదేకంగా చూసి మాట్లాడ్డం మొదలు పెట్టారు...

"చిరంజీవి చంద్రకళని అభినందించి సత్కరించుకోగలగడం మన అదృష్టం.  నిజం చెప్పాలంటే, కళా రంగంలో నేను సాధించిన విజయాల్లో- నాకు మంచి అనుభూతినిచ్చి, నాకెంతో గర్వకారణమైనది,  కళాకారిణిగా చంద్రకళ ఎదుగుదలే.

చంద్రకళ మా పట్ల సొంత బిడ్డలా మెలుగుతూ ఆప్యాయతలు పంచుతుంది కూడా.  ఆమె ఇలాగే  సంతోషాలు పంచుతూ , కళా రంగాన అనుకున్నది సాధిస్తూ సుఖంగా ఉండాలని కోరుకుంటాను," అంటూ ముగించారు అంకుల్...

లేచి, అయన పాదాలంటి నమస్కరించాను.

ప్రత్యేక వక్తగా – తమ్ముడు వినోద్, నా గురించి మాట్లాడుతూ, మధ్య మధ్యలో నా పై ఫిర్యాదులు చేస్తూ అందరిని నవ్విస్తూ చక్కగా ప్రసంగించాడు.

నీరూ ఆంటీ చేయూతతో, కార్యక్రమాన్ని స్వయంగా నిర్వహించారు, భూషణ్ అంకుల్.

అల్పాహార విందుతో, మీట్ ముగిసింది...

**

అమెరికా ప్రయాణం మూడు రోజులుందనగా, అంకుల్ వాళ్ళతో కాస్తసమయం గడపాలనిపించింది. స్టూడియోలో పనయ్యాక, వచ్చి కలుస్తానని వారికి తెలియజేసాను...

నా రాక, నా మాట అంకుల్ కి ఊరటనిస్తాయన్న నీరూ ఆంటీ మాటలు గుర్తుచేసుకుంటూ, స్టూడియో నుండి, వాళ్ళింటి వైపు కారు మళ్ళించాను...

రద్దీగా ఉన్న రోడ్డుపై నెమ్మదిగా కదులుతున్న ట్రాఫిక్ తో పాటే నేను.....

రేడియో వాల్యూం తగ్గించి, కారు అద్దాలు క్రిందికి దించాను...

వారం క్రితం, రాం మామయ్యా, మణత్తయ్య వచ్చి వెళ్ళడాన్ని గుర్తుచేసుకొన్నాను. పని వత్తిడి వల్ల వాళ్ళతో నేను ఎక్కువ సమయం గడపలేక పోవడం బాధగా అనిపించింది.... ఉన్న రెండు రోజులూ, వారు, నా పట్లఎంతో ప్రేమగా, ఆప్యాయంగా మెలగడం ... చాలా ఆనందాన్నిచ్చింది.

ఎలాగైనా, మరీ ఆలశ్యం కాకుండా, మా వివాహం జరిపించాలని కూడా అమ్మ వాళ్ళతో ప్రస్తావించారు వాళ్ళు.

నాకు సెండాఫ్ ఇవ్వడానికి జగదీష్ వచ్చినప్పుడు కూడా, పెళ్లి విషయం చర్చించమని మరీ మరీ చెప్పి వెళ్ళారు అత్తయ్యా వాళ్ళు.

ఇలా ఆలోచిస్తూనే, అంకుల్ వాళ్ళ ఇంటి వరకు వచ్చేసాను...

బయటే పార్క్ చేసున్న రాణి కారు వెనుకే, నా కారు పార్క్ చేసాను.

అప్పుడప్పుడు  తారస పడినా, రాణి మునుపటి కన్నా కూడా నాతో ముభావంగా ఉంటుంది' అనుకుంటూ కారు దిగి, గేటులో నుండి, ఇంట్లోకి నడిచాను..

ఆంటీ,అంకుల్  ఇద్దరూ సిటింగులోనే ఉన్నారు... వెళ్లిఎదురుగా కూర్చున్నాను.

తలొంచుకుని పేపర్స్ రాసుకుంటున్న అంకుల్ తలెత్తిచూసారు.

"రామ్మా కళా, నీ పని మీదే ఉన్నాను.  అమెరికాకి వెళ్ళిన ఆరు నెల్లకి, మళ్ళీ నువ్వు ఇండియాలో అవార్డ్ అందుకోడానికి వచ్చేయాలి," అన్నారు చేతిలోని పేపర్స్ పక్కకి పెడుతూ.  అర్థం కాలేదన్నాను... "ఇంకా అమెరికా వెళ్ళనే లేదు.  అప్పుడే తిరిగి రావడం గురించి మాట్లాడుతున్నారే..

మీరేమంటున్నారో  అర్థమయ్యేలా చెప్పండి," నవ్వుతూ ఆంటీ ...

"నిజమే కదా!" పెద్దగా నవ్వారు అంకుల్...

"కళకళలాడుతూ వచ్చి, కిలకిలా నవ్వుతూ మనతో కబుర్లాడి, మన గుబుళ్ళుదూరం చేసే చంద్రకళ, దూర దేశం వెళ్ళిపోతుంది అంటే దిగాలుగా ఉంది కదా! అందుకే, అప్పుడే అమ్మాయి తిరిగి రావడం గురించి ఆలోచిస్తున్నాను," అన్నారాయన, తలెత్తినా వంక సూటిగా చూస్తూ.

"మీ ఆలోచన బాగుంది... దానికి మీ ప్లాన్  కూడా చెప్పండి,"  అంది ఆంటీ.

"చెప్పండి అంకుల్, వెళ్ళక ముందే, మళ్ళీ వచ్చేసే టైం ఎలా ఫిక్స్ చేస్తున్నారు?" నవ్వుతూ అడిగాను, పని పిల్ల తెచ్చిన 'టీ' అందుకుంటూ......

"ఏం లేదమ్మా,  'మౌన గీతం' సినిమాలో నీ పర్ఫార్మెన్స్ కి, కనీసం ఫిల్మ్ ఫేర్ వారి 'క్రిటిక్స్ అవార్డ్' వస్తుందని, నా

అభిప్రాయం.  ఆ సబ్జెక్ట్ అటువంటిది.

పోతే, గ్యారంటీగా మాత్రం, ప్రభుత్వం వారి  ప్రతిష్టాత్మక 'హంసిని' అవార్డు నిన్నే వరిస్తుంది.  దానికి, నేను నామినేషన్ పంపుతున్నాను...  కళారంగంలో నీ కృషికి, ఆ అవార్డు అందడంలో, ఇప్పటికే ఆలస్యం అయింది..  ఈ అవార్డులు ప్రకటించడానికి  ఆరునెల్లటైం ఉంది.  అదీ సంగతి,"  వివరించారాయన.

ఆయన ఇంకా నా ఎదుగుదల గురించి ఆలోచిస్తున్నందుకు ఆశ్చర్యమనిపించింది.

"ఇంకా కూడా మీరు నా గురించి ఇలా ఆలోచిస్తూనే ఉన్నారు,"  అన్నాను కృతజ్ఞతతో....

"భలే పిల్లవే, అది నా డ్యూటి.  నీ అభివృద్ధి నా ఆశయం కదా తల్లీ... అంతేకాక, మా శ్రేయస్సు  కూడా నీ చేతుల్లోఉంచి, నీకు అదనపు భారమయ్యాము కూడా," అంటూ వాపోయారాయన...

"అలా అనకండి అంకుల్.  మీరు సంతోషంగా ఉండడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను.  అన్ని విషయాలు సర్దుకుంటాయి..మీరే చూస్తారుగా," నమ్మకంగా పలికాను.

గుండెల మీద చేయుంచుకొని, తలాడించారు అంకుల్..  "పదమ్మా కాస్తఏమన్నా తిందాము... నాకు ఆకలిగా ఉంది. ఆంటీ నీకిష్టమైన టిఫిన్లు చేయించింది," అంటూ పైకి లేచారు.

డైనింగ్ లోకి వారిని అనుసరించాను....

నాకిష్టమని, అటుకుల ఉప్మా, దహీవడ చేయించుంచింది, ఆంటీ...

ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకుంటూ,  టిఫిన్లు ఎంజాయ్ చేసాము.

మరి కాసేపు కూర్చుని, మళ్ళీ అమెరికా నుండి తిరిగొచ్చాకే వారింట భోంచేస్తానంటూ, వారి వద్ద సెలవు తీసుకున్నాను..

**

ఢిల్లీనుండి వస్తున్న జగదీష్ ని పికప్ చేసుకోడానికి నాన్న ఎయిర్ పోర్ట్ కి వెళ్ళారు.

నేను ప్యాకింగ్ చేసుకుంటుంటే, నా బెడ్ మీద కూర్చుని... బట్టలు మడతలు వేయసాగింది అమ్మ.

ఓ పక్క నా భవిష్యత్తు గురించి సంతోషంగా ఉన్నా, మరో పక్క ఒకింత దిగులుగా కూడా ఉందామె...

కోటమ్మత్త కూడా అదే తంతు. వినోద్ మాత్రమే హ్యాపీగా ఉన్నాడు... తన మీద కన్నేసి ఉంచే అక్క డిటెక్టివ్, ఏకంగా ఇండియా నుండే వెళ్ళిపోతుందనట.......

ప్యాకింగ్ ఫినిష్ చేసాక, నా టి.వి ప్రొడ్యూసర్స్ కి, గురువు గారికి, సెల్వన్ సార్ కి ఫోన్లు చేసి, వీడ్కోలు చెప్పాను.

ఫోను పెట్టేసి వెనక్కి తిరిగేప్పటికి, ఎదురుగా జగదీష్, వెనుకే నాన్న.....

**

రెండు రోజుల పాటు జగదీష్ కబుర్లతో సందడిగా గడిచింది....

తను కొత్తగా నేర్చుకున్న కర్రీస్ కూడా చేసాడు... అంతా మెచ్చుకుంటూ తిన్నారు కూడా...

నాకిష్టమని, పాయసం చేయడం నేర్చుకున్నానన్నాడు....

తన కాబోయే అల్లుడు ఇంత బాగా వంట చేయడాన్ని మెచ్చుకుంది అమ్మ.

ఇక మరునాడు నా ప్రయాణమనగా, సాయంత్రమయ్యాక, అమ్మవారి గుడికి వెళ్ళొచ్చి, భోంచేసాము.

అందరం మాట్లాడుతూ హాల్లో కూర్చునుండగా, అంకుల్, ఆంటీతో పాటు రాణి కూడా వచ్చింది..

ఎన్నడూ లేనిది, చాలా సంతోషంగా నా వద్దకు వచ్చి నా చేయందుకుంది రాణి....

"హార్టీ కాంగ్రాచ్యులేషన్స్. ఈ అమెరికా అసైన్మెంట్ ఒప్పుకుని నీ కెరియర్ ని మరో లెవెల్ కి తీసుకెళుతున్నావు...బెస్ట్ విషస్," నా పక్కనే కూర్చుంటూ రాణి....

అమ్మ వంక చూసాను... నాకు కలిగిన ఆశ్చర్యాన్ని బయటకి తెలియనీయకుండా రాణికి 'ధన్యవాదాలు' చెప్పాను.

మునుపెన్నడూ లేని ఆప్యాయత చూపిస్తూ కబుర్లు చెప్పసాగింది...

కాసేపటికి, పైకి లేచి నా చేయందుకుంది...

"పద, వచ్చే ముందు అందరికీ ఐస్ క్రీం ఆర్డర్ చేసాను. వెళ్ళి పికప్ చేద్దాము...

నీకు స్పెషల్ గా 'మాంగో కసాట' కూడా చెప్పాను.... మళ్ళీ ఎప్పుడు తినగలవో... మా పార్లర్ లోని 'మాంగో కసాట',"

నన్ను బయటకి నడిపిస్తూ రాణి..

“మేము వెళ్లి పికప్ చేస్తాముగా!” ఆఫర్ చేసాడు జగదీష్

“నో, నో, దగ్గరేగా, పది నిముషాల్లో వచ్చేస్తాము.  ఇది మా ‘గర్ల్స్ టైం’,” నా చేయి విడువకుండానే ముందుకి కదిలింది రాణి…

“నేను కూడా వద్దా?  .. అయితే, నాకు మాత్రం ఎక్స్ ట్రా ఆర్డర్ ‘బనానా స్ప్లిట్’ తీసుకురండి,” వెనుక నుండి వినోద్… మాకు వినబడేలా…

**

మామూలుగా వెళ్ళే దారిన కాకుండా, కారుని హైవే దిశగా తిప్పింది…

“విషయం ఏమిటి? రాణి… నాతో ఏమన్నా మాట్లాడాలా? “ అడిగాను…

“ఔను, నీతో మాట్లాడే అవకాశం ఇదేనని అనిపించి, అమ్మా వాళ్ళని మీ ఇంటికి బయలుదేరదీసిందే నేను.  లేదంటే,  నీ ఫ్లైట్ రేపు సాయంత్రం కనుక, పొద్దున్నే వద్దామనుకున్నారు వాళ్ళు.  రేపు నేను బిజీ.  అందుకే ఇలా,” అంది జవాబుగా…..

“సరే, విషయం చెప్పు,” కాస్త అసహనంగానే నేను…

“చూడు కళా, నీవంటే, జగదీష్ కి చాలా ప్రేమని నాకు తెలుసు.. అలాగే, నీవంటే మా నాన్నకి కూడా ప్రేమే.. ఇప్పటివరకు, వారిద్దరు నీకు చేయని సాయం లేదు…నీ సంతోషం కోసం వారు పడని పాట్లు లేవు.

ఇక ఇప్పుడు, వారి సుఖ సంతోషాల గురించి, నీవు, ఆలోచించవలసిన సమయం వచ్చింది…

మా నాన్నా వాళ్ళ సుఖసంతోషాలంటావా! అవి కేవలం నా బాగోగుల మీద ఆధారపడి ఉంటాయి. నేను సుఖంగా, సంతోషంగా ఉంటేనే, వారు బాగుండేది…

ఇకపోతే, మన జగదీష్ విషయం….

అతనికి, ఈ ప్రపంచంలో ఉన్న అన్ని సుఖ సంతోషాల్ని అందించ గల ఏకైక వ్యక్తిని నేను.. అతని అదృష్టమేమో గాని, పేరు, పరపతి, హోదా అందం అన్నీ ఉన్న నేను, తన్ని పిచ్చిగా ప్రేమిస్తున్నాను.

ఇదంతా కాక, ఈ క్షణాన మా మెడికల్ ఇన్స్టిట్యూట్ కి అతన్ని అధిపతిని చేయగలను…," క్షణం సేపు పక్కకి తిరిగి నా వంక చూసి, తిరిగి డ్రైవింగ్ మీద దృష్టి పెట్టింది.

రాణి గుణం, అతిశయం తెలియంది కాదు. అయినా, ఆమె మాటలు నాకు తూటాల్లా తగిలాయి…ఇంకా ఏం వినాలో, ఏమనాలో తెలిడంలేదు.

ఇంతలో, మళ్ళీ నోరు విప్పింది రాణి…

"…మా అమ్మా వాళ్ళ పట్లకాని, జగదీష్ పట్లగాని నీకు నిజంగా ప్రేమ, దయ ఉంటే, జగదీష్ ని వదులుకో. జగదీష్ నా వాడైతే, అతనే కాదు, నీ భూషణ్ అంకుల్, ఆంటీ కూడా సుఖంగా ఉంటారు…. అదీకాక, ఇప్పటికైనా వాళ్ళకి నీనుండి విముక్తి కల్పించు.. అదే అందరికీ మంచిది," దురుసుగా రాణి….

కొద్ది క్షణాలు మౌనంగానే ఉన్నాను… ఎక్కువసేపు తమాయించుకోలేక పోయాను…

“చూడు రాణి… నీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నావు. ఇతరుల ఇష్టాయిష్టాలు, సుఖ సంతోషాలు నీ గుప్పిట్లో ఉన్నాయనుకోడం, ఇతరుల జీవితాలని శాసించాలనుకోవడం సరయనవి కావు… నీ దృక్పథంలో మార్పు రావాలని కోరుకుంటాను…

నా విషయంగా అంటావా? ఔను మా బావ, మీ నాన్న కూడా నాకు ఎంతో కావలసిన వాళ్ళు..

వీరితో నాకున్నవి సత్సంబంధాలు. గౌరవం – ఆప్యాయత – అవగాహనలతో కూడుకున్నవి. ఇకపోతే నా జీవితం ఎలా నడవాల్సి ఉందో, అలాగే జరుగుతుంది,” అన్నాను ధృడంగా.

“ఇక చాలు కళా. నీ ఉపన్యాసాలు వినే ఓపిక లేదు నాకు. వొళ్ళు మండుతుంది నీ మాటలు వింటుంటే… నేనేమంటున్నానో నీకు తెలుసు. నాకేం కావాలో కూడా నీకు తెలుసు.

అదీగాక, ఇప్పుడు నీకైనా ఏం తక్కువని. గారెల బుట్టలో నుండి తంతే, బూరెల బుట్టలో పడ్డట్టు, అమెరికాకి వెళ్ళే చాన్స్ సంపాదించేసావు కదా,” అక్కసుగా రాణి….

“కాబట్టి, అక్కడే ఎవరినన్నా పెళ్లిచేసుకొని, సెటిల్ అయిపో… ,” పార్లర్ ఎదురుగా సడన్ బ్రేకుతో కారుని పార్క్ చేసి, దిగి విసురుగా పార్లర్ లోనికి వెళ్ళింది.

**

పార్లర్ నుండి ఇంటికెళ్ళేప్పుడు, ఇద్దరం మౌనంగా ఉండిపోయాము. షార్ట్-కట్ లో, ఐదు నిముషాల్లో ఇల్లు చేరాము.

అందరికీ తను తెచ్చిన ఐస్క్రీం కప్స్ అందించి, ఈ సారి జగదీష్ పక్కన కూర్చుంది రాణి…

అందరూ సరదాగా మాట్లాడుతూ, ఐస్ క్రీం తింటున్నారు. నాకెంతో ఇష్టమైన ‘మాంగో కసాటా’ మాత్రం చేదుగా


అనిపించి, గొంతు దిగడం లేదు.  మరునాడు నా సెండాఫ్ కి, తప్పక రమ్మంటూ, మా ఎదుటే, జగదీష్ రాణిని వొత్తిడి చేయడం, నాకు ఎబ్బెట్టుగా అనిపించింది.

మరి కాసేపటికి, వీడ్కోలు చెప్పి వాళ్ళు వెళ్ళాక, “ఆ అమ్మాయి ప్రవర్తన, ఏ నిముషంలో ఎలా ఉంటుందో చెప్పలేము, అలాంటి ఆమెని ఎయిర్ పోర్ట్ కి రమ్మని ఎందుకు బాబూ బలవంతపెట్టావు?” జగదీష్ ని అడిగింది కోటమ్మత్త.

“ఆ అమ్మాయి తన ప్రవర్తన మార్చుకుంటుందని, పిన్ని.

మొండితనం, అసూయ, ఆవేశం తగ్గించుకుంటుందని ఓ ప్రయత్నం,” అన్నాడు జవాబుగా.....

రాణి ప్రవర్తన మెరుగు పరచడం, జగదీష్, తన బాధ్యతగా అనుకుంటున్నాడని అర్ధమయింది.




మూడేళ్ళ తరువాత......

డాన్స్ క్లాస్ ముగిసే సమయానికి, నా అసిస్టెంట్ రాగిణి, మెసేజ్ నోట్ అందించి వెళ్ళింది....

స్టూడెంట్స్ చేత నమస్కారం చేయించి, మరునాటి డాన్స్ ప్రోగ్రాం విషయంగా కొన్ని సూచనలిచ్చి పంపేసాను.

మెసేజ్ నోట్ పంపిన వారు, సుసర్లశర్మ గారు... అమెరికాలోని, హ్యూస్టన్-గాల్వెస్టన్ ఇండియన్ కమ్యూనిటీలో మంచి పేరున్న వ్యక్తి పెద్దాయన.

ఆయన సహాయ సహకారాలతోనే, గాల్వెస్టన్ లో, డాన్స్ స్కూల్ బ్రాంచ్ స్థాపించగలిగారు, తేజశ్విని గారు. నా అజమాయిషీలోనే, వందకి పైగా స్టూడెంట్స్ డాన్స్ నేర్చుకుంటున్నారు..

అలసటగా ఉన్నా, వారిని కలవడానికి, స్టూడియో వెయిటింగ్ రూమ్ లోకి వెళ్లాను..

నన్ను చూస్తూనే, లేచి గ్రీట్ చేసారాయన. వెంట ఆయన భార్య కుమారి కూడా ఉన్నారు.. ఇద్దరూ శివ పార్వతుల్లా ఉంటారంటుంది అమ్మ. ఈ మధ్య హ్యూస్టన్ వచ్చినప్పుడు, అమ్మా వాళ్ళకి, వీరితో మంచి స్నేహం కుదిరింది.

"నమస్తే ఎలా ఉన్నారు?" వెళ్లిఎదురుగా కూర్చున్నాను.

"ఏం లేదమ్మా. మా కిచెన్ గార్డెన్ నుండి ఈ కూరగాయలు నీకిచ్చి వెళదామని ఇటుగా వచ్చాం. దొండకాయ, కాకరగాయ నీకు ఇష్టమని చెప్పింది మీ మమ్మీ," అంది ఆంటీ...

"థ్యాంక్స్ ఆంటీ, అమ్మంటే వెంటనే వండేస్తుంది కూడా," టేబిల్ మీద ఉంచిన ప్లాస్టిక్ బాగ్స్ ని చూస్తూ నేను...

"ఔనూ, అమ్మా వాళ్ళు వెళ్లికూడా వారం రోజులయిందిగా? మేమంతా వాళ్ళని తలుచుకుంటున్నామని చెప్పు.

వాళ్ళున్నన్నాళ్ళు సరదాగా ఉండేది. పిల్లల్ని, డాన్స్ క్లాసులో దింపి, అమ్మతో, సి-వాల్ పొడుగునా వాకింగ్ చేసి, బీచ్ కి వెళ్లి కూర్చుని కబుర్లు చెప్పుకునేవాళ్ళం. మొత్తానికి మూడు నెలల పాటు, శనాదివారాలు మంచి కాలక్షేపంగా ఉండేది వాళ్ళతో," మళ్ళీ కుమారి గారు…

"ఔనండి…వాళ్ళు కూడా మీ కంపెనీ ఎంజాయ్ చేసారు… ఇక్కడ పరిచయమైన వారందరి గురించి తలుస్తూ ఉంటారు," అన్నాను…

శర్మ గారు కల్పించుకున్నారు… "చూడమ్మా చంద్రకళ………నిన్నో సంగతి అడగాలని కూడా ఇలా వచ్చాము," అన్నారాయన…

'చెప్పండి' అన్నట్టుగా ఆయన వంక చూసాను..

"మీ పేరెంట్స్ వెళ్ళే ముందు, మన డాన్స్ స్కూల్ వార్షికోత్సవం అయింది కదా. అక్కడ కలిసినప్పుడు, మాటల్లో మీ నాన్నగారు ఓ సంగతి చెప్పారు," క్షణమాగి, ఓ సారి తదేకంగా నా వంక చూసారు….

"అదేనమ్మా, త్వరలో నీవు తిరిగి ఇండియాకి వెళ్ళిపోతావన్నట్టు సూచించారాయన. అదే నిజమైతే, మరి మా పిల్లల క్లాస్ ఎలా జరుగుతుంది?

నీ శిక్షణలో వారికి డాన్స్ తో పాటు, మన సాంప్రదాయం కూడా వంటబడుతుంది. అలాంటిది, ఉన్నట్టుండి నీవు వెళ్ళిపోతావేమోనని మాకు కాస్త దిగులు గానే ఉంది," ఆగారాయన….

నేను జవాబు చెప్పేలోగా, కుమారి గారు అందుకున్నారు… "చూడు తల్లీ, నీకు మంచి వరుణ్ణి చూసి, పెళ్లి చేసి, ఇక్కడే ఉంచేయాలని మా ఆలోచన.

త్వరలోనే నీ వివాహం జరిపించాలని మీ అమ్మ కూడా చాలా సార్లు మాతో అన్నారు. వరాన్వేషణ మొదలు పెట్టడానికి మేము సిద్ధం….మరి నువ్వేమంటావ్?" అడిగారామె…

వారిద్దరి మాటలు విని, నవ్వేసాను.

"చూడండి, శర్మ గారు.. వారి మొదటి విజిట్ నుండే, నన్ను తిరిగి వచ్చేయమంటున్నారు, మా అమ్మావాళ్ళు. మా నాన్న గారైతే,

పట్టు బడుతున్నారు కూడా.

మరి నేను వచ్చి అప్పుడే మూడున్నరేళ్ళు గడిచాయి కదా!" ....క్షణమాగాను...

"నిజానికి, నాకూ ఇండియాకి వెళ్ళాలనుంది...కాకపోతే, ఎప్పుడనేది, ప్లాన్ లేదు... నేను వెళ్ళేదుంటే మాత్రం, తేజశ్విని మేడమ్ తప్పకుండా ఆల్టర్ నేటివ్ ఆలోచిస్తారు... కాబట్టి, మీరు బెంగ పెట్టుకోకండి.. మీ అభిమానానికి కృతజ్ఞతలు," అంటూ వారి నుండి సెలవు తీసుకున్నాను.

**

కార్ డ్రైవ్ చేస్తూ, శర్మ గారితో నా సంభాషణ గుర్తుచేసుకున్నాను. అమెరికాలో నేనడుగిడి అప్పుడే మూడున్నరేళ్ళు అవుతుందని కూడా గుర్తుచేసుకున్నాను...

తేజశ్విని గారి ఆధ్వర్యంలో మెలుగుతూ, కళా రంగంలో ఎంతో చూసాను, ఎంతో చేసాను. ఎన్నెనో అనుభవాలు... ఒక్కోప్పుడు ఉత్సాహంగా ఉంటుంది...

మరోప్పుడు దిగులుగా, అసహనంగా ఉంటుంది.

తెజేశ్విని గారు మాత్రం, నా రాక తమ ఆర్ట్స్ ఇన్స్టిట్యూట్ కి ఓ కొత్తవొరవడి తెచ్చిందంటారు. ఆ ఉత్సాహంతో, ఇతర ప్రాంతాల్లోతమ డాన్స్ స్కూలు బ్రాంచిలు స్థాపించారు కూడా.

అమెరికాలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే పద్ధతి కొంచెం కొత్తగా అనిపిస్తుంది...... నాట్యాభ్యాసన ఇక్కడ వారికి ఓ కాలక్షేపమే అనిపిస్తుంది..

ఏమైనా, ఇక్కడి కళారంగ వాతావరణం  నాకు  అంతగా రుచించలేదు......

అసంతృప్తిగా ఉంటుంది....

ఈ మూడున్నరేళ్ళల్లో అమ్మ ఓ మారు, నాన్న ఓ మారు, ఇద్దరూ కలిసి మరోసారి నా వద్దకు వచ్చి వెళ్ళారు.

నేను చేస్తున్న కృషి, నాకందుతున్న గుర్తింపు చూసారు... ఇక్కడి కళా రంగ వాతావరణం వారికి కూడా అంతగా రుచించలేదన్నారు.అదీ గాక, త్వరలోనే నా పెళ్లి జరిపించాలని, అమ్మ ఆరాట పడుతుంది.

దాంతో, మొన్నటి సారి వచ్చినప్పుడు, నన్నిక తిరిగి చెన్నై వచ్చేయమని వొత్తిడి చేయసాగారు నాన్న.

ఆ విషయంగా,  ఆయనకి, ఇక్కడ నా పరిస్థితి వివరించాలని, ఓ మారు గట్టి ప్రయత్నమే చేసాను.

జీతం పెంచడమే కాక,  తేజశ్విని గారు, నా కోసం టౌన్–హోమ్  తీసుకుని, కారు కూడా కొన్నారని నాన్నకి గుర్తుచేసాను. మరో ఏడాది వరకు ఏర్పాటయిన క్లాసులు, శిష్యుల 'రంగ ప్రవేశ కార్యక్రమాలు అకస్మాత్తుగా మధ్యలో వదిలి రాలేనని నాన్నకి అర్ధమయ్యేలా చెప్పడం ఒక అవస్తే అయింది.

అదంతా వింటున్న అమ్మ, కూడా కలగ జేసుకుంది....

"చూడమ్మా చంద్రా మన జగదీష్ చదువయి, జాబులో చేరబోతున్నాడు.

నేనిక్కడికి వచ్చి మూడేళ్ళయింది.  ఇంటికి తిరిగి రావాల్సిన సమయమే కదా, పెళ్లిచేసుకోడానికిక్కూడా సరయిన సమయం.

కాబట్టి, మీరిద్దరూ కూడా,  భూషణ్ గారి విషయం అంటూ, ఇక సమయం వృధా చేయడం సరికాదు.  పెళ్లి జరిగిపోవాలి...తేజశ్విని గారితో మాట్లాడి ఇక్కడ ఈ పనులు కానిచ్చి వచ్చేయమ్మా చంద్రా" అంటూ తన అభిప్రాయం తెలిపింది. ....

జగదీష్ తో ప్రతిరోజూ మాట్లాడుతూనే ఉంటాను.

హౌజ్-సర్జెన్సీ కూడా కంప్లీట్ అవబోతుందని,  నన్నిక ఇండియాకి తిరిగి వచ్చేయమని చెబుతున్నాడు.  రాణి అప్పుడప్పుడు ఢిల్లీవచ్చి మణత్తయ్య తో గడిపి వెళుతుందని  కూడా చెబుతుంటాడు.

'పోనీ రాణిలోనే సెటిల్ అయిపోరాదా? నా జీవితాన్ని కళాసేవలో గడిపేస్తాను'

అని ఓసారి గమ్మత్తుగానే  జగదీష్ తో అన్నప్పుడు, నవ్వేసాడు.

అలాగైతే, తను కూడా తన జీవితాన్ని, బీదవారికి వైద్య సేవలందిస్తూ, అందరికీ  దూరంగా అటవీ ప్రాంతాల్లోని మెడికల్ క్యాంప్స్ కి పని చేస్తానన్నాడు.

ఆ సంభాషణ గుర్తొచ్చినప్పుడల్లానవ్వొస్తుంది..

ఇదంతా పక్కన పెట్టినా, అంకుల్  కుటుంబ పరిస్థితిలో కాని, రాణి పద్ధతిలో కాని ఎటువంటి మార్పు లేకపోవడంతో, జగదీష్ తో నా  జీవితం మీమాంస గానే ఉండి పోతుందేమో  అని అశాంతిగా ఉంటుంది.

**

గరాజిలో కారు పార్క్ చేసి, ఇంటి ఎంట్రెన్స్ వైపు నడిచాను…

ఫ్రంట్ డోర్ తాళం తీయబోయి, తలపు తెరిచే ఉందని గ్రహించాను.

తేజశ్విని గారి వద్ద మాత్రమే డూప్లికేట్ ఉంది కదా, అనుకుంటూ మెల్లగా తలుపు పక్కకి తోశాను.  హాల్లో ఆవిడే కూర్చుని ఉన్నారు.  ముఖంలో అసహనం తాండవిస్తుంది.. అలికిడికి తలెత్తి చూసారావిడ.




"త్వరగా రా చంద్రా, అసలైనా ఇంత లేట్ అయిందే," గాబరాగా ఆవిడ.

అర్ధంకాక, గబగబా వెళ్లి ఎదురుగా సోఫాలో కూర్చున్నాను.

డాన్స్ రిహార్సల్స్ గురించి నేను నోరు తెరిచే లోగా, "మీ పేరెంట్స్,

నీరూ ఆంటీ, జగదీష్ సహా అందరూ కొన్ని గంటలుగా నీకు ఫోన్ చేస్తున్నారుగా. చూసుకోలేదా?" ఆదుర్దాగా తేజశ్విని గారు.

"లేదండీ, రిహార్సల్స్ కదా. ఫోన్ ఆఫ్ చేసాను," అంటూ బాగ్ నుండి ఫోన్ తీసి చెక్ చేసాను.

నిజమే మిస్డ్-కాల్స్ ఎక్కువే ఉన్నాయి.

తజశ్విని గారు లేచి వచ్చి, పక్కనే కూర్చున్నారు.

"కాల్స్ రిటర్న్ చేద్దువులే. ముందు విషయం విను. హార్ట్-ఎటాక్ వచ్చి, భూషణ్ గారు హాస్పిటల్లోఉన్నారట. ఆయన పరిస్థితి ఎటూ చెప్పలేకుండా ఉందట. మూడోసారట కదా! నీరూ ఆంటీ చాలా బాధ పడుతుంది.

ఆయన నీ కోసమే అడుగుతున్నారట. నీవు వెంటనే ఇండియాకి బయలు దేరు చంద్రా. రేపు సాయంత్రం ఫ్లైట్ కి అన్ని ఏర్పాట్లుచేసాను. మరేమీ ఆలోచించకు. నేను చూసుకుంటానుగా." అన్నారామె, నా భుజంపై చేయి వేసి.

**

ఇండియాకి తిరుగు ప్రయాణమయ్యాను. బ్యాగేజీ చెకిన్ చేయడానికి లైన్లోనిలబడ్డాను.

భూషణ్ అంకుల్ పరిస్థితి గురించి ఆదుర్దాగా ఉంది. ఆయనకి హార్ట్ అటాక్ వచ్చి, ఇంత సీరియస్ అయ్యారంటే, మరి నేను వెళ్ళేప్పటికి

ఎలా ఉంటారో అని దిగులుగా ఉంది.  నా కోసమే అడుగుతున్నారు కాబట్టి, నేను వస్తున్నానని తెలిస్తే కోలుకోవచ్చునేమో కూడా' అన్నాడు జగదీష్.

'నెక్స్ట్ పాసెంజర్ ప్లీజ్," అన్న టికెటింగ్ క్లార్క్ పిలుపుతో, ఆలోచనల నుండి తేరుకుని, వెళ్లి లగేజ్ చెకిన్ చేసి, బోర్డింగ్ పాస్ తీసుకున్నాను.

దూరంగా వెయిటింగ్ ఏరియా లో, వెయిట్ చేస్తున్న విక్రమ్, తేజశ్విని గార్ల

వద్దకి వెళ్లాను...

నేను చెన్నై వెళుతున్నానని తెలిసి, డల్లాస్ నుండి వచ్చాడు విక్రమ్...

**

"కమాన్, ఫ్లైట్ కి టైం ఉందిగా.  కాఫీ షాప్ కి వెళదాము. నాకు ఆకలిగా కూడా ఉంది," అంటూ నా చేతి నుండి హ్యాండ్ లగేజ్ అందుకున్నాడు విక్రమ్.

కాఫీ హౌజ్ లో ఓ కార్నర్ టేబిల్ వద్దకు వెళ్ళికూర్చున్నాము.

బాటిల్ నుండి వాటర్ సిప్ చేసి టేబిల్ పైనుంచారు తేజశ్విని గారు.

“చూడమ్మా చంద్రా, భూషణ్ గారి ఆరోగ్యం కుదుట పడుతుందిలే… దిగులు పడకు..

అక్కడ నువ్వు కాస్తసెటిల్ అయ్యాక, మేము చెప్పిన విషయం ఆలోచించి, మీ పేరెంట్స్ తో కూడా సంప్రదించు. నీ నుండి ‘ఓకే’ రాగానే, రెక్కలు కట్టుకుని, నిశ్చితార్ధం చేసుకోడానికి మీ ముందు వాలిపోతాం నేను, విక్రమ్. వాళ్ళ డాడీ సహా,” అంది తేజశ్విని ఆంటీ..

విని, తలొంచుకుని మౌనంగా ఉండిపోయాను.

“మామ్ ప్లీజ్. ఇప్పుడు కూడానా? ఇక్కడైనా, కాసేపు ఆ సంగతి వదిలేయి. … చంద్రకళని వొత్తిడి చేయ వద్దని మీకు ఇది వరకే చెప్పాను. అయినా మీరు, ఊరుకోలేదు. ‘మా విక్రమ్ ని పెళ్ళిచేసుకో’ మంటూ తనని వొత్తిడి చేస్తున్నారు.

అదీ, భూషణ్ అంకుల్ గురించి వర్రీలో ఉన్నప్పుడు కూడా........ ఏంటి మామ్ మీరు," కోపంగా విక్రమ్.

"అది కాదురా.  నువ్వలా అన్నావనే,  నేరుగా తన పేరెంట్స్ ని అడగకుండా,

చంద్రకళతోనే మాట్లాడాము.  తప్పేముంది?  వొత్తిడి చేయడం లేదు.

తను ఆలోచించి నిర్ణయం తీసుకునే  అవకాశం ఉందికదా కన్నా," శాంతంగా తేజశ్విని గారు.

నేనే కల్పించుకున్నాను.  "పర్వాలేదు విక్రమ్.  ఎందుకు కోప్పడతావు?  మీ పేరెంట్స్ ఏ తప్పూ చేయలేదు," అన్నాను.

"ఓకే, థట్స్ ఫైన్...," కాస్తరిలాక్స్ అయ్యాడు.

"సరే, మీ కాఫీ ఫ్లేవర్స్  నాకు తెలుసు.  నీకిష్టమైన బేబీ-కార్న్ కూడా తెస్తాను.

మరో గంటలో,  నీవు సెక్యూరిటి లైన్ లోకి వెళ్ళాలి కదా,"  నాతో అంటూ సీట్ నుండి పైకి లేచాడు.

**

అమెరికాలో బేబీ కార్న్ ఫ్రిటర్స్, వెనెలా కాఫీ ఎంజాయ్ చేయడం, బహుశ

ఇది ఆఖరిసారౌతుందేమో, అనుకున్నాను.

డల్లాస్ లో మెడిసిన్ చదువుతున్న విక్రమ్, సెలవలకి వచ్చినప్పుడల్లా, నా చేత రకరకాల ఫుడ్స్ టేస్ట్ చేయిస్తుంటాడు. నాకు తెలుగు భాష ఇష్టమని, తెలుగులో చక్కగా మాట్లాడ్డం నేర్చుకున్నాడు.

మంచి స్నేహితుడుగా మారాడు విక్రమ్. మనస్సు విప్పి అన్నీ షేర్ చేసుకునేటంతగా.

**

రెండు చేతుల్లో ట్రేలతో వచ్చి, స్నాక్ – కాఫీ, టేబిల్స్ మీద సర్దాడు, విక్రమ్..

“పెద్ద హర్రీ ఏమి లేదు. ఎంజాయ్ యువర్ కార్న్ ఎండ్ కాఫీ... ,” అన్నాడు....

అలాగే అన్నట్టు తలాడించి, కాఫీ అందుకుని విక్రమ్ వంక చూసాను.

ఏమిటన్నట్టు చూసాడు. ఏమీ లేదన్నాను...

కాఫీ సిప్ చేస్తూ నిరుడు అకాడెమి ఓపెన్ హౌజ్ సందర్భంగా జరిగిన సంఘటన గుర్తుచేసుకున్నాను...

ఆ రోజు క్రిస్టమస్ పార్టీ అయ్యాక, నాతో మాట్లాడాలంటూ నా ఎదురుగా

కూర్చునప్పటి విక్రమ్ నా కళ్ళెదుట నిలిచాడు....

"ఏమిటి విషయం?" అని నేనడిగినప్పుడు, "నేనంటే ఇష్టమేనా? నా లైఫ్ పార్ట్నర్ అవ్వమని నిన్ను అడిగితే, నీకు సమ్మతమేనా? ఎటువంటి సంకోచం లేకుండా చెప్పు. నేను ఆక్సెప్ట్ చేస్తాను," అని విక్రమ్ నన్ను సూటిగా అడిగినప్పుడు, నేను తడబడి పోవడం కూడా బాగా గుర్తు.

అది చాలదన్నట్టు, "చూడు కళా, నీవు మరెవరినన్నా ఇష్టపడుతుంటే, చెప్పు...నేనేమనుకోను... నేను నిన్ను పూర్తిగా సపోర్ట్ చేస్తాను," అని విక్రమ్ అనడంతో,, అతనికి, జగదీష్ విషయం వివరించడం సులువైపోయిన వైనం గుర్తొచ్చింది..

అతరువాత, తరచితరచి నానుండి అన్ని విషయాలు రాబట్టాడు విక్రమ్. జగదీష్ తో నాకున్న అనుబంధం గురించి -

రాణి విషయంగా తలెత్తిన మా సమస్యలు - అంకుల్ నా వద్ద చేసిన అభ్యర్థన గురించి కూడా

చెప్పుకొన్నాను మరి.

వెనెలా కాఫీ సిప్ చేస్తున్నా, ఆలోచనలతో, రుచి తెలియడం లేదు.

"ఏమ్మా చంద్రా, మౌన వ్రతం పట్టినట్టుగా ఉన్నావు?" తేజశ్విని గారు అడగడంతో, తేరుకొన్నాను.

ఎయిర్ పోర్టు లో ఉన్నానన్న సంగతి స్పృహ లోకి వచ్చింది.

"సరే, స్నాక్ ఫినిష్ చెయ్యి. కార్న్ చల్లగా అయితే, బాగోదు...నేను ఐదు నిముషాల్లో వస్తాను," అంటూ ఆవిడ వాష్ రూమ్ వైపుగా కదిలారు...

వెళుతున్న ఆవిడనే చూస్తున్న నన్ను, చేతిపై తట్టాడు విక్రమ్....

“నేనూ నోటిస్ చేసాను.  సీరియస్ ఆలోచనలో ఉన్నావే కళా? అడిగాడు.

సన్నగా నవ్వుతూ కాఫీ ఫినిష్ చేసాను.

“ఒకటి మాత్రం గుర్తుపెట్టుకో.   నీకు అప్పుడు చెప్పాను – ఇప్పుడూ చెబుతున్నాను. ఒకవేళ, జగదీష్, తప్పని సరి సిట్యుయేషన్ లో రాణితో సెటిల్ అయితే -  దిగాలు పడిపోకు…నీ కోసం నేనున్నాను.   నాకు నువ్వంటే చాలా ఇష్టం. పైగా నాకేం తొందర లేదు. వెయిట్ చేయ గలను.

“నాకిక   కనబడకు – వినబడకు’ అని నువ్వు , అనేంత మటుకు, నేను వెయిట్ చేయ గలను,” ఆగి నవ్వుతున్న నా వంక చూసాడు.

“వాట్ ఇస్ దిస్ కళా? నేను సిన్సియర్ గా చెపుతుంటే, ఆ రోజు కూడా ఇలాగే నవ్వావు,” అంటూ నా చెవి పట్టుకున్నాడు.

“అదిగో, మీ మమ్మీ వచ్చేసారు. పద విక్రమ్, నాకు ఇక ఫ్లైట్ కి టైం అవుతుంది,” అన్న నాతో పాటు లేచి టర్మినల్ వైపు నడిచాడు.

****




చెన్నై చేరెప్పటికి అర్ధరాత్రి దాటింది. ఇల్లు చేరేప్పటికి తెల్లరుజామయింది.

నన్ను చూసి వినోద్, కోటమ్మత్త కూడా చాలా సంతోషించారు.

ఆశ్చర్యపోయేటంతగా ఎదిగిపోయాడు, వినోద్.. అందమైన యువకుడిగా మారిపోయాడు నా తమ్ముడు.

ఫ్రెష్ అయి బ్రేక్ ఫాస్ట్ చేస్తుండగా అంకుల్ పరిస్థితి వివరించారు నాన్న. ఈ సారి హార్ట్-అటాక్ నుండి, ఆయన బయటపడ్డం కష్టమన్నారట, మొదట్లో డాక్టర్లు. అందుకే, ఆయన మరీ మరీ అడగడంతో నన్ను అర్జంటుగా పిలిపించామన్నారు.

ప్రస్తుతం, క్రిటికల్ నుండి, ఆయన పరిస్థితి నిలకడగా ఉందట. హృద్రోగం వల్ల మాత్రం, మున్ముందు ఆయన ఆరోగ్య పరిస్థితి సున్నితంగానే

ఉండబోతుందని సూచించారట..

రాణి గురించి అడిగాను..

రాణి ఇప్పుడు బయట వేరేగా నివశిస్తుందట. తండ్రి-తనయల నడుమ పరిస్థితి అదేవిధంగా పగ-పౌరుషాలతోనే కొనసాగుతుందట.

విని చాలా బాధగా అనిపించింది.

ఇంతలో హాల్లోనుండి వడిగా పడుతున్న అడుగుల చప్పుడుకి, పక్కకి తిరిగి చూసాను. చిరునవ్వుతో డైనింగ్

ఎంట్రెన్స్ లో నిలబడున్నాడు జగదీష్..

ఆశ్చర్యంతో, సంతోషంతో నాకు నోట మాట రాలేదు... చూస్తుండిపోయాను...

నా గుండె చప్పుడు క్షణం సేపు ఆగినట్టు, తిరిగి అతి వేగంగా కొట్టుకుంటున్నట్టు అనిపించింది. ఇది అది అని చెప్పలేని భావన నన్ను అమాంతం చుట్టేసింది.

"హలో, మేడమ్ నన్ను గుర్తుపట్టారా?" అన్న మాటలకి ఉలిక్కిపడి చూస్తే, వచ్చి నా ఎదురుగా కూర్చున్న జగదీష్.

"నువ్వు ఇవాళ వస్తున్నావని, చంద్రకి చెప్పలేదు జగదీష్ బాబు. చంద్రని సర్ప్రైజ్ చేద్దామన్నావుగా," నవ్వుతూ అమ్మ.

"సంతోషకరమైన సర్ప్రైజ్ ఇచ్చారు, కళకి," అమ్మ నుండి కాఫీ కప్పు అందుకుంటూ నాన్న.

"జగదీష్, నీవు కూడా ఫ్రెష్ అయ్యి, బ్రేక్ ఫాస్ట్ కానివ్వు. అంకుల్ ని విజిట్

చేయడానికి వెళదాము," అన్న నాన్నతో........

"నా బ్రేక్ ఫాస్ట్ ఫ్లైట్ లోనే అయింది మామయ్య. చంద్రకళ పనయితే, హాస్పిటల్ కి బయలుదేరడమే. మీతో కలిసి వస్తున్నట్టు, నీరూ ఆంటీకి తెలియజేశాను,"

అన్నాడు జగదీష్.

"ఈ లోగా కాఫీ అయినా తాగు," అంటూ జగదీష్ కి కప్పందించింది అమ్మ.

కాఫీ సిప్ చేస్తూ నావంక చూసాడు.

"నీవు ఇండియాకి తిరిగొచ్చేయాలని ఎంతగానో తపించింది కూడా, మీ నాన్నే అని తెలుసా నీకు? అక్కడ క్లాసికల్ ఆర్ట్స్ కి తగినంత ఆదరణ

లేదంట. ఆర్టిస్ట్ గా అక్కడ స్థిరపడాలనుకోడం పొరపాటే అంటున్నారు మామయ్య," ,"నిజమా?" నాతో జగదీష్...

నాన్న వంక చూసాను.

అయన సన్నగా నవ్వారు...

"అక్కడ కళారంగం పద్ధతులే వేరని, తెలుగు సభల్లోపాల్గొని మరీ, గ్రహించాను. అక్కడ, ఆర్టిస్ట్ గా కొనసాగడానికి, టాలెంట్ కంటే ముందు, పలుకుబడి-పరపతి ఉండాలనిపించింది. అమెరికాలో, స్థానికంగా ఉండడంతో, ఓ విలువున్న ఆర్టిస్ట్ గా తన ఉనికిని కోల్పోయింది మన కళ.

సభల్లోపాల్గొనేందుకు, అందరిలా 'ఆడిషన్స్' చేసి, తన ఖర్చు కూడా

తానే భరించింది.

అందుకే, చంద్రకళ అలా అగచాట్లుపడే అవసరం లేదని, త్వరగా తిరిగి ఇక్కడికి వచ్చేయాలని ఆరాటపడ్డాను," అన్నారు నాన్న నిక్కచ్చిగా...

"పోనీలే సత్యం, కష్టపడినా, ఆ దేశంలో కూడా పేరు ప్రతిష్ఠదక్కాయిగా.. ఇక ఇప్పుడు తిరిగోచ్చేసింది. సంతోషం. ఇక చంద్రని చూస్తేమన భూషణ్ గారు కూడా కోలుకుంటారేమో! వెంటనే, హాస్పిటల్ కి బయలుదేరండి," అంది కోటమ్మత్త.

**

హాస్పిటల్ ఫోర్త్ ఫ్లోర్ లిఫ్ట్ నుండి బయటికి వచ్చి, అంకుల్ ఉన్న కేర్-యూనిట్ దిశగా నడిచాము...

అంకుల్ రూములోకి వెళ్లబోతుంటే, గది నుండి మాకెదురుగా వచ్చిన

యువతిని చూసి, ఆగిపోయాము. క్షణం తరువాత, ఆమె రాణియే నని

గుర్తుపట్టాను.ఇంత అధాట్టుగా ఆమె ఎదురుపడుతుందని ఊహించని నేను, నివ్వెరపోయాను. మమ్మల్ని చూసిన రాణి కూడా అల్లాగే చేష్టలుడిగి

నిలబడిపోయింది.

ముందుగా తేరుకున్న జగదీష్, “హలో, రాణి, ఎలా ఉన్నావు? ఫాదర్ ఎలా ఉన్నారు? ఆయన ప్రస్తుత పరిస్థితి ఏమిటి?” రాణిని ప్రశ్నలతో ముంచెత్తాడు.

రాణి కూడా తేరుకుని జగదీష్ ని నవ్వుతూ పలకరించింది. “డాడీ పరిస్థితిలో పెద్ద మార్పేమీ లేదు. కొద్దిగా మాట్లాడుతున్నారు. ఈ లీగల్ డాక్యుమెంట్స్ పై అయన సంతకాల కోసం, పొద్దుటి నుండి ఇక్కడే ఉన్నాను,” గబగబా

చెప్పింది.

జగదీష్ మాట్లాడుతుండగా, నేను రాణి ని పరిశీలించాను. ముందుకన్నా, బొద్దుగా అందంగా ఉంది. చేతుల్లో ఫైల్స్ ఉన్నాయి...పొత్తికడుపు ఎత్తుగా ఉంది. తను ప్రెగ్నెంట్ అని స్పష్టంగా తెలుస్తుంది. ఆమెతో వెనుకగా ఓ నడివయస్కుడు కూడా ఉన్నాడు. అతనికి ఓ చేతిలో బ్రీఫ్కేస్ - మరో చేతిపై లాయర్ కోటు ఉన్నాయి. రాణి పర్సనల్ లాయర్

అయ్యుండవచ్చు.

“ఇదో మనచంద్రకళ, ఇవాళే అమెరికా నుండి రిటర్న్ అయింది.

అంకుల్ ని చూద్దామనే మేమంతా ఇలా,”... క్షణమాగాడు జగదీష్..

“ఇంతకీ నీరూ ఆంటీ లోపలున్నారా,” ఏమనాలో ఇబ్బంది పడుతూ, మళ్ళీ అతను..

“అవును, నిన్ను చెన్నైకి రమ్మని పిలిచానని చెప్పారు డాడీ. ఇవాళ, ఇక్కడికి వస్తున్నావని మమ్మీ అన్నది. ఇప్పుడే, తను ఇంటికి వెళ్ళింది. ఫ్రెష్ అయి త్వరగానే వచ్చేస్తుంది... ,” అంటూ మావైపు

చూసింది రాణి...

“ఎలా ఉన్నారు మీరంతా?” అడిగింది.

“బాగున్నాము రాణి. మీ ఫాదర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటాము,” అంది అమ్మ.

చిరునవ్వు తో “థ్యాంక్యూ,” అనేసి, జగదీష్ వైపు చూసింది రాణి..

”జగదీష్, నీకిక్కడ పనయ్యాక, ఓసారి నన్ను కలుస్తావని ఆశిస్తాను. నీతో మాట్లాడవలసిన విషయాలు ఉన్నాయి. ప్లీజ్, కాల్ చేసి తప్పకుండా రా,” అనేసి

అందరి వద్ద సెలవు తీసుకొని వడివడిగా తన లాయర్ తో వెళ్ళిపోయింది.

**

అంకుల్ ఉన్న రూమ్ లోకి వెళ్ళాము... వాకిట్లోనే అంబుజ కనబడింది...నన్ను చూడగానే, నీళ్ళు నిండిన కళ్ళతో, రెండు చేతులూ జోడించి దణ్ణం పెట్టింది.

దగ్గరగా వెళ్ళి ఆమె భుజం మీద తట్టి, లోనికి నడిచాను.

లోపల, అంకుల్ బెడ్ వద్ద వైటల్స్ చెక్ చేస్తున్న నర్స్ కనబడింది.

వెళ్ళి కాస్తదూరంలో అంకుల్ కాళ్ళ వైపు నిలబడ్డాము.

పని ముగించి వెళుతూ, క్షణం సేపు మా వద్ద ఆగింది, నర్స్.

"పొద్దుటినుండి ఆయన తన డాటర్ తో మాట్లాడుతూ గడిపారు. ఆవిడ ఉండగానే, కళ్ళు మూసుకుని పడుకున్నారు, సార్," ఆయనకి కాస్త విశ్రాంతి

అవసరమన్నట్టు మాకు సూచించి, అక్కడినుండి కదిలింది...

**

బెడ్డుకి దగ్గరగా వెళ్ళి అంకుల్ వంక చూసాను. మూసుకుని ఉన్న ఆయన కళ్ళ చుట్టూ నల్లని వలయాలు ఏర్పడ్డాయి. వెలుగు తగ్గిన ఛాయ, సన్నబడి చిక్కిపోయిన శరీరాకృతి చూసి, దిగులుగా అనిపించింది. అయన రూపు పూర్తిగా

మారిపోయింది.

వణుకుతున్న చేతులతో ఆయన పాదాలపై చేతులుంచాను.

తమాయించుకోమనట్టు, పక్కనే ఉన్న జగదీష్ నా భుజంపై చేయి వేశాడు.

పాదాలపై స్పర్శకి, మెల్లగా కళ్ళు తెరిచారాయన. "ఎవరూ?" అంటూ మా దిశగా చూసారు.

నా వెనుకగా ఉన్న నాన్న, అంకుల్ కి దగ్గరగా వెళ్లి బెడ్ పక్కనున్న స్టూల్ మీద కూర్చున్నారు.

"ఇవాళ నిన్ను చూడ్డానికి మాతో పాటు చంద్రకళ కూడా వచ్చింది, భూషణ్.

అంతేకాదోయ్, మాతో పాటే జగదీష్ కూడా ఉన్నాడు," మృదువుగా ఆయన చేతులపై తడుతూ నాన్న.

కళ్ళెత్తి చూసిన ఆయన ముఖంలో మెల్లగా ఆనందం, ఆశ్చర్యం చోటుచేసుకున్నాయి.

"కళా, నువ్వా? ఇలా రా, వచ్చి నా దగ్గరగా కూర్చో," అన్నారు...

“నమస్తే అంకుల్,” అంటూ నాకూడా దగ్గరగా వచ్చిన జగదీష్

చేయందుకున్నారాయన..

“బాబూ జగదీష్, నామాట మన్నించి చెన్నై వచ్చినందుకు, ఆనందంగా ఉంది. మీ ఇద్దరితో నుకాసేపు మాట్లాడాలి,” మా వంక చూస్తూ అంకుల్....

“హైరానా పడకుండా, తిరిగ్గా మాట్లాడు భూషణ్. నీకు కావలసినంత సేపు ఇక్కడే ఉంటారు వీళ్ళు,” నాన్న కలగజేసుకున్నారు..

“బాబూ జగదీష్, నీవు చైర్ దగ్గరగా వేసుకొని కూర్చో. ఈ లోగా మేము వెళ్లిక్యాంటీన్ లో కాఫీ తాగి వస్తాము,” అంటూ నన్ను స్టూల్ మీద కూర్చోమని, అమ్మతో సహా రూము నుండి వెళ్ళారు.

**

మమ్మల్ని తన బెడ్డుకి ఇరువైపులా కూర్చోమని సైగ చేసారు అంకుల్.

ఉద్వేగాన్ని ఆపుకోలేకపోతున్న నా వంక చూసి, వద్దని సైగ చేసాడు

జగదీష్. వెళ్ళి బెడ్ దగ్గరగా స్టూల్ మీద కూర్చున్నాను..

ఇరువైపులా కూర్చున్న మా ఇద్దరి చేతులూ గుప్పిళ్ళలోకి తీసుకుని దగ్గరగా పట్టుకున్నారు అంకుల్.

“అత్యంత ఆప్తుల్ని దగ్గరికి తీసుకున్నట్టుగా ఉందమ్మా,” అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నారు.   నా దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను..

“మీరీ స్థితిలో అప్సెట్ అవ్వడం మంచిది కాదు అంకుల్,” అంటూ అటు ఆయన్ని,“ఎందుకు ఏడుస్తావు?...నువ్విలా బాధపడి ఆయన్ని మరింత

బాధపెట్టకు చంద్రా,” అని ఇటు నన్ను ఓదార్చాలని ప్రయత్నిస్తున్నాడు జగదీష్.

వెల్లుబుకుతున్న దుఃఖంతో, అంకుల్ చేతి పై తల ఆనించాను.

“చంద్రా, చెబితే వినాలి... కంట్రోల్ యువర్సెల్ఫ్ ప్లీజ్. కన్నీళ్ళు తుడుచుకో,”

టిష్యూ అందించాడు జగదీష్...

కాసేపటికి, నాకంటే ముందుగా అంకుల్ తేరుకున్నారు...

“బాధపడకు, కళా.  కళ్ళు తుడుచుకో,” సుతిమెత్తగా అంకుల్ గొంతులో పాటు,...

“అవును చంద్రా, బాధపడకమ్మా,” అన్న నీరూ ఆంటీ మాటలకు తలెత్తాను.

ఆవిడ ఎప్పుడు గదిలోకి వచ్చారో కూడా తెలియలేదు.  నా దగ్గరగా నిలబడి, నా తలపై చేయి వేసింది ఆంటీ.

పైకి లేవబోయిన నన్ను, “పర్వాలేదు కూర్చోమ్మా, మీఇద్దరిని చూడాలని ఎంతగానో తపిస్తున్నారు మీ అంకుల్. మేము జగదీష్ ని చూసి కూడా చాలా కాలమయింది,” అంటూ మరో కుర్చీ లాక్కుని నాపక్కనే

కూర్చున్నారావిడ.

జగదీష్ తో పలకరింపులు ముగిసాక, “నిన్ను తలవని రోజు లేదంటే నమ్ము,”  నాతో ఆంటీ.

**

“కరెక్ట్ టైంకే వచ్చావు నీరూ.  ఇప్పుడే నీ గురించి అనుకున్నాను.  డాక్టర్ గారిని

కలిసొస్తున్నావుగా!  ఏమన్నాడాయన?” అంకుల్.

ఆంటీ లేచి అంకుల్ కి దగ్గరగా వెళ్ళి  పైకి జరిగి కూర్చోడానికి ఆయనకి సాయం చేసింది.

"వారం క్రితం కంటే బెటర్ అన్నారు. ఇలాగే నిలకడగా ఉంటే, నాలుగు రోజుల్లో ఇంటికి వెళ్ళవచ్చన్నారు. కోలుకునేంత వరకు, ఫుల్-టైం నర్స్ అజమాయిషీలో ఉండాలన్నారు. పోతే, నడవడానికి ఓపిక వచ్చేంతవరకు

వీల్-చెయిర్ తో మానేజ్ చేయాలన్నారు. చెయిర్ కూడా సెలెక్ట్ చేసే వస్తున్నా. పోతే, ఓ గంటలో మళ్ళీ వచ్చి మిమ్మల్ని చూస్తాన్నారు," వివరించింది ఆంటీ.

తిరిగొచ్చి, నా పక్కనే కూర్చుంటూ, "ఏమ్మా, మీరు రాణి ఉండగానే వచ్చారా? దాన్ని కలిసారా చంద్రా?" అడగిందామె.

చూసామన్నట్టు తలాడించాను...

"కలిసాము ఆంటీ... బ్రీఫ్ గా మాట్లాడాము కూడా," జవాబిచ్చాడు జగదీష్....

కొద్దిపాటి మౌనం...తరువాత...జగదీష్ చేతిపై తట్టి, ముందుగా అంకుల్

మాట్లాడారు.

"జగదీష్ బాబు, నీకు తెలియని కొన్ని విషయాలు, ఈ రోజు నీ

ముందుంచుతాను..," అన్నారు.

విశ్రాంతిగా ఉండమని జగదీష్ వారించినా ఊరుకోలేదాయన.

చేసేది లేక, ఇద్దరం మౌనంగా ఉండిపోయాము.

"మన చంద్రకళని స్వయంగా నేనే, ఓ క్లిష్టమైన పరిస్థితిలోబంధించేసానని తెలుసా నీకు?...నా అంచనా ప్రకారం కళ నీకు ఈ విషయాలేవీ చెప్పుండదు," అంటూ, వారి ఇరవైఐదవ పెళ్లిరోజున జరిగిన సంగతులతో పాటు, ఆలయంలో మా మధ్య జరిగిన సంభాషణని పూస గుచ్చినట్టు ఏకరవు పెట్టారు... అంకుల్.

అవాక్కయిపోయాను. జగదీష్ వంక చూసే ధైర్యం లేకపోయింది.

"ఈ రోజున మాత్రం, ఆనాటి నా తప్పిదాన్ని సరిదిద్దుకోదలిచాను. అయితే, అందుకు ముందుగా చంద్రకళని క్షమార్పణ అడుగుతున్నాను," నా చేతిని

పదిలంగా జగదీష్ చేతో కలిపి పట్టుకున్నారు అంకుల్..

తల పైకెత్తి అయన వంక చూసాను.

“స్వార్థపూరితంగా ఆలోచించి, నిన్ను అసాధ్యమైన త్యాగాలు చేయమని అడిగాను తల్లీ, నన్ను క్షమించు కళా.. నేను ఆశించిన దానికన్నా నీవు ఎక్కువే చేసావు.   రెండేళ్ళగా  ఇండియాకి తిరిగొచ్చేయమని, మీ నాన్న చెప్పినా,

నీవు రాలేదంటే, నాకర్థమయిందమ్మా కళా.

మా ఇంటి పరిస్థితులు మెరుగవుతాయని ఆశించే,  జగదీష్ కి దూరంగా గడపుతున్నావని గ్రహించగలిగాను....  మాతో ఉన్న అనుబంధాలకి కట్టుబడి,

పెద్ద మనసుతో వ్యవహరించావని తెలుసునమ్మా, కళా,”  అంకుల్

కళ్ళనిండా నీళ్ళు....

నా కళ్ళ నుండీ ఆగని కన్నీరు.

“అందుకే, ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, మీఇద్దరి వివాహం నా చేతుల మీదగా జరిపించడమే నాకున్న కోరిక,” కలిపున్న మా చేతులని గుండెలకి హత్తుకున్నారు.....

**

నేను తలెత్తి జగదీష్ వంక చూసాను.. మునుపెన్నడూ చూడని భావాలు కనబడ్డాయి నాకు.

‘ఇందుకేనా  మాట్లాడినప్పుడల్లా నా మనస్సుని రాణి వైపు మళ్ళించాలని, వాళ్ళ కుటుంబానికి నా అవసరం  ఎంతైనా

ఉందని చెప్పడానికి ప్రయత్నించావు?' అని గుచ్చి గుచ్చి అడిగినట్టుగా ఉన్నాయి అతని చూపులు...

ఆ ప్రశ్నకి నా వద్ద జవాబు లేదే మరి! ఛటుక్కున కళ్ళు దించుకున్నాను.

"నేను ఈ సారి హార్ట్ అటాక్ తో ఆసుపత్రిలో జేరడమే నిన్ను తిరిగి చెన్నై తీసుకురాగలిగింది కదూ! అందుకే, ఇది, మన సమస్యకి ఆ దేవుడు చూపిన పరిష్కార మార్గం అనుకుంటాను...," అన్న అంకుల్ వైపు చూసాను.

ఇంతలో ఆంటీ కలగజేసుకుంది...

"మేము నీ భవిష్యత్తుకి అడ్డుగోడయ్యామని నిత్యం కుమిలిపోతున్నాం చంద్రా.. ఇక మన జగదీష్ అంటావా? తరుచుగా మా యోగక్షేమాలు కనుక్కుంటూ, రాణి విషయంలో కొంత కనువిప్పు కలిగించాడు. అందుకే ద్వేషించే బదులు, దాని ఆలోచన, ప్రవర్తన అర్ధం చేసుకునే ప్రయత్నంలో పడ్డాము. చెన్నై వచ్చిన ఒకటి రెండు సార్లు మమ్మల్ని స్వయంగావచ్చిపలకరించాడు కూడా," క్షణమాగింది ఆంటీ.

"ఇప్పుడవన్నీ ఎందుకు ఆంటీ," అన్నాడు జగదీష్.

"చెప్పనీ బాబూ, నిన్ను చూసి కూడా ఆరు నెలలు దాటింది కదా," అంది ఆంటీ.... జగదీష్ కి వినడం మినహా వేరే ఆప్షన్ లేకుండా పోయింది.

“ఇకపోతే,  రాణి  కొన్నాళ్ళ  క్రితం వరకు తరచుగా, ఆశగా ఢిల్లీవెళ్ళడం, వాళ్ళ  సొంత మనిషిలా వ్యవహరించడం చేసేది.  తిరిగి వచ్చి నిరుత్సాహంగా గడిపేది.  చేసేదిలేక, మేము మౌనంగా ఉండిపోయాము.

ఆరునెల్లక్రితం మాత్రం ఇంటినుండి తన సొంత ఫ్లాట్ లోకి వెళ్ళిపోతానంది.

జగదీష్ పై, తానిక ఆశలు వదులుకున్నట్టేనని మాకర్థమైంది....

తనకి కావలసిన అన్ని సౌకర్యాలు సమకూర్చాము.  కాకపోతే, అక్కడ, ఆ రంజిత్ సూరితో సహజీవనం చేస్తుందని అశాంతిగా ఉంది,” చెప్పడం ఆపి గట్టిగా ఊపిరి తీసుకుంది ఆంటీ....

అంకుల్ వైపు ఒకసారి చూసి, మళ్ళీ చెప్పసాగింది...”రాణిని మీరూ చూసే ఉంటారుగా..తనిప్పుడు ప్రెగ్నెంట్ కూడా.... నెలరోజుల క్రితం,

ఆస్తులపై తన హక్కులివ్వమని తన లాయర్ ద్వారా అడిగింది,”

అంటూ ముగించిందామె.

**

మంచినీళ్ళు అడిగి తీసుకొని తాగారు అంకుల్.  మా వంక నిశితంగా చూసారు..

“మేము చెప్పిందంతా విన్నారుగా... ఎంతో హాయిగా ఉంది. భారమంతా

దిగిపోయినట్టుగా! ఇప్పుడు మీరిద్దరూ మమ్మల్ని క్షమిస్తారు కదూ,” అంటూ

చేతులు జోడించారాయన.

ఆయన్ని వారించబోయాము..

“అదేమిటోయ్, భూషణ్, వాళ్ళని ఆదేశించు...బతిమాలి బామాడుతావేమిటి... ఈ కూతురు వద్ద నీకు ఎంతైనా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలున్నాయిగా,” అన్న నాన్న మాటలకి కళ్ళు తుడుచుకుని వెనక్కి తిరిగి చూసాను. ఎప్పటి నుండి అక్కడ ఉన్నారో గమనించనే లేదు...

అది గ్రహించిన జగదీష్, “మామయ్యావాళ్ళు వచ్చి కూడా కాసేపయింది.

వినవలసిందంతా విన్నారు,” అన్నాడు నవ్వుతూ.

“ఇకపోతే, భూషణ్ అంకుల్, ఇప్పుడు నేను చెప్పేది కూడా వినాలి మీరు,”

అంకుల్ వైపు చూస్తూ మళ్ళీ జగదీష్.

“చంద్రకళకి మీ పట్ల అంతులేని ప్రేమాభిమానాలున్నాయి. ఎంతంటే, నన్ను కూడా దూరం చేసుకోడానికి వెనుకాడలేదు,” ఆగి, ఒక్క క్షణం నా వంక సూటిగా చూసాడు.

“కాబట్టి, క్షమించడాలు ఏమీ అక్కరలేదు... మా మామయ్య అన్నట్టు, మీరు ఎలా కావాలంటే అలా చేద్దాము,” అన్నాడు.......

అమ్మ కల్పించుకుంది.. “ఇదే సరయిన సమయం.. చంద్రని తిరిగి చెన్నైకి రప్పించాలని, మీరిద్దరూ ఎన్నాళ్ళగా ప్లాన్ చేస్తున్నారో కూడా చెప్పండి,” అంది నాన్నతో......

“భలేదానివే శారదా...ఇప్పుడా? మొదటి సారి అమెరికా వెళ్లి ఆరునెలలు

చంద్రకళ వద్ద ఉన్నప్పుడే చెప్పానుగా. అమెరికా జీవనం చాలించి, ఇక ఇండియాకి వచ్చేయమని. ఆ సంగతి భూషణ్ కి తెలుసును.

అందుకేగా ‘నర్తకి’ అనే టెలి-సీరియల్ ప్రాజెక్ట్ మొదలుపెట్టి, దాన్ని ఇక్కడికి రప్పించాలని ప్లాన్ చేసాము, ఆ ప్రాజెక్ట్ సిద్ధమైంది కూడా,” అన్నారు నాన్న.....

వెంటనే, అంకుల్ కల్పించుకున్నారు.

“జగదీష్ కి అమెరికా వెళ్ళే ఆలోచన లేకపోవడం కూడా కొంత కారణం లేవోయ్

సత్యం," నవ్వుతూ ఆయన..

ఆయన ముఖాన చిరునవ్వు అందరికీ అపురూపమైన దృశ్యమే అయింది..

"ఏమైనా, అందరం మాట్లాడాము... అసలు చంద్రకళ మాత్రం నోరు విప్పలేదు," నా వంక సంశాయంగా చూసారు అంకుల్.

క్షణం సేపు తడబడ్డాను.

"ఏం లేదు అంకుల్. నన్ను ఇండియాకి రప్పించాలని, కొద్దికాలంగా మీరు, నాన్న ఎంతగా తపించారో, మీ ఆరోగ్యం చక్కబడాలని నేనూ అంతగానే ఆశిస్తున్నాను. మూడేళ్లక్రితం కంటే కూడా మీరింకా కృంగిపోయారు.... ఇంత అలజడిగా ఉన్నప్పుడు నన్నేమనమంటారు? చెప్పండి...," ఆయన వంక చూసాను.

ఆయన పెదవులపై కదిలిన చిరునవ్వు నాకెంతో ధైర్యాన్నిచ్చింది...

"వీల్-చెయిర్ అవసరం లేనంతగా మీరు ముందు కోలుకున్నాకే, అంకుల్,

మిగతా విషయాలు. అందుకు మీరు పూర్తి ప్రయత్నం చేస్తానని ప్రామిస్ చెయ్యాలి," చేయి చాచాను.

“అలాగే, నీకు నా ప్రామిస్ తల్లీ” చాచి ఉన్న నా చేతిలో చేయి వేసారాయన....

డోర్ మీద నాక్ చేసిన అలికిడికి అందరం అటుగా చూసాము.

“హలో, ఇక భూషణ్ సార్ కి విశ్రాంతి అవసరం,.. “అంటూ డాక్టర్ గారు లోనికి రావడంతో, అంకుల్ వద్ద శలవు తీసుకొని, అక్కడినుండి

కదిలాము.

**

అమెరికా నుండి, చెన్నై తిరిగి వచ్చిన ఆరు నెలలకే, నాట్య ప్రదర్శనలతో,

టి.వి షోలతో బిజి అయిపోయాను. అంకుల్ ద్వారా, “నారాయణీ నమోస్తుతే” అన్న ఓ ‘భక్తి’ సినిమా సైన్ చేసాను... ఆ సినిమాలో నాది అమ్మవారి పాత్ర.... జగదీష్ కూడా ఈ ప్రాజెక్ట్ విషయంగా ప్రోత్సహించాడు...

ఈ ఆరు నెల్లల్లో, అంకుల్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. కోలుకున్నారు.

వీల్-చైర్ అవసరం లేకుండా నడుస్తూ, స్టూడియో వ్యవహారాలని కూడా సంతోషంగా చూసుకోవడం మొదలుపెట్టారు..

తమ్ముడు  వినోద్, మెడికల్ స్కూల్లో చేరడానికి ప్రిపేర్ అవుతున్నాడు...

**

సిటీలోని ఓ సెంటర్ ప్లేస్ లో, డాన్స్ ఇన్స్టిట్యూట్ స్థాపించడానికి, నాన్న సన్నాహాలు మొదలుపెడితే,  ముహూర్తం నిర్ధారించి, రెండు నెల్లల్లో మా పెళ్ళి జరిపించే  సన్నాహాలు అంకుల్ మొదలుపెట్టారు...

అమ్మమ్మ, మామయ్యా వాళ్ళు కోటమ్మత్త సహా ఆయనకి

సలహాదారులయ్యారు.

ఇక, రాణికి పాప పుట్టిందని తెలిసింది.  తన రీతిలో తను బాగానే ఉందని

వింటుంటాను.

“ఏమి జరిగుంటే, జగదీష్ పై, రాణి ఆశలు వదులుకుందో తెలియలేదు,” అని

అమ్మతో అన్నప్పుడు,

“ఎంత వెంటపడినా, లాభం లేదని, ఇంక సమయం వృధా చేయడం వ్యర్ధం అని అనుకునుంటుంది,” అందామె..

కాలిఫోర్నియాలో తన మెడికల్ ప్రాక్టీస్ మొదలుపెట్టినవిక్రమ్ తో ఎప్పటిలామాట్లాడుతూనే ఉన్నాను. నా లాంటి మరో అమ్మాయిని తనకి భార్యగా తెచ్చే బాధ్యత నాదేనంటూ, ఆట పట్టిస్తుంటాడు...

అమెరికా నుండి మా పెళ్ళికి వస్తామని తెలియజేసారు తేజశ్విని గారు...

**